
# జ్యోతిష విజ్ఞానము

(మేష వృషభ మిథున కర్కాటకములు)

మొదటి భాగము




మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# జ్యోతిష విజ్ఞానము

## (మేష వృషభ మిథున కర్కాటకములు)

మొదటి భాగము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2019

ప్రతులు : 1,000

© ధనిష్ఠ - 2019

వెల : రూ॥ **100-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

Website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-30-2

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 984 999 6538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

## ముందుమాట

ఋషులమార్గము ననుసరించి శాస్త్రములన్నియు జీవ సంస్కారమునకు, స్ఫూర్తికిని దోహదము చేయు ఉపాయములు. సంస్కారము, స్ఫూర్తి గలవారికి శాస్త్రములు దర్శింపచేయు అంశములు వినూత్నముగ నుండును. దివ్యపథమునకు దిక్సూచు లను అందించును. శాస్త్రములను కేవలము శాస్త్రముగనే నేర్చు కొనుట ఒక పద్ధతి. శాస్త్రమువలన స్ఫూర్తిచెందుట, జీవసంస్కారము నకు మెరుగు పెట్టుకొనుట మరియొక పద్ధతి. ఈ రెండవ పద్ధతి అవలంబించు వారికి శాస్త్రములు దర్శనమిచ్చుట ఆరంభించును. దర్శనజ్ఞానము గ్రంథజ్ఞానము కన్న గొప్పది. సద్గురువులు సాధకు లకు దర్శనజ్ఞాన మార్గమును సూచింతురు. వారికి శాస్త్రములు అనూహ్యమగు రీతిలో ఆవిష్కరింపబడుచు నుండును.

పరంపరాగతమైన జ్ఞానము రాజర్షులనుండియే లభ్య మగును. వారు అనుయాయులను దివ్యదర్శన మార్గమున ప్రోత్సహించుచు, జ్యోతిషాది శాస్త్రములలో పరిచయము లిత్తురు. సాధకుడు స్ఫూర్తితో తననుతాను సంస్కరించుకొనుచు, శాస్త్రముల నభ్యసించుచు, దివ్య దర్శనమునకు పాత్రుడగుచు నుండును.

అట్టి వారినుండి వెలువడిన గ్రంథ మేదైనను సజీవమై, అజరామరమై అందరిని మేల్కొల్పును.

కవిత లెన్నియో కలవు. కాని కొన్ని కవితలు జీవచైతన్యమును మేల్కొల్పును. అట్లే వ్యాఖ్యానము లెన్నియో కలవు. కాని కొన్ని వ్యాఖ్యానములు అజరమై నిలచియుండును. అట్లే జ్యోతిషమున కూడ దివ్యదర్శనమును అనుగ్రహింపగల వ్యాఖ్యానములు కొందరు రాజర్షులచే సూచింపబడినవి. అట్టి వారందించిన జ్ఞానము చదువరులకు పంచుటకే ఈ రాశుల వివరణము ఆరంభమయ్యెను. మూడవ వంతు రాశిచక్రము ఈ గ్రంథమున యథాశక్తి వివరింపబడెను.

జ్యోతిషచక్రమున మూడు జలరాశులున్నవి. జలరాశులు ప్రళయ సూచకములు కూడ. కర్కాటకము, వృశ్చికము పాక్షిక ప్రళయములు కాగ, మీనరాశి పూర్ణ ప్రళయముగ జ్యోతిషము తెలుపుచున్నది. కనుక ద్వాదశరాశులను మూడు భాగములుగ వివరించు ప్రయత్నము ఆరంభింపబడినది. ఇందు మొదటి భాగము కర్కాటకముతో అంతమైనది. మిగిలిన రెండు భాగములు వృశ్చికముతో ఒకటి, మీనముతో మరియొకటిగ వివరింపవలెనను భావముతో ఈ మొదటి భాగమును అందించుట జరుగుచున్నది. మిగిలిన భాగములు దైవేచ్ఛ ననుసరించి వెలువడవచ్చును.

ఈ పుస్తకమందలి మేష, వృషభ, మిథున, కర్కాటక రాశుల వివరణము శ్రద్ధతో పఠించువారికి రాశి స్వరూప

స్వభావములు ఆకళింపై, తదనుగుణమగు ఉద్ధారణము నీయ గలవు. 'నావాణి' దర్శన మాసపత్రిక యందు ధారావాహికగ ప్రచురింపబడుచున్న ఈ వివరణము పాఠకుల ప్రార్థనమును అనుసరించి పుస్తకముగ తీర్చిదిద్దుట జరిగినది. గ్రంథ విషయము ప్రయోజనకరమై నిలచుగాక!

*మాస్టర్ నమస్కారమ్!*

తేది : **4-8-2019** **- పార్వతీకుమార్**

శ్లో॥ మయ్యాసక్తమనాః పార్థ
యోగం యుంజ న్మదాశ్రయః ।
అసంశయం సమగ్రం మాం
యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥

నా యందు మనస్సును స్మరణ మార్గమున నిలుపువారు నా కాశ్రితులు. వారికి నా అనుభూతియే గాక అఖండ సృష్టి విజ్ఞానము దర్శన మిచ్చును. సృష్టి యనగా నా వ్యక్త స్వరూపమే గదా! గనుక శాస్త్రము లన్నియు వానికి ప్రసన్నము లగును.

(భగవద్గీత - 7అ. 1 శ్లో.)

# జ్యోతిష విజ్ఞానము

(మేష వృషభ మిథున కర్కాటకములు)

# విషయ సూచిక

## మేషము


1. పరిచయము 17
2. ఇచ్ఛాశక్తి 19
3. సాధన-సిద్ధి-అనుభూతి 21
4. కుజ ప్రభావము 22
5. చైతన్యము 24
6. సంవత్సర చక్రము 26
7. మార్గము 30
8. సంకల్పము-చతుర్దశలు 31
9. విస్ఫోటక శక్తి 33
10. గోపాలక శక్తి 34
11. తలమార్పిడి యజ్ఞము 36
12. శంబళ 38
13. సంఖ్యాశాస్త్రము 39
14. ధ్యాన మార్గము 41
15. దేవ-పితృయానములు 43
16. చైనీయుల అవగాహన 45
17. అగ్నితత్త్వము 46
18. సృష్టి - లయము 47
19. విరాట్పురుషుడు 49
20. దివ్య సంకల్పము 51
21. బుద్ధి-బలము 53
22. త్రిభుజధ్యానము 55
23. జనన మరణ చక్రము 57
24. మలుపు 58
25. శాశ్వతత్త్వము 60
26. సామరస్యము 60
27. ప్రళయములు 62
28. సప్తఋషి మండల ప్రభావము 63
29. దివ్య ప్రణాళిక 65
30. అగ్ని పరీక్ష 66
31. తారణము 68
32. నాయకత్వము 70
33. అంతరంగ సాధన 72
34. నాలుగు దశలు 73
35. సంకల్పములు 76
36. ఉత్తమోత్తమ తత్త్వము 77
37. ధర్మ నిర్వహణ 79
38. స్వభావ ప్రభావము 81

## వృషభము


1. పరిచయము 85
2. ఇచ్ఛ 86
3. దిశానిర్దేశము 88
4. పరహితము 90
5. విచక్షణ 94
6. కిరణధ్యానము 96
7. దారి చూపుట 98
8. బృందావనము 100
9. బంగారు కాంతి 102
10. చక్కని మలుపు 103
11. భోగకాంక్ష 105
12. వ్యామోహము 107
13. కోరికలు 108
14. నిమ్నభావము 109
15. వృషభాక్షము 111
16. దివ్య ప్రజ్ఞలు 112
17. రూపమోహము 114
18. నాలుగు స్థితులు 115
19. అంతఃకరణ శరీరము 116
20. రూప వికాసము 118
21. వృషభ తత్త్వము 120
22. వైశాఖలోయ 121
23. జీవన ప్రయోజనములు 123
24. జీవోద్ధరణ 125
25. రూపబంధము 126
26. అంతర్విద్య 128
27. వాఙ్మయమము 129
28. వాక్శుద్ధి 131
29. సత్‌చిత్‌లు 132



## మిథునము


1. పరిచయము 135
2. భాషణము 136
3. ముఖద్వారము 139
4. అంతరరంగ జీవనము 140
5. అంతర్వాణి 142
6. బాధ్యతపడుట 145
7. ప్రేమ-మైత్రి 146
8. జీవుడు-స్వభావము 149
9. గణపతి ఆరాధన 150
10. శ్రమతో కూడిన దీక్ష 151
11. పరిణామ కథ 153
12. ఏకత్వభావము 155
13. వైవిధ్యము 156
14. దివ్యజీవనము 158

15. ఒకటి రెండగుట 159
16. ద్వంద్వములు 162
17. అనుసంధానము 164
18. సమన్వయము 165
19. ఒకే తత్త్వము 169
20. బుధతత్త్వము 170
21. విచక్షణ 171
22. మిథునతత్త్వము 173
23. దేవదూతలు 175
24. తోడ్పాటు 176
25. ఆనంద స్వరూపులు 178
26. పరిణామము 179
27. శని తోడ్పాటు 181
28. క్రతుబద్ధము 183
29. ఏకత్వము 184
30. నియుక్తము 186
31. జీవుడు - స్వభావము 187


## కర్కాటకము


1. పరిచయము 191
2. నాటకరంగము 193
3. జీవుల రూపధారణ 194
4. భూతవర్తనములు 196
5. జనన మరణ చక్రము 197
6. లోక ప్రయోజనము 199
7. తరింపు మార్గము 201
8. జిజ్ఞాసత్వము 202
9. అనుకరణ 204
10. ప్రతిబింబ లక్షణము 205
11. జీవుల పుట్టుక 207
12. శరీరపుంజము 208
13. ద్విజత్వము 210
14. పరిణామ కథ 211
15. నివృత్తి మార్గము 213
16. జీవుని వికాసము 214
17. జన్మప్రయోజనము 216
18. ఇచ్చుట-పంచుట 217
19. మార్గదర్శకులు 219
20. భక్తి మార్గము 220
21. అన్వేషకుడు 222
22. కేంద్రస్థానము 223
23. భ్రమ - భ్రాంతులు 225
24. వాయు కాలుష్యము 226
25. త్రయీవిద్య 228
26. ప్రతిముఖ రాశి 230
27. గురు స్పర్శ 232



మేషము

**పరిచయము :**

మేషము చరరాశి. మిగిలిన మూడు చరరాశులు వరుసగ కర్కాటకము, తుల, మకరము. ఈ నాలుగు చరరాశులు కలిసి చరరాశి చతుర్భుజ మందురు. సంవత్సరము నొక దినముగ భావించి నచో చరరాశియందలి మకరము ఉదయము. మేషము మధ్యాహ్నము. కర్కాటకము సాయంత్రము. తుల అర్ధరాత్రి. ఇట్లు దినము, మాసము, సంవత్సరము– వీటిని ఒక్కొక్కటి నాలుగు భాగములుగ దర్శింప వచ్చును.

మేషము, తుల విషువత్పుణ్యదినములు కాగ, మకరము, కర్కాటకము సంక్రమణములై యున్నవి. వీటినడుమ 90–92 దినముల కాలమున్నది. ఈ చతుర్భుజమును సంవత్సరమునందు చూచినట్లే మాసమునందు కూడ గుర్తింపవచ్చును. అవి వరుసగ పౌర్ణమి – అమావాస్య – కృష్ణాష్టమి – శుక్ల అష్టమి. అట్లే దినమును ముందు తెలిపిన విధముగ నాలుగు భాగములుగ తెలిపెదరు. కాలజ్ఞానమున ప్రవేశించువారికి చరరాశి చతుర్భుజము అత్యంత పవిత్రము. పై కారణముగ చైత్ర శుద్ధ పాద్యమి, ఆశ్వయుజ శుద్ధ పాద్యమి విషువత్పుణ్యదినములుగను; కర్కాటక శుద్ధ పాద్యమి, పుష్య శుద్ధ పాద్యమి కర్కాటక, మకర సంక్రమణములుగను గుర్తించి

ఆరాధించవలెను. సూర్యుడు ఈ రాశులలో ప్రవేశించుటను గమనించి ఆ దినమునకు ముందు, తరువాతి దినములు కలిపి మూడు దినములు దీక్షగ దైవధ్యానము, ఆరాధనము గావించుట – కాలము రూపమునగల దైవమును అనువైన వేళన ఆరాధించుటగ తెలియవలెను. ఇట్లారాధించు వారికి తమలోని అజ్ఞానపు పొరలు నిర్మూలింపబడును. విషువత్పుణ్య దినములయందు పగలు, రాత్రి భూమధ్యరేఖపై సమానముగ యుండును. కర్కాటక సంక్రమణ పుణ్యదినమున పగలు అత్యధికమై యుండును. మకర సంక్రమణ పుణ్యదినమున రాత్రి అధికమై యుండును.

చరరాశి చతుర్భుజము సంవత్సర పురుషుని చతుర్బాహువులుగ భావింపవలెను. కాలమును నాలుగు వర్గములుగ తెలియుట కాల జ్ఞానమునకు ప్రధానమైన అంశము. నాలుగు యుగములు కలసి ఒక కాలచక్రముగ యున్నది. కృతయుగము, త్రేతాయుగము, ద్వాపర యుగము, కలియుగము కలిసి ఒక మహాయుగ మగుచున్నది. నిజమునకు ఈ నాలుగు యుగములందు పది యుగము లున్నవి. కలి కన్న రెండు రెట్లు ద్వాపర, మూడు రెట్లు త్రేత, నాలుగు రెట్లు కృత యుండుటవలన మొత్తము పది యుగములే నాలుగు, మూడు, రెండు, ఒక యుగములుగ నున్నవి. కాల భావము ననుసరించి నాలుగు యుగములుగ ఋషులు దర్శించి యిచ్చిరి. ఈ నాలుగు యుగములందు ధర్మము నాలుగు విధములుగ నుండును. కలియుగమున ధర్మము ఈ విధముగ నుండును. ఇట్లు తెలియుట వలన ధర్మమును గూర్చి, దైవమును గూర్చి నిరుత్సాహపడుట, నిస్పృహ చెందుట యుండదు. అట్లే ఒక యుగమున కూడ నాలుగు పాదములుండును. ఈ

చతుర్భుజముతో కూడిన వృత్తాకారమును జిజ్ఞాసువు జ్ఞప్తి యందుంచు కొనుట ప్రధానము. ఈ పరిచయ జ్ఞానముతో ద్వాదశ రాశులను అధ్యయనము చేయుట ప్రయోజనకరమై యుండును.

**ఇచ్ఛాశక్తి :**

మేషరాశి ఇచ్ఛాశక్తికి ప్రతీక. ఇచ్ఛ అందరికిని ఉండును. కాని అది శక్తివంత మగునపుడు ఇచ్ఛాశక్తిగ మారును. ఇచ్ఛాశక్తి గలవారు దూసుకొని పోవుచుందురు. ఛేదించి ముందుకు సాగుదురు. భూమి లోపలనున్న బీజమునుండి అంకురశక్తి బీజమును ఛేదించును. భూమి పొరను కూడ ఛేదించును. ఇట్లు ముందుకు సాగుచు, అవరోధములు ఛేదించుకొనుచు, పురోగమించుట ఇచ్ఛాశక్తి స్వరూపమే. బీజమందలి అంకురశక్తియే కడపటకు మహావృక్షమై తరముల తరబడి నీడను, ఫల పుష్పములను అందించును. మేషరాశియందు అట్టి అంకురశక్తి యున్నది. ప్రతి సంవత్సరము సూర్యుడు మేషరాశి యందు సంచరించు చున్నపుడు భూమిపై జీవులు పై విధమగు శక్తిని పొందవచ్చును.

మేషరాశి సంవత్సర ఆరంభమేకాక వసంత ఋతువున కారంభము కూడ. భూమిపై దైవము వసించుటకు అవతరించు సమయమే వసంత ఋతువు. సంవత్సర పురుషుని రూపమున యజ్ఞ పురుషుడు ఒక నూతన తరంగముగ భూమిపై అవతరించి, నూతనమైన ప్రభావమును చూపును. ఇది కారణముగ మరల మరల జీవులలో నూతన అంకురముగ దైవము ప్రవేశింప గలడు. తత్కారణముగనే వసంత ఋతువు అత్యంత పవిత్రమగు ఋతువుగ ఋషులు భావించిరి. చైత్రశుద్ధ పాడ్యమి నుండి నవరాత్రములు దీక్ష వహించి నూతనముగ

అవతరించుచున్న యజ్ఞపురుషుని తమ లోనికి ఆహ్వానము చేసుకొనుట సంప్రదాయమైనది. అవియే నవరాత్రి ఉత్సవములు. మిత భోజనము, మిత భాషణము, మిత సంచారము, మిత కార్యకలాపములు కలిగి దేహేంద్రియ మనస్సులను పవిత్ర మొనర్చుకొనుచు నవమి నాటికి తమయందు దివ్యత్వ మవతరించుటకై యోగులు, సిద్ధులు, లోకహితులు ప్రార్థన చేయుదురు. సంప్రదాయమున రామనవమి ఉత్సవములుగ రామ జననము, రామ కళ్యాణము, రామ పట్టాభిషేకము చేసుకొనుట పరిపాటి అయినది. ఆత్మారాముడు మనయందు మరల మరల స్ఫూర్తినిచ్చి మనయందలి అష్టప్రకృతుల లోనికి అవతరించుటకే ఈ ఆరాధనమని తెలిసినవారు ఆడంబరము లేకుండ, అంతర్యజ్ఞముగ నవరాత్రి దీక్ష వహింతురు.

చైత్రశుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమి తిథి అంతము వరకు పదహారు రోజుల పాటు ఆరాధన చేయు సంప్రదాయము కూడ కలదు. షోడశ కళానిధియగు యజ్ఞ పురుషుడు పదహారు కళలతో తమ నావేశించి సంవత్సరమంతయు దివ్య స్ఫూర్తితో నడిపింపవలెనని ఆరాధన చేయుదురు.

ఇచ్చట ప్రధానమగు భావము తమ యందలి సంకల్పశక్తి లేక అంకురశక్తి, దివ్య సంకల్పశక్తియై జీవితములు నడుపవలెనని భావించి, ఇట్లు దివ్యసంకల్పమే తమ సంకల్పముగ నిర్వర్తించువారు భూమి యందున్నారు. వారరుదుగ నుందురు. ఇతరులు వారి వారి వ్యక్తిగత జీవితములయందు వారి జీవన పరిస్థితుల నుండి వారికి కలుగు

సంకల్పములు శక్తివంతము గావించుటకు మేషరాశియందు నూతన కార్యము లారంభింతురు.

**సాధన-సిద్ధి-అనుభూతి :**

జీవుడు దైవాంశయే అయినను తానున్నానను భావనతో జీవించును. తానుగ నుండి విశ్వమును, దైవమును అవగాహన చేసుకొనుచు పరిపూర్ణుడగుటకై అనేకానేకములగు జన్మల నెత్తు చుండును. అతనిని నడుపునది అతని సంకల్పమే. వక్తిగత సంకల్పము క్రమముగ దివ్యసంకల్పమునకు అనుసంధానము చెందుటకు కొన్ని వేల జన్మలు పట్టును. దివ్య సంకల్పముతో అనుసంధానము కోరి జీవుడు చేయు వ్యక్తిగత ప్రయత్నములు కూడ కొన్ని వందల జన్మలు పట్టును. అనుసంధానము చెందుటకు ప్రయత్నము మేషమున ఆరంభముకాగ అది మకరమున పరిపక్వము చెంది దైవ పాదసన్నిధిని చేరుట జరుగుచుండును.

ప్రతి సంవత్సరము సత్పురుషులు మేషమున దైవసంకల్పము నెరుగుటకు ధ్యానములు చేయుదురు. తమ మేధస్సున కందుబాటులోనికి వచ్చిన సత్కార్యములను శ్రద్ధతో మకరము వరకు నిర్వర్తించుట వలన తదనుగుణమైన దివ్యానుభూతి సంవత్సరమందలి మిగిలిన రెండు నెలలలో కలుగుచుండును. ఇట్లు మేషమున అంకురించిన సత్ సంకల్పములకు మకరమున వలసిన సిద్ధిని సాధన ద్వారా పొంది, అటుపైన ఒక ఋతుకాలము దివ్యానుభూతి చెందు సంప్రదాయ మేర్పడినది. మకరము పదియవ రాశి అగుటచే సంవత్సర సిద్ధి ఈ

మాసమున జరుగునని పెద్దలు నిర్ణయింతురు. ఇట్లు మేషము నుండి మకరము వరకు దీక్ష వహించి సాధకులు సంకల్పించిన సత్కార్యములను దృఢచిత్తముతో నిర్వర్తించ వలెను.

మేషము దృఢశక్తిని అందించును. అగ్నితత్త్వపు రాశి గనుక, సత్సంకల్పమున దృఢచిత్తము కలిగినవారు తమయందు, తమ పరిసరములయందు అగ్ని సహాయమున పవిత్రులగుచు ముందుకు సాగుచుందురు. అట్టివారి స్వభావమునందుగల అజ్ఞానము ఆహుతి చెందుచు, జ్ఞానము ప్రకటింపబడుచు నుండును.

పై తెలిపిన అగ్ని జీవుని కర్మములను దగ్ధము చేయును. దివ్యకర్మయందు స్థిరపరచును. దివ్యదర్శనమునకు వేదిక నేర్పరచును.

అగ్ని కార్యములన్నియు పవిత్రములే యని మా అభిమతము.

**కుజ ప్రభావము :**

మేషరాశి అధిపతియగు కుజుడు వృశ్చిక రాశి అధిపతి కూడ యగుటచే మేషమునకు వృశ్చికమునకు షష్టాష్ట సంబంధమున్నది. మేషరాశి నుండి వృశ్చికరాశి ఎనిమిదవ రాశి యగుటచే మేష భావమునకు వృశ్చికమున మరణము సంభవించును. మేష మందలి కుజుడు బాహ్య ప్రపంచమున పోరాడుట, యుద్ధము చేయుట యిత్యాది కార్యములు చేయుచు బాహ్యమునందు వ్యాప్తిచెందుచు నుండును. ఇట్టి వ్యాప్తికి వృశ్చికము మరణము వంటిది. బాహ్య వ్యాప్తి ప్రపంచమున కీర్తి ప్రతిష్ఠలు, ధనము, అధికారముల నేర్పరచినను దానియందు

జీవుడు బద్ధుడై యుండును. జీవ స్వభావము జీవి నావిధముగ బద్ధుని చేయును. ఇది జీవునికి మరణము వంటిది. ఇట్టివారు బాహ్యాలోకము లన్నింటిని జయించినను, అంతర్లోకములను జయించలేకపోవుట వలన మరణము సంభవించుచుండును. హిరణ్యకశిపుడు బాహ్యా లోకములను మాత్రమే జయించెను. ప్రహ్లాదుడు అంతర్లోకములను జయించుటచే అతనిని జయించుటకు హిరణ్యకశిపుడు అసమర్థుడై నిలచెను.

అంతర్లోకములను జయించుటకు కుజశక్తిని అంతర్ముఖముగ నిర్వర్తింప జేయవలెను. అదియే నిజమగు సాధన. కుజుడనగ కుమారుడే. కుజశక్తి కుమారుని హస్తగతమైన శక్త్యాయుధము. దానికి తిరుగులేదు. దాని నంతర్ముఖముగ ఉపయోగించినచో కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అను మాలిన్యములను జయించ వచ్చును. అపుడు వ్యక్తిగత స్వభావము పవిత్రీకరింపబడి దివ్య స్వభావమై వెలుగొందును. అట్టి స్వభావము జీవుని బంధింపదు. కనుక జీవుడు శరీరమును, స్వభావమును దాటియుండుటకు వీలుపడును. అట్టి వాడు మరణించడు. మరణ మాసన్నము కాగ, శరీరము మరణించుట తాను దర్శించు చుండును. మరణము దర్శించు వానికి మరణము లేనట్లే.

కావున మేషరాశి యందు సామాన్యులు స్వభావమును జయించుటకు వలసిన సంకల్పములు చేయవచ్చును. స్వభావమును దాటినవారు కైవల్యమునకు సంకల్పము చేయవచ్చును.

**చైతన్యము :**

మేషరాశియందు చైతన్యము అవతరించు చుండును. దివ్య పురుషులు కూడ ఈ రాశి ద్వారా దిగివచ్చు చుందురు. కర్కాటకమున దేహమును ధరింతురు. మకరమున లోక రక్షణము గావించి, మరల మేషమున ఊర్ధ్వగతి కేగుదురు. పై కారణముగ చరరాశి చతుర్భుజము దైవ సంబంధితమని జ్యోతిషము తెలుపుచున్నది. జీవులు కర్కాటకము నుండి దేహధారులుగ వృద్ధి చెందగ, దివ్యపురుషులు మాత్రము మేషము నుండి అవతరింతురు. దివ్యపురుషుల కాలచక్రము మేషముతో ప్రారంభ మగును. సామాన్య జీవుల కాలచక్రము కర్కాటకముతో ఆరంభ మగును. పై కారణముగ మేషరాశి అత్యంత పవిత్రరాశిగ తెలుప బడినది.

*మరియొక అవగాహన :* దివ్యపురుషులకు వ్యక్తిగత స్వభావము లుండవు. దివ్య స్వభావమే వారి స్వభావముగ నుండును. అట్టివారు కర్మబంధముల కతీతముగ నుందురు. ప్రపంచము వారిని బంధించదు. జీవులందరు సహజముగ దివ్యులే. కాని కాలక్రమమున వ్యక్తిగతమగు స్వభావము లేర్పడి బంధములు పెంచుకొనుచు జీవించుచున్నారు. స్వభావ జననము కర్కాటకమున జరుగుననియు, జీవుల అవతరణ మేషరాశి యందు జరుగుననియు కూడ అవగాహన చేసుకొనవచ్చును. సృష్టిమొత్తము మేషమునందే ఆరంభింపబడినదని ఋషుల దర్శనము. కావున అన్ని జీవరాశులు మేషము నుండియే దిగివచ్చినవి. దిగివచ్చిన వెనుక మనసు ప్రధానమైన జీవులు మరల మరల జన్మించుట కర్కాట కము నుండి జరుగుచున్నది. కావుననే కర్కాటకము నుండి చాతుర్మాస

దీక్షల నవలంబించుచు స్వభావమును నియమించుట ఒక సంప్రదాయ ముగ వెలువడినది.

అదట్లుండగ అందరికిని మేషమున భావాంకురములు మొలచును. ఆ భావాంకురములు దివ్యమై యుండుటకు మేషరాశి యందు సూర్యుడు సంచరించు చున్నప్పుడు అప్రమత్తులై ధ్యానమునకు ప్రాముఖ్య మిచ్చుట పెద్దలందించిన హెచ్చరిక.

మేషరాశియందు సంకల్పము బడయుట, భావమయ లోకమున దానికి బలము చేకూర్చుట, అట్టి భావమునకు కార్యాచరణ జ్ఞాన మేర్పరచుట, దానిని క్రియాశీలత ద్వారా భూమిపై అవతరింప చేయుట, కలిగిన అవరోధములను నిర్మూలించుకొనుటకు వలసిన జ్ఞానము, శక్తి బడయుట. ఇవి యన్నియు సంకల్పములోని భాగములే యని తెలిసి, ఒక సత్సంకల్పమును అవతరింప జేయుటకు వలసిన దీక్ష మేష మాసమున బడయవలయును. ప్రతి మానవుడు తాను సనాతనుడగు జీవుడని, దైవముయొక్క అంశయని, దివ్యత్వమునకు వాహికయని తెలియవలెను. తనకు దేహము, ఇంద్రియములు, మనసు వాహికగ (వాహనముగ) ఈయబడినవని తెలియవలెను. ఇట్లు తాను, దైవము, దేహము అను మూడు విధములుగ తా నేర్పడినాడని తెలియవలెను. తాను దైవముతో నున్నపుడు మనస్సు, ఇంద్రియములు, శరీరము తనకు తోడ్పడునని, తాను మనస్సుతో నున్నపుడు దైవము నిద్రాణమై యుండునని, అపుడు తన వాహనమగు దేహము, ఇంద్రియములు, మనస్సు తనకు వినియోగపడక, తనను వినియో

గించు కొనునని తెలియవలెను. దైవముతో లేనపుడు ప్రకృతి బంధించు నని, దైవము తోడుగనే ప్రకృతితో నుండవలెనని తెలియవలెను.

దీనినే ఒక బ్రాహ్మణుడు, పులి, మేక కలిసి ప్రయాణము చేయుట అని తెలుపుదురు. ఇందు మేక జీవుడు. బ్రాహ్మణుడు బ్రహ్మము. పులి ప్రకృతి. మేక బ్రాహ్మణునితో లేనిచో పులి మ్రింగుట తథ్యము. మేక బ్రాహ్మణునిదే. పులి కూడ బ్రాహ్మణునిదే. బ్రాహ్మణుని సన్నిధిలోనే పులికి – మేకకు సామరస్యము కుదురును. అట్లే జీవునికి – ప్రకృతికి సామరస్యము బ్రహ్మము సన్నిధి యందే. కావున జీవుడు బ్రహ్మముతో నున్ననే ముముక్షువై యుండునని తెలిసి జీవన యానము సాగించ వలెనని మేషరాశి బోధించు చున్నది.

**సంవత్సర చక్రము :**

మేషమున జీవుడు అవతరించుట సంకల్పించునని, కర్కాటక మున దేహధారి యగునని, తులయందు అతని స్వభావము సమతుల్య మగునని, మకరరాశియందు ఆశయ సిద్ధిని పొంది పరిపూర్ణుడగునని చరరాశి చతుర్భుజము ప్రకటించుచున్నది. సూర్యుని గమనము నాధారముగ చేసుకొని సంవత్సర మంతయు పై చతుర్భావములతో అనుసంధానము చెంది జీవించుట సాధకుని కర్తవ్యమై యున్నది.

జీవుడు తానెందులకు జన్మమెత్తెనో ఆత్మ పరిశీలన మార్గమున ఆత్మావలోకనముతో తెలియుట ముఖ్యము. జన్మమెత్తిన ప్రయోజన మును గుర్తించి, దానిని నిర్వర్తించుటకు వలసిన ప్రణాళికను సిద్ధపరచు కొనుటకు సంవత్సర మందలి మొదటిపాదము వినియోగపడవలెను.

కర్కాటకము నుండి సంవత్సర మందలి రెండవ పాదము ఆరంభము కాగ, దేహమును పదను పెట్టి జీవన ప్రయోజనమున కనుగుణముగ మలుచుకొనవలెను. సమస్త సాధనలకు దేహమే ఆధారము గదా! దేహము పటిష్ఠముగను, చురుకుగను, సహకారము నందించునదిగను మలచుకొనుటకే పూర్వము చాతుర్మాస్యదీక్షలను అవలంబించిరి. జీవుడు దేహపరముగ సంపర్క మేర్పరచుకొని ఆశయ సిద్ధికై కృషి సలుపు చున్నపుడు తనదగు వ్యక్తిగత స్వభావ మేర్పడును. ఈ స్వభావ మును సమతుల్యము చేయుటకు వలసిన రహస్యములు తులారాశిలో యున్నవి. కావున సంవత్సరమున మూడవ పాదము తులారాశిలో ప్రారంభించినపుడు స్వభావమును సమతుల్యము చేయుటకు ప్రయత్నించవలెను. స్వభావము ఇహపరములకు పనికివచ్చునట్లుగ, సామరస్యముతో కూడియుండునట్లు నిర్మాణము చేసుకొనవలెను. దేహ నిర్మాణము దైవము చేయగ, దాని పోషణ కర్తవ్యమే మానవున కున్నది. కాని స్వభావ నిర్మాణము పూర్తిగ మనిషి కర్తవ్యమే. స్వభావము దేవాలయమువలె నిర్మించవచ్చును. కారాగృహము కూడ చేసుకొన వచ్చును. దానికి కర్త జీవుడే. స్వభావమును సమతుల్యముగ నేర్పరచు కొన్నచో యిహపరములు సుఖము నిచ్చును. అట్టివాడే యోగి.

సమతుల్య స్వభావముతో ఆశయ సిద్ధికై కృషి సల్పుట సంవత్సర మందలి నాల్గవ పాదముగ, మకరమందు ఆరంభింపబడి మీనాంతము పరిపూర్తి యగును. నాలుగు పాదముల సంవత్సరచక్రము ఈ విధముగ అవగాహన చేసుకొనుట జ్యోతిషవిద్య నాధారముగ జ్యోతిర్మార్గమున పయనించు ఆసక్తి గలవారికి ప్రధాన కర్తవ్యమై గోచరించును.

మేషరాశికి కుజుడధిపతి యనుట సాధారణమగు అవగాహన. ఉత్తమ సాధకులగు మేషరాశి వారికి బుధుడధిపతియై యుండును. మేషరాశి బుధుడు మిథునమునకు, కన్యకు కూడ అధిపతియే. అందువలన మేషరాశికిని, మిథున రాశికిని, కన్యారాశికిని నడుమ సంబంధమున్నదని తెలియవలెను. ఇది సద్గురువుల అవగాహన.

సాధకుడైన మేషరాశి జాతకుడు మిథున మాధారముగ ఆధ్యాత్మిక సోదరత్వము అలవరచుకొనుటకు సంకల్పింపవలెను. సోదరత్వ మేర్పడుటకు సేవాకార్యక్రమములను పరహితముగ నిర్వర్తించ వలెను. పరులకు హితముగ సేవాకార్యము లొనర్చుట కన్యారాశి తత్వమై యున్నది. కనుక సేవా తత్పరత ద్వారా, సోదరత్వమును ప్రదర్శించుట కర్తవ్యమై నిలచినపుడు, సాధకుడు సిద్ధు డగుటకు వేదిక ఏర్పడును. జీవుల సేవ చేయక, జీవుల సోదరత్వమును దర్శింపక ఎవ్వరును సిద్ధులు కాలేరు.

సర్వజీవుల సోదరత్వము ఆధ్యాత్మిక సత్యము. జీవులందరును దైవము నుండి ఏర్పడినవారే గనుక, వారియందు సహజమగు సోదరత్వము కలదు. దానిని దర్శించుటకు ప్రేమతో కూడిన సేవయే ప్రధానము. స్నేహముతోను, వాత్సల్యముతోను, ప్రేమతోను జీవుల సేవ గావించినవారు మహాత్ములై శాశ్వత పదమున నిలచిరి. అట్టివారు మనోలోకముల నధిగమించి బుద్ధిలోకమున చేరుదురు. అట్టి వారికి బుధు డనుకూలుడై యుండును. అట్లు చేరునంతవరకు బుధుడు ఆచార్యత్వము వహించును. బుద్ధిలోకమున సదా వసించు సద్గురువు

మనోలోకముల యందు విహరించు జీవులకు దారి చూపువాడై యుండును. అతడు ప్రప్రథమముగా అందించునది విచక్షణ జ్ఞానమే. విచక్షణతోనే జీవుడు ముందుకు సాగుటకు ప్రయత్నించును. అతనికి విచక్షణను సద్గురువు కలిగించుచు నుండును. ఇచ్చట సద్గురువు శిష్యునకు బుధుడై దారి చూపుచు నుండును. సద్బుద్ధి కలుగుటకు శిష్యుడు గురువును, దైవమును ఆశ్రయించవలెను.

మేషరాశియందు సూర్యుడున్న వారు ఎవ్వరిని అనుసరించుటకు సమ్మతింపరు. తమనే అందరు అనుసరింపవలెనను అహంభావ ముండును. ఇట్టి వారికి సద్గురువు లభించుట సులభము కాదు. వారు తమ యందలి బుద్ధినే ప్రచోదనము గావించుచు సాగవలసి యుండును. కాని యిట్టి వారి లగ్నము కన్య యందున్నచో సద్గురువు లభించు అవకాశము కలుగుచుండును.

పై విధముగ మేష, కన్య, మిథునముల పరస్పరత్వమును తెలుసుకొని సద్వినియోగము గావించుకొనుట సాధనలో భాగము.

మేషరాశికి కుంభరాశికిని కూడ చక్కని సంబంధ మొకటి కలదు. మేషరాశి కుంభ చైతన్యమును రుచి చూచినచో లోకహితులై భౌగోళికముగ హితకార్యములు నిర్వర్తింప గలుగుదురు. మేష మందలి బుధుడు బుద్ధిలోక ప్రవేశమును గావింపగా, కుంభరాశి అధిపతియైన వరుణుడు ఆత్మలోక ప్రవేశము గావింపగలడు. అట్టి సమయమున ప్రత్యగాత్మ విశ్వాత్మను చేరి పరమగురువై వెలుగును.

**మార్గము :**

జీవులందరును మేషరాశియందే ఉద్భవించిరి. ఇట్టి జీవు లందరు జనన మరణ చక్రమున తిరుగుచుందురు. సృష్టి మేషరాశి యందు ప్రారంభింపబడుట వలన జీవుల పుట్టుక కూడ మేషరాశియందే జరిగినది. అట్టి జీవులు సంకల్పశక్తి కలవారై పరిపూర్ణత్వము కొరకు ప్రయత్నింతురు. వీరికి రాశిచక్రమున ఎనిమిదవ రాశియగు వృశ్చిక మున జ్ఞానోదయము కలుగుచుండును. అనగ కొంత అజ్ఞానము మరణించుట, ఆ మేరకు జ్ఞాన ముదయించుట క్రమముగ జరుగు చుండును. మరణమను భావము కూడ క్రమముగ మరణము చెందును. ఇది వృశ్చికము చేయు పని.

జ్ఞాన మేర్పడుచుండగ బుద్ధిలోకములందు ప్రవేశించుచు, సోదరభావముతో జీవులకు సేవ చేయుట రెండవ మెట్టు. అట్టి సేవ వలన స్నేహము, ప్రేమ, రక్షణ అను గుణములబ్బును. అట్టివారు వ్యక్తిగత స్వభావమును దాటి, దైవీ స్వభావమును పొంది నరులయందు శ్రేష్ఠులై యుందురు. హృదయగతు లగుదురు. హృదయము సింహరాశి చిహ్నమగుటచే, ఈ నరశ్రేష్ఠు లందరును నరసింహములుగ గుర్తింప బడుదురు. అపుడు వీరి తత్త్వము సింహరాశి యందు స్థిరపడును.

వృశ్చికమునందు చేయు సాధన కుజశక్తి ప్రభావముచే తులయందలి వ్యామోహములను దాటించి కన్యకు చేర్చును. కన్య యందలి సాధన సేవాతత్పరతగ మారి, జీవులసేవలో తరించుచు, జీవుని సింహరాశికి చేర్చును.

సింహరాశి తత్త్వము చేరిన జీవుడు పరహిత కార్యములను చేయుచు తన సర్వస్వము దానికి అంకితము చేసి ప్రేమ జ్ఞాన మార్గముల ద్వారా వ్యాప్తిచెందుచు, పరిమితము నుండి అపరిమితము లోనికి సాగుచుండును. ఇట్లొక నిర్దిష్ట మార్గము మేషరాశి జీవులకు అందు బాటులో నున్నది. ఇచ్చట మేషరాశి జీవులనగ అందరును అని తెలియవలెను.

## సంకల్పము-చతుర్దశలు :

సృష్టి దైవము చేయు పని, ప్రతిసృష్టి మానవుడు చేయు పని. ప్రతి జీవియు ప్రతిసృష్టి చేయుచుండును. దైవసృష్టి అనంతకాల ముండును. జీవసృష్టికి ఆయుర్దాయము తక్కువ. జీవునికి సంకల్పములు కలుగుచుండును. సంకల్పమే అతనిని నడిపించుచుండును. సంకల్పము జీవుని అధీనమున నుండదు. అది కర్మాధీనమైగాని, దైవాధీనమైగాని యుండును. కర్మాధీనమైన సంకల్పము కర్మమున బంధించును. కావున జీవుడు సుఖపడడు. సంకల్పము దైవాధీనమైనచో జీవునికి సుఖము లభ్యము కాగలదు. సంకల్పములు దైవాధీనమై తనయందు భాసింప వలెనని కోరుటయే నిజమగు ప్రార్థన. కాని ప్రార్థన లట్లు జరుగవు. తమతమ సంకల్పములు సిద్ధించవలెనని దేవుని ప్రార్థింతురు. అట్లు జరిగినను కర్మబంధము తప్పదు. తనయందలి సృజనాత్మక శక్తిని దైవమునకు సమర్పించి దివ్యసంకల్పమే తన సంకల్పముగ నిర్వర్తింప బడవలెనని ఆర్తితో దైవమును ప్రార్థించినపుడు క్రమముగ మానవుని సృష్టి దివ్యసృష్టితో అనుసంధానము చెందును.

సంకల్పశక్తి మేషరాశి భావ మగుటచే, మేష రాశియందు వ్యక్తిగత సంకల్పములను దైవమునకు సమర్పితము చేసి, దైవ సంకల్పమునకై ధ్యానమున వేచియుండుట మహాత్ములు కూడ చేయు పని. సాధకులు కూడ అట్లే చేయవలెను. మరియొక మార్గము లేదు. దివ్యసంకల్ప మెరిగి నిర్వర్తించువారు మహాత్ములు. మహాత్ముల సంకల్ప మెరిగి, తదనుగుణముగ జీవితము నిర్వర్తించుకొనువారు సాధకులు.

సాధకులు సామాన్యముగ ద్విస్వభావులై యుందురు. అందు వలన చంచలత్వ ముండును. గురుసంకల్పము, సొంత తెలివి మధ్య ఊగిసలాడు చుందురు. గురు సంకల్పమునకు కట్టుబడి యుండనిచో కర్మము నుండి తరింపక, కర్మలయందు చిక్కుకొని యుందురు. సొంత తెలివిని ప్రక్కకు నెట్టి, గురువాక్యమునే నిర్వర్తించుట ప్రారంభించి నచో వారు పునర్జీవులై పురోగమింతురు. అట్టివారు మరల మార్గమున చేరుదురు.

మార్గమున మాత్రమే దీక్షతో నడచువారికి దివ్య సంకల్పము ఉన్ముఖ మగును. అట్లు ఉన్ముఖత్వము పొందినవారు పండ్రెండు జన్మలలో అసంగస్థితి చేరి దివ్యప్రేమ యందు, సేవయందు స్థిర పడుదురు.

ఇట్లు మేషరాశి యందు సంకల్పములు సరిదిద్దుకొనువారు ప్రతి సృష్టినుండి, సృష్టికార్యములోనికి నాలుగు దశలలో ఉద్ధరింప బడుదురు. ఇందు మొదటి దశ కార్యకారణ సంబంధము. రెండవ దశ పునర్జీవము. మూడవ దశ ఉన్ముఖము. నాలుగవ దశ అసంగము.

**విస్ఫోటక శక్తి :**

అణువునుండి అణుశక్తిని విడుదలచేయు మహాశక్తివంతమైనది మేషరాశి. మేషరాశియందు వరుణుడు సంచరించు చుండగనే మానవుడు అణువునుండి శక్తి విచ్ఛేదనము గావించినాడు. అణువున నిమిడియున్న శక్తిని విడుదల చేయుట బీజమందలి వృక్షమును విడుదల చేయుట వంటిదే. బీజము మొలకెత్తునపుడు భూమి పొరలను విచ్ఛేదించుకొని వ్యాప్తిచెందును. మహావృక్షమై పెరుగును. అణు విస్ఫోటమైనను, అటువంటిదే అయినను దీని నంకుర శక్తి యందురు. వసంత ఋతువున మొలకలెత్తుట సహజము. అట్లే మానవుల యందు సంకల్పములు మొలకలెత్తుచుండును. మహత్తర కార్యములనుండి చిల్లరపనుల వరకును సంకల్పము మొలకెత్తుట వలననే జరుగుచున్నది. కావున మేషరాశి ప్రభావము ఇంతింతని తెలుపలేము.

నాయకత్వము మేషరాశి సహజ లక్షణము. ధైర్యము, సాహసము, అవరోధముల నధిగమించుట మేషరాశికి వెన్నతో పెట్టిన విద్య. ఛేదించుట సహజగుణమైన మేషరాశి జీవున కెంతయో ఉపయోగకరము. మానవుని బంధించు మానవ స్వభావము నుండి, చిత్త ప్రవృత్తులనుండి మానవుడు బయల్పెడలవలె నన్నచో మేషరాశి తత్వమును ఉపాసించవలెను. మేషరాశి చిహ్నమును భ్రూమధ్యమున నిలిపి ధ్యానము చేసినచో ఇడ, పింగళ నాడులు కలియు స్థానమున సుషుమ్న శక్తి అంకురించి జీవుని దివ్యత్వము వైపునకు నడుపును. జ్యోతిషశాస్త్రము మేషరాశిని సూర్యునకు అత్యుత్తమ స్థానముగ వర్ణించి నది. జీవుడు గూడ సూర్యాత్మక ప్రజ్ఞయే. అతని ప్రజ్ఞ ఫాలభాగమున

నున్నచో అతని జీవితమున కతడు రాజై వెలుగొందును. ఫాలభాగము నుండి శిఖ వరకు వ్యాపించివున్న శిరస్సు మానవునియందు మేషరాశిగ గుర్తింపబడినది. వెలుగు లోకములన్నియు అచటనే గలవు. "శీర్ణోద్యౌః" అని పురుష సూక్తము కీర్తించుచున్నది. శిరస్సే జీవున కత్యున్నత స్థానము. సహస్రారమే దాని కేంద్రము. పురుషుడు సహస్రము శీర్షమును శీర్షమునందు ధరించిన వాడగుటచే "సహస్ర శీర్షా పురుషః" అని కీర్తింపబడుచున్నాడు. సహస్రార పద్మమే సర్వస్వము. అందు అన్ని పద్మములు ఇమిడియున్నవి. అన్ని రాశులు ఇమిడియున్నవి. అన్ని లోకములు ఇమిడియున్నవి. బ్రహ్మాదండమునకదే మేరువు.

## గోపాలక శక్తి :

మేషరాశి ప్రారంభమున సూర్యుడు భూమధ్యరేఖను ఖండించి దక్షిణము నుండి ఉత్తరమునకు సాగుతున్నట్లుగ భూమిపై జీవులకు గోచరించును. సమాంతర రేఖయగు భూమధ్యరేఖను ఊర్ధ్వరేఖగ సూర్యుడు ఖండించుట వలన ఆ దినమును విషువత్పుణ్యదిన మనిరి. ఉత్తరముగ ఖండించుటవలన ఉత్తరాయణ విషువత్పుణ్యదిన మనిరి. భూ వలయమును ఖండించుచు జీవుడు ఊర్ధ్వలోకముల కేగుటకు సంకేతముగ ఋషులు ఈ పుణ్యదినమును వర్ణించినారు. మేకలవంటి సాధుజనులు 'రక్షకుని' (అవతార పురుషుని) సహాయమున ఊర్ధ్వమున కేగుటకు కూడ నిది సంకేతింపబడినది. గోపాలకుడైన శ్రీకృష్ణుడు, గొఱ్ఱెల కాపరియైన ఏసుక్రీస్తు పై విధముగ జీవులను తరింపజేసెనని పరమ గురువులు నిత్యము కీర్తించుచుందురు. మేషరాశి ప్రభావమును ఆకళింపు చేసుకొనిన మహాత్ములే యిట్టి మహత్తర కార్యములను చేయగలరు.

సూర్యుడు భూమధ్యరేఖను ఉత్తరాభిముఖముగ ఖండించుట యందు నిగూఢమగు దర్శనము లెన్నియో గలవు. పొరలను చీల్చుకొని సృష్టిలోని పై పొరలలోని కేగుట ఊర్ధ్వగమనమున కలుగుచుండును. ఊర్ధ్వగమనమునకు లోకములు మితము లేర్పరచు చుండును. మితమును ఛేదించుటకు మేషరాశి శక్తి ఆవశ్యకము. అవరోధమును అధిగమించుటగ కృత్తికా నక్షత్రము చెప్పబడినది. పశ్చిమ దేశములందు కృత్తికను శిలువగ సంకేతించిరి. తూర్పు దేశములయందు కృత్తికను కత్తెరగ సంకేతించిరి. కత్తిరించుటకు తెలుపబడిన కత్తెర, శిలువ చతుర్భుజమువలె గోచరించును. చతుర్భుజమందలి సమాంతర రేఖ లోకముల మితిని సంకేతించును. హద్దులను సంకేతించును. దానిని ఖండించుచు సాగు ఊర్ధ్వరేఖ పరిమితము నుండి అపరిమితము లోనికి సాగుటను సంకేతించును.

ఇట్లు పరిమితము నుండి అపరిమితములోని కేగుటకు మేషరాశి తత్త్వము చాల ప్రధానమై ఉన్నది. జీవులు రకరకముల దైవయోగ సాధనముల ద్వారా ఈ ప్రయత్నముననే యుందురు. వృద్ధి చెంద వలెనను సంకల్పము ప్రతి జీవికిని సహజము. అందు స్ఫూర్తిమంతులు దృఢమగు సంకల్పము గలవారై ముందుకు సాగుట కిచ్చగింతురు. అట్టి వారిని తీరము దాటించు తరణోపాయ మిచ్చువారు మహా పురుషులు. యుగపురుషులే అట్లు తరింపు మార్గమున నడిపించగలరు. ఇతరులు జీవుల సేవ, వ్యక్తిగత సాధన, స్వాధ్యాయముల ద్వారా తమను తాము తరింపజేసుకొందురు. రెండు తెగల వారికిని వృద్ధి చెందవలెనను అంకురము ప్రధానము గనుక ఇట్టి వారికి మేషము ఉత్తమోత్తమమైన కాలముగ గోచరించును.

అపరిమిత మనగ అది అనంతము. అనంతమగు కాలమందు అపరిమితమై చరించుట జీవుల పరిపూర్ణతకు చిహ్నము. అనంత కాలమునకు అనంతుడగు సర్పము సంకేతింపబడినది. అంతము లేని కాలచక్రమున అంతము లేక జీవించుట సహస్రారమును చేరుటగ పెద్దలు తెలిపిరి. అనంతుడు సహస్రశీర్షుడే గదా! అధోలోకము లన్నియు అంతమగు చుండును. ఊర్ధ్వము, దివ్యము అగు లోకము లంతము కావు. ఇట్లు అంతము నుండి అనంతమునకు ప్రయాణము చేయుటకు మేషరాశి భావము సహకరించును.

## తలమార్పిడి యజ్ఞము :

మేషరాశి తత్వము సమర్థత, దక్షతలకు చిహ్నము. సంవత్సర పురుషుడు దక్షుడై, సంవత్సరకాలము జీవులను నడుపుచు నుండును. ప్రతి సంవత్సరము ఒక నూతన భావము నావిష్కరించుచు, జీవులను నడుపుట అతని దక్షత్వము. కాలచక్రముల కధిపతులు ప్రజాపతులు. అందు దక్షుడు ప్రధానుడు. దక్ష ప్రజాపతి అమోఘమగు ఉపదేశమును పొంది దివ్యుడై నిలచినాడు. అతడు ఈశ్వర కటాక్షముచేత తనకున్న శిరస్సును మార్పు గావించుకున్నాడు. శిరస్సు ఖండింపబడి గొఱ్ఱె శిరస్సును ధరించుట వలన అతడు సంవత్సర చక్రమును దివ్య ప్రణాళికకు అనుసంధానము చేయుచు నడుపుచున్నాడు. జీవులకు మార్గమును చూపుచున్నాడు. మార్గము చూపుటయేగాక ఆ మార్గమున నడిపించు చున్నాడు.

శిరోఖండనము యజ్ఞములలో ఉత్తమోత్తమమైన యజ్ఞము. శిరస్సును దైవమున కప్పగించి, అతని అనుగ్రహమునకై వేచియుండుట

సాహసోపేతమైన మార్గము. శిరస్సు తెగినను సరే తాను దైవమునకే సమర్పితుడు అని భావించువారు ఈ యజ్ఞమున కుపక్రమింతురు. ఇటీవలి కాలములో ఏసుక్రీస్తు ఇట్టి యజ్ఞమును కావించినాడు. ఇది పురుషమేధ యజ్ఞము. ఆ యజ్ఞ నిర్వహణమున ఏసు అవతార పురుషుడై నిలచినాడు.

పురాణములందు దక్షునకు తల మార్చబడినది. గణపతికి కూడ తల మార్చబడినది. ఒకరికి గొఱ్ఱెతల ఏర్పడినది. గొఱ్ఱెతల సమర్పణమునకు చిహ్నము. దక్షుడు దైవమునకు సమర్పణముచెంది శాశ్వతుడై నిలచినాడు. గణపతికి ఏనుగుతల అమర్చబడినది. ఏనుగు తల దైవసిద్ధి, దైవ బుద్ధులకు సంకేతము. ఇరువురును దివ్య ప్రణాళిక యందు సింహ భాగమును నిర్వర్తించు చున్నారు.

సాధకులు సిద్ధులు కావలెనన్నచో స్వభావములన్నియు తొలగింపబడి దివ్యభావమే మిగులవలెను. ఇదియే తల మార్పిడికి చిహ్నము. జీవుల భావములు వారి స్వభావము ననుసరించి యుండును. దివ్యభావముల ననుసరించుచు క్రమముగ స్వభావము నుండి బయల్పడుట తలమార్పిడి యజ్ఞమే యగును.

తలమార్పిడి యజ్ఞమున శిరస్సు నిజముగ ఖండింపబడ నక్కర లేదు. అహంకారము తొలగి, నిరహంకారమున దైవమునకు సమర్పితుడై నిలచిన శిరోఖండనమైనట్లే. ఇనుము బంగారమైనట్లే. దుష్టుడు శిష్టుడైనట్లే. జీవుడు దైవమును చేరినట్లే. ఇట్లు మార్పు చెందుటకు కొన్ని వేల మార్పులు ఆ నడుమ జరుగును. బీజము వృక్షమగుటకు ఎన్నో మార్పులు జరుగుచున్నది. స్వభావము దైవీ భావముగ మారుటకు

అన్ని మార్పులు జరుగును. రూపము సహితము మారును. ఇన్ని మార్పులు జరుగవలెనన్నచో ఎట్టి దృఢమగు సంకల్పము ఉండవలెను? అట్టి సంకల్పము మేషమున, వృశ్చికమున, మకరమున లభింపగలదు.

**శంబళ :**

మేషరాశికి భూమిపై శంబళ గ్రామము మకుటము వంటిది. అందు వసించు ప్రజ్ఞ కుమార ప్రజ్ఞ. అతడు భూమికి ప్రభువు. భూమి జీవు లందరికిని చక్రవర్తి. భూమి సహస్రార చక్రమున సనత్కుమారుడు వసించి భూమి పరిణామమును, భూమి జీవుల పరిణామమును నిర్వర్తించుచున్నాడు. సనత్కుమారుడే ద్వాపర యుగాంతమున ప్రద్యుమ్నుడుగ అవతరించినాడు. వాసుదేవుని కుమారుడిగ ధర్మ సంస్థాపనమున కృషి చేసినాడు.

సనత్కుమారుడు నీలకాంతి దేహుడు. బాలునివలె శంబళ గ్రామమున వసించి యుండుటచేత, ఆ గ్రామమున కతని పేరు సంక్రమించినది. శ్యామబాలుడే శంబళవాసి. అతడు భూమికి వలసిన ప్రణాళికను ధ్యానమార్గమున ఊర్ధ్వలోకములనుండి గొనివచ్చి నూతన సంవత్సర ఆరంభమున భూమిపై సిద్ధులకు మౌనముగ, బీజప్రాయముగ అందించును. దక్షిణామూర్తి గురుతత్వము వలె అతడు మౌనముగనే బోధ చేయును. ఉత్తమోత్తమ మగు సిద్ధులకు అతని బోధనలు అందు చుండును. ప్రతి సంవత్సరము చైత్ర పౌర్ణమినాడు మైత్రేయాది పరమ గురువులు సహితము అతని ఆజ్ఞను గొనుటకు ధ్యానమున అతనికి ఉన్ముఖులై యుందురు.

కలియుగాంతమున శంబళ గ్రామము నుండియే అవతార పురుషు డేతెంచి ధర్మసంస్థాపనము చేయునని పురాణములు తెలుపుచున్నవి. అట్టి మహత్కార్యము నిర్వర్తింపబడుటకు సనత్కుమారుడు సహకారము నందించగలడు. మేషరాశియందు సాధకులు సహస్రారమున సనత్కుమారుని ఆహ్వానించి, ఆ దివ్యపురుషుని సంకల్పమే తమ సంకల్పముగ సాగవలెనని ప్రార్థించు సంప్రదాయ మొకటి కలదు. సనత్కుమారుని ప్రార్థించుటవలన మనలోని సంకల్పశక్తి కామ మార్గముల చనకుండ దివ్యమార్గముల చొరబడగలదు. కామదేవుని బారినుండి జీవులను రక్షించగల ప్రజ్ఞగ సనత్కుమారుని వేదవ్యాస మహర్షి కీర్తించినాడు.

సుబ్రహ్మణ్య తత్త్వమే కృత్తికల ద్వారా 'కార్తికేయుడు'గ భూమి కేతెంచిన ప్రజ్ఞ. అదియే సనత్కుమార ప్రజ్ఞ.

**సంఖ్యాశాస్త్రము :**

మేషరాశి తొమ్మిది అంకెగ సంఖ్యాశాస్త్రమున తెలుపబడినది. తొమ్మిది తరువాత వచ్చునది పూర్ణము. పూర్ణమనగ పరబ్రహ్మము. పరబ్రహ్మమునుండి వెలువడు శుద్ధ చైతన్యము అందుండి దిగివచ్చిన ప్రధాన తత్త్వముగ తెలియనగును. ఆ శుద్ధ చైతన్యము జీవుల కావలి వెలుగు. అంతేకాక పరతత్త్వము యొక్క వ్యక్తరూపము, ప్రథమ రూపము, ప్రధాన రూపము. దీనినే గాయత్రి యనిరి. అదితి అని కూడ పిలచిరి. సరస్వతి అని కూడ అందురు. శ్రీమాత అని కూడ సంబోధింతురు. జీవ చైతన్యము వస్తుతహ శుద్ధ చైతన్యమే. చైతన్యము పరతత్త్వము నుండి దిగివచ్చుటచే అది సత్–చిత్ తత్త్వమై యున్నది. జీవుడు కూడ సత్–చిత్ రూపుడే.

సత్–చిత్ తత్త్వము నుండి అష్ట ప్రకృతు లేర్పడుచున్నవి. మూడు గుణములు, ఐదు భూతములుగ ఎనిమిది ప్రకృతు లేర్పడు చున్నవి. సృష్టియందు మహదహంకారము ఎనిమిదవ అంకె. అహంకార స్వరూపుడైన జీవుడు కూడ ఎనిమిదితోనే పోల్చబడినాడు. అతనిని అష్ట ప్రకృతులు బంధించి యుండును. అహంకారమునకు లోబడి బుద్ధి, చిత్తము, పంచభూతములు పనిచేయు చుండును. ఎనిమిది బంధములకు చిహ్నము. శుద్ధ చైతన్యము సృష్టియందు అష్టదిగ్బంధము చేయబడి, రూపములన్నియు ఏర్పడి జీవపరిణామ కథ సాగుచున్నది. అష్టబంధములు, అష్ట ప్రకృతుల బంధనములే. అజ్ఞానమున వసించు జీవులకు అవి అష్టకష్టములను కొనితెచ్చును. అష్టదారిద్ర్యములలో ముంచును. శనిదేవతను కూడ ఎనిమిది అంకెతో సరిపోల్తురు. ఎనిమిది పరిమితిని సంకేతించును. తొమ్మిది అపరిమితమును సంకేతించును. 3 గుణములకు, 5 భూతములకు లోబడని తత్త్వము అపరిమితమేగదా! అట్టి అపరిమిత తత్త్వమునకు సంకేతము 9వ అంకె.

9వ అంకెను సంస్కృతమున 'నవ' అని పిలతురు. అందువలన ఈ స్థితి యందనుభూతి నవానుభూతి. అది నిత్య నవ అనుభూతియై యుండును. ఎప్పటికప్పుడు నూతనముగనే యుండును. ఇట్లు మేషరాశి ప్రతి సంవత్సరము నిత్యనూతనమగు ప్రణాళికను సృజనాత్మకముగ భూమిపై ప్రసరింపజేయు చుండును.

ప్రాణుల శరీరములో రక్తము కూడ నిత్య నూతనమై హృదయము నుండి ప్రకటింపబడుచుండును. భావములయందు నూతనత్వమున్నను లేకున్నను జీవుల రక్తము మాత్రము నిత్యనూతనముగ తయారగుచున్నది.

రక్తమే ప్రాణమును దేహమంతట ప్రవహింపజేయును. ప్రాణమయ కోశమునకు, రక్తమునకు, మేషరాశికి చక్కని సంబంధమున్నది. అశ్వములవంటి సూర్య కిరణముల ద్వారా ప్రాణము, వాయువు వాహనముగ జీవుల రక్తమును చేరి నిత్య నూతనత్వమును ప్రసాదిం చును. రక్తమందలి వేడిమి కూడ మేషరాశి అధిపతి యగు కుజు డేర్పరచునదే. రక్తమందలి ఎఱ్ఱకణములు కుజశక్తిని సంకేతించును. అశ్వినీ నక్షత్రముతో ప్రారంభమగు మేషరాశి మొదటి 13 దినములు ప్రాణమయ కిరణములను విస్తారముగ ప్రసరింపజేయును.

**ధ్యాన మార్గము :**

మొలకెత్తు గడ్డిపోచలు మేషరాశి చిహ్నముగ భావింతురు. గడ్డిపోచ ఒకే మూలమునుండి మొలకెత్తి ఊర్ధ్వమున రెండుగ చీలును. మానవ శరీరమున ముక్కు, కనుబొమలు ఇదే సంకేతమును సూచించును. సాధకుడు తనయందలి ఈ భాగమును ధ్యానము చేసినచో హృదయముననున్న ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెంది భ్రూమధ్యమున చేరగలదు.

♈

పై చిహ్నమును ముక్కునుండి ఊర్ధ్వమునకే కాక, మూలా ధారమునుండి భ్రూమధ్యమునకు ఏర్పడియున్న మంత్రదండముగ కూడ ధ్యానింపవచ్చును. మూలాధారము నుండి నాసికాగ్రము వరకు తేజోమయమగు బ్రహ్మదండముగను, అటుపైన కనుబొమలు బ్రహ్మ దండమునకు ఇరుపార్శ్వములుగ నున్న రెక్కలుగ కూడ భావించ వచ్చును.




ఇడ, పింగళ నాడులను కనుబొమలు సంకేతించును. కనుబొమలపైన ఇరుపార్శ్వములనుండి ఈ నాడులు భ్రూమధ్యమును చేరి, ఆ తరువాత మెలికలు తిరుగుచు, బ్రహ్మదండము నంటి పెట్టుకొని మూలాధారము వరకు అల్లుకొని యున్నది. పరమగురువు జ్వాలా కూలుడు ఈ రెండు నాడులను వృషభ మీనములతో పోల్చిరి. మధ్యస్థమైన మేషమును భ్రూమధ్యముతో పోల్చిరి. దేవుని చేరు సంకల్పముగల జీవునియందు అంకురశక్తి ఊర్ధ్వమునగల భ్రూమధ్య మును చేరి, అటుపైన ఊర్ధ్వమున కేగును. అట్లూర్ధ్వమున కేగుటకు భ్రూమధ్యమున ఇడ –పింగళ స్రవంతులు సమన్వయము చెందవలెను. అట్టి సమన్వయమున బుద్ధి విద్యుద్దీపమువలె ప్రకాశించును. ఆ ప్రకాశ మాధారముగ జీవునికి ఊర్ధ్వగతి చేరు దివ్యమగు వంతెన ఒకటి గోచరించును. ఆ వంతెనపై పయనించి జీవుడు సహస్రారము చేరగలడు.

సూర్యచంద్రాత్మక ప్రజ్ఞలు పింగళ – ఇడ నాడులుగ ప్రజ్ఞను, పదార్థమును అల్లుచు సమస్త దేహనిర్మాణము చేయును. ఈ రెంటిని సమన్వయించు ప్రజ్ఞ అగ్ని. అది విద్యుదాగ్ని. ప్రజ్ఞ, పదార్థములు సమన్వయింపబడినపుడు ధన–ఋణ సంజ్ఞలు సమన్వయింపబడి విద్యుదాగ్ని ప్రకాశించును. అపుడు ఊర్ధ్వలోకముల కేగు మార్గము దృగ్గోచరమై జీవుడు సహస్రార మందలి దైవమును చేరును.

## దేవ - పితృయానములు :

సృష్టి ప్రారంభము మేషమున జరిగినదని ఋషులభిమతము. ఆర్యజాతి ప్రాదుర్భావము కూడ మేషమునందే జరిగినదని తెలియ దగును. ఆర్యజాతి బ్రహ్మదండమును ఉపాసనచేసి మహత్తర సిద్ధులను పొందినారు. భూమి ధ్రువములు మేషరాశియందు సంచరించుచున్న 2,160 సంవత్సరములు ఆర్యజాతి అత్యుత్తమమైన దివ్య స్థితుల ననుభవించినది. వారి హస్తమున తరచు గోచరించు మంత్రదండము వారు సాధించిన బ్రహ్మదండమే. వశిష్ఠ, విశ్వామిత్రాది మహర్షులు వారి సర్వ సిద్ధులను హస్తగతమగు వారి మంత్ర దండమునుండే ప్రకాశింపజేసిరి. ఇటీవలి కాలమున యూదులలో మోజెస్ అను మహాత్ముడు దైవకృపద్వారా బ్రహ్మదండ దర్శనము పొంది ఈజిప్ట్‌లో మహత్తరమగు మాహాత్మ్యములు చేసి చూపెను. ఈజిప్ట్ చక్రవర్తుల బానిసత్వము నుండి యూదులను విడిపించి పుణ్య భూమియగు ఇజ్రాయిలుకు చేర్చెను. ఆ మహాత్ముని దర్శించినవారు అతని భ్రూమధ్యమునుండి రెండు కిరణములు సూర్యచంద్రాత్మక కాంతితో ఊర్ధ్వమునకు కొమ్ములవలె దర్శించుచుండెడివారట. అవి వెలుగు కిరణము లగుటచే ఆ కొమ్ములను 'కిరణ్' అని సంబోధించెడివారట. మోజెస్ మహాశయుని తపశ్శక్తియే సూర్యచంద్రాత్మక ప్రజ్ఞలుగ ఫాల భాగమున ప్రకాశించు చుండెడివి. ఇడ - పింగళ - సుషుమ్న తేజోవంతములైనపుడు మానవుని ఫాలభాగమున ఊర్ధ్వపుండ్రము లేర్పడును. అవియే నేటి ఆచారమున వైష్ణవ నామములుగ స్థిరపడినవి. ఊర్ధ్వపుండ్రములను చూచినపుడెల్ల సూర్య, చంద్ర, అగ్ని తేజస్సులతో కూడిన ఇడ, పింగళ, సుషుమ్న నాడులుగ సాధకులు గుర్తించవలెను.

బాహ్య ప్రపంచమున గల ఆకర్షణలకు లోనై జీవించువారికి ఈ మంత్రదండము భూమికి సమాంతరమై పనిచేసి బంధములు కలిగించును. అంతర్లోకములందు జీవించుచు బాహ్యాకర్షణలకు లోనుకాక, దైవసాన్నిధ్యమున స్థిరమై నిలచువారికి ఈ మంత్రదండము మహత్కార్యములు సాధించుటకు వినియోగపడును. వీరికది ఊర్ధ్వమై పనిచేయును. మానవ ప్రజ్ఞ బాహ్యములోనికి ప్రవహించుచున్నంత కాలము అతడు శక్తిహీనుడై, వీర్యహీనుడై నశించును. ఇట్టి వారికి సర్పములు సంకేతములుగ తెలుపబడినవి. అంతర్లోకములు సాధించి ఊర్ధ్వగతి చెంది దైవస్పర్శను, దర్శనమును పొందినవారికి శక్తి సామర్థ్యములు ఇనుమడించి మహత్కార్యములు నిర్వర్తించుటకు తోడ్పడును. ఇట్టి వారి ప్రజ్ఞ గరుత్మంతుని ప్రజ్ఞతో పోల్చుదురు. సర్పములు పొట్టపై ప్రాకుచు జీవించుచుండును. గరుడ పక్షి ఆకాశము నకు ఎగురుటకు ఉత్సహించు చుండును. మానవ ప్రజ్ఞ ఇనుమడించి దైవీ ప్రజ్ఞ అగుట ఒక మార్గము కాగ, పదార్థ సముపార్జనకై పాటుపడుచు పశుప్రాయుడుగ జీవించుట మరియొక మార్గము. ఇందు మొదటి మార్గమును దేవయాన మార్గమందురు. రెండవ మార్గమును పితృ యాన మార్గ మందురు.

మేషరాశి యందు సాధకులు తమ తమ సంకల్పములను ఒకసారి పరిశీలించుకొని సమాంతర భావములను విసర్జించి ఊర్ధ్వ మార్గములను అనుసరించుటకై యత్నించవలెను. మేషమున యిట్టి నిర్ణయముగొనుట సాధకుల కర్తవ్యమై యున్నది.

## చైనీయుల అవగాహన :

మేషరాశి మీనమునకు, వృషభమునకు నడుమగల రాశి. అగ్నితత్వపు రాశి. వృషభమునకు పయనించినపుడు పృథివీ తత్వమున ప్రవేశించినట్లు, మీనమున ప్రవేశించినపుడు (అపసవ్యముగ) జీవ చైతన్యమున ప్రవేశించినట్లు తెలుసుకొనవలెను. మీనము జలరాశి. కాని మీన జలము ఆకాశజలము. వానిని నారము లందురు. వాని నధిష్ఠించి నారాయణు డుండును. నరులు నారముల నుండి ఏర్పడిన వారే. నరులనగ నశింపబడనివారు.

అగ్నితత్వము మనస్సునకు సంబంధించినది. వాయుతత్వము బుద్ధి సంబంధితము. ఆకాశజలము ఆత్మ సంబంధితము. సాధకులు మేషము నుండి వృషభమునకు చనక, మీనమునకు చను మార్గమున్నది. వారు ఇరు మార్గముల కూడలి యందున్నారు. వృషభమును ఒక పెద్ద పర్వతముగ ఊహించుకొనుడు. అందు రాయి, మట్టి మిక్కిలిగ నుండును. పర్వతము మొదలున సాధకుడున్నాడు. అతడు నిలబడిన చదును భూమికి ఈవల నిర్మలమైన సరస్సు ఉన్నది. పర్వతము లెక్కుటకన్న జలప్రవేశము చేయుటయే ఉత్తమ మని చైనీయులు వారి గ్రంథమున చమత్కరించినారు. పర్వతము నెక్కుట గొప్పదనము వైపు మొగ్గుట. జలములందు ప్రవేశించుట క్లుప్తముగ నుండుటకు ప్రయత్నించుట. గోపకులందరు గుప్తులే. వారు దైవమును హృదయ మున పదిలపరచుకొని గుప్తులై శాశ్వత పథమున నిలచిరి.

ఇట్లు మేషరాశి యందు తమను తాము గుప్తమగు దివ్య మార్గముల యందు చరించుటకు సంకల్పించవలెనుగాని, ప్రపంచ

మున గొప్పదనము కొరకు కాదు. జీవుడు తనను తాను తెలుసుకొన్న నాడే సంతుష్టుడగును గాని ఇతరములేవి లభించినను సంతృప్తి యుండదు.

**అగ్నితత్త్వము :**

మేషము, సింహము, ధనుస్సు ఈ మూడును అగ్నితత్త్వపు రాశులు. మూడును మూడు విధములగు అగ్నితత్త్వములతో కూడి యున్నవి. వాటిని త్రేతాగ్ను లందురు. ఇందు రెండగ్నులు కనబడవు. ఒకటి కనబడును. కట్టెయం దగ్ని యున్నది. కాని కనపడదు. చోటుయం దగ్ని యున్నది. కాని కనపడదు. జ్యోతి జ్వాలయం దగ్ని యున్నది. అది కనబడును. కట్టె యందలి అగ్నిని 'పావకాగ్ని' అందురు. చోటుయం దగ్నిని 'విద్యుతాగ్ని' అందురు. జ్వాలయం దగ్నిని 'జ్యోతిరగ్ని' అందురు.

పై మూడగ్నులే మూడు లోకములకు ఆధారము. ఇందు విద్యుతాగ్ని ఆత్మ వంటిది. జ్యోతిరగ్ని బుద్ధి వంటిది. పావకాగ్ని దేహము వంటిది. (దేహ మనగా మనసు, ఇంద్రియములు, శరీరము) దేహము కట్టెవలె కాలిపోయినపుడు పావకాగ్ని జ్యోతిరగ్నిలో కలియుచుండును. కట్టె (దేహము) పూర్తిగ కాలిపోయినపుడు జ్యోతి కూడ వాయు రూపమును ధరించి ఆకాశమును చేరును. అపుడు మిగులునది విద్యుతాగ్నియే (ఆత్మయే). ఆత్మ, బుద్ధి, శరీరము– ఈ మూడును కలిసి మానవుడుగ గోచరించుచున్నాడు.

పై మూడింటిని మూడగ్నులు పరిపాలించు చున్నవి. ఆత్మ సంకేతమైన విద్యుతాగ్ని మేషరాశి. ఆత్మ స్థానము కూడ మేషరాశి భాగమైన ఫాలభాగమే. జీవు డాత్మ స్వరూపుడైనపుడు అతడాజ్ఞా

కేంద్రమున స్థిరమై తనను తాను పరిపాలించుకొనును. అదే విధముగ జ్యోతిరగ్నియైన బుద్ధి సింహరాశి. మానవుడు బుద్ధిలోకములయందు స్థితి గొనునపుడు సింహరాశి భాగమైన హృదయమునందు వసించి యుండును. బుద్ధిలోకవాసి సింహాసనము నధిష్ఠించి యుండును. ఆత్మలోకవాసి రాజసింహాసనమున కూర్చుండి మకుటమును కూడ ధరించి యుండును. పావకాగ్ని దేహాత్మ భావములను కలిగిన జీవునకు సంకేతము. అనగ పదార్థమున నున్నటువంటి మానవ ప్రజ్ఞ. అది ధనూరాశి సంకేతము. అట్టి మానవుడు మూలాధారమున దేహబద్ధుడై యుండును. 'మూల' నక్షత్రము ధనూరాశికి చెందినదే. ఇట్లు ఆత్మ మూడు స్థితులలో నుండును. మూడు స్థితులు తెలిసినవారు మూడగ్ను లను సమన్వయించిన వారు. వారియందు అగ్ని పరిపూర్ణమై యుండి మానవులలో దైవములుగ కీర్తింపబడుదురు. వీరిని మహాయోగు లందురు. ఇతర మానవులు దేహబద్ధులు. కొందరు బుద్ధిమంతులు. మరికొందరు జన్మరాహిత్యము గావించుకొని ఆత్మలోకముననే స్థిరపడిన వారు. యోగులు మాత్రము అన్ని లోకములయందు యథేచ్ఛగ విహరింతురు. నారదాదు లట్టివారు.

## సృష్టి - లయము :

భిన్నత్వము నుండి ఏకత్వమునకు, ఏకత్వమునుండి భిన్నత్వము నకు మేషరాశి చిహ్నముగా నున్నది. ఒకటి రెండగుట అనగ సృష్టి ఆరంభము. మరల రెండు ఒకటి యగుట అనగ సృష్టి లయమగుట. సృష్టి ఆరంభము, సృష్టి లయములు రెండును మేషరాశి యందే జరుగును. ఒక వృత్తము నందు ఆరంభ మెచట జరుగునో అంతము

కూడ అచటనే యుండును. అంతము నందారంభము, ఆరంభము నందంతము దర్శించుట ఋషి దర్శనము. అదియే సమగ్ర దర్శనము. పుట్టుక యున్నచోట చావుకూడ నిర్దేశింపబడినది. అట్లే చచ్చుట మరియొక పుట్టుకకే. అంతము ఆరంభమునకు పునాది. ఆరంభము అంతమునకు పునాది. ఓషధులీ సత్యమును ప్రస్ఫుటముగ ప్రకటించు చున్నవి. బీజమునుండి మొలక వచ్చుట అనగా బీజ మంతమై మొలక జనించుటని తెలియవలెను. మరల మొలక మొక్కయై, మొక్క నుండి బీజము రాగ, మొలక అంతమై బీజ మారంభమగును. ప్రతి అంతము ఒక ఆరంభమునకే. ప్రతి ఆరంభము ఒక అంతమునకే. ఇట్లు వృత్తాకారముగ ఒకదాని వెంట ఒకటి నడచుట కాలము స్వభావము. నిజమునకు ఆరంభము, అంతము అనునది లేక అనుస్యూతమై సృష్టి సాగుచుండగ అందు ఆరంభము, వృద్ధి, అంతము వచ్చిపోవు చుండు నట్లు కనిపించును. వచ్చినదెల్లయు పోవుటకే. పోవునది మరల నూతనముగ తిరిగి వచ్చుచుండును. ఈ సత్య మెరిగినవారికే మేషరాశి సంపూర్ణముగ అవగాహన యగును.

విడివిడిగ గోచరించు కుడి ఎడమ కనుబొమలు ఒకే కేంద్రము నుండి కుడి ఎడమగ విచ్చుకొనుచున్నవి. రెంటి నడుమగల కేంద్రమున కుడి ఎడమలు వేరు. కుడి ఎడమల పుట్టుక స్థానమే వాటి అంతిమ స్థానము కూడను. ఎచ్చుట పుట్టినవో, అచటే లయమగును. అట్లే ప్రకృతి పురుషుల ఉత్పత్తి స్థానమే వాని లయస్థానమై యున్నది. జీవుడు తనను తన మూలము నందు లయము గావించుకొనుటకు ఈ స్థానముననే ధ్యానము చేయుట ఋషులందించిరి. జీవాత్మ-పరమాత్మల ఐక్యభావమునకు, ప్రకృతి-పురుషుల ఐక్యభావమునకు మూలముగ

మేషరాశి చిహ్నమును ఆరాధింపవలెను. ఈ ఆరాధనమున భిన్నత్వ మదృశ్యమై ఏకత్వమే మిగులును.

**విరాట్పురుషుడు :**

మేషరాశి నాలుగు ప్రధానమగు చర రాశులలో మొదటిది. చరరాశి ప్రకారమే సృష్టి నిర్మాణము, అటుపైన నిర్వహణము సాగు చుండును. దైవముయొక్క నాలుగు వ్యూహములు చరరాశి నుండియే వ్యక్తమగు చుండును. సృష్టి ఆది మేషముననే ధారణమైనది. అది ఋషి దర్శనము. అట్లే కలియుగ ప్రారంభము కూడ మేషమందే ప్రారంభమైనట్లు ఋషిప్రోక్తమగు పురాణములందు గోచరించును. ఆరంభ మెచట జరుగునో అంతము కూడ అచటనే యుండును. కనుక సృష్టికి గాని, కలి యుగమునకు గాని ప్రారంభము, అంతము కలియుగము నందే అని ఋషుల విశ్వాసము. కనుకనే ప్రతి సంవత్సరము మేషమున సూర్యసంక్రమణము ఉగాదిగ గుర్తింప బడినది. ఉగాది నిజమునకు 'యుగాది' అని తెలియవలెను. కనుకనే సంవత్సరమున మేషమును శుభారంభముగ భావింతురు.

సృష్టికి మూలము బ్రహ్మము. అతనినుండి సంకల్ప మాధార ముగ ఇరువది ఏడు తత్త్వములు వ్యక్తమై బ్రహ్మాండ మేర్పడును. దానిని 'విరాట్' అందురు. అందుండి ఒక విశ్వరూపుడగు పురుషు డేర్పడును. అతనిని విరాట్పురుష డందురు. అతడే సృష్టికి దైవము. మతమేదైనను, ఆరాధనము విరాట్పురుషుని గూర్చియే. అతడి ప్రతిరూపమే మానవుడు. విరాట్పురుషుని నుండియే నవవిధ సృష్టి,

చతుర్వ్యూహములుగ నేర్పడినవి. ఈ వివరములు భాగవత పురాణమున లభించును.

కనుకనే మేష మాసమున వసంత నవరాత్రుల పేరిట తొమ్మిది రోజులు ఉభయ సంధ్యల యందును విరాట్పురుషారాధనము అనాదిగ జరుగుచున్నది. అది వేద సమ్మతము. తదుపరి వేదమత మైనది. అదియే శ్రీరామ నవమి సందర్భముగ వసంత నవరాత్రి పూజలు రామ కైంకర్యముగ రూపాంతరము చెంది నిర్వర్తింపబడుచున్నవి. మేష సంక్రమణము (మార్చి 20 – 21) ఆదిగ తొమ్మిది రోజులపాటు విరాట్పురుష ఆరాధన చేయువారియందు విరాట్పురుషు డావిర్భ వించును. ఇదియే పురుష సూక్త ఆరాధనము. దైవమును తమయందు నిలుపుకొను వారందరును, పురుషసూక్త పారాయణము నిత్యము గావించుకొనుట పరిపాటియైనది. అతని మహిమను వర్ణించుటకే ఈ సూక్త పారాయణము. దీక్షగ ఉగాది మొదలు తొమ్మిది రోజులు ఉభయ సంధ్యలయందు విరాట్పురుషుని ధారణచేసి, పురుష సూక్తము పారాయణ చేసినచో మానవునియందు దైవము స్థాపింపబడగలదు. పౌర్ణమి తిథి అంతము వరకు 16 రోజులు గావించినచో మరింత శ్రేష్ఠము. విరాట్పురుషుని వైభవమే అతని 'శ్రీ' అగుటచే శ్రీసూక్త పారాయణము కూడ మరింత శ్రేయోదాయకము. చైత్ర ప్రతిపత్ నుండి రాకాంతము వరకు అనగా పౌర్ణమి తిథి అంతము వరకు ఈ ఆరాధన చేయుట వలన సర్వ శుభములు కలుగును. నిత్య పారాయణ ముగ మారినచో మానవుడు సంసారమున తప్పక తరించును. మేషరాశి యొక్క వైభవములలో విరాట్పురుషారాధనము అత్యంత విశేషమై యున్నది. ఎరిగి నిర్వర్తించుకొనుట ప్రధానము.

**దివ్య సంకల్పము :**

సృష్టి యారంభమున కలిగిన బ్రహ్మ సంకల్పమే మేషముగ ఋషులు గుర్తించిరి. బ్రహ్మ సంకల్పమే సృష్టి కాధారము. అది కళ్యాణ ప్రదమై యున్నది. జీవసంకల్పము జీవుల జీవనమును చుక్కానివలె నడిపించును. జీవసంకల్పము దివ్యమగు బ్రహ్మ సంకల్పముతో అనుపానముగ నడచినచో, సృష్టియందు జీవనము వైభవోపేతమై యుండును. జీవసంకల్పము దివ్యసంకల్పముకన్న భిన్నమై నడచినచో, జీవుల జీవనము అస్తవ్యస్త మగుచుండును.

బ్రహ్మ సంకల్పము బ్రహ్మర్షు లెరుగుదురు. నారదాది బ్రహ్మ మానస పుత్రులు ఎరుగుదురు. సప్తఋషు లెరుగుదురు. మనువు లెరుగుదురు. కనుక వారి జీవనము దివ్యప్రణాళిక ననుసరించి యుండును. ఎరుగనివారికి ఎరుగ చెప్పుటకే పై తెలిపినవారు ఒక గురుపరంపరగా ఏర్పడి యున్నారు. గురుపరంపరా గతముగ బ్రహ్మ సంకల్పమును, బ్రహ్మజ్ఞానమును పొందవచ్చును. అట్టివారు బ్రహ్మ యజ్ఞము చేయుదురు. యజ్ఞార్థముగ కర్మలు నిర్వహణము చేయుటయే బ్రహ్మకర్మ లేక బ్రహ్మయజ్ఞము. దీనిని భూమియందు నిర్వర్తింప జేయుటకు సనత్కుమార ఋషి శంబళ గ్రామమున ఆవాస మేర్పరచు కొని యున్నాడు. భూమిపై గల ఋషులు, సిద్ధులు, యోగులు, దేవతలు అతనినుండి బ్రహ్మ సంకల్ప మెరిగి సంవత్సర మంతయు కార్యమును నిర్వర్తింతురు. మేషమున అత డందరికిని ఆరాధ్యుడై యున్నాడు. అతడే భూమికి ప్రభువు, గురువు కూడ. మైత్రేయాది జగద్గురు పరంపర కూడ అతని సంకల్పము ననుసరించియే నడతురు.

అతడు బ్రహ్మ సంకల్పము ననుసరించి భూమిని, భూమి జీవులను నడిపించును.

ఎంత దక్షత కలిగినను, దివ్య సంకల్పము నెరుగక ప్రవర్తించి నచో భంగపడుదురు. దక్ష ప్రజాపతి కథ యిదియే. దక్ష ప్రజాపతి చతుర్ముఖ బ్రహ్మనుండి వెలువడి ప్రజాసంసర్గము గావించినాడు. అతడత్యంత సమర్థుడు. సమర్థత వలన అహంకారము కలుగు అపాయమెప్పుడు పొంచి యుండును. దక్షుడు అహంకారమునకులోనై బ్రహ్మ సంకల్పము కన్న భిన్నమగు సంకల్పము ననుసరించి, భంగపడి జ్ఞానము నొందెను. మానవుని కథ కూడ ఇట్టిదే. స్వంతమగు సంకల్పముల వలన చిక్కుపడి జనన మరణ చక్రమున అంతులేక భ్రమణము చెందుచు గురుస్పర్శ వలన తరణోపాయము తెలియువాడు మానవుడు.

మేషరాశి సంకల్పమునకు ప్రధానమైన రాశి. సంకల్పములు బ్రహ్మము నుండి వెలువడినట్లే జీవుల నుండి గూడ ఏర్పడును. జీవుల యందు కూడ అహంకారము నుండి, అజ్ఞానము నుండి, మమకారము నుండి, మోహము నుండి, కామము నుండి, క్రోధము నుండి, లోభము, భయము, దుఃఖము, ద్వేషము యిత్యాది స్థితుల నుండి ఏర్పడు చుండును. ఒక్క దివ్యసంకల్పము తప్ప యితర సంకల్పము లన్నియు దుఃఖ హేతువులు. మరణ కారణములు. కనుక ప్రతి సంవత్సరము మేష రాశియందు, ప్రతి దినము సూర్యోదయము నందు సంకల్పములు సరిదిద్దుకొనుట మేషరాశి సూచించు రహస్యము.

**బుద్ధి-బలము :**

భావము లుద్భవించునది మేషము నందే. ఆర్యజాతికి మనసే ప్రధానము. మనసునం దుద్భవించిన భావములు బుద్ధికి సమర్పణ చేసి, బుద్ధి కనుగుణముగ భావములు నిర్వర్తింపజేయుట ఆర్యుడు చేయదగిన పని. మనసున కలుగు భావమును విచక్షణతో వ్యవహ రించుకొనక నిర్వర్తించుట వలన పశుప్రవృత్తి బలపడుచుండును. పశుబలమున కార్యము చేయుట ఒక ఎత్తు. బుద్ధి బలమున కార్యము చేయుట మరియొక ఎత్తు. మేషము నందు కలుగు భావమునకు బలమిచ్చునది కుజుడు లేక అంగారకుడు. బలము బుద్ధిబలమూ కావచ్చును, పశుబలమూ కావచ్చును. కేవలము పశుబల మైనపుడు మానవుడు జయించుట, ఆక్రమించుట, యితరుల నణగద్రొక్కుట, వశము చేసుకొని పరిపాలించుట యుండును. కాని ఈ కుజునకు బుద్ధి తోడైనచో, బుద్ధి బలమై శ్రేయోదాయకమగు కార్యములు నిర్వర్తించుట, తోటి జీవులను సంరక్షించుట, పోషించుట, రక్షించుట జరుగును.

మేషరాశి యందు సామాన్యులను కుజుడు పరిపాలించును. సంస్కారవంతులైన వారిని బుధ, కుజులు పరిపాలింతురు. కేవలము కుజుడే పరిపాలించినచో జీవుడు శక్తివంతుడై యుండును గాని, బుద్ధి బలముండదు. కనుకనే ప్రాచీన భారతమున కుజ బుధులను ఆరాధించు విధానము ప్రవేశపెట్టిరి. గణపతి, షణ్ముఖులను కలిపి ఆరాధించు విధానము యిందుండియే పుట్టినది. షణ్ముఖునకు గణపతి గురువై యుండుట వలన అతడు సుబ్రహ్మణ్యుడై శాశ్వత కీర్తిని పొందెను. ఎచ్చట బుద్ధి, బలము కలిసి యుండునో అచట సర్వమును చేకూరును.

జ్యోతిషమున కుజగ్రహము, బుధ గ్రహము అనుకూలమగు భావముల యందు ఉండుట వలనను, ఒకరినుండి ఒకరికి శుభదృష్టి యుండుట వలనను కార్యసిద్ధి కలుగును. కుజ–బుధుల శుభదృష్టి ఆనుకూల్యము పొందుటకై గణపతిని, కుమారుని ఆరాధించు సంప్రదాయ మేర్పడినది. దక్షిణాపథమున వీరిరువురిని దేవాలయమున ప్రతిష్ఠించు సంప్రదాయ రహస్య మిదియే.


భావము లుద్భవించుట మానవునకు సహజముగ జరుగును. ప్రతి భావము ఉద్వేగముతో ఆచరణకు దారి తీయును. ఈ ఉద్వేగము కుజుడే. కుజుని ఉద్వేగమునకు బుధుని విచక్షణను తోడ్పాటు గావించినచో కాలమును బట్టి, దేశమును బట్టి, అవశ్యకతను బట్టి భావము నవతరింప జేయవచ్చును. అవతరణమున కలుగు విఘ్నము లను బుధ కుజ బలమున దాటవచ్చును. బుధ కుజ సమాగమ ప్రజ్ఞను క్రతువిద్య యందు ఒక పరికరముగ గుర్తింతురు. దానిని 'ఉలి' అందురు. ఉలి పూర్వభాగము బలముగను, ఉత్తర భాగము నిశితముగ త్రికోణాకారముగ నుండును. పూర్వభాగము బలము కలదై, ఉత్తరభాగము పదునై యుండును. శిల్పి ఉలి ఆధారముగ శిలలను మలచును. ఉలి లేనిదే శిలను శిల్పముగ మార్చుట వీలుపడని పని. వడ్రంగమునకు కూడ ఉలి యవసర మున్నది. ఉలి నేర్పరచుకొని, దానిని నిపుణతతో వినియోగించుట క్రతువిద్య (Massonary) యందు ప్రధానము. మానవ స్వభావమున చక్కగ మలచుకొని దైవీ స్వభావము నేర్పరుచుకొనుట క్రతువిద్య. స్వభావమున పనికిరానివి విసర్జించుచు, పనికివచ్చువానిని పోషించుచు ముందుకు సాగుట యిందు తెలుపబడు విద్య. ఈ విద్య నేర్వనివాడు జీవితమున జయము పొందడు.

స్వభావమును జయించుటయే నిజమగు జీవనము. ఒక గుఱ్ఱమును, ఎద్దును, ఏనుగును, పులిని, సింహమును, గరుడ పక్షిని లొంగదీసి వాహనముగ నేర్పరచుకొనుట అను కథలయందు ఆయా స్వభావము లను బుద్ధిబలముతో మలచుకొనుట అను రహస్య మిమిడి యున్నది. ఎంత క్రూరమైన స్వభావమునైనను బుధ-కుజ సమన్వయ బలము వలన స్వాధీనము చేసుకొనవచ్చును. అత డాత్మవంతుడే కనుక బుధ కుజులు తోడైనచో కార్యము సుగమమగును. ఆత్మ సూర్యుడే అగుట వలన, సూర్యుడు-బుధుడు-కుజుడు మేషరాశి కధిపతులుగ తెలియ వలెను. కేవలము కుజుని స్వస్థానమని, సూర్యుని ఉచ్చస్థానమని జ్యోతిషులు తెలుపుదురు. కాని బుధుడు సంధానకర్త యని మహర్షులు తెలుపుదురు.


**త్రిభుజధ్యానము :**

సంవత్సర చక్రమున చరరాశి యొక చతుర్భుజియై యున్నది. అందు మేషము, కర్కాటకము, తుల, మకరము చతుర్భుజములుగ నున్నవి. ఈ చతుర్భుజములు పరమాత్మయొక్క చతుర్భావములుగ తెలుపబడు చున్నవి. పరమాత్మ జీవాత్మగ వెలయుట, జీవాత్మ పదార్థ మును కూడగట్టుకొని స్వభావము నేర్పరచుకొనుట, స్వభావ మాధార ముగ సృష్టి అనుభవమును పొందుట, అటుపైన పరమాత్మను చేరుట అను కథ నాలుగు భావముల కథగ యున్నది. నాలుగు కాలములుగను, నాలుగు స్థితులుగను, నాలుగు వాక్కులుగను ఈ కథలు సాగుచున్నవి. ఈ కథారంభము మేషమగుట వలన మేషము కేంద్రముగ కర్కాటకము, తుల, మకరము ఒక త్రిభుజమై కార్యములు నిర్వర్తించు చుండును.

ఈ త్రిభుజము నారాధించుట మహర్షు లిచ్చిన ఉపదేశము. అది యిట్లున్నది.




పై త్రిభుజమును ఫాలభాగమున ఈ క్రింది విధముగ ధ్యానింప వచ్చును.




పై విధమగు ఆరాధనము చతుర్విధ పురుష సమాగమ ప్రజ్ఞను మనయందు స్థాపితము చేయునని మహర్షుల అనుభవ జ్ఞానము. ఈ యారాధనము మేషరాశియందు ప్రారంభించి, 90 రోజులు ధ్యానము గావించి మరల కర్కాటకమున ప్రారంభించి 90 రోజులు

ధ్యానము గావించి, అట్లే తుల, మకరముల నుండి గూడ ఒక సంవత్సర కాలము నిర్వర్తింపబడినచో మానవునియందు సర్వమును సమన్వయము చెందును. ఇది యొక దీక్ష.

**జనన మరణ చక్రము :**

జనన మరణములను పొందుచు, సంసార చక్రమున దేహేం ద్రియ మనస్సులను తృప్తి పరచుచు జీవించువారు కోకొల్లలు. వీరనంత కాలము ఈ చక్రముననే తిరుగుచుందురు. కల్పాంతమున గూడ బ్రహ్మములోనికి లయము చెంది మరల కల్పారంభమున జీవులుగ పుట్టుచు జనన మరణ చక్రమునందే వీరు తిరుగాడుచు నుందురు. సృష్టియందలి సుఖదుఃఖములు, లాభనష్టములు, ఆకలిదప్పులు, సౌకర్యా సౌకర్యములు, శీతోష్ణములు, జయాపజయములు వంటి ద్వంద్వముల యందు కొట్టుమిట్టాడు జీవులందరును ద్విస్వభావ రాశు లచే నడిపింప బడుచుందురు. మిథునము, కన్య, ధనుస్సు, మీనము వీరిని పరిపాలించుచు నుండును. వీరు జీవన యాత్రయందు చిక్కు ముడి వేసుకొని తమ జీవితమున బంధింపబడి యుందురు. ఎపుడునూ ఏదో నొక సమస్య పీడించుచుండగ, సమస్యాపూరణకే జీవనము సాగుచుండును. ఇట్టివారి కొక గమ్య ముండదు. ఒక దివ్య ఆశయ ముండదు. మహత్తరమగు కార్యములు నిర్వహించు శక్తి యుండదు. కోరికలను తీర్చుకొనుటకే జీవితమంతయు వెచ్చింపబడు చుండును. తమ అనుభవములనుండి తమ కేర్పడిన అభిప్రాయములను ఆధారము చేసుకొని, తమ అభిప్రాయములనే సత్యముగ చూచుచుందురు. వారికి

సృష్టియందు ఉన్నది గోచరింపక, తామేర్పరచుకొన్న అభిప్రాయములే గోచరించుచుండును. వీరు దేహము చేతను, ఇంద్రియముల చేతను, మనో అభిప్రాయముల చేతను గట్టిగ బంధింపబడి వాని కొరకే జీవించుచు మరణింతురు. మరల జన్మించినను వాసనల రూపమున వారి వారి అభిప్రాయములే వారికి గోచరించు చుండును. కొంత కొంత అనుభవ జ్ఞానము కలుగుచుండును. వీరిని సామాన్యులని పిలతురు. గొఱ్ఱెలవలె ఇతరు లనుసరించినది, ఆచరించినది వారును ఆచరించుచు, అనుసరించుచు బ్రతుకుటకు త్రిప్పలు పడుచు నుందురు. ఇట్టి చక్రమున పడినవారికి దైవానుగ్రహముగ ఒక సంఘటన, ఒక సన్నివేశము ద్వారా కనువిప్పు కలుగును. అట్టి మెళకువ కలుగుట దైవానుగ్రహమే గాని, వారి ఆలోచనలనుండి పుట్టిన తలంపు కాదు. గంజాయి మొక్క నుండి తులసి పుట్టదు కదా!

## మలుపు :

మానవునకు కనువిప్పు కలిగిన నాటినుండి జీవితము మరియొక మలుపు తిరుగును. గానుగెద్దు జీవితము నుండి మరొక జీవితమునకు ఉత్సాహ మేర్పడును. పొట్టకూటి జీవనముకాక మరియొక జీవన మున్నదను భావము ఏర్పడు చుండును. దాని కొరకై వెదకులాట ప్రారంభమగును. అనిత్యమగు విషయములయందు, విలువల యందు ఆసక్తి తగ్గి శాశ్వత విలువల యందు ఆసక్తి పెరుగుచు నుండును. సంపాదన, సంసారము, సంఘమునందు కీర్తి – ఇత్యాది విషయముల యందు రుచి తగ్గును. జీవుల సేవ యందు రుచి పెరుగును. దైవమెక్కడో లేడనియు, పరిసర జీవులయందే ఉన్నాడనియు తెలిసి హీనులకు,

బలహీనులకు యితోధికముగ సేవ లందించుచు, అంతరంగమును శుద్ధి పరచుకొనుచు, లోబలమును పెంచుకొనుచు నుండును. బాహ్య విషయములందు ఆధారపడక అంతరంగము నాధారము చేసుకొని, అంతర్ అవలోకనము గావించుచు, బాహ్యము నందు పరహితమునకు జీవితమును సమర్పించుకొనుచు నుండును.

బహిరంగము కన్న అంతరంగమందే విశ్రాంతిగొనుట, అంతః పరిశీలనము చేసుకొనుట, అంతర్మథనము ద్వారా అంతఃకరణ పరిశుద్ధిని పొందుట ఇత్యాది విషయముల యందు అనురక్తి పొందుచు నుండును.

అట్టి సమయమున అదే విధమగు జీవ లక్షణముగల సజ్జనుల సాంగత్యము లభించి సత్సంగ బలముతో ముందుకు సాగును. ఇట్టి వారికి సాధు సజ్జనుల సాంగత్యము ఊరటను, బలమును యిచ్చును. సద్గోష్ఠి, స్వాధ్యాయము క్రమముగ పెరుగును. తన స్వభావము అనునిత్యము పరిశీలించుకొనుచు, జీవహితము చేయుచు సాగు చుండగ మరియొక మలుపు ఎదురగును. ఈ మలుపు దివ్యమగు మలుపుగ మారి సత్యదర్శనములు జరుగుచుండగ, బాహ్యానుభూతులకు స్వస్తి పలుకును.

మేషమున అత్యున్నత అంతరంగ అనుభూతి యందు రమించు వారు బాహ్యమైన సమస్త అనుభూతులను మానసికముగా దగ్ధ మొనర్తురు. అట్టివారు లోకోపకారమగు కార్యములను నిర్వర్తింతురేకాని దేనికిని మోహపడరు. కలి కాలమున ఇట్టి వారరుదు.

**శాశ్వతత్త్వము :**

నిత్య పోరాటము మేష లక్షణము. జంతువులు పోరాడు చుండును. పక్షులు పోరాడుచుండును. మానవుల యందు పోరాటము మిక్కుటము. సాధకులయందు కూడ అంతరంగ బహిరంగ పోరాటము లున్నవి. ఉత్తమ సాధకుల యందు కూడ జీవునకు, స్వభావమునకు పోరాటము జరుగుచునే యుండును. బ్రహ్మర్షి యగు వరకు జీవ పోరాటము సాగుచునే యుండును. ఆరాట మున్నంతవరకు పోరాట ముండును. ఆరాటము లేనివారికి పోరాటము ఆగును. పోరాడి సాధించిన దెప్పుడును తృప్తినీయదు. ఒకవేళ తృప్తి కలిగినను అది తాత్కాలికమే. గెలుచుకున్న దేదియు నిలువదు. ఒక విషయమున గెలుచుకున్నపుడు అది చేజారిపోవునేమో నను భ్రాంతి, భయము జీవుని పీడించుచునే యుండును. అనాదిగా సృష్టియందు జరుగుచున్న దిదియే. మేషరాశి "జయించుట" అను లక్షణము నుండి "ఉండుట" అను లక్షణమును చేరినపుడు ఆ రాశి ప్రభావమున శాశ్వతత్వమును పొందవచ్చును.

**సామరస్యము :**

జ్యోతిషమున మేషము, వృశ్చికము షష్టాష్టకములుగ భావింతుము. నిజమునకు మేషమునకు, వృశ్చికమునకు కుజుడధిపతి యగుట వలన దూకుడు స్వభావముగల మేషరాశి వారికి, స్థిర స్వభావముగల వృశ్చిక రాశివారు ఎంతయో తోడ్పాటు గావింపగలరు. అట్లే వృశ్చికరాశి వారికి, మేషరాశివారు పురోగతికి తోడ్పాటు గావింప

గలరు. జ్యోతిష పండితులు ఈ రెండు రాశులను షష్టాష్టకములుగ నిర్వచించి పొంతనలేని రాశులుగ తెలుపుదురు. కాని కుజుడు పొంతనము కలిగించ గలడు. ఈ రహస్యము తెలియుటవలన చాల పరిష్కారము లుండును. ఉదాహరణకు బ్రిటిష్ దేశము మేషరాశిచే పరిపాలింపబడు చున్నది. ఇస్లాము అనుసరించుచున్న దేశములు వృశ్చికముచే పరిపాలింపబడు చున్నవి. ఈ రాజ్యముల నడుమ పొంతనము కుదురునా అను ప్రశ్నకు ఆధ్యాత్మిక జ్యోతిషము పరిష్కారము నిచ్చునని తెలుపును. బ్రిటిష్ పరిపాలకుల దృక్పథమందు స్వల్పమగు మార్పు కలిగినచో భూగోళమునకు చాల పరిష్కారములు లభింపగలవని పరమగురువుల సూచన యున్నది. దాని సూత్రమిదియే.

పై తెలిపిన విధముగనే మేషమునకు, కన్యకు షష్టాష్టక సంబంధమున్నది. కాని రెండు రాశుల యందు సత్ఫలితముల నిచ్చు వాడు బుధుడు. అందువలన బుధ గ్రహ మాధారముగ ఈ రెండు రాశులకును మైత్రి చేకూర్చ వచ్చును. ఆ యా రాశులచే పరిపాలింప బడు వ్యక్తుల మధ్య గాని, దేశముల మధ్యగాని సామరస్యము కూర్చుటకు బుధ గ్రహ లక్షణములను వినియోగింపవచ్చును. ఇట్లు రాశి ప్రభావముల మధ్య పరస్పరత్వమును గూర్చి సామరస్యమును పెంపొందింపజేయుట భవిష్యత్తున జ్యోతిషవర్యులు చేయవలసిన సత్కర్మగా పరమగురువులు అభివర్ణింతురు. బుద్ధి కుశలతను బట్టి జ్ఞాన విజ్ఞానములను చక్కగ వినియోగించుట శాస్త్రాధ్యయమునకు ఫలశ్రుతి. అట్లు కానపుడు శాస్త్రముల వినియోగము పరిమితమై యుండును.

**ప్రళయములు :**

సృష్టియందు ప్రళయములు మూడు రకములుగ తెలుప బడినవి. 1. భూకంపములు, 2. జలప్రళయములు, 3. అగ్ని ప్రళయ ములు. మేషరాశి అగ్ని ప్రళయములకు సంబంధించినది. అగ్ని ప్రళయమును పరిరక్షించునది శంబళ కేంద్రము. జలప్రళయమును పరిరక్షించునది కలాప, శ్రావస్తి గుహలలోగల గురుపరంపరాగత కేంద్రము. భూప్రళయములు పరిరక్షించునది మను కేంద్రము. ఇట్లు మనువు, గురుపరంపర, శంబళ గ్రామ అధిదేవతయైన సనత్కు మారుడు భూమిపై ప్రళయములను నిర్జించుచు జీవులను కాపాడుచు నుందురు. కాని మానవజాతి ప్రవర్తనము ధర్మము నతిక్రమించుటయే గాక విపరీతమైన ధోరణులు ప్రకాశించు చున్నపుడు జాతిని నియ మించుటకు పాత్యకమైన ప్రళయములను అనుమతించు చుందురు. ఇప్పటికి ఈ భూమిపై ఈ మూడు రకముల ప్రళయములు జరిగినవి. పెనుమార్పులు కూడ సంభవించినవి. కోటి ఎనభై లక్షల సంవత్సర ముల మానవజాతి మనుగడలో మానవజాతి ఈ మూడు రకముల ప్రళయములను చవి చూచినది. ఎప్పటికప్పుడు పశ్చాత్తప్తు లగుట, పునః ప్రారంభము కావించుట, పురోగతి సాగించుట, కొందరు తరించుట, అధిక సంఖ్యాకులు అహంకరించుట, మరల ప్రళయ ములు సంభవించుట అను ఇతివృత్తము పునరావృత మగుచున్నది. మానవుని యందు నీతి అధమస్థితి చేరినపుడు ప్రకృతి విధిలేక శిక్షించుట యుండును. ఇట్టి మానవజాతి శిక్షణ, పరిరక్షణ ఇత్యాది కార్యక్రమములన్నియు కూడ రాశి చక్రమందలి మేషరాశి అధిపతియై

నడచును. మేషరాశియే సర్వమునకు పరిపాలనా బాధ్యతలు వహించి యున్నది. ఈ రాశి యందు గ్రహకూటములు విశిష్టముగ జరిగినపుడు అగ్ని ప్రమాదములు, అగ్ని ప్రళయములు సంభవించి, నూతనారంభ ములకు తెర తీయబడునని జ్యోతిషము తెలుపుచున్నది. అట్టి సమయ మున కుజ వరుణుల ప్రభావము మిక్కుటముగ పనిచేయును.

**సప్తఋషి మండల ప్రభావము :**

సప్తఋషి మండల ప్రభావము మేషరాశి నుండియే భూమికి అందును. ఈ ప్రభావము ప్రధానముగ కుజుని ద్వారా శక్తిగను, బుధుని ద్వారా విచక్షణా శక్తిగను, వరుణుని ద్వారా సృజనాత్మక శక్తిగను భూమిని చేరును. ఇందు ప్రధానముగ కుజశక్తి భక్తి మార్గమున నడవనిచో, ఆశయము లందు మూర్ఖత ఏర్పడును. కుజశక్తికి చక్కని ఒరవడి నిచ్చునది భక్తి. ఈ కారణముగనే మహత్తర సంకల్పశక్తి గల మరువుమహర్షి భక్తిమార్గము నధిష్ఠించి శక్తివంతులకు దిశా నిర్దేశము గావించుచున్నారు. నియమనిష్ఠలు లేని శక్తివలన అరిష్ట ములు కలుగును. భక్తి పేరున ఆవేశములు పడువారందరు అదుపులేని కుజశక్తి ప్రభావమువలననే అట్లేర్పడుదురు. భక్తి యందు మూర్ఖత, ఆవేశము, తను నమ్మిన విశ్వాసమునకై వాగ్వివాదములు చేయుట, పోరాడుట, యుద్ధములు చేయుట, ఆత్మాహుతి గావించుకొనుట ఇత్యాదివన్నియు కుజగ్రహ వికారములు.

వీని నరికట్టవలె నన్నచో ఆవేశమునకు ఆలోచన తోడు కావలెను. ఆలోచనము, వివేచనము, విచక్షణ ఇత్యాదివన్నియు బుధునివలన లభించును. బుధుడు జ్ఞానము ద్వారా ఆవేశపూరితమైన

శక్తిని అదుపుచేసి నిర్మాణాత్మకమగు కార్యములలోనికి మలుపు చేయును. మతములపేరిట మారణహోమములు నియమింపబడని కుజశక్తిగ పరిగణించవలెను. అట్టి శక్తిని బుధునితో జోడించుట వలన ఒక చక్కని ఆధ్యాత్మిక జిజ్ఞాసువు ఆవేశపరుని నుండి ఏర్పరచుటకు వీలుపడును. బుధుడు బుద్ధి లోకములనుండి మనసునకు వికాసమేర్పరచును. అట్టి వికాసము ద్వారా కలలు, కల్లలు, భ్రమలు, భ్రాంతులు తొలగి జీవుడు ప్రశాంత మనస్కుడై కార్యోన్ముఖు డగును. అట్టివాడు క్రమ వికాసము చెందుచు బుద్ధిమంతుడై తనయందలి శక్తిని శ్రేయోదాయకమగు మార్గములో నిర్వర్తించుచు, వికాసము చెందుచు సాగును.

బుద్ధిమంతు డగుచున్న జిజ్ఞాసువు వరుణగ్రహ ప్రభావముచేత క్రతుబద్ధము చేయుట జరుగును. క్రతుబద్ధత వలన జిజ్ఞాసువగు సాధకుడు అద్భుతమగు కార్యములు చేయగలుగును. క్రతుబద్ధత వరుణుని ప్రత్యేకత. క్రతుబద్ధత ద్వారా జీవులకు సృజనాత్మకమగు మెఱపు భావములు అపుడపుడు వరుణ ప్రభావముచే కలుగును. అట్టి భావనలకు రూపకల్పన చేయుచు శ్రేయోదాయక మగు కార్యములను సంఘమున నిర్వర్తించుచు సాధకుడు సిద్ధుడగును.

ఇట్లు మేషరాశియందు సప్తఋషిమండల ప్రభావముచే కుజుడు, బుధుడు, వరుణుడు ఒక పరంపరగ జీవుల నుద్ధరించు త్రిభుజ మేర్పడినది. అట్టి పరంపరయే మరువు, దేవాపి, మాస్టర్ సి.వి.వి. వీరు వరుసగ కుజ, బుధ, వరుణ ప్రభావములను అధిష్ఠించి నిర్వర్తింపజేయుచున్న పరమగురువులు. ఈ విశేష రహస్యమును తెలిసి, ఈ గురుపరంపరను ఒక త్రిభుజముగ నేర్పరచుకొని

ఆరాధించుచు అనుగ్రహము పొందు విధానము ప్రస్తుతము అమలులో నున్నది.

**దివ్య ప్రణాళిక :**

మేషరాశి యందు కుజ గ్రహము ఆశయముల కొరకై పోరాడుటగ నుండును. ఆశయ సిద్ధి కొరకు నిర్వహణము చేయు నపుడు త్యాగము చేయుట, స్వంతమును లెక్కచేయకపోవుట యుండును. సంస్కారములు తక్కువగ నున్నచో ఉన్మాదము, పోరాడుట గూడ యుండును. మేషము నందలి కుజుడు ఆశయ సిద్ధికై ప్రాణములైనను లెక్కచేయక ఉద్యమించును. అనుసరించు సిద్ధాంతము సత్యపరమైనచో, త్యాగనిరతి కారణముగ కల్మషములను పరిష్కరించు కొనుచు, ఒక నిర్దిష్టమగు దివ్య ప్రణాళిక యందు ప్రవేశించును. అపుడు కుజుడు హరించిన కల్మషములు కలవాడగుటచే మకరరాశి స్వభావమును పొంది, ఉత్కృష్టమగు కార్యములు నిర్వహించి తరించును. మేష మందలి కుజుడు మకరమునందు తరింపు నిచ్చుటలో ఎన్నియో ఘర్షణలకు, జయాపజయములకు, పోరాటము లకు తావిచ్చును. అన్నిటి యందు అంతర్హితముగ జీవుని పరిణామము సాగుచు నుండును. ఈ మార్గమును ఆరవ కిరణ మార్గముగ జ్వాలా కూలుడు వర్ణించెను.

మేషమందలి బుధుడు అంతరంగమందలి పరస్పర విరుద్ధ భావములను పరిష్కరించుకొనుటకై వినియోగపడును. ఘర్షణములు, పోరాటములు, యుద్ధములు అంతరంగమును చేరును. కుజుడు బహిరంగమున నిర్వర్తించు చుండగ, బుధు డంతరంగమున

నిర్వర్తించు చుండును. పరస్పర విరుద్ధమగు భావన లన్నియు పరిష్క రింపబడగ క్రమముగ బుద్ధి వికాసము చెంది, మనస్సునకును జీవునకును మధ్యవర్తిత్వము వహించును. అనగా జీవునికి, అతని స్వభావమునకును మధ్య రాయబారములు సలుపుతు, సామరస్యమును నెలకొల్పుచుండును. రాయబారములు ఫలించుటకు చాల సమయము పట్టును. లోకములందు రాయబారము లెట్లు విఫలము లగుచుండునో అంతర్లోకములందు కూడ అట్లే విఫలమగు చుండును. జీవుని ఆశయములకు, అతని స్వభావము యొక్క ఆశలకు నడుమనుండు వ్యత్యాసమువలన రాయబారములు పొసగుటకు చాల సమయము పట్టును. బుధుని యొక్క నైపుణ్యము వలన ఎట్టకేలకు స్వభావమందలి భ్రమలు, భ్రాంతులు తొలగి జీవ ప్రయోజనమునకు స్వభావము సహకరించును. అపుడు బుధుడు మేషము నుండి కన్యకు చేరి దివ్య ప్రణాళిక నావిష్కరించును. ఇట్టి ఆవిష్కరణము కారణముగ జీవ స్వభావము జీవునికి సహకరించుచు నొక దివ్య ప్రణాళికను ప్రవేశించును. అట్టి సమయమున జీవునియందు దైవము పుట్టుట జరుగును. దీనినే క్రీస్తు పుట్టుకగ జ్వాలాకూలుడు వర్ణించెను.

**అగ్ని పరీక్ష :**

మేషరాశి యందు వరుణ గ్రహము క్రతుబద్ధమగు పాలకత్వము నందించును. అవినీతి నెండగట్టును. పారదర్శకమగు పరిపాలనము నిచ్చును. చరిత్రయందు సుస్థిరమగు రాజ్యపరిపాలనము చేసిన వారందరును ధర్మము ననుసరించి క్రమమగు పద్ధతిలో రాజ్య పాలనము చేసినవారే. రాజులు క్రమము తప్పినపుడు ప్రజాస్వామ్య మేర్పడినది. ప్రజాస్వామ్యమున అస్థిరతకు మూలకారణము పాలకుల

యందు క్రమశిక్షణము, ధర్మానుష్ఠాన బుద్ధి లేకుండుటయే. ధర్మము ననుసరించు పాలకుడే క్రమశిక్షణను నెలకొల్పగ సమర్థతను కలిగి యుండును. తనయందు బంధుప్రీతి, అధికారప్రీతి యున్నచో ధర్మము తప్పుట జరుగును. పాలకులే ధర్మము తప్పినపుడు వారి సహచరులు కూడ విజృంభించి అవినీతికి గురియగుదురు. తన ఆచరణము శ్రేష్ఠముగ నున్నచో, అట్టి పాలకుని సహచరులు కూడ అనుసరింతురు.

పాలకులలో అలసత్వము, అవినీతి, అధర్మము వరుణ తత్త్వము సహింపదు. వరుణుని ప్రధానమగు లక్షణము పారదర్శ కత్వము. మేషరాశి యందు వరుణుడు పాలకత్వమందలి లోటు పాట్లను సరిచేయును. ప్రస్తుతము వరుణుడు మేషరాశి యందు ప్రవేశించినది మొదలు భౌగోళికముగ పాలకులు యిబ్బందులకు గురియగు చున్నారు. వరుణుడు మేష సంచారము పూర్తిచేయు లోపల ప్రపంచ పాలనమును సుస్థిరము కాగలదు. ఈ లోపల ఎన్నియో మార్పులు తప్పనిసరియై యున్నవి. ప్రజా సంక్షేమము లభించువరకు పాలన యందు సర్దుబాట్లు జరుగుచనే యుండును.

ఆత్మసాధకుల ప్రవర్తనయందు కూడ సర్దుబాట్లు తప్పనిసరియై యుండును. పరివర్తనము సంపూర్ణమగు వరకు సర్దుబాట్లు జరుగు చునే యుండును. మానసిక లోకమున ఘర్షణము, బుద్ధిమయ లోకమున మాయా మోహములు తీరువరకు వరుణుడు సర్దుబాట్లు చేయుచునే యుండును. సాధకుడు అగ్నిపరీక్షకు గురిచేయబడును. ఈ పరీక్ష యందు ఉత్తీర్ణుడైనపుడే శాశ్వతమగు వెలుగు సామ్రాజ్యమున అతడు స్థిరపడగలడు. ఉత్తమోత్తమ మగు ఉపదేశములు కలుగుట, తత్సంబంధితమగు వికాసము లేర్పడుట శ్రమకోర్చుటవలన జరుగును.

యుధిష్ఠిరుడు, హరిశ్చంద్రుడు, నలుడు ఎదుర్కొనిన అగ్నిపరీక్ష లన్నియు వారు వెలుగు సామ్రాజ్యమున స్థిరపడుటకే జరిగినవి. మేషమున వరుణుని ప్రభావము అత్యంత తీవ్రమై యుండును. ఆత్మ సాధకునికి తుది దశలో వరుణుడే గురువై నిలచును.

**తారణము :**

మేషరాశి యందలి కుజుడు వృశ్చికముతోను, బుధుడు కన్య తోను, వరుణుడు తులతోను సమన్వయింపబడి మేషరాశి తత్త్వము వానికి పదియవ భావమైన మకరమునందు తారణము జరుగునని జ్వాల్‌కూల్ మహర్షి బోధించుచున్నారు.

వృశ్చికమున కుజుడు స్వస్థుడగుట మహర్షి తెలుపుచున్న ఒక ముఖ్య విశేషము. పోరాటము లన్నిటికిని కుజుడే నాయకుడు. పోరాటములు బహిరంగమున కాని, అంతరంగమున కాని జీవులకు సాగుచునే యుండును. సామాన్యులకు బహిరంగమునను, సాధకులకు అంతరంగమందును పోరాటములు తప్పనిసరియై యుండును. ఆరాటము వలన పోరాటములు తప్పవు. ఆరాటము లేనిచో పురుష ప్రయత్నమే యుండదు. కుజుని ఆరాటములు పోరాటములు వృశ్చిక మున సమన్వయింపబడుటకు ముఖ్యకారణము వృశ్చిక మందలి లోతులే కారణము. లోతుల లోనికి మునిగి సాధనలన్నీ ఫలించి సిద్ధి నిచ్చుచుండగ జీవుడు శమించును. అప్పుడు పురుష ప్రయత్నము దైవానుగ్రహమై సిద్ధినిచ్చును. ఇట్టి వానికి మకరమున తారణము లభించునని జ్వాల్‌కూల్ మహర్షి అందించు సూచన.

అట్లే అంతరంగ పోరాటమున మేషరాశి యందలి బుధుడు తప్పొప్పులను, మంచి చెడులను, కుడి ఎడమలను, సూక్ష్మ స్థూలము లను పరిష్కరించుకొను ప్రయత్నమున మిథునమున చేరి, ద్వంద్వము లను పరిష్కరించు ప్రయత్నమున మునిగి, ఎడతెగని తర్కముతో సతమతమగుచు దీర్ఘ కాలము కృషి సలిపి, తనయందలి విచక్షణ ఆధారముగ నిత్యా నిత్యములను పరిశీలించుకొనుచు కన్యయందు ఉత్తీర్ణుడగును. మేషరాశి బుధునకు కన్యారాశి పవిత్రతయే పరిష్కారము నిచ్చును. అటుపైన మంచిచెడుల నిర్ణయ ప్రయత్నము విసర్జించి జీవులసేవకు తనను తాను అంకితము చేసుకొనును. ఇట్టి బుధునకు కన్యారాశి పంచమ భావమైన మకరమందు దివ్యజ్ఞానము జనించి తరింపు కలుగును.

ఇక మేషరాశి వరుణునకు తన స్వభావమందలి సమస్త కల్మషములను దగ్ధము చేసుకొనుటవలన స్వభావముతో నిజమగు పరిణయ మేర్పడును. పరిణయము సప్తమ భావమగుటచే తుల యందు తనకును, తన స్వభావమునకును పరిణయ మేర్పడి అందుండి సమతుల్యము పుట్టును. ఇట్టి సమతుల్యత వలన ఇహ పరములను సమన్వయించుకొనుచు తనదైన స్వతంత్రమును అవలంబించును. వరుణుని స్వతంత్ర భావము ఒక అద్భుతము. తా నెవరికీ పట్టు పడడు. తా నెవరినీ బంధించడు.

ఇట్లు మేషరాశికి కన్యారాశి వలన, వృశ్చికరాశి వలన, తులా రాశి వలన వచ్చు అద్భుతమగు పరిష్కారములు సామాన్య జ్యోతిష శాస్త్రమున తెలియబడవు. షష్ట, సప్తమ, అష్టమ భావముల పరిష్కార

ములను కుజ, బుధ, వరుణ గ్రహ ప్రభావములచే పరిష్కరించుకొనుట దర్శన శాస్త్రము. అట్టి దర్శనములను అందించువారే ఋషులు.

**నాయకత్వము :**

మేషమున సూర్యునికి ఉచ్ఛస్థితి మరియు శనికి నీచస్థితియు, శుక్రునకు బలహీన స్థితియు జ్యోతిషము తెలుపును.

మేషమున సూర్యుడు ప్రవేశించగనే ప్రాణము, ప్రజ్ఞ రెంటికిని నూతనోత్సాహము కన్పడును. ఉత్సాహమే జీవితమునకు ఊపిరి. ఉత్సాహవంతుడు ప్రాణబలముతో ప్రజ్ఞను విస్తారముగ వర్తింప జేయును. తాను, నేను అను ప్రజ్ఞ మనయందలి సూర్యు డగుటచే వసంత ఋతువు రాగానే సృష్టియం దుత్సాహము పెరుగును. దానికి కారణము జీవ ప్రజ్ఞల ఇనుమడించిన ప్రాణబలమే. మేషరాశి, చైత్రమాసము, వసంతఋతువు పరివర్తన చెందు జీవులకు ఇనుమ డించిన ఉత్సాహము నిచ్చును. ఇట్టి ఉత్సాహమే లేనినాడు జీవుల పరిణామ కథయే లేదు. కనుకనే 'మేషము' రాశులలో నాయకత్వము వహించు రాశిగ ప్రసిద్ధి కెక్కినది. ముందుండి ఉత్సాహముతో నడిపించు నాయకునివలన విజయములు సిద్ధించును. మేషరాశి సూర్యు డట్టివాడు.

శుక్రుడు మేషరాశియందు తన ప్రభావమును కోల్పోవును. కారణ మొక్కటియే. సూర్యుని వెలుగు ముందు ఇతర గ్రహరాజుల వెలుగు వెలవెల పోవుటయే. ఇనుమడించిన సూర్యకాంతి మేషమున వ్యాప్తిచెంది యుండగ, అందలి శుక్రకాంతికి విలువ యుండదు. ఆత్మప్రజ్ఞ ఇనుమడించి ప్రకాశించుచున్న చోట ఇతర ప్రజ్ఞలు

విలువలను కోల్పోవును. అన్నిటికిని ఆత్మయే ఆధారము గనుక ఆత్మ వెలుగుయందు ఇతర వెలుగులకు తావుండదు. శుక్రుని యందు గూడ వెలుగుగ నున్నది ఆత్మయే గనుక ఆత్మ ప్రకాశము శుక్ర ప్రకాశమును కూడ హరించును. ఉన్నతాశయముల కొరకు జీవితమును పణముగ పెట్టినవారు అనుభూతి, ఆనందము ఇత్యాది విషయములందు తగుల్కొనరు. కనుక మేషరాశి యందు శుక్రునకు స్థాన మంతంత మాత్రమే.

శనైశ్చరుడు జీవుల కర్మలకు తగిన ఫలముల నిచ్చు గ్రహముగ ప్రసిద్ధి గాంచినాడు. అజ్ఞానపూరితము అగు వర్తనము వలన ఏర్పడిన కష్ట నష్టములను సహించుట, పశ్చాత్తప్తులగుట, చక్కదిద్దుకొనుట ఇత్యాది వన్నియు శనైశ్చరుడు నేర్పు పాఠము. ఆత్మవంతుడగు మానవుడు అవరోహణ క్రమమున పతనము చెందినపుడు అతనికి శిక్షణము నిచ్చునది శనైశ్చరుడే. జీవిత పాఠములను చక్కగ అవగాహన చేసుకొనుచు, జీవితమును చక్కదిద్దుకొనుచు ముందుకు సాగవలె నన్నచో శనైశ్చరుని శిక్షణము తప్పనిసరి. శిక్షణమున ఉత్తీర్ణులగుచు పరిణామమున ఆరోహణ మార్గము నాశ్రయించి తత్వప్రజ్ఞ ఉత్తమోత్తమముగ భాసించినపుడు శనిగ్రహమునకు పని ఏమున్నది. ధర్మము నాచరించు వారికి ప్రత్యేకముగ శిక్షణమునిచ్చు అవసరము లేదు గదా! మేషమున సూర్యుడు ఉత్తమమగు ప్రజ్ఞగ వెలుగొందుచుండగ శనైశ్చరునికి పని తక్కువ. అందువలన మేషమున శనిదేవునకు నీచస్థితిగ జ్యోతిషము పేర్కొనెను. మేషమునకు సప్తమ స్థానమగు తులయందు మాత్రము అతడమితముగ ప్రకాశించును.

మేషరాశియందు ఈ మూడు గ్రహముల స్థితిని పై విధముగ జ్వాల్‌కూల్ మహర్షి వివరించినాడు.

**అంతరంగ సాధన :**

మేషరాశిని మూడు సమభాగములుగ విభజించి, దశాంశ పద్ధతిన మూడు భాగములకు ముగ్గురు గ్రహాధిపతులను తెలుపుదురు. మొదటి భాగమునకు కుజుడు, రెండవ భాగమునకు సూర్యుడు, మూడవ భాగమునకు బృహస్పతి అధిపతులని కొందరి అభిప్రాయము. అట్లే మొదటి భాగమునకు కుజుడు, రెండవ భాగమునకు సూర్యుడు, మూడవ భాగమునకు శుక్రుడు అధిపతులని మరికొందరి అభి ప్రాయము.

ఈ రెండు అభిప్రాయములును సత్యమే. జీవుల పరిణామ కథలో ఆశలు, ఆశయములు పరిపూర్ణము గావించుకొనుట ఒక భాగము కాగ; ఆత్మానుభూతి, తదనుగుణమగు సాధన మరియొక భాగముగ నున్నది. పదార్థ పరితృప్తికై జీవుడు పరుగులెత్తి ఒకానొక జన్మములో తిరోధానమునకై తపన చెందును. జీవులందరు ఒకే లోకమునందున్నను కొందరు అవరోహణ క్రమములో నుండగ, కొందరు ఆరోహణ క్రమమున యుందురు. కనుక వారిని పరిపా లించు గ్రహరాజులు కూడ వేర్వేరుగ నుందురు.

రెండు తెగలవారికిని మొదటి రెండు దశాంశములకు గ్రహపతు లొకరే. మూడవ దశాంశముననే మార్పు ఉన్నది. కుజుడు రెండు తెగలవారికి పరిశ్రమ తప్పనిసరి యని తెలుపుచుండును. సూర్యుడు పరిశ్రమను బట్టి ఆత్మవికాసము కలుగునని తెలుపు చుండును.

పదార్థమునకై పరిశ్రమించు వారికి బృహస్పతి బాహ్యమగు పరితృప్తి నిచ్చు చుండును. ఆత్మసాధనకై పరిశ్రమించు వారికి శుక్రుడు అంతరంగ ప్రవేశము నిచ్చి ఆత్మానుభూతికి దారి చూపును.

మేషరాశి యందు ఆత్మ సాధకునకు చివరి పది దినములు అంతరంగ సాధనమునకు చాల ముఖ్యమై నిలచినవి. ఈ పది దినములయందే ఏసుక్రీస్తు తిరోధానమునకు సంకల్పించి పట్టుపడి, శిలువనెక్కి పునరుత్థానము గావించుకొని మానవజాతికి ధృవతారయై నిలచియున్నాడు. చైత్ర మాసపు తుది దినములలో, అమావాస్య గడియలలో ఉత్తరలోక ప్రవేశమునకు మార్గ మున్నదని అనాదిగ హిమాలయములందు, ఇజ్రాయిల్ దేశమునందు పూర్వకాలమున ఎందరో తెలిసియున్నవా రున్నారు. దీనినే ప్రస్తుతమున “Pass over” అను పండుగగా నిర్వర్తించుచు నుందురు.

**నాలుగు దశలు :**

మానవుడు దేహధారణము చేయుట, అనుభవమును అనుభూతిని గడించుట, తదనుగుణముగ పరివర్తనము చెందుట, అటుపైన దివ్యోన్ముఖు డగుట, దేహపరమగు విషయము లన్నిటిని సన్యసించుట అనునది అతడి మొత్తము పరిణామము కథ. Recreation, Regeneration, Reorientation, Renenciation అను నాలుగు దశలుగ మానవ కథ నడచునని జ్వాల్‌కూల్ మహర్షి తెలుపు చున్నాడు. దీనినే మన వాఙ్మయమున బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధక్యము అను నాలుగు దశలుగ చెప్పుచుందురు. ఈ

నాలుగు దశలు ఒక జీవితమునగాక కొన్ని వందల వేల జీవితములుగ సాగును.

బాల్యదశ యనగ ఆటలు పాటలు ఆనందము ఇత్యాది వాని కొరకే జీవితమని భావించు దశ. ఆనందమే జీవిత పరమావధిగ భావించు దశ. పసి పిల్లలవలె ఆనందము కొరకై ఇంద్రియములకు వశపడి భోగములను అనుభవించుచు జీవించు దశ అది. మానవ జాతియందు ఇట్టివా రెక్కువ.

అటుపైన కౌమారదశ యందున్నవారు ఆలోచనాపరులై ప్రపంచము నర్థము చేసుకొనుచు, కొంత బాధ్యతపడి, ఇచ్చి పుచ్చు కొనుచు, తాను తన కుటుంబము, తన పరివారము, తన ఆస్తిపాస్తులు సంరక్షించుకొనుచు, పరిమితమగు జీవితమును బాధ్యతతో నిర్వర్తించు కొనుచు జీవింతురు. ఇట్టివా రందరు కౌమార దశయందు జీవించు వారే. ఇట్టి జీవితములు కొన్ని వేల జన్మలు సాగును.

అటుపైన యౌవన దశ యనగ, సంఘ బాధ్యత నెరిగి, సంఘము కొరకు పాటు పడుచు, స్వంత శ్రేయస్సు కన్న సంఘ శ్రేయస్సే ప్రధానమని భావించి పరహితమున నిమగ్న మగుచు క్రమముగ తమ కోసము జీవించుట కన్న, ఇతరుల కోసము జీవించుటయందే ఆనందమును చవిచూచి జీవించుట. ఇట్టివారినే సాధకులందురు. వీరు సృష్టి నవగాహనము చేసుకొనుచు తమ జీవితములను లోకహితమునకై సమర్పణ చేయుచుందురు. తమ కోసము జీవించుట నుండి అందరి కోసము జీవించుట అను మార్పు క్రమముగ అతనిని దివ్యత్వము వైపునకు మరల్చును. బహిరంగము

నుండి ప్రజ్ఞ అంతర్ముఖమై అంతరంగము చేరి శోధన చేయును. అంతరంగ బహిరంగ జ్ఞానమును పొందుచు పరహితమునకై జీవించుట జరుగును. ఈ దశయందు జీవునికి తిరోధానము లభించును. ఏ మానవుడైనను నలుబది తొమ్మిది సంవత్సరములు లోపున ఇట్టి మార్పు చెందినచో యౌవన దశ పొందిన వాడగును. దైవమునుండి దిగివచ్చిన జీవుడు దైవమును చేరుట అను భావము పొందుటయే యౌవన దశ.

మానవ పరిణామము నందు చివరి దశ వార్ధక్యము లేక సన్యసించుట. ఈ దశ యందు మమకార మోహములు నశించి అంతయు దైవమే అని భావించుచు పరహితమునకే సమర్పింపబడిన జీవితములు కలవారగుదురు. వీరినే మానవులలో మహాత్ములందురు. వీరియందు ప్రేమ, మైత్రి, కరుణ ఇత్యాది కళ్యాణ గుణములన్నియు తొణికిసలాడు చుండును. వీరి జీవితము పరిపూర్ణముగ ఇతరుల కొరకు త్యాగము చేయబడు చుండును. వీరే ఇతర జీవులకు మార్గదర్శకులు. ప్రపంచమందలి ఏ విషయమందైనను కాంక్ష, ద్వేషము లేక సమభావముతో జీవితమును నెరపుదురు.

ఇట్లు నాలుగు దశలలో మేషరాశి ప్రభావముచే జన్మించిన మానవుడు పన్నెండు రాశి తత్వములను పుణికి పుచ్చుకొనుచు, పరిణతి చెంది పరమును చేరును. ద్వాదశ రాశుల అనుభూతి పై తెలిపిన నాలుగు దశల యందును అనుభవించును. పురుష ప్రయత్నము, దైవానుగ్రహము కలసివచ్చి తరించును. దిగివచ్చుట, తరించుట కూడ మేషము నందే జరుగును.

## సంకల్పములు :

జ్యోతిషమున నాలుగు చర రాశులు నాలుగు జనన స్థానములను సూచించు చున్నవి. అందు మేషము దివ్య సంకల్పమునకు జనన స్థానము. కర్కాటకము రూపములకు జనన స్థానము. సింహము వ్యక్తులకు జన్మస్థానము. మకరము ద్విజత్వమునకు జన్మస్థానము– అనగా రక్తమాంసాదుల రూపములో జనించిన జీవుడు తన నిజస్వరూపము నెరుగుట. ఇట్లు రాశి చక్రమున నాలుగు జనన స్థానములున్నట్లుగ జ్వాల్‌కూల్ మహర్షి తెలుపుచున్నారు.

మేషమున దివ్య సంకల్పము జనించుననుట ద్వారా మహర్షి రెండు ముఖ్య విషయములను ప్రస్తావించెను. ఒకటి : జీవుల జననము. ఇదియును దివ్య సంకల్పము ననుసరించియే జరుగును. రెండు : సృష్టి నిర్వహణమున వలయు సంకల్పములు. ఇందు మొదటిది కుజ ప్రభావమున జరుగుచుండును. రెండవది బుధ ప్రభావమున జరుగుచుండును. దివ్య సంకల్పము నుండి దిగివచ్చిన జీవులు కుజతత్వముచే నడిపింపబడుదురు. వారియందు పరిణామము జరుగుచున్నకొలది కోరికలు తగ్గుచు ఆలోచనలు పెరుగుట జరుగును. ఆలోచనలు సదాశయములుగను, శ్రేయోదాయకముగను మారువరకు కుజుడే అధిపతియై నడిపించును. విచక్షణ పెరిగి యజ్ఞార్థ జీవనము ప్రారంభము కాగ క్రమముగ బుధుడు అధిపతియై కుజుని వద్ద నుండి కార్యభారమును అందుకొని వర్తించును. ఇతర సృష్టి నిర్వహణ సంకల్పము లన్నియు సామాన్యముగ దైవము యొక్క బుద్ధి

వ్యూహము నుండే ఏర్పడుచుండును. ప్రత్యేక సన్నివేశములలో వరుణ ప్రభావమున కూడ ఆకస్మిక మార్పులు జనించును.

ఇట్లు మేషమున సామాన్యజీవుల నుండి వ్యక్తమగు సంకల్పము లన్నియు కుజుని చేతను, శిష్టాచారులనుండి ఏర్పడు సంకల్పములు బుధుని చేతను, మహాత్ములనుండి ఏర్పడు సంకల్పములు వరుణుని చేతను నిర్వర్తింపబడుచున్నట్లుగ జ్వాలాకూలుడు వివరించు చున్నాడు.

నిజమునకు మానవుల సంకల్పములు వాని సంస్కారములపై ఆధారపడియుండును. కోరికలున్నంతకాలము జీవుల సంకల్పములకు కుజుడే ప్రభువు. బుద్ధిమంతులకు బుధుడు ప్రభువు. మహాత్ములకు వరుణుడు ప్రభువు. మేషమునందు ఈ మూడు గ్రహములు వరుసగా చూపు ప్రభావమును మహర్షి ఈ విధముగ వ్యాఖ్యానించుట అపూర్వము.

జ్యోతిషమును సలహా సంపత్తికై వినియోగించినపుడు జీవ సంస్కారమును బట్టి గ్రహ స్థానములు, వాని ప్రభావము కనుగొన వలెను. కాని అందరికిని ఒకే రకముగ వ్యాఖ్యానము చేయుట అవివేక మగును.

**ఉత్తమోత్తమ తత్త్వము :**

ఒక జ్యోతిష్కుడు ఒక జాతకమును పరిశీలించునపుడు అతని పరిణామ దశను గూడ అవగాహన చేసుకొనవలెను. ఒకే సమయ మున ఒక క్రూర జంతువు, ఒక సాధు జంతువు, ఒక పరిణామము చెందని మానవుడు, పరిణామము చెందుచున్న మానవుడు, పరిణా

మము చెందిన మానవుడు జన్మించినపుడు గ్రహస్థానములట్లే యుండును. ఆరూఢ లగ్నములు కూడ దరిదాపులలో ఒకటిగనే యుండవచ్చును. అయినను కాలక్రమమున వారి చేష్టలు వైవిధ్యముతో నుండును. కారణము జీవుల పరిణామమునందుగల వ్యత్యాసము. గ్రహ దేవతలు పరిణామమును బట్టి నియమించు వారిగనో, స్నేహితులుగనో, సహకారము నందించు వారిగనో ప్రతిస్పందింతురు గాని అందరి యెడల ఒకే విధముగ నుండరు. కనుక జాతక పరిశీలనము కేవలము శాస్త్ర జ్ఞానమునకే పరిమితము చేయక లోకజ్ఞానము, జీవ పరిణామ జ్ఞానము కూడ తెలిసి యుండవలెను.

ఒక జీవుడు పరిసరములతోగాని, ఇరుగుపొరుగు వారితోగాని ఎట్టి సంపర్కము లేక తనకు తానుగ పూర్ణ స్వార్థముతో వృద్ధి చెందు వాడై యుండవచ్చును. మరియొకడు తన క్షేమముతో పాటు ఇతరుల క్షేమమును కూడ కోరుచు సాగుచు నుండవచ్చును. ఇంకొకడు ఇతర జీవుల శ్రేయస్సు కొరకే జీవితమును పణముగ పెట్టవచ్చును. ఈ మూడు రకముల జీవులకు శాస్త్రము నొకే విధముగ అన్వయింపరాదు.

చర రాశియైన మేషము ఉత్తమోత్తమమగు జీవులకు ఉత్తమోత్తమమైన అవకాశము. ఉత్తమ అశ్వమునకు ఉత్తమ రౌతు లభించుట, అట్లే ఉత్తమ రౌతుకు ఉత్తమ అశ్వము లభించుట పూర్ణ వైభవము కలిగించును. అశ్వినీ నక్షత్రముతో ప్రారంభమగు మేషరాశి ఉత్తమోత్తమమగు అశ్వము. కాని దాని నధిష్ఠించగల రౌతు అరుదుగ లభించుచుండును. మూర్ఖునకు పంచకల్యాణి గుఱ్ఱము వలన

ఉపయోగము లేదుగదా! వినియోగము తెలియక నశించును. మేషమందించు ఉత్తమోత్తమ తత్వము నందుకొనుటకు మానవ జాతి యందు అర్హత గలవా రతి తక్కువ. దాదాపు లేనట్లే. ఎవరైన నొకరున్నట్లు అయితే, అతడీ భూమికి చక్రవర్తియై మానవజాతి నంతను శాసించ గలడు. అట్టివాని రాకను పురాణములు కల్కిగ సూచించుచున్నవి.

**ధర్మ నిర్వహణ :**

"నేను దేహమును దాల్తును. మనసు నధిష్ఠించి నా జీవితమును పరిపాలింతును" అనునది జీవుని ఆకాంక్ష. మానవ దేహమును ధరించు నపుడు మానవుడు సమస్త లోకానుభూతులను పొందగలడు. అనుభూతి యుండవలె నన్నచో మనసేంద్రియ శరీరముల ఆవశ్యకత యున్నది. మనసు నధిష్ఠించి బాహ్య ప్రపంచమును పరిపూర్ణముగ అనుభవించ వచ్చును. దేహావశ్యకత, దేహ ప్రయోజనము తెలియనివారే దేహమును గూర్చి మిడిమిడి జ్ఞానముతో ప్రేలాపములు చేయుదురు. దేహము తుచ్ఛమైనదని, త్యజింప వలసినదని ప్రేలుచుందురు. వీరు సృష్టి ప్రయోజనమే తెలియనివారు. శుష్కవేదాంతులు. వీరి సిద్ధాంతముల వలననే దేహము విషయమున తూర్పు దేశములలో అశ్రద్ధ కలిగినది. అన్ని ధర్మములును సాధించుటకు దేహ మావశ్యకము.

దేహమున ప్రవేశించి, మనస్సు నధిష్ఠించి దేహమును, జీవిత మును పాలించుట సిద్ధి. దివ్యమగు అస్త్రము నిచ్చినపుడు దానిని వినియోగించుట చేతగాక దానిని దూషించుచు, అశ్రద్ధ చేయుచు దానిచే బంధింపబడి మరణించువారి నేమనవలెను? ఇట్టి చేతకాని వారు

పలుకు సిద్ధాంతములే ప్రపంచమున మిక్కుటముగ ప్రచారము నందున్నవి. దేహధారణము, దేహ పోషణము, దేహ నిర్వహణము ఇత్యాదివి తెలిసినవారు దేహము వలన ఎన్నో మహత్కార్యములు సాధించిరి. కళ్యాణప్రదమగు కార్యము లెన్నియో నిర్వర్తించిరి. దైవమునకైనను ధర్మ నిర్వహణమునకై దేహము దాల్చుట తప్పని సరి.

దేహము ధర్మ సాధనమునకు వినియోగించుట తెలియనపుడు దుర్వినియోగము చేయుటవలన అందు జీవుడు బంధింపబడు చున్నాడు. తెలియకపోవుట వలన బంధనమే కాని మరియొకటి కాదు. తెలిసినచో మోక్షము, తెలియనిచో బంధము. ఈ సూత్రము అన్ని యంశము లందు సత్యమే. జీవునికి జీవునితో గల సంబంధము సరిగ నిర్వర్తింపబడనపుడు అందుండి బంధము లేర్పడును. జీవునికి ప్రకృతితో గల సంబంధము పెరిగినపుడు ప్రకృతి వలన బంధము కలుగును. పురుషుడు స్త్రీతో మెలగుట తెలియనపుడు అతని వివాహము బంధమై నిలచును. ప్రకృతిని గూర్చిన విజ్ఞాన మెరిగి, తనను గూర్చిన జ్ఞానమెరిగి జీవించు వానికి ఏదియును బంధము కాదు. దేహము లేకుండుట కన్న దేహ ముండుట సదుపాయము. దేహమును సమర్థతతో నిర్వహించుట మరియొక సదుపాయము. జీవుడు బుద్ధి స్వరూపుడు. అతడు మనసు నధిష్ఠించి దేహమును పాలించినచో జీవితము కళ్యాణప్రదమై యుండును. వైభవోపేతమై యుండును. కనుకనే ప్రారంభమున తెలిపిన మేషరాశి సూత్రము అత్యంత ప్రతిభావంతము.

**స్వభావ ప్రభావము :**

మన సూర్యుడు ద్విస్వభావ రాశులను, అతడికి మూలమైన సవితృమూర్తి స్థిర రాశులను, సవితృమూర్తికి కూడ మూలమైన ఆదిత్యుడు చర రాశులను ప్రభావితము చేయుచున్నారని మహర్షి జ్వాలాకూలుడు బోధించుచున్నాడు.

మన మెరిగిన సూర్యుడు భూమికిని, భూమి జీవులకును స్వభావముపై ప్రభావము చూపువాడని, సవితృమూర్తి ఆత్మలపై ప్రభావము చూపువాడని, ఆదిత్యుడు ప్రాణముపై ప్రభావము చూపు వాడని జ్వాల్‌కూల్ మహర్షి ప్రకటించినాడు. అనగా ప్రాణము ఆదిత్యుని ఆధీనమున నున్నదని తెలియుచున్నది. జీవుడు సవితృమూర్తి ఆధీనమున నున్నాడని తెలియుచున్నది. జీవుల స్వభావములు మన సూర్యుని ఆధీనమున నున్నవని తెలియు చున్నవి.

సమన్వయించి చూడగ మన వ్యక్తిగత స్వభావములన్నియు సూర్యాధీనములని, అవి ద్విస్వభావరాశుల నుండి మనలను పరిపా లించునని తెలియును. ద్విస్వభావ రాశులు నాలుగు. ఈ నాలుగు రాశులయందు జీవుల స్వభావ ప్రభావమే ఎక్కువ యుండును. మిథునము, కన్య, ధనుస్సు, మీనములు స్వభావమునే ఎక్కువగ ప్రేరేపించును. ఇట్టివారు స్వభావ ప్రేరితులుగనే యుందురు. ఈ రాశుల యందు సూర్యుడు సంచరించు చున్నపుడు జీవుల స్వభావమే ఎక్కువగ ప్రకోపించును.

అట్లే స్థిర రాశులగు సింహము, వృశ్చికము, కుంభము,

వృషభముల యందు జీవ లక్షణ మెక్కువగ పనిచేయు చుండును. స్వభావముకన్న జీవునికే బలమెక్కు వుండును. స్వభావము జీవుని బంధింపని స్థితి స్థిరరాశి కిరణములలో నున్నది. ఈ రాశి ప్రభావము మిక్కుటముగ గలవారే మానవజాతి యందు ఉత్కృష్టమగు కార్యములు నిర్వర్తించిన వారుగ గోచరింతురు. వీనియందు ప్రజ్ఞా స్థిరత్వ మెక్కువ. కారణము స్వభావము నధిష్ఠించి జీవుడుండుట. వీరికి బలము సవితృమూర్తియే.

చర రాశులగు మేషము, కర్కాటకము, తుల, మకరములు సూర్యమండల మందలి ప్రాణికోటికి ఆదిత్యుని నుండి ప్రాణ ప్రసార మును గావించును. దాని వలన జీవులు వారి వారి పరిణామ కార్యములు నిర్వర్తించుకొను చున్నారు.

ఇట్లు మనకు కనిపించు వివస్వతుడను సూర్యుని నుండియే ఆదిత్యుడు, సవితృమూర్తి కూడ పనిచేయుచున్నారు. ఆదిత్యుడు, సవిత, సూర్యుడు చెరి నాలుగు మాసములు తమదైన ప్రసారమును గావించుచు జీవుల ప్రాణములకు, జీవులకు, జీవ స్వభావమునకు బలమిచ్చు చున్నారు. అవియే వరుసగ చర రాశులు, స్థిర రాశులు, ద్విస్వభావ రాశులుగ జ్యోతిష చక్రమున నిలచి యున్నవి.

రాశిచక్రము పరిశీలించినపుడు ఈ మూడు చతుర్భుజముల ప్రభావము జీవునిపై ఎట్లున్నదో గమనించుట ద్వారా జీవుని పరిణామ స్థితిగతులపై చక్కని అవగాహన ఏర్పడునని జ్వాల్‌కూల్ మహర్షి బోధించెను.

ఈ ముగ్గురు సూర్యుల పనియే పన్నెండు రాశులయందు వ్యాప్తిచెంది యున్నవి. (ముగ్గురు సూర్యు లనగ ఆదిత్యుడు, సవిత, సూర్య) ఈ ముగ్గురినే పాశ్చాత్య తత్వ వాఙ్మయమున 'సోలమన్' అని పలుకుదురు. వీరందరికిని పుట్టుక స్థానము మేష రాశియని తెలియవలెను.

♉

# వృషభము

**పరిచయము :**

వృషభరాశి లేక వైశాఖ మాసము మెండుగ అవకాశముల నిచ్చు మాసము. వైశాఖమున సనాతన సంప్రదాయములందు అనేకానేక పర్వదినము లున్నవి. వ్యాస మహర్షి, ఆదిశంకరులు ఈ మాసముననే జన్మించిరి. వైశాఖ పూర్ణిమ భూదేవికే పండుగ దినము. సనత్కుమారుడు విశాఖుడై భూమిపై గల సమస్త ఋషులకు, దేవతలకు దర్శనమిచ్చుట, దిశానిర్దేశము చేయుట వైశాఖపూర్ణిమ గడియలలో హిమాలయములలో జరుగుచు నుండును. సంవత్సర పురుషుడు వృషభము రూపమున తన కిరణములతో భూమిని స్పృశించి పవిత్రము చేయును. వైశాఖమాస మందలి సూర్యకిరణములు అతి తీవ్రమై భూమియందలి తమస్సును హరించి, భూప్రజ్ఞను పదనెక్కించును. జీవులకు గూడ శరీరమందలి తమస్సు హరింపబడి శరీరము చురుకుగ, పదనుగ నుండును. వైశాఖ కిరణములు ఎంతటి తమస్సునైనను హరింపగలవు. కృత్తిక కార్తె, రోహిణి కార్తెలయందు ఉదయము, సాయంత్రము ప్రసరించు కిరణములు సాధకులకు అత్యంత శ్రేయోదాయకమై యున్నవి. మధ్యాహ్న కిరణములు రౌద్రమై ప్రాణములను గూడ హరించును. ప్రాతః సాయం సంధ్యల యందు సూర్యకిరణముల నందుకొనుచు దైవముపై మనసు లగ్నము చేసిన వారికి ఉత్తమోత్తమ మగు వికాసములు ఈ రాశి అందించును. ఈ రాశి కిరణములు విష్ణు ప్రియములు. “వృషప్రియః” అని విష్ణు సహస్ర నామములలో ఒక నామము.

దేహమునందు వసించియున్న జీవుడు తమః ప్రభావముచే ఒక స్వప్న జీవనము గావించుచు నుండును. స్వప్నమున స్వప్నములు కనుచుండును. ఇట్టి వానికి విష్ణు ప్రియమైన వైశాఖ కిరణములు మేలుకొలుపు నీయగలవు. జీవుని పరివర్తనమునకు ఎంతయూ దోహద పడగలవు. సాధకుల శరీరధాతువులలోని తమస్సును వైశాఖ కిరణములు హరించును కనుక వైశాఖమాస మంతయు ఉదయ సాయంత్రపు కిరణములను భక్తితో అందిపుచ్చుకొనుట సాధకుల కర్తవ్యమై నిలచినది.

వైశాఖమాసమున ఋషులే దిశానిర్దేశమును పొందుచుండగ సామాన్యులకు అది ఎంతటి మహత్తర అవకాశము! ఇబ్బడి ముబ్బడిగ సత్సంకల్పములు అందివచ్చు కాలము వైశాఖము. అందుకొని జీవితము లను అనుగుణముగ మలచుకొని సాగు సాధకులకు వైశాఖము ఒక అద్భుత అవకాశము. "మార్పులకు, చేర్పులకు, పరివర్తనమునకు వైశాఖము పెట్టినది పేరు" అని జ్వాల్‌కూల్ మహర్షి వృషభరాశిని ప్రశంసించినాడు.

**ఇచ్ఛ :**

వృషభమున దైవము ఇచ్ఛ ప్రకటింపబడును. ఇచ్ఛయే జీవు లను గూడ నడిపించుచున్నది. ఇచ్ఛయే లేనిచో చీమ కదలదు, దోమ ఎగురదు, మానవుడు క్రియాశీలుడు కాడు. సృష్టియే ఇచ్ఛ కారణముగ జరుగుచున్నది. ఇన్ని లోకములను నడిపించుచున్నది ఇచ్ఛయే. చిన్న పనికిగాని, పెద్ద పనికిగాని ఇచ్ఛయే మూలమై యున్నది. ఇచ్ఛకు మరియొక పేరే కామము. 'క' నుండి 'మ' వరకు వ్యాప్తిచెందు

సమస్తము కామరూపమే. బ్రహ్మమును పొందవలెనని కొందరు కాంక్షించు చుండగ, అన్నియు దొరికిన చాలునని కొందరు కాంక్షింతురు. అన్నము నుండి బ్రహ్మము వరకు అన్ని వ్యాపారములు ఇచ్ఛచే నడిపించబడు చున్నవి. ఇచ్ఛ లేనిదే భూమి కూడ తిరుగదు. గ్రహగోళములు సూర్యునిచుట్టు తిరుగవు. సూర్యుడు ప్రకాశింపడు.

ఇచ్ఛ తీవ్రతను బట్టి శక్తి జనించును. ఇచ్ఛాశక్తి వలన చిల్లర కోరికల నుండి సదాశయములు, సత్య దర్శనము వరకు ఇచ్ఛ పనిచేయుచున్నది. ఇట్టి ఇచ్ఛాశక్తి స్వరూపమే వృషభము. దానివలననే సమస్త కార్యములు నెరవేరు చున్నవి. జీవించుట కూడ ఇచ్ఛ చేతనే. ఇచ్ఛను వినియోగించు రీతిలో జీవుడు పరిణమించుట లేక పతనము చెందుట జరుగుచున్నది. ఇచ్ఛా వినియోగమే జీవునికి వైవిధ్యమగు అనుభూతులను కలిగించుచున్నది. కనుకనే బుద్ధుడైన గౌతముడు ఇచ్ఛను పరిశీలించుకొనుమని ప్రధానముగ బోధించినాడు. నీ ఇచ్ఛా వినియోగము శ్రేయోదాయకమగు మార్గములలో నిలచినపుడు నీవు వికాసము చెందుచు నుందువు. కేవలము ప్రేయస్సు మార్గములలో పరువెత్తినచో నశింతువు అనునది లోకమున ప్రధానమగు బోధ. ఇచ్ఛాశక్తిని గ్రహ సంబంధమగు కోరికలపై ప్రసరింపజేయుట, జీవపరమైన సత్యదర్శనమునకై వినియోగించుటను పెద్దలందరును బోధింతురు. ఎట్లయినను వైశాఖ మాసమున ఇచ్ఛను సరిదిద్దు కొనుట ముఖ్యమగు కర్తవ్యముగ గోచరించును.

మానవుని సంకల్పములు దైవసంకల్పముతో అనుసంధానము చెందియున్నప్పుడు మానవునకు జీవనము రసోపేతమై యుండును. అట్లుగాక అతడి సంకల్పములు సమన్వయము కోల్పోయినపుడు ఘర్షణ

యుండును. సంకల్పము దివ్యమా లేక వ్యక్తిగతమా అను సందేహ నివృత్తికి ధర్మమే ప్రమాణము. ధర్మమునకు లోకశ్రేయస్సు ప్రమాణము. వ్యక్తిగత సంకల్పములు లోకశ్రేయస్సునకు అనుగుణముగ నడచినచో శ్రేయస్సు కలుగును. లేనిచో శ్రేయస్సు కలుగనేరదు. సంకల్పములను సరిచేసుకొనుటకే ప్రతి సంవత్సరము వైశాఖ కిరణములు ప్రసరించు చున్నవి.

## దిశానిర్దేశము :

సంకల్పము, శక్తి, కోరిక, ఆశ, ఆశయము, ఉద్దేశ్యమందలి పవిత్రత, జీవన ప్రయోజనము, ఉత్సాహము, ప్రణాళిక– ఇట్టి పదము లన్నియు వృషభరాశి సంబంధితములు. వీని నిర్దేశమునుబట్టి జీవుడు ఉన్నతుడగుచు సుఖించుటగాని, పతనము చెందుచు దుఃఖించుట గాని జరుగుచుండును. ప్రతి జీవికిని జీవనము సాగుటకు దిశా నిర్దేశము ప్రధానము. జీవన దిశానిర్దేశము లోకశ్రేయస్సయినచో జీవనము సమన్వయింపబడి రసమయమై సాగును. అట్లుకానిచో ఘర్షణ తప్పనిసరి యగును. ఒక బలమైన ఎద్దు తన బలము నెట్లుప యోగించునో అను దానిని బట్టి శ్రేయస్సో, విధ్వంసమో యుండును. ఎద్దుకున్న బలము ఇతర జంతువులకు లేదు. గ్రామ జంతువులలో ఎద్దు బలమైనది. అట్లే జీవునకు సంకల్పమే బలమైనది. ఎద్దును చక్కగ వశపరచుకొని, నాగలికి కట్టి పొలము పండించవచ్చును. అట్లే సత్సంకల్పమను ఎద్దును సంఘశ్రేయస్సుకై వినియోగించుటవలన జీవుడు ఉత్తీర్ణుడగును. ఒక ఎద్దు ఆబోతు కాగలదు. అట్లే నందీశ్వరుడై ఆనందరూపమై నిలువగలదు. సంకల్పమే ఆనందమునకు గాని దుఃఖమునకు గాని హేతువు. ఈ సంకల్పమునే వేదమున వృషభమని

కీర్తించినారు. పరమశివుడు ఎద్దుపై నెక్కుటయనగ సంకల్పము శివమై యుండుటయే. మనసు శివసంకల్ప మైనపుడు వృషభరాశి తత్వము పరిపూర్ణమగును. శివసంకల్ప మనగ సత్సంకల్పమే. సత్యమే శివము, సుందరము కూడ. జీవితములు అందముగ తీర్చిదిద్దుకొనుటకు వృషభరాశి కిరణములు ఎంతయో ఉపయోగకరములు. మహర్షులు సయితము ఈ మాసమున తమయందు దివ్యసంకల్పము ప్రణాళిక ననుసరించి పటిష్ఠముగ ఏర్పడుటకు ప్రార్థనలు చేయుచుందురు.

వైశాఖ మాసముననే శంబళ గ్రామము నుండి దివ్య సంకల్పము వ్యక్తమగును. సనత్కుమారుడు మన భూమి యందు దైవము యొక్క బుద్ధిప్రజ్ఞగ నెలకొనియున్నాడు. దైవము యొక్క బుద్ధివ్యూహము నుండి భూమికి సంబంధించిన ప్రణాళిక వైశాఖమున వ్యక్తమగును. మేషము దైవము యొక్క సంకర్షణ వ్యూహము కాగ, వైశాఖము బుద్ధివ్యూహమై యున్నది. ఈ బుద్ధివ్యూహము నుండి దివ్య ప్రణాళిక సంబంధితమగు సంకల్పములు శంబళనుండి వ్యక్తమగునని పరమ గురువులు తెలుపుచున్నారు. వీని నందు కొనుటకు భూమిపై మానవులు ప్రయత్నింప వచ్చును. ఈ సంకల్పము లందజేయుటకు శంబళ గ్రామమునకు మానవజాతికి నడుమ మైత్రేయాది పరమగురువుల పరంపర ఒక వారధిగ నున్నది. సంధాన కర్తలుగ గౌతమబుద్ధుడు, మైత్రేయ మహర్షి దీక్షవహించి యున్నారు.

విధివశులై జీవించుచున్న మానవులు బంధము నుండి వైదొలగుటకు వైశాఖమున దిగివచ్చుచున్న సత్సంకల్పములను

అనుసరింప వచ్చును. అట్లనుసరింపదలచిన వారికి పరమగురువులు సహకరింతురు. దానివలన జీవితమొక సత్సంకల్పమునకు సమర్పింప బడును. అట్లు సమర్పితమై జీవించు మానవుడు సాధకుడుగ మారును. అతని సాధనము లోకహితమునకై అయి ఉండుట చేత క్రమముగ లోకహితుడు కాగలడు.

పై విధముగ వ్యక్తిగతమగు బంధజీవనము, వ్యక్తిగత ప్రణాళిక నుండి దివ్య ప్రణాళికకు మరల్చబడి క్రమముగ దివ్య ప్రణాళికయే వ్యక్తి ప్రణాళికగ మార్పుచెందును. వ్యక్తిగతమగు కర్మ విశ్వకర్మలో కలియును. విశ్వకర్మ దివ్యకర్మ అగుటచే సాధకుడు కూడ దివ్యత్వ మును పొందును. ఒక సెలయేరు జీవనదిని చేరి జీవనదియై ప్రవహించి సాగరము చేరునట్లు, ప్రత్యగాత్మ అయిన ఒక వ్యక్తి సర్వాంతర్యామి యందు రమించుట, లయించుట జరుగును.

ఇది యంతయు సంకల్పమునకు సరియగు దిశానిర్దేశము నిచ్చుట వలననే జరుగుచున్నది. ఈ కారణముచేత వైశాఖము పరమ పవిత్రమగు మాసముగ గుర్తింపబడినది.

**పరహితము :**

ప్రస్తుతము మానవజాతియందు సత్సంకల్పములు మెండుగ మొలకెత్తు చున్నవి. ఎన్నెన్నో సంఘములు ఎన్నో వైవిధ్యములగు సత్సంకల్పములను నిర్వర్తింపజేయుచున్నారు. సత్సంకల్పములకు బలము కూడ పెరుగుచున్నది. సత్సంకల్పములందలి బలము సంఘ శ్రేయస్సు, లోకశ్రేయస్సు. వీనికి వ్యతిరేకములగు భావములు స్వార్థమై

యున్నవి. స్వార్థపరులైనవారు తమ కోసమే జీవింతురు. పరహితపరులు ఇతరుల శ్రేయస్సు కొరకే జీవింతురు. ఇట్లు స్వహిత, పరహిత సంకల్ప ప్రవాహములు ఎదురు బొదురుగ ప్రవహించుట వలన రెండును కలియుచోట ఘర్షణ ముత్పన్నమగు చున్నది. ఈ ఘర్షణమే మానవ జాతియందు చిన్న చిన్న యుద్ధములనుండి ప్రపంచ యుద్ధము వరకు గూడ నిర్వర్తింపబడుచున్నది. ఇట్టి యుద్ధమున దైవబలము పరహిత ప్రవాహమునకే యుండును. కనుక పరహిత ధర్మమే గెలుచును. స్వార్థశక్తులు తాత్కాలికముగ గెలిచినను మరల మరల జరుగు యుద్ధమునందు పరహితమే గెలుచును.

మానవజాతి చరిత్రయందు ఎన్నియో యుద్ధగాథ లున్నవి. ఈ యుద్ధముల వలన జాతికి పురోగతి లభించుచుండుట గమనార్హమైన విషయము. వ్యాధిసోకిన జీవుడు వ్యాధి నెదుర్కొనుచు, వైద్య సహాయముతో ఔషధసేవ చేయుచు వ్యాధిని నిర్మూలించుకొనినపుడెల్ల మరల గ్రహణమును వీడిన చంద్రునివలె మరింత ప్రకాశించును.

స్వార్థచింతనతో నడచు మానవజాతి పరహితమునకు క్రమముగ వశపడును. ఇట్లు వశపడుట పరిణామక్రమమున నిర్దేశింపబడి యున్నది. వశపడు లోపల ఎన్నియో అంతర్యుద్ధములు, బాహ్య యుద్ధములు జరుగుట తప్పనిసరి. జాతి మనోభావములు పరిశుద్ధ మైనపుడు యుద్ధము లాగును. అంతవరకు యుద్ధముల ఆవశ్యకత మానవజాతికి యున్నది. భూమిపై పేదరికము, తత్సంబంధితమగు అసౌకర్యములు మానవజాతి యందున్నపుడు పోరాటములు సాగుచునే

యుండును కనుక సర్వహితమే ధ్యేయముగ మానవ ప్రభుత్వములు నడువనంత కాలము యుద్ధము లుండితీరునని తెలియవలెను. ఇట్టి దురవస్థనుండి మానవజాతి మేల్కొనుటకు కాలచక్రము కుంభయుగము నావిష్కరించినది. కుంభచైతన్యము కారణముగ ప్రస్తుతము సగటు మానవుడు భౌగోళికముగ ఆలోచించుట ఆరంభించినాడు. అందరును బాగుండిననే తానును బాగుండగలనని తెలుసుకొనుచున్నాడు. పరిసరము లందలి జీవితములు దగ్ధమగుచుండగ తానెట్లు విశ్రాంతిగ నుండగలడు? కుంభచైతన్యము వృషభరాశి చైతన్యమునకు మెరుగులు దిద్ది, మానవజాతికి దిశానిర్దేశము గావించుచున్నది. శంబళ బలపడు చున్నది.

శంబళ గ్రామమునకును దక్షిణ హిమాలయ ప్రాంతమందలి మను కేంద్రమునకు నడుమ ఏర్పడియున్న చైతన్యపు వంతెన ప్రస్తుత కాలమున బలపడుచున్నది. దీని కారణముగ మానవ మేధస్సునందు దివ్య ప్రణాళిక సంబంధితమగు భావములు భాసించుట ఎక్కువగు చున్నది. స్వార్థమునుగూర్చి పనిచేయు మానవుని యందు పరార్థ చింతనము పెరుగుచున్నది. సంఘమును గూర్చి, రాష్ట్రమును గూర్చి, దేశమును గూర్చి, మానవ జాతిని గూర్చి యోచించువారి సంఖ్య పెరుగుచున్నది. ఇది యంతయు వృషభరాశి ఆధ్వర్యమున జరుగు చున్నదని మహర్షి జ్వాలాకూలుడు ప్రకటించియున్నాడు.

వెలుగు పెరుగుచున్నపుడు కోల్పోవు చీకటి లేక అజ్ఞానము తన స్థాన బలిమికై ప్రతిఘటించుట సహజముకదా! అట్టి

ప్రతిఘటనయే 20వ శతాబ్దము, 21వ శతాబ్దము లందు అనుభవింప బడుచున్నది. నీతికి అవినీతికి నడుమ పోరు సాగుచున్నది. ఉగ్ర వాదమునకు శాంతవాదమునకు మధ్య పోరు సాగుచున్నది. ధర్మాధర్మ యుద్ధము వ్యక్తియందు, సంఘమందు, రాష్ట్రమందు, దేశమందు, మొత్తము భూగోళమునందు నిత్యము సాగుచున్న విషయము వాస్తవమే కదా!

అవినీతి, అధర్మము తాత్కాలికముగ జయించినను అచిర కాలమునందే ధర్మమునకు ఆధిక్యత లభ్యమగుట తథ్యము. ఈ యుద్ధమున ప్రాణములు కోల్పోయినవారు మరల జన్మలెత్తినపుడు పవిత్రులై భాసించగలరు.

ప్రస్తుతమీ యుద్ధము బుద్ధి మనో లోకముల మధ్య సాగు చున్నది. పరహితార్థము జీవించుచు, పరిసరముల యందలి మానవు లకు స్ఫూర్తి నిచ్చువారు మిక్కుటముగ పెరుగుచుండుటచే ఈ కార్యము సుగమ మగుచున్నది. వీరి నుండి భౌగోళికముగ ఒక నూతనమగు సమన్వయము అందరికిని అందుచున్నది. వీరి మతము పరహితమే. పరహితమే భౌగోళికముగ మానవ మతముగ నిలువ వలెనని శంబళ సంకల్పము. ఈ సంకల్పమునకు పుట్టినిల్లు వృషభము.

పరహితులకు ప్రకృతి సహకారము లభించుచుండగ అతడు బలపడి పరహిత కార్యమున ప్రముఖుడై నిలచినపుడు అత డహంక రించునా లేక వినయముతో తనను తాను పరహితమునకు సమర్పించు కొనునా అనునది ఒక ప్రముఖమగు మీమాంసగ యున్నది. తనను

పెంచుకొనువాడు అహంకారియై పతనము చెందును. అచ్చువేసిన ఆబోతువలె మిగిలిపోవును. పరహిత యజ్ఞమున తనను తాను సమర్పించుకొన్నవాడు నందీశ్వరుడై శివానందలోకమున శాశ్వతుడగును. ఇది కాలమే నిర్వహింపగలదు.

**విచక్షణ :**

వృషభరాశి తత్వమందు ఒక ముఖ్యలక్షణ మేమనగ అంతర్గతముగను, అదృశ్యముగను, సూక్ష్మముగను స్వభావమందు ఇమిడియున్న లక్షణములను బయల్పరచును. వ్యక్తము చేయును. లోనున్న భావమును భాషగను, చేతగను బయట పెట్టును.

సామాన్యుల యందు స్వభావములోనున్న అవినీతి, అధర్మము, కోరికలు, ఆశలు ఇత్యాదివన్నియు బయల్పడుట జరుగును. మహాత్ముల యందు గల ధర్మనిరతి, దివ్య భావములు కూడ వ్యక్తమగుటకు వారియందలి వృషభ బలమే. లోపలగల సంకల్పములను బయలు లోనికి వ్యక్తము చేయుట తప్పనిసరియై వృషభమున జరుగును. మేకతోలు కప్పుకొని తిరుగు పులులు బయటపడుదురు. మోసగాండ్రు బయటపడుదురు. కుట్రలు, కుతంత్రములు బయటపడును. అర్థకామము నందలి ఆసక్తి బయటపడును. దాచినవెల్ల బయటపడును. అట్లే దాచిన దివ్యలక్షణములు కూడ బయటపడును. నిజమునకు ప్రపంచమందలి కార్యక్రమ మంతయు వృషభముననే. మంచి చెడు ప్రస్తుతమున విస్తృతముగ బయటపడుచున్నవి.

సామాన్యులకు మహాత్ములకు నడుమ సాధకజనులున్నారు కదా. వీరు తమ స్వభావమందలి మంచి చెడులను వివరించుకొనుచు

విచక్షణతో మంచిని వ్యక్త పరుచుచు, చెడును దమించుటకు ప్రయత్నింతురు. తమయందలి గర్హనీయమైన విషయములను బలముగ అణచివేయుటలో వీరు చాల శ్రమపడుదురు. అణచివేత ప్రకృతి విరుద్ధము కనుక ఘర్షణ కలుగుచుండును. ఒక ఎద్దును క్రమశిక్షణలో పెట్టుటకు ఎంత శ్రమపడవలెనో వృషభమున సాధకు నకు స్వభావ మందలి కలుపు విత్తనములను ఏరుట అంత కష్టము.

ప్రస్తుతము మానవ జాతియందు చిల్లర కోరికలు, కామము విస్తృతమై, విశృంఖలమై సాగుచున్నది. స్త్రీ పురుష కామము, ధనముపై ఆసక్తి, అధికారముపై ఆసక్తి, ఇంద్రియ పరితృప్తి ఎల్లలు దాటి నిర్వర్తింపబడు చున్నది. స్వాతంత్ర్యము పేరున బాధ్యతలను విస్మరించి హక్కులను సంరక్షించుకొనుట జరుగుచున్నది. దీనికి కారణము ముందు శతాబ్దములలో మతముల పేరిట పెద్దలు పెట్టిన విపరీతమగు ఆంక్షలే. ఆంక్షలతో అణగత్రొక్కపడిన అర్థకామములు ప్రస్తుతము ధర్మము నతిక్రమించి విప్లవాత్మకముగ చెలరేగుచున్నవి. పెద్దలను గౌరవింపకుండుట, అధ్వాన్నములు తినుట, పతనము కలిగించు విలాసములందు కృంగి యుండుట, మితిమీరిన కామముతో స్త్రీ పురుష బంధమును హీనస్థితికి గొనివచ్చుట ఇత్యాదివన్నియు వృషభము చేయుచున్న విధ్వంసములు. కట్లు తెంచుకొని పొలమున పడిన ఎద్దువలె సర్వ నాశనమునకై మానవజాతి పురోగమించుటలో వృషభరాశి ఆధిపత్యము గోచరించు చున్నది.

ఇది ఇట్లుండగ పరమగురువుల పరంపర తన అనుయాయు లతో దివ్య ప్రణాళికను భూమిపై అవతరింపజేయుటకు కృషి సలుపుచు

నున్నది. ఈ కృషికూడ వృషభప్రజ్ఞయే. వైశాఖపౌర్ణమి ప్రాతిపదికగ గుప్తముగనున్న దివ్యత్వమును వ్యక్తము చేయుచు, వ్యక్తుల నుద్ధరించు కొనుచు పరమగురువులు సాగుచున్నారు. వారి బోధనములు సాధక బృందములకు అమృత తుల్యములు. బృందమందలి సాధకులు వారి వారి పరిశ్రమను బట్టి ఉద్ధారణము చెందుచున్నారు. సత్సాధకులు భాషణమునందు, చేతనల యందు విశిష్టమగు విచక్షణతో వర్తింపవలె నని వృషభము సూచించుచున్నది.

**కిరణధ్యానము :**

భూమికి సంబంధించిన సమస్త దివ్య ప్రణాళిక వృషభరాశి యందే ఇమిడియున్నది. దానిని నిర్వర్తించు సిద్ధులుకూడ ఈ రాశితో సంబంధము కలవారే. మహత్తరమగు రోహిణి నక్షత్రము ఈ రాశి విభాగమందే యున్నది. ఆ విభాగమునందే వృషభాక్ష మున్నది. విష్ణు సహస్ర నామమున దైవము వృషభాక్షుడుగను, వృషప్రియుడుగను స్తుతింపబడెను. రోహిణి కార్తెయని ప్రసిద్ధికెక్కిన పదునాలుగు రోజులు వృషభాక్షము నుండి రోహిణి నక్షత్రము ద్వారా దిగివచ్చు తరంగములు మన సూర్యుని ద్వారా మన భూమికి అందుచుండును. రోహిణి నక్షత్ర ప్రభావముగల సూర్యకిరణములు అమిత శక్తివంతములు. భూమి యందలి సమస్త రుగ్మతలను ఆ సూర్య కిరణములు హరించి వేయగలవు. రోహిణి సూర్యకిరణములు రోళ్ళను, రాళ్ళను కూడ బ్రద్దలు చేయునని తెలిసిన విషయమే. భూమి రుగ్మతలను సరి దిద్దుటకు, భూమి పరిణామము చెందుటకు రోహిణికార్తె సూర్య కిరణములు వేద వాఙ్మయమున వృషభముగ పేర్కొనబడినవి.

మున్ముందు భూమిపై జరుగు ఉత్పత్తికి ఈ కిరణములే బీజములు. పురుషులయందు దీనిని వీర్యశక్తిగ కూడ తెలియవచ్చును.

వృషభకిరణము వినియోగము బట్టి భూమి ఎట్లు సరిదిద్దబడి పరిణామము చెందునో అట్లే వీర్యశక్తి వినియోగమును బట్టి పురుషుల శరీరమందలి స్వస్థత నిర్ణయించబడును. సారవంతమగు భూమినుండి చక్కని పంటను పొందినట్లుగ మానవుడు శుక్రశోణితములను దేహమందలి శక్తిగ మలచుకొని సత్కార్యముల వైపు మలచినపుడు శరీరధాతువులలో ప్రకాశ మేర్పడును. ఆ ప్రకాశము శరీరరూపమున తనకు వినియోగపడును.

వైశాఖమాసమున ప్రాతః సాయం సంధ్యలయందు ప్రసరించు కిరణములను ధ్యానము ద్వారా లేక ప్రార్థన ద్వారా ఆస్వాదించు వారు తమయందీ వృషభశక్తిని పెంపొందించుకొన వచ్చును. వైశాఖము యొక్క ప్రాశస్త్యము భారతీయ సంప్రదాయమున మిక్కుటముగ నున్నను అందలి సూర్యచంద్ర కిరణముల స్వరూప స్వభావములు తెలిసినవారు అరుదు. వైశాఖమందలి సూర్య కిరణములు సాధకులను అమిత తేజోవంతులను చేయగలవు. చంద్ర కిరణములు గ్రంథులను స్రవింప చేయగలవు. సూర్య కిరణములను వృషభముతోను, చంద్ర కిరణములను గోవులతోను జ్యోతిషము పోల్చును.

శ్రీకృష్ణుడు రోహిణి నక్షత్ర సంజాతుడై వృషభములతోను, గోవులతోను కూడియుండుట యందు ఒక మహత్తరమగు సత్యము ఇమిడియున్నది. ఇట్లే వేదవ్యాసుడు, ఆది శంకరులు, మైత్రేయుడు,

గౌతమబుద్ధుడు కూడ వైశాఖమున జన్మించినవారే. వీరివలననే దివ్య ప్రణాళిక భూమిపై నిర్వర్తింపబడు చున్నది.

వైశాఖమందలి కృత్తిక మూడు పాదములు మన సూర్య మండలమునకు మాతృస్థానము వహించిన కృత్తికల స్థానమును సూచించును. కృత్తికలు సప్తర్షి మండలముతో అనుసంధానము చెంది మన సూర్యమండలమునకు, మన భూమండలమునకు ప్రణాళిక, ప్రయోజనము అందించుచు నున్నవి.

కృత్తిక, రోహిణి నక్షత్రములు బీజప్రాయముగ ప్రతి సంవత్సరము సూర్య సంచారము ద్వారా భూమికి ప్రణాళిక నిచ్చు చున్నవి. ప్రయోజనమును కూడ తెలుపుచున్నవి. ఈ రెంటి ప్రతినిధులుగ భూమిపై సనత్కుమారుడు, గౌతమబుద్ధుడు, మైత్రేయాది గురుపరంపరకు వైశాఖమాసమున ప్రణాళిక మరియు ప్రయోజన మును తెలుపుచు నున్నారు. అంతరంగమున పై గురుపరంపరను, నక్షత్రములను ధ్యానించుచు సత్సాధకులు సంవత్సరమునకు వలసిన ప్రణాళిక నందుకొని నిర్వర్తించుచు నున్నారు.

**దారి చూపుట :**

కలియుగమున శంబళ గ్రామమున కెంతయో ప్రాధాన్యత కలదు. శంబళ గ్రామము నుండి సనత్కుమారుడు అమితముగ మానవజాతి ఇచ్ఛాశక్తిని పెంపొందించు చున్నాడు. ఈ ఇచ్ఛయే మానవులను అమితముగ పరుగెత్తించు చున్నది. కుంభయుగమున ఇచ్ఛావేగము మరింత పెరిగినది. మానవుని ఇచ్ఛయంతయు

పదార్థము వైపునకే ప్రవహించు చున్నది. మానవ మేధస్సంతయు పదార్థ సంగ్రహము, దానివలన ఆధిక్యత, ఇతరులపై స్వామిత్వము ఇత్యాది విషయములందు నిమగ్నమై యున్నది. ఆక్రమణము, దురాక్రమణము కూడ పదార్థపరముగ కోకొల్లలుగ గతమునుండి జరుగుచునే యున్నది. ఔన్నత్యమంతయు కూడ పదార్థపరముగనే లెక్కించుట పరిపాటి యైనది. ఇదియంతయు వృషభరాశి ప్రభావమే. వృషభము పృథివీతత్వపు రాశి. కనుక పృథివీపరమైన పదార్థము యందు ఆసక్తి, ఈ రాశి స్వభావమున కలుగు పృథివీపర భావములు కలవారందరును తమ ఆధిక్యతల లెక్కలను పదార్థ సముపార్జనముతో లెక్కింతురు. పది మేడలు కలిగినవాడు గొప్పవాడు. వంద ఎకరములు భూమి ఉన్నచో గొప్ప. అట్లే బంగారము, ధనము. ఇవి ఎంత కలిగిన అంత గొప్పవారుగ లోకులు గుర్తింతురు. ఇదియంతయు ఇచ్ఛాశక్తి యందలి కామదేవుని ప్రభావము. కామమంతయు పదార్థము కొరకే వినియోగింప బడుచున్నది. ఇట్టి ఇచ్ఛాశక్తి వినియోగపడుట వలన జీవులు (మానవులు) పదార్థమున కూరుకొనిపోవు చున్నారు. పదార్థముచే బంధింపబడి ఒకరిపైనొకరు ఆధిక్యతను పొందుటకు శ్రమ చెందు చున్నారు.

ఇట్లు అధోగతిగ సాగుచున్న ఇచ్ఛను మలుపుతిప్పి సేవా రంగమునకు దారి చూపుట ప్రస్తుతము దివ్య ప్రణాళికయందు ఒక ముఖ్య అంశమై యున్నది. స్వంత ఉన్నతికి కృషి చేయుట అను స్థితినుండి పదిమంది కొరకు కృషిచేయుట అను స్థితికి జీవుడుద్ధరింప బడవలెనని ఒక ప్రణాళిక ఏర్పడియున్నది. దీనికై కృషి సలుపుటవలన

ప్రతి మానవుడు తనను తానుద్ధరించుకొనువా డగుచున్నాడు. ఏ వ్యక్తియైనను తన శక్తిని పరహితమునకు సమర్పించినపుడు అతని యందలి స్వభావము క్రమముగ సాధుత్వమును చెందును. ఎంత సాధుత్వము చెందిన అంత జీవనమున ప్రశాంతత, ఆనందము కలుగును.

వైశాఖ మాసమున సాధకుని యందలి సంకల్పములను పరిశీలించుకొని పరహితమునకై దీక్షగొనుట ముఖ్యమగు కర్తవ్యముగ నున్నది.

**బృందావనము :**

వృషభరాశివారు పరహితకార్యముల నొనర్చునపుడు వారు ప్రత్యేకించి పరికించవలసిన అంశములు కొన్ని కలవు. ఈ రాశి తత్త్వమున సొంత గుర్తింపుకై ప్రాకులాడుట సామాన్యముగ నుండును. అన్నిట, అంతట తమకు గుర్తింపు కావలెనని వీరి స్వభావమున యుండును. పండుగలు పబ్బముల యందు గాని, సంఘములు సమావేశములయందు గాని వృషభరాశివారు గుర్తింపుకొరకు, పొగడ్తలకొరకు అంతరంగమున ఆశపడుచుందురు. ఇట్టివారొక బృందమున చేరి పరహిత కార్యముల నొనర్చు చున్నపుడు తమదే పై చేయిగ నుండవలెనని కోరుదురు. బృందజీవనము బృంద చైతన్యము ననుభవించుటకే గాని వ్యక్తిగతమగు గొప్పలకు కాదు. ఇట్టివారు బృందజీవనము నందలి ఆశయము తెలియక అందిమడ లేక సతమతమగుచు నుందురు.

బృందజీవనమున వ్యక్తి బృందములోనికి అదృశ్యము కావలెను. అట్లు అదృశ్యమైనచో తనను గూర్చి తనకు గల ప్రత్యేక భావము నశించును. అట్లు నశించుట సాధకున కవసరము. తనను గూర్చిన ప్రత్యేక భావములు తననొక భ్రాంతియందుంచును. అట్టి భ్రాంతి వైదొలగవలె నన్నచో గుర్తింపునకై తపన చెందక బృందములకు తోడ్పడుట నొక్కటియే మార్గము.

గుర్తింపు ఉన్నను లేకపోయినను తోడ్పడువారు బృందజీవన ప్రయోజనమును పొందగలరు. తోడ్పాటు కారణముగ సాధన సిద్ధి నిచ్చును. తోడ్పడుచు గుర్తింపునకై ప్రాకులాడినచో సాధకునకు తానే అవరోధమై నిలచును. బృందజీవన ప్రయోజనమెరిగి అందు తాను మిళితమై తోడ్పాటు గావించినపుడు బృందజీవనమే బృందావనమై భాసించును. అట్టి బృందావనము నందలి అందము ఆనందము నిచ్చును.

వసుదేవుడు, శ్రీకృష్ణుడు ఇట్టి బృందావనము నేర్పరచి మానవులకు మార్గము చూపినారు. ఇట్లు జీవించుట చేతకాని వారు వ్యక్తిత్వము పేరున వేర్పాటుధోరణిలో ఏకాకులగు చున్నారు. వారి మనసున ఎన్నియో అడ్డుగోడలు ఏర్పరచుకొను చున్నారు. తమ స్వాతంత్ర్యమును తామే కోల్పోయి తమ మనోభావముల యందు బందీలై జీవించు చున్నారు. తమదైన సిద్ధాంతములతో తమకు తామే ఉచ్చు బిగించుకొను చున్నారు. నాగరికత పేరున జీవులు, జీవులకు దూరమగుచు, అడ్డుగోడలు పెంచుచు, ఏకాకులై జీవించువారు జ్ఞానులెట్లు కాగలరు? ఒంటరి జీవితములు మితమగు ఆనందమునే ఇచ్చును. బృందజీవనము పరిమితులను నశింపజేసి అమితానందము

నిచ్చును. వ్యక్తిగత ప్రత్యేకతలను మరచినవారికి వైశాఖము బృందావనము నందించగలదు.

**బంగారుకాంతి :**

మానవ మేధస్సున బంగారమునకు చాల ప్రాధాన్యత కలదు. మతములు, దేశములు, ఆర్థిక సంస్థలు అన్నియును బంగారము సేకరించుచునే యున్నవి. బంగారు లోహమును ప్రోగుచేసుకొను తత్వమునకు వృషభరాశియే అధిపతియని మహర్షి జ్వాలాకూలుడు బోధించుచున్నాడు. మానవజాతి యందు కోరిక అధికమై ధర్మము నుల్లంఘించు స్వభావ మున్నంతకాలము బంగారముపై మోజు యుండునని పెద్దల అవగాహన. ప్రపంచమందు ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తము చేయుటకు కూడ బంగారమునే పనిముట్టుగ వాడుచున్నారు.

ఒక వ్యక్తికి బంగారముపై ఎంత మోజు ఉన్నచో ఆ వ్యక్తి అంత కామశరీరమున నున్నాడని ఋషుల అవగాహన. మానవుని కామమునకు, బంగారముపై మోజునకు అనులోమ నిష్పత్తి యున్నదని తెలియవలెను. "మానవ ప్రజ్ఞ తూర్పుయందున్నపుడు బంగారు కాంతియందు మోజు కలిగి యుండును. మానవ ప్రజ్ఞ పశ్చిమమున యున్నపుడు, అనగా పదార్థమున బంధింపబడి యున్నపుడు బంగారు లోహముపై మోజు కలిగియుండును."

బంగారు కాంతిని కోరుటవలన మానవ ప్రజ్ఞ పదార్థలోకము నుండి తరించును. బంగారు లోహమును కోరినపుడు పదార్థమున

బంధింపబడును. బంగారులోహమునకై ప్రాకులాడుటకన్న బంగారు కాంతికై ప్రాకులాడుట వివేకము. నిజమునకు బంగారులోహమున ఆకర్షించునది బంగారు కాంతియే కదా!

బంగారు లోహమును కోరుట వృషభరాశి తత్వము కాగ, బంగారు కాంతిని కోరుట సింహరాశి తత్వమై యున్నది. బంగారు కాంతియై నిలచుట వలన మానవుడు శాశ్వతు డగుచున్నాడు. కనుక లోహమును కోరుట కన్న కాంతిని కోరుట ఉత్తమ మని, తరణోపాయమని జ్వాల్‌కూల్ మహర్షి సూచన.

భవిష్యత్తున ఏదో ఒక పుణ్యకాలమున బంగారమును గూర్చిన తపన తరుగునని, బంగారుకాంతిని గూర్చిన తపన పెరుగునని, అదియే మానవులు కాంక్షించు నవయుగ మని, నవలోక మని కూడ గురుపరంపర తెలుపుచు నున్నది.

వృషభరాశి పృథివీ తత్వపు రాశి యగుటచే పదార్థ ఆకర్షణము ఆ రాశికి సహజము. పదార్థ వినిమయము వలన జీవుడు కృత కృత్యుడగు చున్నాడు. దానిని ప్రోగు చేసుకొనుటలో అతడు పతనమగు చున్నాడు. అధిష్ఠించి యుండవలసిన మానవుడు అధిష్ఠింపబడి యుండుట దురదృష్టమని ఋషుల భావన.

**చక్కని మలుపు :**

పృథివీతత్వపు రాశులు మూడు. అవి వరుసగ వృషభము, కన్య, మకరము అయియున్నవి. మానవ ప్రజ్ఞ పృథివీతత్వమున బంధింపబడి యున్నది. మనసుద్వారా మానవుడు అనునిత్యము

పదార్థముతో అనుసంధానము చెందుచు అభినివేశమునకు లోనైనాడు. పదార్థమయుడై పదార్థములోనికి చొరబడి పదార్థముచే బంధింపబడి యున్నాడు. అనుభవింప దగిన దానిచే బంధింపబడుట ఎంత విచిత్రము?

మానవుని యందు ఇంద్రియార్థములపై అభిలాష, ఆసక్తి ఉన్నంత కాలము కోరికలు మెండై యుండును. కోరికలున్నంత కాలము పదార్థబంధన ముండును.

కోరికలతో జీవించు మానవులలో ఏ ఒక్కనికో ఉన్నతాశయ ములపై మనసు కలుగును. కోరికల కొరకు పనిచేయుటకన్న ఒక ఆశయము కొరకు పనిచేయుటవలన జీవితమొక చక్కని మలుపు తిరుగును. ఆశయము కొరకు పరిశ్రమించువాడు కోరికలకు తన జీవితమును పణముగ పెట్టడు. కోరికలను తగు మాత్రముగ పరిమితము గావించుకొని ఆశయ సిద్ధికై కృషి చేయును. ఆశయమున ప్రజ్ఞ పరిశ్రమించుచుండగ, కోరికల సమూహము లన్నియు ఆవిరియై, అత్యవసరమగునవి మాత్రమే మిగులును.

ఇట్లు కోరికలనుండి ఆశయములకు మలుపు తిరిగిన జీవితము ఉన్నతాశయసిద్ధికై పరిశ్రమించుచు పవిత్రతను పొందుచు నుండును. పదార్థ వినియోగము కూడ ఆశయ సిద్ధికొరకై మళ్ళింప బడును. ఇట్లు పదార్థ వినియోగము మానవుడు నేర్చును. క్రమముగ పదార్థమును నియమించుట కూడ నేర్చును. ఆశయసిద్ధికై పదార్థ మును సమర్పించుటలో సంసిద్ధతను నేర్చును. ఇట్టి నేర్పు అతని మనసును పవిత్రీకరించి కన్యగ మార్చును. ఇట్లు కోరికలనుండి

ఉద్ధరింపబడి ఆశయసిద్ధికై సర్వము సమర్పించిన వాడు వృషభము నుండి కన్యకు చేరినవాడగును. అట్టి వాని జీవితము ఉన్నత ప్రయోజనములతో కూడియుండును.

అటుపైన కన్యను చేరిన మానవ ప్రజ్ఞ అధికముగ పరిశ్రమించుచు తనకున్నది సమస్తము సర్వులకు పంచుటగా ఎదుగును. పూర్వమిట్టి యాగములు చేసినవారు కలరు. తనకున్నది సమస్తము దివ్యకార్యములకు సమర్పించుట వలన మానవప్రజ్ఞ అమృతత్వమును పొందును. "త్యాగేనైకేన అమృతమానసుః" అనునది సూక్తి. త్యాగము వలన మనసునందుగల మానవప్రజ్ఞ అమృతమగు బుద్ధిని చేరును. ఇట్లు కన్య నుండి మకరమును చేరును. పదవ రాశియగు మకరము సిద్ధి నిచ్చును.

**భోగకాంక్ష :**

వృషభరాశి అధిపతి శుక్రుడుగ జ్యోతిషము గుర్తించుచున్నది. వృషభరాశి పృథివీ తత్వపురాశి అగుటచే వృషభ రాశికిని, భూమికిని, శుక్రునకును నడుమ ఒక త్రిగుణాత్మకమగు బలీయమైన సంబంధ మున్నది. నిజమునకు శుక్రగ్రహము నుండియే భూగ్రహ మేర్పడినది. సూక్ష్మలోకము నుండియే భూలోక మేర్పడినది. సూక్ష్మలోకములకు శుక్రుడధిపతి కాగ, భూలోకమునకు శని అధిపతియై యుండును. వీరిరువురును కామము వలన కలిసియుందురు. వృషభరాశి యందలి సంకల్పశక్తి సామాన్యముగ కామముగనే వర్తించును. కనుక భూమి యందు భోగము చెందుటకు జీవుడు ఉపక్రమించును. ఇట్టి భోగకాంక్ష వలన జీవుడు భూమిపై బంధింపబడును. భోగేచ్ఛవలననే మరల మరల జీవుడు భూమిపై జన్మించు చుండును. వివిధముగ మానవులు

భూమిపై బంధింపబడినారని ఋషుల భావన. మానవుడు తన సంకల్పమును కామముతో నింపుటవలన ఇట్టి దుర్బలత్వము, దుస్థితి అతనికి కలిగినదని, అతడు ఆర్తుడైనపుడు అర్థమునందు సమాధానము దొరకక, ధర్మము నాశ్రయించి మరల స్వస్థానమునకు చేరుమార్గము పట్టునని ఋషుల అవగాహన. అట్లు జరుపుటకు ప్రేరణ మానవుల యందే యున్నది. ఆ ప్రేరణ మానవులకు కలుగుటయే అనుగ్రహమని ఋషులు తెలిపినారు.

కామోత్కంఠత వలన జీవుడు పదార్థములకై ప్రాకులాడు చుండగ అతని దృష్టి బాహ్యమునకు మాత్రమే ప్రసరించుట వలన అంతరంగము, అంతర్‌దృష్టి అతనికి మరుగైనది. బాహ్యదృష్టి మాత్రమే గలవారికి భౌతికరూపము, రూపసంపదకన్న మించిన అవగాహనము మృగ్యమగును. భౌతిక రూపమున కతీతమైనటువంటి అందము, అమితమైనటువంటి ఆనందము అంతర్లోకము లందు ఉన్నదని తెలిసి నపుడు మానవు డంతర్ముఖుడగును. అంతర్ముఖు డైనపుడు శుక్రుడు సృష్టి విజ్ఞాన రహస్యములను తెలుపును. కేవలము బహిర్ముఖుడై యున్నపుడు శుక్రుడు పదార్థమయమగు సుఖమునే కోరును.

పైవిధముగ శుక్రుడు బాహ్యలోకమున పదార్థము, పదార్థ రూపములు రక్షించు రక్షస్సులకు గురువై యున్నాడు. అంతరంగమున సృష్టిరహస్యములను తెలుపుటకు, అమరత్వమునకు, దివ్యమార్గము లకు గురువై యున్నాడు. శుక్రుని పూర్ణ అవగాహనము పురాణము లందున్నది. అతడు సామాన్యముగ కామమును ప్రోత్సహించువాడుగ అందరును తలతురు. ఇది ఒక భాగమే. అదే కామేచ్ఛను అంతర్ముఖము

గావించి, కామేశ్వర దర్శనమునకు మార్గము చూపువాడు కూడ శుక్రుడే అగుటవలన వృషభరాశియందు ఎద్దుమొద్దు స్వభావము గలవారు మాత్రమేగాక మహాత్ములు గూడ జనించుట సంభవించు చున్నది.

**వ్యామోహము :**

తనను తాను ప్రేమించుకొనుట, తనను గూర్చిన దురభిమానము, తనను తానే గౌరవించుకొనుట, స్తుతించుకొనుట అంతయు తనచుట్టూ తిరుగుతున్నట్లు భ్రమపడుట వృషభరాశి అవలక్షణములు. ఇట్టి అవలక్షణములు కలవారు తెలివిగల మూర్ఖులు. తెలివితేటలున్నను తమపై తమకున్న వ్యామోహము వలన అక్కరకు రాని తెలివిగ మిగిలిపోవును. ఆశయము లున్నను ఆత్మస్తుతి యుండుట వలన అవి సిద్ధించవు. వీరు చేయు కార్యములు అనుస్యూతముగ సాగవు. ఒకప్పుడు ఉధృతముగను, మరియొకప్పుడు అత్యల్పముగను హెచ్చుతగ్గులతో సాగును. జీవితమున వీరి నడక కుందేలు నడకవలె యుండును. తమకు తెలిసిన కొద్దిపాటి జ్ఞానమును ఆచరింపలేని బలహీనత గోచరించును. ఇట్టివారికి తెలిసినది ఎక్కువ, ఆచరించునది తక్కువ. వార్ధక్యమున వీరియందలి ద్వంద్వధోరణి ప్రస్ఫుటముగ గోచరించి తమ అసహాయతను గుర్తించి ఒక నిర్వేదమున పడుదురేగాని పరివర్తనకు కృషి సలుపరు. తమయందు తామే అసంతృప్తితో జీవితము గడుపుచుందురు. ఇట్టి వారికి వారి దీనస్థితి నుండి రక్షింపబడుటకు ప్రకృతి ఆకస్మికమగు దుర్ఘటన ద్వారా మార్పు నిచ్చును. మార్పు కలిగినచో వృషభము తన శక్తినంతను పునర్నిర్మాణమునకు సమర్పించి, శీఘ్రగతిని ఉత్తమలోకము చేరగలదు.

**కోరికలు :**

బలమగు కోరికకు వృషభము సంకేతము. సృష్టి ఏర్పడుటకు, వృద్ధి చెందుటకు, లయ మగుటకు కోరికయే ఆధారము. అట్టి కోరికలకు అధిష్ఠానము కామేశ్వరి – కామేశ్వరులు. సృష్టి – స్థితి – లయములు కోరిక ఆధారముగనే సాగుచున్నవి. పుట్టవలెనను కోరిక, వృద్ధి చెందవలెనను కోరిక, తిరోగమనము చెందవలెనను కోరిక, జీవించునపు డేర్పడు కోరికలు అన్నిటికిని ఆధారము వృషభమునెక్కి సంచరించు శివుడే. కనుక వృషభమే కోరిక యని తెలియవలెను.

కోరిక అన్నిలోకములను నడిపించు చున్నది. కనుక ఏ లోకమున ఎట్టికోరిక యుండతగినది, ఎట్టికోరిక ఉండతగనిది? ఇది తెలిసినవాడు సుఖించును. తెలియనివాడు బంధింపబడును. ముక్కుకు త్రాడు వేయని ఎద్దు ప్రమాదకరము. త్రాడువేసి, నియమబద్ధము గావించి, విచక్షణతో వినియోగించిన సర్వకామములు సిద్ధించును. కామము దివ్యమనగ నేమో తెలియును. దివ్యకామమునే దివ్య సంకల్ప మనికూడ అందురు. కామమును జయించినవాడు కామేశ్వరుడు. కామమును జ్ఞానముతో నిర్వర్తించుకొనుచు జీవించువాడు జీవుడు. జ్ఞానము లేని జీవుడు బద్ధుడు.

కామము తీరుతెన్నులు తెలిసినవారు మహాత్ములు. వారు తమ కోరికలను ఒక ఆశయమునకు జతపరచి, ఆశయసిద్ధికై కృషి సలుపుచు మహాత్ములైనారు. భూమిపై అట్టివారికి నాయకుడు సనత్కు మారుడు. అతడే కార్తికేయుడు, షణ్ముఖుడు, శివపుత్రుడు, శరవణ

భవుడు. కామమును అదుపున పెట్టగల శక్తి గలవాడు. కామనిరోధక శక్తి తన ఆయుధముగ కలవాడు. మన భూమికి రాజతడు. అతడుండు గ్రామమగు శంబళతో అనుసంధానము చెందుటవలన మానవుడు సత్సంకల్పుడై, సత్పురుషుడు కాగలడు. భూమిపై సత్సంకల్పము లన్నియు శంబళ నుండియే వ్యక్తమగు చున్నవి. కృత్తికల ప్రభావము పుణికి పుచ్చుకున్న కార్తికేయుడు వృషభరాశి అధిపతి కూడ. అతడి సంకల్పమునే పరమగురువులు నిర్వర్తించు చుందురు. అతడికా సంకల్పము కృత్తికల నుండి దిగివచ్చును. కృత్తికలకు రోహిణి నుండి అందివచ్చును. రోహిణి వృషభముయొక్క కన్ను. దాని నధిష్ఠించువాడు శివుడు.

**నిమ్నభావము :**

వృషభము మొండితనమునకు, పట్టుదలకు, సంకల్పబలము నకు సంకేతము. సంస్కారమును బట్టి వృషభరాశిలో మొండితనముతో కూడిన మూర్ఖుల నుండి ఆత్మజ్ఞానముతో కూడిన మహాత్ముల వరకు గోచరింతురు. తమలోపల కలిగిన భావ మెట్టిదైనను దానిని భూమిపై అవతరింపజేయుటయే వృషభరాశి లక్షణము. భావ మెట్టిదైనను ఆచరించు ఆతురత బలముగ నుండును. ఇహపరములకు కూడ కామ మావశ్యకమే కదా! ధనమును కామించుటకును, దైవమును కామించుటకును వలసిన కామబీజము వృషభ మందున్నది. జీవుని ప్రణాళిక బీజప్రాయముగ వృషభమందు గోచరించును. సాధకునకు తనలోని సంస్కార బీజములే తనను బలవత్తరముగ ప్రవర్తింప జేయు

చుండును. పరుగిడు ఎద్దును నిర్జించుట సులభము కాదు. అట్టి ఎద్దునకు వివేక మను ముక్కుత్రాడు బిగించనిచో అదుపున పెట్టుట కష్టము. భావమును, వాక్కును, ప్రవర్తనమును అదుపున పెట్టినచో, వివేకముతో వృషభ బలమును వినియోగించినచో ఎద్దువంటి సాధకుడు నందీశ్వరుడై విరాజిల్లును. అట్టి నందీశ్వరుని శివ సంకల్పమే నడిపించును. వృషభము యొక్క బలము అసామాన్యమైనది గనుక, వారు ఏఏ మార్గములలో పని చేయుదురో ఆయా మార్గములలో సిద్ధిని పొందగలరు.

వృషభరాశియందు గల మరియొక బలమగు శక్తి వ్యామోహము. మోహము సత్యమును మరుగుపరచును. మోహము వ్యామోహమై నపుడు జీవుని సమస్య జటిలమగును. అట్టి వ్యామోహ స్థితి నుండి బయటపడుటకు శక్తితో కూడిన సుబ్రహ్మణ్యుని ఆరాధన తెలుపబడినది. సుబ్రహ్మణ్యుడే భూమిపై సనత్కుమారుడుగ జీవుల నుద్ధరించుటకు నిలచి యున్నాడు. శంబళ గ్రామమందున్నాడు. అతని ఆరాధనము కామ వ్యామోహముల నుండి జీవుని విముక్తి చేయగలదు. "సనత్కుమారో అవతు కామదేవ" అనుచు నారాయణ కవచము పలుకుచున్నది. కామ వ్యామోహముల బారినుండి తప్పించి జీవుని కర్తవ్యమునకు స్ఫూర్తి, బలము నిచ్చి నడిపించు కృత్తిక మండల ప్రభావము ఈ రాశియందే యున్నది. కార్తికేయుని ఆరాధనమున మనసేంద్రియ శరీరమందుగల మాలిన్యము తొలగించుకొనుచు మానవుడు వృషభరాశి యందలి నిమ్నభావము నుండి ముక్తి నొందగలడు.

**వృషభాక్షము :**

ఆత్మసాధకులకు వృషభరాశి బంగారు అవకాశము. అనగా అతి శ్రేష్ఠమగు అవకాశ మందించును. తమ ముఖమందలి జ్ఞాన నేత్రమగు మూడవ కన్ను వృషభ రాశియందు అత్యుత్తమ స్థానము. వృషభ రాశి యందున్న ఈ కంటిని వృషభాక్ష మందురు. విష్ణు సహస్రనామము లందు "వృషభాక్ష" అను నామ మున్నది. "వృషప్రియ" అను మరియొక నామ మున్నది. వృషభరాశి మాధవునకు అతి ప్రీతికర మాసమని, అందున వృషభాక్షము అనగా శివుని మూడవ కన్ను అత్యంత ప్రీతికరమని తెలుపబడినది. ఆ కన్నే సమస్త లోకము లను అవలోకించుచు, పరిరక్షించుచు నున్నది. ఆ కంటియందు ఆసక్తి గొనుట ఆత్మసాధకులకు అత్యవసరము.

తమ ఫాల భాగమందలి మూడవ కన్నును దర్శించుటకై తపించుటయే తపస్సుగ సాధకులు సిద్ధి పొందిరి. భౌతిక లోకమున ఆసక్తి గల వృషభరాశి తత్త్వము ధనము, బంగారముల యందు ఆసక్తిగొని యుండును. కాని ఆత్మసాధకులకు నిజమగు ధన బంగార ములు మూడవ కన్నును దర్శించుటయే.

ద్వాదశ రాశి చక్రమున వృషభరాశి మొదటి భూతత్త్వపు రాశి. రెండవరాశి కన్య. ఆత్మ తత్త్వమునకై పరితపించువారు తమ దేహ ధాతువులను పరిశుద్ధము గావించు కొనుటకు అత్యుత్తమ శ్రద్ధను కలిగి యుండవలెను. అన్నము, పానము, పాన్పు, పనులయందు పరిశుద్ధత ప్రధానమగు భావనగ యుండవలెను. దేహమున పరిశుభ్రత ఏర్పడుకొలది ఆరాధనము పెరుగుచు తపస్సుగ పరిణతి

చెందును. పరిశుద్ధి లేనివారు పదార్థ విషయముల ఆసక్తి యందు, తత్పరమైన పదార్థ బంధమందు చిక్కుకొని ఆరాధనలు చేయలేక నిస్పృహ చెందుచుందురు. వృషభరాశి యందలి వృషభాక్షమను మూడవ కన్నును దర్శించుటకు మనసేంద్రియ శరీరములను అను నిత్యము పరిశుద్ధము గావించుకొనుచు ఆరాధన సాగింపవలెను. అట్టి ఆరాధనే తపస్సుగ మారును.

కన్యారాశి తిరుగు ప్రయాణమున వృషభమును చేరుటకు పవిత్రత ప్రధానము. లేనిచో తులారాశిని చేరి ప్రాపంచిక విషయము లందు ఆసక్తిగొని ప్రపంచమున బంధింపబడును.

**దివ్య ప్రజ్ఞలు :**

వృషభరాశియందు జన్మించిన వారిలో శ్రీ శంకరాచార్యులు, గౌతమబుద్ధుడు విశిష్ట వ్యక్తులుగ ఆస్తికులు గుర్తింతురు. ఇరువురును దాదాపు అవతారమూర్తులే. ఇరువురును సన్యసించినవారే. వారు సన్యసించిరే గాని, సన్యాసాశ్రమమును ప్రోత్సహించలేదు.

కామ్యకర్మలను సన్యసించుట, కర్మఫలములను సన్యసించుట, సంకల్పములను సన్యసించుట జ్ఞానమార్గమున తెలుపబడిన సోపాన ములు. కర్మలను సన్యసించుట అజ్ఞానము. కర్మలు వేరు, కామ్యకర్మలు వేరు. కర్మ లనగా కర్తవ్యములు. వానిని నిర్వర్తించుచునే యుండ వలెను. కర్మలు కామ్య కర్మలైనపుడు అవి బంధించును. కామ్యకర్మలు కానపుడు కర్మలు వికాసము కలిగించును. క్రమముగ యజ్ఞార్థ కర్మలుగ పరిణతి చెందును. వృషభమునకు చక్కని శిక్షణ అవసరము.

శిక్షణమున్నచోట వృషభము లోక శ్రేయస్సుకై అమితముగ ఉపయోగ పడును. శిక్షణ లేనిచో కామబద్ధమై మెలగును. హద్దులేని ఎద్దు వినాశకర మగును. ఎద్దునెక్కిన శివుడు ఎద్దును పవిత్రీకరించి నందీశ్వరునిగ తీర్చిదిద్ది లోకోపకారము కావించినాడు.

వృషభరాశి వారికి సహజముగ కామము మెండై యుండును. వారు అమిత వీర్యవంతులు. వారి వీర్యము వృథా కాకుండగ లోకోప కారమునకై మళ్ళించుట ఒక చక్కని ఉపాయము. కామేశ్వరుడగు శివుడు, కామమును జయించిన సుబ్రహ్మణ్యుడు ఈ రాశివారికి ఎంతయు మేలు చేయగలిగిన దివ్య ప్రజ్ఞలు. కైలాస పర్వతమందలి శివుని గాని, శంబళ గ్రామమందలి కుమారుని గాని నిత్యమారాధింప బడినచో కామము క్రమముగ దివ్యకామముగ మారును. అట్టి వారి వలన దివ్య సంకల్పములు భూమిపై అవతరించుటకు అవకాశ మేర్పడును.

కామము ప్రధాన సూత్రముగ సృష్టి నడచుచున్నది. అట్టి కామమునకు గమ్యము దివ్యమైనచో జీవుడు దివిని చేరగలడు. కానిచో ఇతర విషయ మందలి ఆసక్తితో మోహితుడై చిక్కుపడును. మోహము నకు కామమెంత ఆయుధమై యున్నదో మోక్షమునకు కూడ కామము అంతయే ఉపయుక్తము. వృషభరాశి సంవత్సరారంభమగు వసంత ఋతువులో సూర్యకిరణముల ద్వారా కామబీజములను ప్రసరింప జేయును. ఆశయమును బట్టి ఈ కామము గమ్యమును చేర్చగలదు.

## రూపమోహము :

వృషభరాశి రూపమునకు ప్రాముఖ్యమిచ్చు రాశి. రూపములు స్థూలము, సూక్ష్మము, సూక్ష్మతరము, సూక్ష్మతమముగ నాలుగు స్థితులలో యుండును. వాక్కు కూడ వైఖరి, మధ్యమ, పర, పశ్యంతి అను నాలుగు స్థితులలో నుండును. ఇందు స్థూల రూపము వైఖరి వాక్కు, దృశ్యమాన జగత్తునకు సంబంధించినది. దృశ్యమాన జగత్తు అదృశ్యము, దివ్యము, అమృతము అగు జగత్తు నుండి ఏర్పడినది. స్థూల లోకమున, నామరూప జగత్తున జరుగు సంఘటనల కన్నిటికిని కారణము లన్నియు సూక్ష్మలోకముల నుండును. సూక్ష్మలోక అవగాహన లేనివారు స్థూలమున సమస్యలకు పరిష్కారమును దర్శించ లేరు.

స్థూల మెప్పటి కప్పుడు మారుచుండును. అది పుట్టినట్లు, ఉన్నట్లు, పెరుగుచున్నట్లు, వృద్ధి చెందినట్లు, నశించినట్లు, అంతమైనట్లుగా ఆరు స్థితులలో మార్పులు చెందుచుండును. వాని కారణము లన్నియు సూక్ష్మమున నుండును. ఉదాహరణకు రూపము పుట్టుట, గోచరించుట, పెరుగుట, పూర్ణముగ వృద్ధిచెందుట, తరుగుట, నశించుట చూచుచునే యున్నాము. అయినను రూపముతో మోహము చేత ముడిపడి రూపమే మనముగ భావించుచు నుందుము. ఇది అజ్ఞానమే కదా! ఈ రాశి అధిపతియగు శుక్రుడు స్థూలము నుండి సూక్ష్మమునకు చేరు మార్గమును బోధించు వానిగ నున్నాడు. మన భూగ్రహ మేర్పడుటకు శుక్రుడే మూలము. అందులకే జ్యోతిషమున శుక్రుని సంకేతము ♀ కాగా భూమి సంకేతము దానికి తలక్రిందులై

యుండును. ♁ వృషభరాశి యందలి శుక్రుడు భూమిపై జీవులు తలక్రిందులుగ నున్నారని సంకేతించును. స్థూలము నుండి సూక్ష్మము చేరవలెనని సంకేతమిచ్చును. వృశ్చికము నుండి వృషభము చేరవలెనని సంకేత మిచ్చును. స్థూల లోకమందలి రూపములు దివ్యములు. అమృత మయములు. "త్రిపాదస్య అమృతం దివి" అనుచు పురుష సూక్తము సూచించు చున్నది. స్థూలమునకే ప్రాధాన్య మీయక, వానికి మూలములగు మూడు సూక్ష్మ లోకములలోనికి జీవుడు వ్యాప్తి చెందిననే జ్ఞానవంతుడగును. కేవలము నామ రూప జ్ఞానము సంపూర్ణ జ్ఞానము కాదు.

**నాలుగు స్థితులు :**

నామ రూపాత్మక జగత్తుయందు తలక్రిందులుగ వసించు జీవులకు పరిష్కారము వృషభరాశి శుక్రుడే. స్థూల రూపము గోచరించునపుడెల్ల అందు యిమిడియున్న మూడు పొరల సూక్ష్మ మును గూడ చూచుట సాధనగ సాగవలెను. అపుడే చతుర్భుజుడగు విష్ణువన నేమో తెలియును. పర-పశ్యంతి-మధ్యమ-వైఖరి అను నాలుగు స్థితులలో సనక సనందన సనత్కుమార సనత్సుజాతు లను నాలుగు వ్యూహములలో కృత-త్రేత-ద్వాపర-కలి అను నాలుగు యుగములలో, నాలుగు వేదములలో దైవము వ్యాప్తిచెంది యుండగ కేవలము స్థూలమును బట్టుకొని ప్రాకులాడుట అజ్ఞానము. 'నేను' అను ఆత్మప్రజ్ఞ కూడ అహంకారము, బుద్ధి, మనస్సు అను పొరలలో వ్యాప్తిచెంది యున్నది. నేను అనగా తన రూపమని భావించుట మితభావము. 'నేను' అనగా ఆత్మ - బుద్ధి - మనస్సు అని కూడ తెలియుట జ్ఞానము. అంతయు నాలుగు స్థితులలో నున్నదని తెలిసిన

వారు స్థూలమునకే పరిమితముగాక, సూక్ష్మము లోనికి వ్యాప్తి చెందుటకు ప్రయత్నింతురు.

శుక్రుడు తపస్సుచేసి అమృత తుల్యమగు సూక్ష్మలోకముల అవగాహన శివానుగ్రహముగ పొందినాడు. అతనందించిన మార్గము అమృతత్వ విద్య. అనగా స్థూలము నుండి సూక్ష్మములోనికి తెలిసి ప్రవేశించుట. అట్లు ప్రవేశించుటకు అంతఃకరణ శరీర నిర్మాణ మావశ్యకమై యున్నది. శుక్రుని అనుగ్రహము వలననే ఈ విద్య నేర్చుట సాధ్యము. శుక్రవారము సూక్ష్మలోక ప్రవేశ విద్యకు విశిష్టముగ అనువైనది. దీనిని సద్గురువుల అనుగ్రహమున పొందువారు ధన్యులు. అంతఃకరణ శరీర నిర్మాణము జరిగినచో జీవుడు స్థూలము నుండి సూక్ష్మములోనికి పెరుగును. ఇట్లు అనుస్యూతము పెరుగుట సాధన. సద్గురువు ఆలంబనము.

వృషభరాశికి ప్రతిముఖముగ నున్న వృశ్చికరాశి యందు అనూరాధ నక్షత్రమున్నది. ఆ నక్షత్ర ప్రభావమున సాధకుడు సద్గురువు నాలంబనము గావించుకొని, ఈగ వలె అనునిత్యము సాగుచు స్థూలము నుండి సూక్ష్మమును చేరును. ఇట్టి సాధనకు క్రమశిక్షణ శనిదేవత యిచ్చును. దీక్ష అంగారకుడు యిచ్చును. అనుభూతి శుక్రుడిచ్చును.

## అంతఃకరణ శరీరము :

వృషభరాశి వైఖరీవాక్కు ప్రభావము కలదియగుటచే దివ్య సంకల్పము ప్రతి సంవత్సరము వైశాఖ మాసమున వైఖరీవాక్కుగ వ్యక్తమగును. జగద్గురువు నుండి భూమిపైగల సమస్త గురుపరంపరకు ఈ వాక్కు అందింపబడును. ఈ వాక్కు ననుసరించుటయే గురు

పరంపర యొక్క కర్తవ్యమై యున్నది. వైశాఖ పౌర్ణమి ఈ యజ్ఞార్థ కార్యమునకు కేంద్రమై యుండుట వలన వైశాఖ పౌర్ణమి ప్రత్యేకతను సంతరించుకొనినది.

జగద్గురువగు మైత్రేయుడు నిశీధి నీలము నుండి అందింప బడు దివ్యవాక్కును గ్రహించి, అనుయాయుల కందించును. నిశీధి నీలము శుక్రుని వర్ణము. అందు వ్యాప్తి చెందియుండు ప్రజ్ఞ సనత్కుమార ప్రజ్ఞ. అతని నుండి మైత్రేయ మహర్షి తన జ్ఞాననేత్రము ద్వారా దివ్య సంకల్పమును వాక్కుగ గ్రహించి అనుయాయుల కందించును.

వృషభరాశి కాంతిని ఆకాశనీలము కాంతిగ తెలుపుదురు. అది నలుపునీలము కాదు. పగటి యందలి నిర్మలాకాశ నీలము. ఆ కాంతిని భ్రూమధ్యము, ఆజ్ఞా కేంద్రముల నడుమ ఆరాధన చేయ వలెను. అనునిత్యము ఈ కేంద్రముల నడుమ నీలపు కాంతిని ఆరాధించుట వలన సాధకునకు స్వభావమందలి కల్మషములు నశించి, అంతఃకరణ శరీరము నిర్మాణము గావింపబడును. ఆ శరీరమే స్థూల సూక్ష్మముల నడుమ వంతెనగ ఏర్పడి సాధకుడు భూమిపై దివ్య కార్యములను నిర్వర్తించుచు, దివ్యజీవనమును గడుపుటకు వీలుపడును.

పై తెలిపిన ఈ వంతెన భ్రూమధ్యము నుండి ఆజ్ఞ వరకు ఏర్పడును. ఆరంభమున వంతెనకాంతి స్వర్ణమయముగ గోచరించి, అంతమున నీలమై గోచరించును. శ్రీకృష్ణుని వేణుగానమున గోపిక లందరును బృందావనమున అనునిత్యము ఇట్టి వంతెన నిర్మాణమే

గావించుకొనుచు ఆనందభరితు లగుచుండిరి. ఈ వంతెన నిర్మాణము నకు వైశాఖ మాసము ఎంతయో ఉపయుక్తమై యున్నది. మేషము నుండి సూర్యుని సంచారము వైశాఖలో ప్రవేశించి సంచరించు చుండగ, పాలభాగ మంతయు కాంతి ప్రసారము హెచ్చుగ నుండును గనుక వైశాఖమందలి ధ్యాన ప్రక్రియలు ఫలప్రదములని తెలియ వలెను.

**రూప వికాసము :**

సృష్టియందు రూపములు పరిణామ క్రమమున పుష్టిగను, పూర్ణముగను, అందముగను తయారగు చుండును. రూపమందలి అందము, పుష్టి దివ్యమని తెలియవలెను. అనగా అవి రూప లక్షణములు కావు. రూపమందు ఆరోపింపబడిన దివ్యత్వము. పూర్ణముగ వికసించిన పుష్పము, పుష్టిగ గోచరించు ఫలవృక్షము, బలిష్ఠమగు జంతువు, అందమగు మానవుడుగ సృష్టి పరిణతి చెందుచు నుండును. రూపములు అందమును బంధించలేవు. కాని అందము రూపము నుండి ప్రకాశించ గలదు. రూపము అందమునకు వాహికయేకాని రూప లక్షణము కాదు. అందము వికసించుట, ఆకర్షణ కలిగించుట రూపములందు కొంతకాలమే యుండును. ప్రకృతి సిద్ధముగ ప్రవర్తన మున్నపుడు, పంచభూతముల సమ్మేళనము సమమై యున్నపుడు, గుణములు సమన్వయింపబడినపుడు రూపము వికాసము చెందుచు నుండును. రూపములందు అట్లు వికసించునది చైతన్యమే. చైతన్య వికాసము పెరుగుట, తరుగుట అందలి జీవి వర్తనమును బట్టి యుండును. వర్తనము సహజత్వము కోల్పోయి

నపుడు రూపమందలి అందము అదృశ్యమగు చుండును. కళ తగ్గును. కాంతి హీనమగును. వికృతముగ కూడ మారవచ్చును. రూపమందలి అందము వృషభరాశిచే పరిపాలింపబడు చున్నది. అనుపమానమగు శ్రీకృష్ణుని అందము వృషభలగ్నము నుండి సంక్రమించునది. శ్రీకృష్ణునకు చంద్రుడు, ఆరూఢ లగ్నము వృషభమున నుండుటచే అతడమిత ఆకర్షణవంతుడై యుండెడివాడు.

రూపమందలి అందము నారాధించుట వలన ఆరాధకుని యొక్క చైతన్య తరంగములు క్రమబద్ధమై స్వభావమందలి వికృతిని కోల్పోవును. కనుకనే ఆరాధింపబడు వస్తువు అత్యంత అందముగను, ఆకర్షణీయముగను నుండవలెను. ఈ విషయమున ఋషులు ప్రత్యేక శ్రద్ధను చూపిరి. దైవమును ఏ రూపమున ఆరాధించినను ఆ రూపమును అందముగ చిత్రీకరించుకొనవలెను. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీమహావిష్ణువు, శివపార్వతులు, గణపతి, కుమారుడు, దత్తాత్రేయుడు, హనుమంతుడు ఇత్యాది రూపములను ఏర్పరచు కొనినపుడు వాని కనులయందు కాంతి, ముఖమునందు చిరునవ్వు, దేహము నందు పుష్టి గోచరింపవలెను. అట్టి మూర్తుల నారాధించి నపుడు ఆ లక్షణములు ఆరాధకున కబ్బును. విషాదమగు మూర్తులను, బక్కచిక్కిన మూర్తులను, ఉగ్రమూర్తులను, క్రౌర్యమూర్తులను, కళా విహీనమగు మూర్తులను ఆరాధింపరాదు.

చైతన్యము పరిపూర్ణముగ వికాసము చెందుటకు ఆరాధన మందు పై సూత్రములను పాటింపవలెనను సందేశము వృషభరాశి యిచ్చును. పుష్టిగను, బలముగను గోచరించు 'తెల్లని ఎద్దు' ఈ

రాశి చిహ్నము. ఆ ఎద్దు కన్నులు నల్లని గవ్వలవలె కాంతివంతమై చూపరుల నాకర్షించును. అట్టి ఆకర్షణమునకు లోనైన వారియందు చైతన్య వికాసము సక్రమమై సాగును.

## వృషభ తత్త్వము :

కృత్తిక నక్షత్ర మండలము వృషభరాశి యందుండుట వలన కృత్తికారాధనము ఈ రాశి ప్రభావమున సత్ఫలితముల నిచ్చును. కృత్తిక యందలి ఆరు తారలు, మనయందలి ఆరు ప్రజ్ఞా కేంద్రములు పరస్పర సంబంధితములు. ఈ ఆరు తారలును ఆరుగురు ఋషి పత్నులుగ పురాణములు తెలుపును. మరియొక తార సప్త ఋషి మండలమున వశిష్ఠునితో కూడి యుండును. ఈ ఏడు తారలును సప్త ఋషుల భార్యలుగ పురాణములు వర్ణించును. ఈ ఏడింటిని మనలోని ఏడు కేంద్రములుగ భావించి ధ్యానించుట ఒక సంప్రదాయము. సహస్రారమున 'అనసూయ' అను తారను, ఆజ్ఞయందు 'ఖ్యాతి' అను తారను, విశుద్ధియందు 'శ్రద్ధ' అను తారను, హృదయమందు 'అరుంధతి' అను తారను, మణిపూరకమందు 'హవిర్భు' అను తారను, స్వాధిష్ఠానమందు 'గతి' అను తారను, మూలాధార మందు 'క్రియ' అను తారను సంధించి ధ్యానింపవలెను.

ఈ ఆరు కేంద్రములందలి ఆరు ప్రజ్ఞలు కృత్తికలు కాగా, ఈ కేంద్రము లన్నింటిని అనుసంధానము చేయు ప్రజ్ఞను కార్తికేయు డనిరి. షట్ తారలతోపాటు షణ్ముఖుడగు కార్తికేయుని 'శరవణభవ' మంత్రముతో అనుసంధానము చేయవలెను. శరవణభవుడగు కార్తికేయుడు భూమియందు శంబళ గ్రామమున సనత్కుమారుడై విరాజిల్లు చున్నాడు. అతడు శ్రీకృష్ణుని ప్రతిరూపము. షట్చక్రముల

యందు వ్యాప్తిచెందిన మాతృమూర్తులను కార్తికేయుని సప్త ఋషులతో కూడి స్మరించి ధ్యానము చేయుటవలన వృషభరాశి తత్త్వము సాధకునిలో అత్యుత్తమ మగు మార్పును కలిగించి దివ్యప్రణాళికతో అనుసంధానము చేయును.

కృత్తికలు పసిబిడ్డడగు కుమారునకు పాలిచ్చి పోషించిరి. షట్ చక్రమందలి గ్రంథులు ఆరాధనమున స్రవించి, ఆరాధకుని పోషించి అతనియందలి సుషుమ్న మార్గమును అంతఃకరణ శరీరముగ నిర్మాణము చేయును. అట్టి నిర్మాణము జరిగినచో ఆరాధకుడు తనను తానెరిగి దివ్యుడై ప్రకాశించును.

మానవుని యందలి సప్తకేంద్రములు సహస్రారము నుండి మూలాధారము వరకు వ్యాప్తిచెంది యుండగ, సూక్ష్మముగ ఆ కేంద్రము లన్నియు వృషభరాశి భాగమని కంఠము నుండి ఫాల మందలి ఆజ్ఞ వరకు బీజప్రాయముగ ఏర్పడి యున్నవి. సద్గురు సాన్నిధ్యమున ఓంకారము నేర్చువానికి ఈ కేంద్రములను మేల్కొల్పు కొనుట సాధ్యపడును.

**వైశాఖలోయ :**

కుంభ యుగమున వరుణగ్రహ ప్రభావముచే వృషభ రాశి యందు ఒక ఉత్తమోత్తమ మగు అవకాశము మానవజాతికి లభించు చున్నది. వృషభరాశి కేంద్రమైన శంబళ మానవుని యందలి ఆజ్ఞా నేత్రముగ పనిచేయుచున్నది. శంబళ యందలి సనత్కుమారుడు షట్ కేంద్రములను సమన్వయించి మానవుని జ్ఞాన నేత్రమగు మూడవ కన్ను నుండి ప్రకాశించుటకు వరుణుడు తోడ్పడుచున్నాడు. ఇదియొక మహత్తరమగు అవకాశము.

వరుణగ్రహము, ఆజ్ఞాకేంద్రము, శంబళ గ్రామము ఒక త్రిభుజముగ నేర్పరచుకొని ధ్యానము చేయు సాధకునియందు అంతఃకరణ శరీరము త్వరితగతిని నిర్మాణము కాబడి ఆజ్ఞ యందు ప్రచోదనము కలుగును. అట్టి సాధకుడు సూటిగ దివ్య ప్రణాళికకు వాహికయై జాతి ఉద్ధరణమునకు పరమ గురువులు చేయుచున్న యజ్ఞమున ప్రవేశించి సహకరించును. ఇది ఒక మహత్తరమగు అవకాశము. శ్రద్ధాళువులగు సాధకులు కాలము నీ విధముగ సద్విని యోగము చేసుకొనవచ్చును. అందులకే వైశాఖ పూర్ణిమా ధ్యానములు కూడ నిర్దేశింపబడినవి. కనుబొమల మధ్య స్థానమే వైశాఖలోయ. అందు ప్రవేశించి ఉన్నత స్థానమునగల నీలాకాశమును దర్శనము చేయుట ధ్యానము. అట్టి ఆకాశమున సనత్కుమారుని స్మరించుట సౌకర్యము. ఈ ప్రయత్నము సఫలీకృతమైనచో వేగము కలిగించు వరుణుడు అతి తక్కువ కాలములో సిద్ధి నీయగలడు.

ప్రపంచమున వరుణుని ప్రభావమున వృషభ రాశియందు పై తెలిపిన ఉన్నతి ఒక మహత్తర అవకాశము కాగ, పతనమునకు కూడ ద్వారములు తెరచును. కామమునకు ప్రతీకయైన వృషభము వరుణుని ప్రభావముచే కామోత్కంఠత శత విధములుగ విజృంభించి, మానవ జాతిని కామ పరితృప్తియందు, మితిమీరిన స్వార్థము నందు కూడ ముంచగలదు. స్వకీయమగు శ్రేయస్సు ప్రధానమై మానవజాతి త్వరితగతిన కామమునకులోనై ఒకరినొకరు పీడించుకొనుట, హింసించుకొనుట, తరచు యుద్ధములు చేయుటవంటి ప్రమాదము లకు గురి కాగలరు.

పర్వత శిఖరాగ్రమునకు చేరు అవకాశము పాతాళమునకు కూడ చేర్చగల అపాయముతో కూడి యున్నది. కామము వలన పొంచియున్న ఈ అపాయము నుండి తరించుటకు సనత్కుమారుని ప్రార్థనము ఉపాయమై యున్నది. "సనత్కుమారో అవతు కామదేవాః" అను నారాయణ కవచము ధరించుట వ్యాసుడిచ్చిన ఉపాయము.

**జీవన ప్రయోజనములు :**

వృషభరాశి అంతఃప్రేరణకు మూలమై యున్నది. అంత రంగము నుండి మానవులందరికిని వారివారి స్వభావములనుబట్టి వివిధమగు ప్రేరణలు ఉత్పన్న మగుచుండును. సాధారణమగు, సామాన్యమగు కోరికలనుండి సుర అసుర భావముల వరకు అంతః ప్రేరితములే. స్వభావము పాశవికముగ నున్నపుడు అసుర భావము లుత్పన్నమగును. ఉత్తమ సంస్కారముతో కూడియున్నపుడు దివ్య భావము లేర్పడును. సామాన్యులకు కోరికలే ప్రేరితమై యుండును. అంతఃప్రేరణ బీజమై, జీవితము మొలకెత్తి ఫలవృక్షమో, విషవృక్షమో అగును. ముండ్లపొదలో, మల్లెపొదలో అగును. నిరుపయోగములై కూడ యుండును.

ఆత్మ పరిశీలనము గలవారు అనునిత్యము తమయందు ఏర్పడుచున్న ప్రేరణను నిశితముగ పరిశీలించుకొనుట ముఖ్యము. తన యొక్క ప్రవర్తనమందలి తీరుతెన్నులను గమనించవలెను. జీవితమున తాము పడు శ్రమవలన కలుగు పరిణామములు జీవోన్నతికి తోడ్పడునవా లేదా చూసుకొనవలెను. నిత్యజీవన శ్రమ

ఒక వ్యవసాయము వంటిది. ఫలసాయమివ్వని వ్యవసాయము వృథా శ్రమయే కదా!

వృషభము అతివేగముగ అత్యంత బలముతో పురోగమించును. అంతఃప్రేరణ కూడ అట్లే కార్యరూపము దాల్చుటకై బుసలుకొట్టుచు ఉరకలు వేయును. దీనికి కళ్లెము వేసి ఫలసాయమిచ్చు వ్యవసాయము లోనికి మళ్లించుట సాధకుని కర్తవ్యము. ఈ ప్రయత్నము అనునిత్యము సాగుచు నుండవలెను. అందులకు కృత్తికా స్వరూపమైన కార్తికేయుని సనత్కుమారునిగ, శంబళ గ్రామస్తునిగ ఆజ్ఞా కేంద్రమున ధ్యానించ వలెను. దీనివలన జీవితము జీవన ప్రయోజనము వైపునకు మళ్లును. కృత్తికల అనుగ్రహము లభించినచో తప్పక మార్గము సుగమ మగును. కార్తికేయుడు సంకల్పమునకు వేడిమి కల్పించి, విఘ్నము లను ధ్వంసము చేసి వెలుగు దారులందు సాధకుని నడిపించగల దివ్యసేనాని.

వృషభరాశి వారికి గల ఏకైక అవరోధము వారి స్వభావమే. జీవుని కన్న అతడి స్వభావము అమితమగు బలము కలిగియుండును. జీవుని దివ్య ప్రయోజనమును ధనము, కీర్తి, ఇతరులపై ఆధిక్యత వైపునకు వారి స్వభావము వారిని మళ్లింప గలదు. ఎప్పటికప్పుడు ఎద్దును అదిలించుచు, పగ్గములు సడలింప నీయక నడిపించ వలెను. ఎద్దుపై సవారి శివునికే చెల్లును. అట్టి ఎద్దుని శివకుమారు డగు కార్తికేయుని సహాయమున సన్మిత్రునిగ తీర్చిదిద్దుకొన వచ్చును. లేనిచో జీవ స్వభావము జీవుని బంధించి గంగిరెద్దై నాట్యమాడును.

**జీవోద్ధరణ :**

వృషభరాశి యందలి వృషభము భౌతిక దేహమును కూడ సూచించును. భౌతికమగు శరీరబలము వృషభరాశి సంబంధితమే. భౌతిక దేహము పుష్టిగ, తుష్టిగ, బలముగ, ఆరోగ్యముగ ఉంచు కొనుటవలన జీవితమున ఆయుష్షు, ఆరోగ్యము మెండుగ నుండి, సాధింపవలసిన వన్నియు సాధించుటకు వీలుపడును. మనసేంద్రి యములను యమ నియమములతో కట్టుబాటు చేయుటవలన పై తెలిపిన పుష్టికరమగు దేహ మేర్పడును. దానిని బుద్ధికి సమర్పించినచో జీవుడు సమగ్రమగు పరిణామము పొందును. సమగ్ర వికాసము కలుగును. వృషభాక్షము అనగా ఆజ్ఞా కేంద్రము. యమ నియమము లను పాటించువారు ఆజ్ఞాకేంద్రము నుండి ఆదేశము లందుకొనుచు పురోగతి చెందగలరు. అట్టి వారికి సనత్కుమారుడు, సప్తర్షి మండ లము, కృత్తికా మండలములనుండి సున్నితముగ సహాయ సహకార ములు లభించును. వారియందు సదాశయము లేర్పడి చిల్లర కోరికలన్నియు క్రమముగ నశించును. సహజముగ సంకల్పబలము కలవారగుటచే వారి బలము సదాశయములకు రెక్కలు తొడిగినట్లుగ వేగిరముగ నిర్వర్తింపబడుచుండును. అప్రదక్ష మార్గమున వృషభరాశి 11వ రాశి యగుటచే వీరికి సంఘము నుండి సులభముగ మిత్ర సంఘములు ఏర్పడగలవు. విచక్షణతో మెలగుట వలన బృందా వనములు, బృంద జీవనములు కూడ నిర్వర్తింప వచ్చును.

వృషభరాశి అధిపతియైన శుక్రుడు భౌతిక లోకములకు, సూక్ష్మలోకములకు సంధానకర్తయై యున్నాడు. నిజమునకు శుక్ర గ్రహము నుండియే భూమి యేర్పడినది. కనుకనే ఈ రెండు

చిహ్నములు సంబంధిత చిహ్నములుగ గోచరించును. శుక్ర గ్రహ చిహ్నము ♀ . భూమి చిహ్నము ♁. ఈ రెంటిని అనుసంధానము చేసినచో చిహ్నమిట్లుండును ♀♁. ఈ చిహ్నమున క్రింది వృత్తము భూమి. పై వృత్తము శుక్ర గ్రహము. భూమి నుండి (అనగా స్థూల లోకముల నుండి) శుక్రునకు (అనగా సూక్ష్మలోకముల లోనికి) మార్గమేర్పరచి జీవులను సూక్ష్మలోకముల లోనికి ఉద్ధరించుటయే ప్రస్తుతము నిర్వర్తింపబడుచున్న దివ్య ప్రణాళిక. అందుకొరకే శుక్ర గ్రహమునుండి సనత్కుమారుడు భూమికేతెంచి శంబళ గ్రామవాసియై, పరమ గురువుల సహకారముతో జీవోద్ధరణ కార్యక్రమము నిర్వర్తించు చున్నాడు. కుమారుని ఆరాధనము ద్వారా అరిషడ్వర్గములను నిర్జించి వెలుగు లోకముల లోనికి ప్రవేశింప వచ్చును. స్థూలము నుండి సూక్ష్మములోనికి జీవులుద్ధరింపబడునపుడు, వారు అమరత్వమును గూడ పొందుదురు. ఈ ప్రణాళికను నిర్వర్తించుటకే వైశాఖ లోయలో సనత్కుమారుని ఆధ్వర్యమున వైశాఖ పౌర్ణమినాడు భూమిపై గల సత్పురుషు లందరు సమావేశమై స్ఫూర్తి చెందుదురు.

**రూపబంధము :**

"మను పుత్రుడు, మను పుత్రిక ఒకరినొకరు ఆలింగనము గావించుకొనిరి. అందమగు వారి రూపములు ఒకరికొకరికి ఆకర్షణగ నిలచినవి. అది కారణముగ ఆలింగనము, చుంబనము ప్రారంభమై కామము జనించినది. మనస్సుల రూప కామ మధికము కాగా రూపములు కన్పించుట అధికమై, అందుపస్థితమైన జీవతత్త్వము మరుగైనది. రూపమునకు నామము తోడుకాగా మనస్సు గట్టిపడి

నామ రూపములను మాత్రమే చూచుట మరగినది. అందలి జీవ చైతన్యమును చూచుట మరచినది.”

పై తెలిపిన వాక్యములు వృషభరాశి సంకేతములు. నామ రూపాత్మకమగు జగత్తును చూచుచు అందిమిడిపోవుట వృషభరాశి తత్త్వములలో ఒకటి. జీవుల నామరూపాత్మక జగత్తులోనికి ప్రవేశించుటకు వృషభతత్త్వము వినియోగింపబడినది. అందుండి విముక్తి చెందుటకు కూడ వృషభాక్షమును అనగా మూడవ కన్నును పొందుట పరిష్కారముగ తెలుపబడినది.

రూపమునందు ప్రవేశించిన జీవుడు రూపాత్మకమగు జగత్తున అనేకానేకమగు వస్తు సముదాయమును కోరుచుండును. రూప సంపద కోరుచుండును. అందమగు రూపముగల వస్తువులను అందవలెనని, అనుభవించవలెనని భావించుట కద్దు. కాని రూప సంపద వెంటపడిన జీవుడు అనేకానేక ప్రాంతములలో జన్మించుచు, చరించుచు, చచ్చుచు, పుట్టుచు నుండును. పల్లపు భూములు, మెట్ట భూములయందు తిరుగాడు చుండును. కొండలలో, కోనలలో, లోయలలో రూప సంపదను పొందుటకై జన్మములను వృథా గావించుకొను చుండును.

రూపము నందున్న తానెట్లున్నాడో తెలియు ప్రయత్నము చేయుట రూప బంధము నుండి బయలు పడుటకు మొదటి మెట్టు. రూపము కన్న గుణమునకు ప్రాధాన్య మిచ్చుట, గుణము నాశ్రయించిన జీవునకు ప్రాధాన్యమిచ్చుట ఒక సోపానక్రమముగ సాగవలెను. రూప సౌందర్యమును గుణ సౌందర్యము అధిగమించి ఆకర్షించవలెను. గుణ సంపదయందు మేల్కొనుట వలన క్రమముగ రూప బంధము సడలును.

**అంతర్విద్య :**

రూపము, గుణము, జీవము అను మూడు సోపానములలో శుద్ధ చైతన్యమును దర్శింపవచ్చును. అందు మొదటి రెండును మూడవదానిపై ఆధారపడి యున్నవి. మూడవది అగు జీవము శుద్ధ చైతన్యము. సత్సాధకులు రూపమునకు ప్రాధాన్య మిచ్చినచో గుణ సౌందర్యము లేనిచోట బంధితు లగుదురు. రూపమున కాకర్షింప బడుటనే సద్గ్రంథములందు "స్త్రీ ఆకర్షణము" అని తెలిపిరి. రూపాకర్షణ మధిగమించుట అత్యుత్తమ సంస్కారమని తెలియవలెను. "స్త్రీ ఆకర్షణమునకు లొంగని వారే సత్పురుషు"లని గ్రంథములు ఘోషించుచున్నవి. సద్భక్తుల జీవితముల యందు పరీక్షగ యిట్టి ఘట్టములు వచ్చుట, వానిని భగవద్భక్తితో దాటుట తెలుపబడు చుండును. తన రూపమునందు తన కాసక్తి లేనివాడు ఇతరుల రూపములయందు కూడ ఆసక్తి లేక యుండును. అట్లున్నవారికే రూపము మరణము చెందునపుడు తాను వ్యథ చెందడు. తాను, తన మిత్రులగు సద్గుణములు కూడి మరియొక రూపమున ప్రవేశించును.

రూపమునందాసక్తి తగ్గినకొలది, ప్రపంచము నందు వ్యామోహము తగ్గుచు నుండును. రూపాతీత సౌందర్యమునందు ఆసక్తి మెండగుచున్నకొలది రూప బంధము సడలు చుండును. వెలుగుల యందు, దివ్య శబ్దముల యందు ఆసక్తి పెరుగుచు నిమగ్న మగుచున్నకొలది దేహ బంధములు సడలగలవు. రూపముల కతీతమైన రంగులను, శబ్దములను ఆరాధించు విధానమును

'అంతర్విద్య' అందురు. అట్టి విద్యకు శుక్రుడు అధిపతియని పెద్దలు తెలిపిరి. ఉషోదయకాంతి, ఆకాశపు కాంతి, నాదము, ఓంకారము అట్టి రూపాతీత విషయములు. అట్టి విషయములందాసక్తి కలుగుట వలన జీవుడు అమృత లోకములయందు ప్రవేశించుట, జీవించుట నేర్చును. అంతర్విద్య యందలి రహస్యములు క్రమముగ ధ్యానమున గోచరించి, అందు మరల పుట్టుటగ అనుభూతి చెందును. అట్లు పుట్టిన వానిని వత్సమందురు. అట్టి పుట్టుకకు మూలము వృషభము. ఇట్టి సాధనకు ప్రాతిపదిక సాధకుని దేహము లేక గోవు. ఇట్లు వృషభరాశియందు వృషభము – గోవు – వత్సములుగ, చంద్రుడు శుక్రుడు బుధుడు గోచరింతురు.

**వాఙ్నియమము :**

మానవ దేహమునందు వృషభము మెడను, గొంతును పరిపాలించును. వాక్కు ఆధారముగ జీవించువాడు మానవుడు. అట్టి వాక్కు గొంతునుండి వెలువడును. ఉచ్చారణమునకు విశుద్ధి కేంద్రము కాగా, అట్టి ఉచ్చారణ ఉత్తేజమును కలిగించ వచ్చును. ఉద్వేగమును కలిగించవచ్చును. దివ్య సంకల్పము, దివ్యప్రేమ వ్యక్తమగునపుడు విశుద్ధి సృజనాత్మకమగు కార్యములను నిర్వర్తించగలదు. కనుకనే ఆత్మసాధనా మార్గమున వాఙ్నియమము అత్యంత ప్రధానమై యున్నది. వాక్కు నియమబద్ధముగ వినియోగించు సాధకుడు స్త్రీ పురుష పశు కామము నుండి విముక్తి చెందగలడు. ఉత్తమమగు ఉచ్చారణము ద్వారా, స్వాధిష్ఠానమును శుభ్రపరచుకొన వచ్చును. వాక్కునకు విశుద్ధి ఉత్తర ధృవము కాగా, స్వాధిష్ఠానము దక్షిణ ధృవమై యున్నది.

వ్యక్తిగత ప్రయోజనములకు సాధారణముగ మానవుడు వాక్కును వినియోగించును. అవసరమగుచో వాక్కును వక్రీకరించును. కాని సాధకులు వాఙ్నియమమును అవలంబించి, శ్రేయోదాయకము, ప్రేమపూర్వకము అగు వాక్కులను మాత్రమే ఉచ్చరించుచు ఇతర కాలమందు మౌనమును పాటించినచో స్వభావమున చక్కని మార్పులు అందుకొనవచ్చును. సూక్తములను, స్తోత్రములను, కీర్తనములను, మంత్రములను ఉచ్చరించుచు, స్వభావము నుద్ధరించుకొన వచ్చును. మౌనము ప్రధానమై దైవ మననమున నుండుట చాలకాలము సాగినచో, మౌన మాధారముగ దివ్య సంకల్పముల నెరుగవచ్చును. అట్టి సంకల్పములను వినవచ్చును. విని మౌనముగ నిర్వర్తించ వచ్చును.

వాఙ్నియమమును తు.చ. తప్పక పాటించుచు మౌనమున స్థిరపడిన ప్రజ్ఞ అనాహత శబ్దములను వినుటకు సాధ్యపడదు. ఆకాశవాణి వినుట యనగా ఇదియే. మౌనికి హృదయాకాశమున అంతర్వాణి వినపడును. దాని ననుసరించి మౌనముగ కార్యములు నిర్వర్తించుటయే విధిగ నడచినచో దివ్య ప్రణాళిక అవగత మగును. దివ్యాశయములను అవతరింపజేయ వచ్చును. ఇట్లు విశుద్ధికి లోబడి అనుబంధముగ స్వాధిష్ఠానము పనిచేయుట ఉత్తమ స్థితి. స్వాధిష్ఠాన మునకు లోబడి విశుద్ధి పనిచేయుట సాధారణ మానవుని స్థితి. ఇట్టి వారి వాక్కు నుండి వ్యక్తిగత ప్రయోజనములు, ఆకాంక్షలు, ఆవేశ కావేశములు, ఊకదంపుడు భాషణము సాగుచు నుండును.

**వాక్శుద్ధి :**

వృషభము వాక్కునకు సంకేతమగుటచే, వాక్కు నియమింప బడుట వలన జీవుడు తరింపు మార్గమున పయనించవచ్చును. బంధములనుండి విముక్తి చెందవచ్చును. ఇతరులకు కూడ తన వాక్కు ద్వారా ప్రయోజనములు సిద్ధించును. పరిసరములు ప్రచోద నము చెందును. వృషభమునకు వృశ్చికము కవల వంటిది. వృశ్చిక ప్రభావము వృషభముపై పడినపుడు వాక్కున హింస కనిపించును. పరుషమగు వాక్కు ఉచ్చరించునపుడెల్ల జీవుని ప్రజ్ఞ అవరోహణము చెందును. ప్రయోజనకరమగు వాక్కు నుచ్చరించినచో ప్రజ్ఞ ఆరోహణ చెందును. వృశ్చికరాశి వారికి సద్భాషణము, సద్గోష్ఠి, వేదోచ్చారణము, స్తోత్రపఠనము ఎంతయో ఉపయోగకరములై యుండును. రెండు మాటలు మాట్లాడని నాలుకే దివ్యోచ్చారణమునకు అర్హత కలిగి యుండును. కనుక వృషభరాశి యందలి విశుద్ధి నిర్వహణము ద్వారా వృశ్చికరాశి బంధనము నుండి విడివడ వచ్చును. దీనినే సర్పము దివ్య సర్ప మగుటగ, సర్పము గరుడ పక్షి అగుటగ పురాణగాథలు వివరించు చున్నవి. ఈ సందర్భమున వృషభరాశి యందలి బుధ గ్రహము సహకరించగలదు.

బుధుడు ఊర్ధ్వ లోకములందు దివ్య సందేశముల నిచ్చెడి దూత. అధో లోకములందు కలహభోజనుడు. అనగా ఉదరవితానము నకు దిగువ కేంద్రములలో సంచరించు ప్రజ్ఞ మాటల వలన బంధింప బడును. ఉదరవితానమునకు ఊర్ధ్వమున సంచరించు ప్రజ్ఞ మాట వలన సమస్తమును పరిష్కరించుకొన గలదు.

వృషభ వృశ్చికములు పరస్పర విరోధముతో కూడిన జంట రాశులు. వృషభమునకు శుక్రుడు అధిపతి కాగా, వృశ్చికమునకు కుజు డధిపతి. ఈ పరస్పర విరుద్ధ తత్వములను సమన్వయించు కొనుటకు బుధుని ఆవశ్యకత ఎంతయు కలదు. కనుకనే అధో లోకముల బంధింపబడిన జీవుని ఉద్ధరించుటకు సద్గురువులు భాషణా నియమములను, మౌనవ్రతములను, స్తుతి స్తోత్రములను శిక్షణ యందు భాగముగ నేర్పరచిరి. వాక్శుద్ధి ఆధారముగ జీవుల నుద్ధరించు టకు జరుగు ప్రయత్న మంతయు వృషభరాశికి చెందినదే. వాక్కును జయించిన వాడు లోకము లన్నియు జయించువాడు. వాగ్దీక్ష ఉత్తమోత్తమ దీక్ష.

**సత్‌చిత్‌లు :**

వృషభరాశి తత్త్వమున రూపమునకు ప్రాధాన్యత మెండుగ నుండును. చంద్రునకు ఈ రాశి యందు ఉచ్ఛ స్థానమున్నది అని జ్యోతిర్విద్యలో తెలుపుదురు. రోహిణి చంద్రుడు అధిక కళలతో నుండునని పురాణ గాథలు కూడ యున్నవి. రూపమునకు మోహితు డైనవాడు దుఃఖము పొందక తప్పదు. రోహిణి యందు మోహము గల చంద్రుడు దక్షునిచే శపింపబడి, శివునిచే ఉపశమనము పొంది నాడు. కాని అతడికి వృద్ధి క్షయములు తప్పలేదు.

రూపము శాశ్వతము కాదని తెలిసి, రూప మోహమున పడకుండుట జ్ఞానము. రూప మోహము కన్న గుణ మోహము శ్రేష్ఠము. గుణములు కూడ ఒక్కరీతిగ నుండవు. కాలము, దేశము,

కర్మము బట్టి గుణమేళనమున మార్పు కలుగవచ్చును. కనుక గుణ మోహము కన్న వానికాధారమైన చైతన్యము నందు, సత్యమునందు మోహపడుట అత్యుత్తమము. సత్‌చిత్‌లు శాశ్వతము. మార్పు చెందనివి. గుణములు, రూపములు మార్పు చెందునవి.

మానవుని మనసు చంద్రుని వంటిది. అది రూప గుణముల యందు మోహితమైనచో వృద్ధి క్షయములు మనసున కుండును. వానికాధారమైన సత్‌చిత్‌లందు లగ్నమైనచో స్థిరమై యుండును.

వృషభరాశి యందలి వృషభము శివుని వాహనముగ పురాణ ములు పేర్కొనును. శివుని వృషభము ఆనంద స్వరూపము. అందులకే దానిని "నంది" అనిరి. శివుని నంది రూపగుణ మోహితులను తన కొమ్ములతో విధ్వంసము చేయును. సత్‌చిత్‌లను ఆశ్రయించిన మనసును నంది గౌరవించును. శివుడు తలపై అలంకరించుకొని అనుగ్రహించును.

వృషభరాశి యందలి వృషభము యొక్క కొమ్ములు రెండు చంద్రవంకలవలె తలపై గోచరించును. అవి రూపగుణ మోహమును విధ్వంసము చేయు ఆయుధములుగ గుర్తింపవలెను.

సత్సాధకులు జీవమును దర్శించుచు, దానికి ప్రాధాన్య మిచ్చుచు, గుణ రూపములకు అమిత ప్రాధాన్యము నీయక జీవించ వలెనన్నది నంది సందేశము.

♊

# మిథునము

**పరిచయము :**

సచ్చిదానంద స్వరూపమే సృష్టి. సత్ చిత్‌ల విలాసమే సృష్టిగ నేర్పడినది. సత్య మొక్కటియే. అందుండి ఉద్భవించిన చైతన్యము సత్యమాధారముగ సృష్టి అల్లిక చేయును. సృష్టియంతయు చైతన్య విలాసమే. సత్యమొక్కటియే యున్నప్పుడు ఏమీ లేనట్టి స్థితి యుండును. ఒకటి రెండుగ ఏర్పడినపుడు రెండు ఒకటితో క్రీడించు టారంభించును. దాని పర్యవసానమే సృష్టి. సత్యము స్థిరమై యుండును. చైతన్యము చంచలమై యుండును. ఒకటి కదలనిది, ఒకటి కదిలెడిది. కదలని తిరుగలి రాయి వంటిది సత్యము. కదిలెడి తిరుగలి రాయి వంటిది చైతన్యము. కదిలెడిది కదలని దానితో రమించునపుడు పుట్టెడిది అగ్ని. అందుండి సమస్తము పుట్టును.

ఈ సత్ చిత్‌లే ప్రకృతి–పురుషులు. ప్రకృతి అల్లికయందు కదలక మెదలక యుండువాడు పురుషుడు. కదలని గుంజ చుట్టును కదిలెడి తీగ అల్లుకొనుచు నుండును. అందముగ కదులుచు తీగ గుంజను కప్పివేయును. తీగ అందము ఆనందము నిచ్చుచుండును. గుంజలేనిదే తీగ ఎగబ్రాకలేదు. ఉత్తగుంజ అందముగ నుండదు. ఆనందము నీయలేదు. అట్లు సత్ చిత్‌ల క్రీడగ సృష్టి నిర్మాణము, అందు జీవుల నిర్మాణము అందము కొరకు, ఆనందము కొరకు ఏర్పడినదని తెలిసినచో సృష్టి యుండవలెనని కోరుదురుగాని, సృష్టి లేకుండుట ఎవరును కోరరు. సృష్టి రహస్యములు తెలిసినవారికి సృష్టి యిచ్చు ఆనందము అపరిమితము.

క్రీడారహస్యములు తెలిసినవారు క్రీడించుటకే యిచ్ఛగింతురు. క్రీడ తెలియనివారు, క్రీడా నిపుణత లేనివారు క్రీడను గర్హింతురు. క్రీడకు దూర మగుదురు. క్రీడానందమేమో తెలిసినవారు మాత్రమే మిథునరాశి వైభవము నెరిగినవారు.

మిథునము స్త్రీ–పురుష జంట. ఒకరిపై ఒకరు ఆధారపడిన జంట. విలక్షణమగు జంట. విలక్షణమొక వైభవమని తెలియుట జ్ఞానము. స్త్రీ పురుషులు వైవిధ్యమగు లక్షణములు కలవారు. వారి నిపుణతలు వేరు. వారి సామర్థ్యము వేరు. వారి ఆలోచనా విధానము వేరు. వారి అవగాహనలు వేరు. అన్ని విషయముల లోను వారి నడుమ వైవిధ్యమున్నది. వారు ధన ఋణ సంజ్ఞలతో కూడిన విద్యుత్తు వంటి వారు. అవ్యక్తమగు విద్యుత్తు వ్యక్తము కావలెనన్నచో, ప్రకాశింపవలె నన్నచో అది ధన ఋణ సంజ్ఞలుగ ఏర్పడవలసినదే. తూర్పు పడమరలు, అహర్నిశలు, ప్రజ్ఞ పదార్థములు, నిధి ప్రతినిధులు, వెలుగు నీడలు, జ్ఞానా జ్ఞానములు. ఇట్టి ద్వంద్వముల ఆధారముగనే సృష్టి క్రీడ సాగుచున్నది. అట్టి క్రీడకు మిథునము అధ్యక్ష పదవి అలంకరించి యున్నది.

**భాషణము :**

ద్వాదశ రాశులలో కర్కాటకము వైఖరీ వాక్కు కాగ, మిథునము మధ్యమ వాక్కుగను, వృషభము పశ్యంతి వాక్కుగను, మేషము పరావాక్కుగను గుర్తింపబడినవి. అందు మేషము నుండి మిథునము వరకు గల 90 దినములు సంవత్సర చక్రమందలి ప్రథమ పాదముగ కూడ గుర్తింపబడినది. సంవత్సరమును నాలుగు భాగములు చేసి

నపుడు ఒక్కొక్క భాగము మూడు నెలలుగ (దాదాపు 90 రోజులుగ) గోచరించును. ప్రతి మూడు నెలలు ఒక పాదముగ భావింప వచ్చును. అందు మొదటిపాదము అగ్నితత్త్వపు రాశియైన మేషముతో ప్రారంభ మగును. రెండవ పాదము జలతత్త్వముతో కూడిన కర్కాటకముతో ప్రారంభమగును. మూడవ పాదము వాయు తత్త్వముతో కూడిన తులారాశితో ప్రారంభమగును. నాల్గవ పాదము పృథివీ తత్త్వముతో కూడిన మకరరాశితో ప్రారంభమగును. ఈ నాలుగు భాగములను భగవంతుని చతుర్విధ వాక్కులుగ కూడ భావించవచ్చును.

మిథునము మధ్యమ వాక్కుగ భావించవచ్చునని ముందు తెలుపబడినది. మధ్యమ వాక్కు భావము, భాషలతో కూడియుండును. అంతకు పూర్వము పశ్యంతి వాక్కునందు భావ మావిర్భవించును. దానికి పూర్వము పరావాక్కు నందు భావము అవతరింపక, అవతరణకు ఉద్యుక్తమై యుండును. మేషమందలి పరావాక్కు వృషభమునందు పశ్యంతియై ఋషులకు దర్శనమిచ్చును. వృషభ మందలి పశ్యంతి వాక్కు మిథునమందు మానవులయందలి యజ్ఞ పురుషునకు మధ్యమవాక్కుగ దర్శనమిచ్చును. పశ్యంతి నుండి వాక్కు మధ్యమావాక్కుగ అవతరించినపుడు భావము వారి వారి వాడుక భాషలలో వ్యక్తమై వినిపించును. యజ్ఞార్థము జీవించు వ్యక్తి ఆంధ్రు డైనచో భావము తెనుగున వినిపించును. ఆంగ్లేయుడైనచో ఆంగ్లమున వినిపించును. ప్రతి వ్యక్తికిని భావము తన మాతృభాషలో కాని లేక తన ప్రధానమగు వాడుక భాషలో గాని వినిపించును. ఇట్లు ఒకే భావము వేరు వేరు భాషలలోనికి వ్యక్తమగును. ఇది మిథునము యొక్క విలక్షణమగు లక్షణము.

తనయందు వినిపించిన భాషాభావములను వ్యక్తి ప్రకటితము చేయును. అపుడది వైఖరి వాక్కగును. ప్రపంచము వినునది నాల్గవ స్థితిలోని వైఖరి వాక్కే. కాని అట్టి వైఖరికి పూర్వము సూక్ష్మముగ మూడు స్థితులున్నవి. వాక్కు సూక్ష్మముగ నున్నపుడే గ్రహించుటకు సూక్ష్మబుద్ధి కావలెను. అంతః శ్రవణము, అంతఃదర్శనము, అంతః గ్రాహ్యము వలయును. వీనిని పొందుటనే అంతఃకరణ శరీరమును పొందుట అని తెలుపుదురు. ఈ అంతఃకరణ శరీరము, బాహ్య అంతర లోకముల నడుమ ఒక విశిష్టమగు మాధ్యమముగ పని చేయును. ఈ అంతఃకరణ శరీర నిర్మాణమునకు మిథునరాశి కేంద్రమైన విశుద్ధిని బాధ్యతతో నిర్వర్తించుకొనవలెను. కంఠ శబ్దములు వెలుగులను ప్రసరింపజేయుటకే అని తెలిసియుండవలెను. విశుద్ధి ద్వారా సముచితమగు శబ్దముల నుచ్చరించుచు శరీరమును శబ్ద మాధారముగ నిర్మలము గావించుకొనవలెను. శరీర ధాతువులలోని మలినములను సుశబ్దముల ద్వారా నిర్మూలించి వెలుగు ప్రసారమునకై ఉద్యుక్తము చేయవలెను. భాషణము ద్వారా చీకటులను పెంచక, ప్రకాశమును పెంచుట ఒక బాధ్యత యని తెలిసియుండవలెను. సనాతనమగు అన్ని సంప్రదాయము లందును మౌనము, మననము, మానవ పరిణామమునకు మార్గముగ నిచ్చిరి. వీని భాషణము యొక్క విలువ తెలిసి జీవించుట మిథున మిచ్చు ప్రధానమగు సందేశము. భాషణము ద్వారా ప్రతి వ్యక్తియు తనను తానే ఆవిష్కరించుకొనుచు నుండును. అవతరింప జేసుకొనును. ప్రతి వ్యక్తియు సహజముగ దైవాంశయే అగుటవలన ఉచ్చారణా శిక్షణ ద్వారా తనయందలి

దివ్యత్వము ప్రకటితము గావించవచ్చును. ఇదియొక విలక్షణ ఆత్మసాధన. వాఙ్నియమము లేని సాధన శుష్కము. ఇది ముమ్మాటికి నిజము. ఈ రాశి అధిపతియగు బుధుడు విచక్షణను సూచించును గనుక అట్టి విచక్షణ సహాయమున భాషణమును విలక్షణముగను, దివ్యముగను మలచుకొనుట ప్రధానము. అట్టివారే దివ్య వాక్కునకు వాహికలుగ లోకశ్రేయస్సును ఆవిష్కరింతురు.

**ముఖద్వారము :**

మిథునము ద్విస్వభావరాశి యగుటచే నిరంతరము స్వభావమున మార్పులు కలుగుచు జీవనము సాగుచుండును. క్రమముగ మార్పు సహజమని తెలిసి, మార్పు యందు మారని వానిగ తనను తాను సాధకుడు గుర్తించును. మిథునరాశి జ్యేష్ఠా నక్షత్ర ప్రభావముతో కూడియున్నది గనుక జ్యేష్ఠ మాసమని కూడ పిలువబడు చున్నది. జ్యేష్ఠా నక్షత్రము వృశ్చికరాశి సంబంధిత మగుటచే, వృశ్చికరాశి స్థిరరాశి యగుటచే, షష్టాష్టక సంబంధముగ వృశ్చికరాశి మిథునరాశికి స్థిరత్వము నీయగలదు. మిథున మాసమందు మృగశిర, ఆర్ద్ర, పునర్వసుల ప్రభావముండుటచే అందలి ఆర్ద్రా నక్షత్రము అమితమగు స్థిరస్వభావము కలది అగుటచే, ఆ నక్షత్ర ప్రభావము నుండి కూడ మిథునరాశికి స్థిరత్వము లభించుచు నుండును.

ప్రాచీన గ్రంథములలో మిథునమే ముఖద్వారముగ దివ్యత్వము భూమిపై అవతరించినదని తెలుపుదురు. దైవము ఒక పాదము సప్త ఋషి మండలమునందు, మరియొక పాదము కృత్తికా మండలము

నందుంచి, ఊర్ధ్వముఖుడై ఉండగ, భూమి జనుల ఆర్తి, ఆర్ద్రత అత్యంత స్ఫూర్తిమంతమై దివ్యావతరణమునకై ప్రార్థింపగ, ఆ ప్రార్థనలకు ప్రతిస్పందించి దైవము అధోముఖుడై మిథునము ద్వారా ధనూ రాశియందు అవతరించెనని తెలుపబడినది. దీనినే దత్తావతరణమని ఋషులు పేర్కొనుచున్నారు. మార్గశీర్ష పౌర్ణమినాడు చంద్రుడు మిథునమున నుండగ, సూర్యుడు ధనుస్సు నందుండగా ద్విస్వభావ రాశినుండి దైవము ప్రకృతి–పురుష సమాగమ ప్రజ్ఞగ మార్గశీర్ష మాసమున అవతరించెనని తెలుపబడినది. అవతరించిన ఈ దైవ స్పర్శ త్రిమూర్త్యాత్మకముగ భూమిపై స్థిరపడి జిజ్ఞాసువులగు జీవులకు దైవమును చేరు మార్గ మేర్పడినది. అది సూటిగ మార్గశీర్షము నుండి మిథునము మీదుగ ఊర్ధ్వలోకముల కేర్పడి యున్నది. ఈ మార్గమునే యోగమార్గమని, సుషుమ్న మార్గమని, దానిని ప్రచోదనము గావించు అధి దైవము దత్తాత్రేయుడని, అతడే యోగనాథుడని పురాణములు కీర్తించుచున్నవి. మిథునరాశి ధనూరాశితో జత కలిపి అధ్యయనము చేసినచో అనేక రహస్యములు బయల్పడగలవు.

**అంతరంగ జీవనము :**

మిథునరాశి ద్విస్వభావ రాశియని తెలియుట సామాన్యము. అంతరంగ బహిరంగ స్వభావము కలిగియున్నదని తెలియుట అసాధారణము. మానవుడు బహిరంతరము లందుండుట సామాన్యమే. కాని బహిరంతరముల గుర్తించుట, అంతరంగ జీవనము అలవరచు కొనుట ఒక అద్భుతమగు ప్రక్రియ. అంతరంగమునకు జీవుడు చేరువగ నుండును. బహిరంగ జీవనమును మాత్రమే నిర్వర్తించు

కొనువారు జీవాత్మకు చేరువగుట సులభము కాదు. ఈ సౌకర్యము మిథునముచే కల్పింపబడినది. బాహ్యజీవన మొకటి సాగుచుండగ, అంతరంగమున వైవిధ్యముతో కూడిన మరియొక దివ్యమగు జీవనము నిర్వర్తించుకొన వచ్చును. ఇట్లు నిర్వర్తించుకొను వారికి సూక్ష్మ లోకముల అవగాహన క్రమముగ ఏర్పడును. అంతరంగ జీవన మాధారముగ అంతఃకరణములను, అంతఃకరణ శరీరమును నిర్మాణము గావించవచ్చును.

అంతరంగ జీవనమును వృద్ధి పరచుకొనుటకు ఏకాంతజీవన మును, ఆత్మావలోకమును అభ్యసించుట తప్పనిసరి. ఈ రాశి అధిపతి యగు బుధుడు అంతరంగ బహిరంగ జీవనములను విడమరిచి నిపుణతతో నిర్వర్తించగల సమర్థుడు. బాహ్య ప్రపంచమున అందరిలో ఒకడుగ జీవించుచు అంతరంగమున అతి మౌనముగ, రహస్యముగ యోగజీవనమును నెరపవచ్చును. లోపలి మనిషి సాధకుడు, సిద్ధుడు అయి ఉండవచ్చును. బయట ప్రపంచమున సామాన్యుడుగ మెలగ వచ్చును. ఈ విధానమునే ఆధునిక యుగమున 'మేసనరీ' అను చున్నారు. అతి ప్రాచీన కాలము నుండియు ఇట్లంతరంగ బహిరంగ జీవనమును వేరు వేరుగ నిర్వర్తించుకున్న సాధకులు, సిద్ధులు ఎందరో గలరు. పురాణములలో ధర్మవ్యాధుడు, సత్యవతివంటి వారి కథలిట్టివే.

బాహ్య ప్రపంచమున తాను సాధకుడని తెలియబడిన వ్యక్తికి, సాధనయందు అవరోధములు మెండుగ నుండును. క్రమముగ సాధన డంబాచార మగును. తాను సాధకుడని, తాను తప్ప ఇతరులకు తెలియుట వలన ప్రయోజనము లేకపోగ, అవరోధములు మెండై యుండును.

**అంతర్వాణి :**

మిథునరాశికి బుధుడధిపతి. బుధుడు విచక్షణ నిచ్చువాడు. మాట నేర్పరితనము కలవాడు. ఈ బుధుని సద్వినియోగము చేసు కొనుటయందే మిథున రాశియందు ఉత్తీర్ణత లభించును. మాట నేర్పరితనము వలన ప్రపంచమున నేర్పుగ మెలగవచ్చును. కాని సత్యము లేని మాటకు విలువ యుండదు గనుక కేవలము మాట నేర్పు గలవారు ప్రపంచమందు గౌరవింపబడరు. పుష్పములు కురుయునట్లుగ ధారాళముగ మాటాడవచ్చును. కాని సత్యము లేకపోవుట వలన ఆ మాటల ప్రభావము గాలిలో కలిసిపోవడమే గాని జీవుల హృదయము చేరదు.

"మాటకు ప్రాణము సత్యము". సత్యములేని మాట మన్నింప బడదు, కీర్తింపబడదు. కేవలము ప్రియ భాషణము వలన జీవుడు సంస్కరింపబడడు. సత్యమున్ననే సంస్కరింపబడును. పెరుగుట యుండును. మాటనేర్పరితన మాధారముగ మిథునరాశి ఇరువురి నడుమ సంధానకర్తగ వర్తించుచు నుండును. వారి మాటలను వీరికి చేరవేయుట, వీరి మాటలను వారికి చేరవేయుట సర్వసామాన్యమగు ప్రవృత్తి. సత్యవ్రతులు కానివారు ఇట్టి కార్యములు చేపట్టినచో అపాయమునకు గురియగుదురు.

బుధుడు కేవలము లోకవార్తలను మాత్రమే నిర్వర్తించువాడు కాదు. స్థూల సూక్ష్మలోకముల నడుమ కూడ అతడు వార్తలను నిర్వర్తించగలడు. సత్సాధకులు లోకాంతరమందలి వార్తలను వినుటకు

కూడ ఉద్యుక్తులు కావలెను. ఒకే లోకపు వార్తలను వినుట, మాటాడుట సమాంతర కార్యము. ఇతరలోకముల మాటలు వినుట, లోకముల నడుమ వార్తలను నిర్వర్తించుట అసామాన్య కార్యము. నారదమహర్షి కైలాసము, వైకుంఠములనుండి పాతాళలోకముల వరకు అన్ని లోకముల యందు వార్తలను నిర్వర్తించునని పురాణములు పలుకు చున్నవి. కనుకనే అతడిని బుధునికే బుధుడని ఋషులు కీర్తించిరి.

సాధకులు సూక్ష్మలోకముల వార్తలు వినుటకు ఉత్సహించ వలెను. దానికి ప్రధానముగ అంతర్వాణిని వినుటకు కృషి సలుప వలెను. లోకమందు మసలు సాధకుడు క్రమముగ లౌకికుడగు చుండును. అట్టి సాధకుడు ప్రతినిత్యము తన లోపలి లోకములను విననిచో లౌకికుడుగనే మిగిలిపోవును. అంతర్వాణిని వినుట ఆరంభించినచో హృదయమునుండి నిర్దిష్టమగు కర్తవ్యములు తెలియ వచ్చును. హృదయము నుండి మనసునకందిన సందేశములను ఆచరణయందు పెట్టుచున్నకొలది మరికొంత లోతైన సందేశము హృదయము నుండి లభించును. ఇట్లు హృదయమునుండి వినుట అభ్యాసము గావించినచో ఎదుటివారు మాటాడునపుడు కూడ వారేమి మాటాడుచున్నారో అను విషయములపైకాక, వారికేమి కావలయునో విశదముగ తెలియును.

లోపల అంతర్వాణిని వినుట అభ్యాసము కాగ క్రమముగ అంతరాత్మ బోధనలు అందివచ్చు చుండును. అంతరాత్మ బోధనలను శ్రద్ధాభక్తులతో ఆచరణములోనికి కొనివచ్చుట వలన క్రమముగ ఆత్మ

ప్రయోజనమునకై జీవించుట ఆరంభమగును. అపుడు సాధకునకు తాను, తన స్వభావము విపులమగును. తానేమి కోరుచున్నాడు, తన స్వభావమేమి కోరుచున్నది అను విషయములు తెలియును. క్రమముగ తన స్వభావముకోరు పనులకన్న తాను నిర్వర్తింపవలసిన పనుల యందు నిమగ్నుడై సాధకుడు వికాసము చెందుట ఆరంభమగును.

ఇట్టి స్థితిలో సాధకునకు తనలో నుండి తన సద్గురువు ఆదేశములు, నిర్దేశములు లభించు సౌకర్యము పొంది మార్గము మరింత సుగమ మగును. తన మనస్సు తన బుద్ధి ననుసరించు చుండగ, తన బుద్ధి ఆత్మను అనగా తనను అనుసరించుట ఆరంభ మగును. ఇట్టి వానికి బుద్ధిలోక ప్రవేశము, అనుభూతి నిరంతరము కలుగుచు నుండును.

మిథునరాశియందలి బుధుడు క్రమముగ సూక్ష్మతరము, సూక్ష్మతమము అగు లోకముల నుండి కూడ సమాచారమును పొందు స్థితికి చేర్చగలడు. ఇట్లు వాక్కు నిర్వర్తించు బుధుడు క్రమముగ మధ్యమ, పశ్యన్తి, పరావాక్కులను కూడ వినుటకువలసిన శిక్షణము నీయగలడు. ఇదియే మిథున రాశియందలి ప్రధానమగు ఉపదేశము. హృదయము దగ్గరకు చేరినవారికే ప్రప్రథమముగ ఉపదేశము లభ్య మగును. ఉపదేశమున దీక్ష గల వారికి పశ్యంతి వాక్కు, అటుపైన పరావాక్కు అంతర్లోకములలో వినిపించుట, వినిపించిన వాక్కును విస్మరించక ఆచరించుట జరిగినపుడు మిథునమార్గమున జీవుడు బుధలోకమును చేరును. ఇది మిథునరాశి ప్రయోజనము.

**బాధ్యతపడుట :**

ఒకరినుండొకరు ఆశించుట, ఆకాంక్షించుట, ఒకరిపైనొకరు ఆశలు పెంచుకొనుట, ఆంక్షలు పెట్టుట వంటి భావములు, తదను గుణమగు చేష్టలు బంధ కారణములు. కలిసి జీవించుట బంధము కారాదు. ఒకరినుండొకరు ఆశించినపుడు సహజీవనము బంధమై యుండును. జీవుడు సహజముగ స్వతంత్రము కోరువాడు. కలసి జీవించుట కిచ్చగించునుగాని, బంధనమున కిచ్చగించడు. బాధ్యత పడుట వేరు, బంధింపబడుట వేరు. భార్య భర్తల నడుమ గల సంబంధము ఒకరికొకరు స్వచ్ఛందముగ బాధ్యతపడుట, సహకరించు కొనుటగ నుండవలెను. అపుడే దాంపత్య జీవితము ప్రేమానురాగము లను వెదజల్లుచు నుండును. భర్త భార్యను దమించ జూజుట పాశవికము. భార్య భర్త నశ్రద్ధ చేయుట కూడ అట్టిదే. ఒకరికొకరు బాధ్యత పడుటయే సంస్కారము. బాధ్యత బంధము కారాదు. బాధ్యతను బంధముగ భావించుట మానసిక అనారోగ్యము.

మిథున రాశియందు బాధ్యతపడుట, బంధించకుండుట, బంధింపబడకుండుట అను మూడు సూత్రములను నేర్చుట యున్నది. బంధింపబడుట, బంధించుట తెలివితక్కువ తనము. బాధ్యత పడుట సద్బుద్ధి. బంధనము లేక బాధ్యతను నిర్వర్తించుట మిథునరాశి నేర్పు నైపుణ్యము. గ్రహ దేవతలలో బుధు డట్టివాడు. అతడు నిపుణతతో మహత్తరమగు కార్యములను బాధ్యతగ నిర్వర్తించును. అట్లని పను లలో బందీకాడు. బుధుడు నీచపడినపుడు బాధ్యతలను తప్పించుకొను తెలివి ఏర్పడి చివరకు అన్ని విధముల బంధింపబడుట జరుగును.

"తప్పించుకు తిరుగువాడు మూర్ఖుడేగాని ధన్యుడు కాలేడు." మిథునమందలి కవలలు ఒకరికొకరు సహకరింతురు. వివిధములగు బలములను కలిగియండుటచే వానిని ఉపయుక్తముగ వినియోగింతురు. వైరుధ్యము సౌకర్యమని తెలియుట జ్ఞానము. దానివలన విరోధమును పొందుట అజ్ఞానము. ఒకరికొకరు ప్రతిముఖముగ నుండుట వ్యతిరేకించుటకే కానక్కరలేదు. వ్యతిరేకముగ కనపడుచున్నది అదనపు బలముగ గుర్తించుట తెలివి.

## ప్రేమ-మైత్రి :

"అమ్మ నన్ను కట్టి తా నాడుతుంది" అనెడి తెలుగునాట సూక్తి మిథునరాశికి చక్కగ వర్తిస్తుంది. అమ్మ అనగా ప్రకృతి. నేను అనగా దైవము. నేను అనగ జీవుడు కూడ. దైవమునకు దైవీ ప్రకృతి యున్నది. జీవునికి కూడ తనదైన ప్రకృతి యున్నది. దైవమాధారముగ దైవీ ప్రకృతి త్రిగుణములను, పంచభూతములను ఏర్పరచి సృష్టి వ్యాపారమును నెరపుచుండును. దైవమును పెట్టుబడిగ ప్రకృతి సమస్త కార్యములు తానే నిర్వర్తించుచు నుండును. దైవము స్థిరుడు. దైవము స్థిరుడుగ అంతట అన్నిట వ్యాపించి యుండును. క్రీడ యంతయు ప్రకృతిదియే. దైవమునుండి జనించి దైవీ ప్రకృతి సృష్టి కార్యమును నిర్వర్తించుచు నుండును.

అట్లే జీవునియందు కూడ అతని ప్రకృతి మేల్కాంచి, జీవుడాధారముగ త్రిగుణసహితమై పాంచభౌతిక శరీరమును నియమించుచు నుండును. జీవుడు అనుభవించుచు నుండును. సుఖానుభవమో, దుఃఖానుభవమో జీవునికి సతతము కలుగుచు నుండును.

దైవము, దైవీ ప్రకృతి ప్రధానముగ కలది మిథునము. అందుండి దైవీ ప్రకృతి ఏర్పరచు సృష్టియందు జీవులందరును కూడ మిథునముచే పరిపాలింపబడు చుందురు. ప్రతి జీవికిని తనదగు స్వభావ ముండును. తాను, తన స్వభావము తన మిథునముగ జీవుడనుభూతి చెందును.

తన స్వభావము తన కనుకూలమైనచో తనకు సుఖము నిచ్చును. తనకు ప్రతికూలమైనచో దుఃఖము నిచ్చును. తన స్వభావ మును తాను క్షుణ్ణముగ పరిశీలించుకొనుచు అందలి లోటుపాట్లను తానే సర్దుబాటు చేసుకొనుట సాధన. దానికి వలసిన ప్రధాన గుణము మైత్రీభావము. తనను తాను నిందించుకొనక, తన స్వభావమును కూడ నిందింపక ప్రేమతో, మైత్రితో సర్దుబాటు చేసుకొనుట ప్రతి సాధకునకును అత్యావశ్యకము. స్వభావము త్రిగుణములచే నిర్ణయింప బడును గనుక, త్రిగుణములను సమకోణ త్రిభుజముగ నిర్మాణము గావించుకొనవలెను. అందుకు వలసిన విచక్షణ బుధ గ్రహము వలన లభించును. సలహా సంపత్తి గురు గ్రహము వలన లభించును. మిథున రాశికి ప్రతిముఖముగ నున్న ధనూరాశికి గురువధిపతి. మిథునరాశికి బుధుడు అధిపతి. బుధ-గురుల శుభదృష్టి యున్న జాతకుడు జీవితమును చక్కగ మలచుకొను అవకాశము మెండుగ కలిగి యుండును. తనయందలి విచక్షణకు, తెలివికి సద్గురువు జ్ఞానము, సాన్నిధ్యము జోడించినచో లోకపూజ్యముగ తన స్వభావమును మలచుకొనవచ్చును. కనుకనే మిథునరాశికి పరిష్కారము ధనూరాశి యందున్నట్లు పెద్దలు తెలుపుదురు. సద్గురు

సాన్నిధ్యమున జ్ఞానమును పొంది, మార్గమును దర్శించి, అందు తనను తాను నియమించు కొనువాడు జీవన ప్రయోజనమున కృతకృత్యు డగును. తెలివి, విచక్షణలకు మూషకము సంకేతించబడినది. జ్ఞానమునకు, గురువునకు గజముఖుడు సంకేతించబడినాడు. గజ ముఖుడు అధిష్ఠించియున్న మూషకము లోకపూజ్యమైనట్లుగ సద్గురువు నకు అంకితము గావించు కొన్న జీవితము కూడ లోకపూజ్యముగ మారును. సూర్యుడు మిథునమున సంచరించు చుండగ, చంద్రుడు ధనుస్సున సంచరించు సమయము మిథునరాశికి అత్యంత పర్వదినమై యున్నది. ఆ సమయ మున జ్యేష్ఠ పౌర్ణమి సంభవించును. జ్యేష్ఠ పౌర్ణమి జీవులకు దివ్యమగు గురుపరంపరను పరిచయము గావించ గలదు. అట్టి పర్వదినములను సాధకుడు సద్వినియోగము గావించ వలెను. సూర్య చంద్రుల ఉన్ముఖత్వమే పౌర్ణమి. జీవుడు స్వభావముల పరస్పర ఉన్ముఖత్వము జీవునికి వెండి వెన్నెలవలె దివ్యానుభూతి నీయగలదు.

కనుక మిథునరాశియందు తన తోబుట్టువైన తన స్వభావ మును ప్రేమతో చక్కదిద్దుకొని, సరిసమానముగ మన్నించుట ప్రధాన సందేశముగ జ్యోతిషము తెలుపుచున్నది. ప్రతి ఒక్కనికిని తన స్వభావము దివ్యానుభూతి నిచ్చునదై యుండవలెను. అందుకొరకే హిమాలయ గురుపరంపర మిథునరాశి పౌర్ణమిని మానవజాతి ఉద్ధరణకై వినియోగపరచు చున్నది. జ్యేష్ఠ పౌర్ణమి ఒక చక్కని వెలుగుల సంతర్పణగ మానవులకొరకై నిర్వర్తింపబడు చున్నది. అర్ధనారీశ్వరుడు మార్గదర్శిగ మరియు గమ్యముగ పూజింపబడు చున్నాడు.

**జీవుడు-స్వభావము :**

మిథునరాశిని ఆత్మసాధనకు ఉపయుక్తమగు రాశిగ ఋషులు భావింతురు. మిథునమును జీవుడు, అతని స్వభావము అను రెండు భాగములుగ దర్శించుట ప్రధానమని ఋషులు తెలుపుదురు. తాను, తన స్వభావము జమిలిగ కలిసియుండుట వలన జీవుడు తన స్వభావమే తానుగ జీవించును గాని, నిత్యము తన స్వభావమును గమనించుకొనలేడు. పరిశీలించుకొనలేడు. అది కారణముగ స్వభావమునదే పై చేయి అయి, జీవుడు బానిసయై జీవనము సాగు చుండును.

తన స్వభావము కన్న తాను వేరుగ నున్నాడని, జీవునికి గుర్తు చేయుటకే సమస్త జ్ఞానబోధనము. ఎన్ని బోధనలు చదివినను, వినినను వర్తనమున స్వభావమునదే పైచేయి అగుచుండును. ఎంత విమర్శించుకొన్నను, పరిశీలించు కొనినను మాయ క్రమ్ముచు నుండును. మహా భారతమున జరాసంధుని కథయందు ఈ రహస్యము వివరింపబడినది. కుడి ఎడమలుగ జీవుడు, అతని స్వభావము ఉండుటచే వానిని విడదీసినను మరల కలియుచునే యుండును. వీనిని విడదీయుటకు వాయుపుత్రుడగు భీముని అవసరము కలిగినది. మనలోని పంచప్రాణములయందు పనిచేయు చున్నది వాయువే.

మానవ శరీరమందలి పంచ ప్రాణములే మహాభారతమున పంచ బలశాలురుగ వర్ణింపబడినది. వారు వరుసగ బకాసురుడు, కీచకుడు, జరాసంధుడు, దుర్యోధనుడు, భీముడు. ఇందు భీముడొక్కడే

పూర్ణమగు దైవారాధనము, ధర్మాచరణము కలిగియున్నవాడు. మిగిలిన నలుగురికి ఆచరణమున ధర్మలోప ముండుటచే నశించుట జరిగినది. మిథునరాశి వారికి స్వభావమునుండి ముక్తి కలుగుటకు అంత రంగమున ప్రాణాయామ సాధనము, బహిరంగమున కుంటుపడని ధర్మాచరణము ప్రధానమై యున్నది. ఈ ద్విముఖ సాధన ద్వారా తమ స్వభావమును ఒక దీపస్తంభమువలె, దేవాలయమువలె తీర్చి దిద్దుకొన వచ్చును. లేనిచో తమ స్వభావము, తమ సహజమగు తెలివితేటలతో తమను శాశ్వతముగ బందీకృతుని చేయగలదు. శాశ్వతముగ భ్రమలకు భ్రాంతులకు గురియగుచు పౌండ్రక వాసు దేవునివలె ప్రవర్తించు వారందరును మిథునరాశి యందు తప్పక పునః పరిశీలనము చేసుకొనవలసి యుండవలెను.

**గణపతి ఆరాధన :**

సాధారణముగ మిథునరాశి అధిపతిగ బుధుని పేర్కొనుట జ్యోతిషశాస్త్రమున కద్దు. కాని పరమగురువు జ్వాలాకూలుడు సాధకు లకు శనైశ్చరు డధిపతియని తెలుపును. మిథునరాశి వారు పాదరసము వంటి మనసు కలవారు. శాశ్వత పరిష్కారము కొరకై పరిశ్రమించలేక, తాత్కాలికముగ సమస్యలనుండి తప్పించుకొనుటకు ప్రయత్నింతురు. తప్పించుకొనుచు, తప్పించుకొనుచు కర్మమును పెంచుకొనుచు నుందురు. తాము చేయు పనులన్నియు ప్రయోగింపబడిన చక్రము వలె తిరిగి తిరిగి తమనే చుట్టుకొనును. అన్నివైపుల నుండి సమస్యలు చుట్టుకొనుటకు కారణము వారి లౌకిక నైపుణ్యమే. చిన్నతనముననే శనిగ్రహమందించు శిక్షణమును పొందినవారు ఈ రాశియందు ఎంతయు రాణింతురు. కష్టనష్టముల యందు, దుఃఖము నందు

కూడ ధర్మమును పరిత్యజించకుండుట శనైశ్చరుడిచ్చు శిక్షణము. ఇట్టి శిక్షణము జీవులందరికిని ఆవశ్యకమే కాని మిథునరాశి స్వభావమున ఈ శిక్షణకు సమ్మతి అతి స్వల్పముగ నుండును.

మిథునరాశికి ప్రతిముఖముగ నుండు ధనూరాశి మిథునరాశి వారికి చక్కని మార్గదర్శకత్వమును వహించగలదు. ధనుస్సున కధిపతియైన బృహస్పతి మిథునరాశి అధిపతియగు బుధుని అధిష్ఠించి యున్నపుడు ద్విస్వభావము గల జీవుడు అదుపు తప్పక మార్గమున పయనింపగలడు. దీనిని సంకేతించుటకే ఎలుక వాహనముగ గణపతిని ఋషులేర్పరచిరి. ఎలుక తప్పించుకు తిరుగు స్వభావము గలది. దాని నధిష్ఠించిన గణపతి ఎలుకకు బుద్ధిని గరపి కుదురు నిచ్చును. మూషకమునకు స్వతః సిద్ధమగు ప్రాముఖ్యతలేదు. గణపతి నాశ్రయించుటచేతనే మూషకము కూడ పూజ్యనీయమైనది. అట్లే మిథునరాశి వారు పూజ్యులుగ మార్పునొందుటకు సద్గురువు నాశ్రయించి తమ జీవితమును సమర్పించుకొన్నచో సర్వము శుభంకరమగును. కేవలము తమ తెలివితేటలనే నమ్ముకొన్నచో తమను తాము తప్పక బంధించుకొందురు. జీవితము సమస్యల పుట్టగ మారును. గణపతి ఆరాధనము వీరికి మార్గదర్శకమై యున్నది.

**శ్రమతో కూడిన దీక్ష :**

మిథునరాశి యందు రెండు పాదములు మృగశిర, నాలుగు పాదములు ఆరుద్ర, మూడు పాదములు పునర్వసు నక్షత్ర విభాగము లను ఋషులు దర్శించిరి. అందలి మృగశిర రెండు పాదములు చపలమతిని సూచించును. తరువాత నాలుగు పాదములు పట్టుదలను

సూచించును. రుద్రశక్తిని సూచించును. పునర్వసు మూడు పాదములు కష్టనష్టములను ఓర్చు స్వభావమును సూచించును. ఒక్కొక్క నక్షత్ర పాదము మూడురోజుల ఎనిమిది గంటలు చొప్పున సూర్యుడు తొమ్మిది పాదములను 29 రోజుల 4 గంటలలో సంచారము పూర్తిచేయును. సూర్యుని రాశి సంచారము దాదాపు ముప్పదిరోజులుగ నిర్ణయించగ, రోజుకు ఒక డిగ్రీ చొప్పున ఒక నక్షత్ర పాదమును మూడు రోజుల ఎనిమిది గంటలలో దాటును.

పై గణితము ప్రకారము సూర్యసంచారము పదమూడు, పదునాలుగు రోజుల నడుమ సాగును. అందు సగభాగము వృషభము నందు, సగభాగము మిథునము నందు సాగును. అనగ వృషభరాశి చివరి భాగము, మిథునరాశి ప్రథమ భాగము మృగశిర యుండగ, ఆ నాలుగు పాదములను సూర్య సంచారమున మృగశిర కార్తిగ గుర్తింపవచ్చును.

మృగశిర అనగ జింక శిరస్సు. జింకను సంస్కృతమున మృగ మందురు. జింక నిలకడయగు నడత లేనిది. ప్రత్యేకించి దాని శిరస్సు, కన్నులు బెదరుచు బెదరుచు అటునిటు చూచుచు నుండును. ఈ పక్షమున పుట్టినవారి ప్రజ్ఞ చంచలత్వముతో కూడియుండునని, స్థిరత్వము తక్కువగ నుండునని తెలియవలెను. అనగ మే 16 నుండి మే 30 తేదీల లోపు జన్మించినవారు అస్థిరతను సహజముగ కలిగి యుందురని తెలియవలెను. అస్థిరత కారణముగ ఏ పనియు కొనసాగింపలేరు. అంతరాయములు హెచ్చుగ నుండును. నిరంత

రత్వముండదు. చురుకైన బుద్ధితో పనులను తప్పించుకొందురేగాని, స్థిరబుద్ధితో ఎదుర్కొని పరిష్కరించుకొనలేరు.

వీరికి పరిష్కారము మిథునమునకు ప్రతిముఖముగనున్న ధనుస్సు నుండి లభించును. ధనుస్సు నందలి మూల నక్షత్రము పట్టుదలకు మారుపేరు. కేతు ప్రభావముతో కూడిన మూల నక్షత్ర తత్త్వము శనైశ్చరుని పట్టును ప్రసాదించును. రాహువు కుజుడికి ప్రతిరూపము కాగ, కేతువు శనికి ప్రతిరూపము. రాహు-కేతువులు శనైశ్చరుని నీడ పట్టును కలిగించు ప్రజ్ఞలు. కనుక మిథునరాశి యందలి మృగశిర ప్రభావమునకు లోబడినవారు శనైశ్చరుడిచ్చు దీక్ష నందుకొనవలెను. అనగ శరీర శ్రమతో కూడిన దీక్షలను చేపట్ట వలెను. అట్లు చేపట్టినచో జీవితమునకు శాశ్వత పరిష్కారము లభించును. శనైశ్చరుడే మిథునరాశికి పరిష్కారమని పరమగురువు జ్వాలాకూలుడు తెలుపుటలోని అంతరార్థ మిదియే. మిగిలిన రెండు నక్షత్రముల సంచారమునందు సూర్యప్రజ్ఞకు స్థిరత్వమున్నది. మృగశిరయే పరిష్కరింపబడవలసిన ప్రజ్ఞ.

**పరిణామ కథ :**

ప్రపంచము కాల తంత్రమున అనునిత్యము మార్పులు చెందుచు నుండును. అందు ప్రవేశించి వర్తించు జీవులు మార్పునకు గురియగుట సహజము. జరుగుచున్న మార్పులను గమనించుచు, తదనుభూతి పొందుచు జీవించువారు సిద్ధులు. మార్పునకు గురి యగుట నుండి మార్పును గమనించు వరకు జరుగు పరిణామ కథ

సాధకులకు సాధనగ ఋషు లిచ్చిరి. మార్పులకు గురియగుట వలన అనుభవ మేర్పడుచుండును. అనుభవము వలన జీవుడు పరిణతి చెందుచు నుండును. సర్దుబాట్లు చేసుకొనుటలో పరిణతి సాధ్యపడుచు నుండును. సర్దుబాట్లన్నియు స్వభావమున చేసుకొనవలసినవే. ఈ సర్దుబాట్లు జీవునకు పరిపక్వత కలిగించుటయేగాక, క్రమముగ పవిత్రుని కూడ చేయును. స్వభావమున పవిత్రత చోటు చేసుకొనగ మిథునమందలి జీవుడు కన్యను చేరును. కన్యయందు పవిత్రత కారణముగ దివ్య సంకల్పమునకు కృషి చేయు సంకల్పము రుచియై, ఆ సంకల్పమును నిర్వర్తించుటకు వలయు జ్ఞానమును, క్రియాశక్తిని పొందును. దివ్య సంకల్ప నిర్వహణమే జీవితాశయముగ సాగు చున్నప్పుడు మూడవ చరరాశి యగు ధనుస్సును చేరును. ఆశయ నిర్వహణమున సర్వసమర్పణము నేర్చి జీవుడు దైవీ స్వభావమును పొందును. అటుపైన జీవుడు దేవుడై, దేవుడు జీవుడై మహోత్కృష్టమగు కార్యములను నిర్వర్తించి సఫలీకృతు డగుటయే మీనమందలి సిద్ధి.

పై విధమగు మార్గమునకు మిథునమున శుభ సంకల్ప పునాదులు ఏర్పడవలెనని పరమ గురువుల పరంపర మిథున మాసమును మానవజాతికి ఉపదేశము నందించు మాసముగ నిర్ణ యించుకొనిరి. జ్యేష్ఠ పౌర్ణిమను ఈ కార్యక్రమమునకై ఎన్నుకొనిరి. పరమగురువు మైత్రేయుడు ఈ పర్వదినముననే జన్మించుట గమనార్హము.

**ఏకత్వభావము :**

ద్వంద్వములను సమన్వయ మొనర్చుకొని, ద్వంద్వాతీత స్థితిని చేరుటయే మిథునమందలి పరమోపదేశము. ద్వాదశ రాశులన్నియు ఆరు (6) జంట రాశులే. ఒకదాని కొకటి ప్రతిముఖముగ నుండును. ప్రతిముఖముగ గోచరించునది అభిముఖముగ కూర్చబడుటయే యోగము.

వివాహ క్రతువున కన్యను వరునకు ప్రతిముఖముగ కూర్చుండ బెట్టెదరు. అనంతరము వధువు వరుని ప్రక్కన చేరును. ప్రతికూలము ననుకూలము చేసుకొనుటయే యోగసాధన. వైవిధ్యమున ఏకత్వము చూచుట వలన అది సాధ్యపడు చుండును. ఏకత్వమే వివిధత్వము చెందినది గనుక, వైవిధ్యమున ప్రతికూలత యొకటి కనుక, అన్ని కోణములను సమన్వయించుకొని జీవించుట వలననే జీవుడు పొంద వలసిన సిద్ధిని పొందును.

శుద్ధ చైతన్యమునందు అన్నియు సమ్మిళిత మగును. కనుక వివిధత్వమున ఏకత్వము సాధించుటకు శుద్ధ చైతన్యము నాశ్ర యించుట పరిష్కారముగ ఋషులు పలికినారు. శుద్ధ చైతన్యమున స్థితి గొనుటకు సాధకుడు తర్కమునుండి బయల్పడవలెను. తర్కము మనోలోకములకే పరిమితము. బుద్ధిలోకమున సమన్వయమై, అధిష్ఠించి యుండగ సమభావనము, సమవర్తనము, సమదర్శనము చేతలయందు, మాటలయందు ఆవిష్కరింపబడు చుండును.

శుద్ధ చైతన్యమున నిలచిన వారికి మాత్రమే దివ్యప్రేమ

అవగాహన యగును. దృక్పథములతో జీవించు వారికి దివ్యప్రేమ అందని ఫలము. దివ్యత్వము ఏకత్వము నుండి వివిధత్వములోనికి అవతరించుచు నుండును. ఆకాశజలమువలె దివ్యత్వ మొక్కటిగనే యుండును. వివిధ భూములయందు వర్షించునపుడు వివిధ నదులుగ ప్రవహించును. ఒక్కొక్క నదీజలమునకు ఒక్కొక్క లక్షణమున్నది. జలములకా లక్షణములు భూమి వలన కలుగును. అట్లే దివ్యత్వము వివిధమగు గుణముల లోనికి, రూపముల లోనికి ప్రవేశించినపుడు భిన్నత్వము గోచరించును. పదార్థముతో సంగము చెందుట వలన జలములు వైవిధ్యమగు గుణములతో నున్నట్లు, ఒకే దైవము కోటాను కోట్ల రూపములను ధరించినపుడు అపరిమితమగు వైవిధ్యము గోచరించును. వైవిధ్యము ఉపాధివలన నేర్పడుచున్నదేగాని, దిగివచ్చిన తత్త్వ మెప్పుడును నిర్గుణమే, నిర్మలమే.

మిథునమున ఏకత్వ భావమునకు అత్యంత ప్రాముఖ్యమున్నది.

## వైవిధ్యము :

కుడి ఎడమల నడుమన గల సత్యమును చూచుటయే మిథునము సంకేతించును. నడుమగల కేంద్రమునుండి కుడి ఎడమ లేర్పడి, కుడి ఎడమలు ప్రాధాన్యము చెందగ, నడుమ గల కేంద్రము అదృశ్యమగు చుండును. కుడి ఎడమలుగ ఏర్పడిన కన్నులు వాని కేంద్రమైన భ్రూమధ్యము ఎగువన మూడవ కన్నుగ నున్నది. ఒక కన్నే రెండు (2) కన్నులుగ భాసించినపుడు మూలము మరుగున పడుచున్నది. ఎడమ కన్ను చంద్రుడుగను, కుడి కన్ను సూర్యుడుగను,

రెంటికిని మూలమైన మూడవ కన్ను సూర్యుని హృదయముగను చూచుట ఋషులు నేర్చిరి. అట్లు నేర్చుటకు వారు భ్రూమధ్యమున మనసును లగ్నము చేసి ధ్యానములు గావించిరి. అట్టి ధ్యానమున వారు సూర్యుని హృదయ మెరిగి, తదనుసారముగ తమ కార్యములు నిర్వర్తించిరి. అట్లు నిర్వర్తించుటకు వలసిన ప్రేమ, జ్ఞానము వారికి ధ్యాన మార్గముననే లభించినవి. ఒకే వెలుగు సూర్యచంద్రాత్మకముగ ప్రకాశించుచు వైవిధ్యమగు కార్యములు నిర్వర్తించుట గమనించిన ఋషులు, సృష్టి యందు వైవిధ్యము సహజమని తెలుసుకొని, దాని నంగీకరించి సామరస్యముతో మెలిగిరి. అట్టి కారణముగ వారు వివిధమగు అవగాహన కలవారికి మార్గదర్శకులై, అందరి నడుమ సామరస్యము చూచుట వారి ప్రధానకర్తవ్యమై నిలచినది. అట్టివారే ఒక బృందముగ నేర్పడి జాతి సామరస్యమునకై కృషి సలుపుచు నున్నారు. అట్టి వారిని "మేస్త్రి" అని సంబోధించిరి. మేస్త్రి అనగా మాస్టర్ అని అర్థము. మాస్టర్ తత్త్వము కలవారు కనుక మేస్త్రీలైరి. వారినే ఆంగ్లమున 'మేసన్' అని పిలువసాగిరి. ఇట్టి మేస్త్రీల బృందము అనాదిగ భూమిని నడుపుచు నున్నది. వారందరు మిథున మాసమున సమావేశమై, వారి కార్యాచరణ ప్రణాళికను ఒక సంవత్సరమునకు సరిపడ నేర్పరచుకొందురు. ఈ మేస్త్రీలలో అతివృద్ధులు మిథునమున దత్తాత్రేయ మండలముతో అనుసంధానము చెంది, ప్రణాళిక నందుకొని భూమిజీవుల కందించు ప్రయత్నము చేయుచున్నారు.

**దివ్యజీవనము :**

మిథున తత్త్వమునకు, సూక్ష్మ శరీరమునకు అనుబంధ మున్నదని పరమగురువు జ్వాలాకూలుడు సూచించెను. శుద్ధ చైతన్య మునకు, రక్తమాంసాదులతో కూడిన శరీరమునకు నడుమనుండు నమూనాగా సూక్ష్మ శరీరమును దర్శింప వచ్చును. సూక్ష్మశరీరము మాధ్యమముగ (వాహికగ) త్రిగుణాత్మకమగు చైతన్యము మనసేంద్రియ శరీరములను చేరును. త్రిగుణాత్మక సృష్టికిని, పంచ భూతాత్మక సృష్టికిని నడుమ మధ్యవర్తిత్వము నెరపునది సూక్ష్మలోకము. మానవుని యందు అది సూక్ష్మశరీరమై వర్తించును. అట్లే త్రిగుణాతీతమగు తత్త్వమునకు, త్రిగుణాత్మక మగు తత్త్వమునకు నడుమ కారణ లోకమును దర్శింప వచ్చును. మానవుని యందు దీనిని కారణ శరీరముగ గుర్తింపవచ్చును.

ఇట్లు మానవుని యందు రక్తమాంసాదులతో కూడిన శరీరము, సూక్ష్మ శరీరము, కారణ శరీరము మిళితమై యున్నవి. ఇందు కేవలము రక్తమాంసాదులతో కూడిన శరీరమే మానవుడు ఎరిగి యున్నాడు.

ప్రపంచమందలి ద్వంద్వములను సమన్వయించుకొని జీవించిననాడు, తనయందలి సూక్ష్మ శరీరము ప్రకటితము కాగలదు. జీవుల వైవిధ్యమునకు మూలమగు త్రిగుణములను దర్శించుచు నుండువాడు క్రమముగ సూక్ష్మమగు అవగాహన పొందుచు, సూక్ష్మ లోక ప్రవేశము చేయును. దైవమిచ్చిన విచక్షణా జ్ఞానమును, పెద్దల వలన అందుకొనిన ధర్మమును వినియోగించుచు, యజ్ఞార్థము


జీవించుకొలది నిత్యానిత్య వివేక మెరిగి, లౌకిక ఆకర్షణల నుండి బయల్పడి, క్రమముగ దివ్యజీవనమును తనకుగ మలచుకొనును. ఇట్టి జీవనము అవలంబించు వారికి మిథునరాశి అధిపతియగు బుధుడు చక్కగ సహకరించును. మనసేంద్రియ శరీరములు బుద్ధికి లోబడి పనిచేయుట అలవడును. ఇట్టి సమయమున శుక్రుడు ధ్యాన సమయమున, నిద్రా సమయమున దివ్యమగు అనుభూతులకు ప్రేరణను కలిగించుటతో దివ్య జీవనము స్థిరపడి సాగుచు నుండును. క్రమముగ బుధుడు అనుభూతి లోకములను గూడ దాటించి ఆత్మాను సంధానమునకు ప్రయత్నము సాగించును. సాధకుడు క్రమముగ బుద్ధిలోకమున కుద్ధరింపబడి ఆత్మానుభూతికి కృషి సలుపును. అట్టి సాధకుడు సహజముగ ధారణ యందు స్థిరపడును.

**ఒకటి రెండగుట :**

మిథునము ఒకటి రెండుగ మారిన స్థితిని సూచించును. ఒకటి రెండగుటకు కారణము, ఒకరితో నొకరు అనుబంధము, సంబంధము నేర్పరచుకొని ఆనందించుట కొరకే. ఒకే తత్త్వము పురుషుడు, ప్రకృతిగ నేర్పడుట, ఒకరియందొకరు ఆకర్షణ కలిగి యుండుట, ఒకరినొకరు ప్రేమించుకొనుట మరియు పోషించుకొనుట ఒక విలాసము. విలాసము కొరకే సృష్టి. అనుబంధము, సంబంధము బంధముగ మారనంతవరకు అది విలాసమే. బంధమైనచో విలాస మదృశ్యమై విలాప మారంభ మగును. ఒకరితో నొకరు సమముగ వర్తించినపుడు విలాసముండును. అసమానత చోటు చేసుకొన్నచో సున్నితమగు ప్రకంపనలు పుట్టి క్రమముగ ద్వంద్వములకు దారి తీయును. ఇరువురిమధ్య ఏకత్వముండుటకు వలసినది ప్రేమభావము

లేదా స్నేహభావము. ఇట్టి భావమునందు సమవర్తన ముండును. సమదర్శన ముండును. హెచ్చుతగ్గులకు తావుండదు. ఇట్టి మిత్ర భావము లేక ప్రేమ భావమును ఒకరియం దొకరికి శాశ్వతముగ నుండుటకు వలసినది అవగాహన. మిథునరాశికి ఇట్టి అవగాహ నము, మిథునమునకు ప్రతిముఖమగు ధనూరాశి యందలి గురు గ్రహము ద్వారా లభించును. కనుక మిథునరాశి వారికి ధనూరాశి వారు మార్గదర్శకులు కాగలరు. వలసిన అవగాహనను అందించ గలరు.

ధనుస్సు నుండి గురుగ్రహ మందించు అవగాహనను తమ యందలి బుధుడు అందించు విచక్షణతో జీవితము నిర్వర్తించు కొన్నచో, పరస్పర జీవనము సుఖానుభూతి నిచ్చును. సుఖానుభూతికి శుక్రగ్రహము అధిపతి. కనుక మిథున రాశివారు లేక ద్వంద్వముల యందు పడియున్నవారు గురు, బుధ గ్రహముల శిక్షణము నందుకొని, శుక్రుడిచ్చు దివ్యానుభూతిని పొందుట సులభగతి.




పై తెలిపిన త్రిభుజమును ప్రజ్ఞాపరముగ ధ్యానించునపుడు బృహస్పతిని సహస్రారమునందు, బుధుని విశుద్ధి (కంఠము) నందు,

శుక్రుని అనాహతము (హృదయము) నందు, సూర్యుని తానుగా ఆజ్ఞయందు దర్శించుచు ధ్యానింపవచ్చును. ఇట్టి ధ్యానమున బుధ, శుక్రులు, బృహస్పతి ఆత్మయందు సమ్మిళితమై ద్వంద్వాతీతమగు దివ్యత్వమును దర్శించు భాగ్యమేర్పడును. విజ్ఞానమయ, ఆనందమయ లోకములలో సంచరించుటకు అవకాశ మేర్పడును. స్థూలమగు పదార్థలోకముల నుండి (అనగా మనోమయ, కామమయ, స్థూల మయ) విడుదల కలిగి వాని నధిష్ఠించియుండు అవకాశ మేర్పడును. అందలి రుచి అనుభూతమైనపుడు భౌతిక ప్రపంచమున ఆహార విహారాదులను క్లుప్తము గావించుకొని అంతర్లోకములందు ప్రవేశించి విహరించుట ఆరంభమగును. కనుకనే జ్యేష్ఠమాసము ఒక పుణ్య మాసముగ కీర్తింపబడుచున్నది.

పై తెలిపిన విధముగ ఊర్ధ్వమగు ప్రజ్ఞా కేంద్రములందు మానవ ప్రజ్ఞను ధ్యాన రూపమున సంచరింపజేయుట అలవరచు కొనుట వలన, సద్విషయము లందాకర్షణము, అసద్విషయములందు వికర్షణము కలుగుటకు అవకాశ మేర్పడును.

ఆకర్షణ వికర్షణము లను ద్వంద్వములు కూడ మిథునముచే పరిపాలింపబడు చున్నవి. మానవులు సద్–అసద్ విషయముల నడుమ నలుగుచు నుందురు. మంచి చెడులు, సుఖ దుఃఖములు, సౌకర్యా సౌకర్యములు, జనన మరణములు వంటి ద్వంద్వములలో ఎడతెరిపి లేక చక్రగతిని తిరుగుతు నుందురు. ఇట్టి చక్రగతి నుండి బయల్పడుటకు ఉదరవితానమునకు ఊర్ధ్వముగనున్న ప్రజ్ఞా కేంద్రము లలో వసించు ప్రయత్నము చేయవలెను. అట్లుకానిచో మకరముచే

పీడింపబడుచున్న వారివలె జీవితము సాగును. 'మ' అనగా చంద్రుడు. 'క' అనగా శని. 'ర' అనగా కుజుడు. ఈ మూడు గ్రహములు ఉదరవితానమునకు దిగువనుండు ప్రజ్ఞాకేంద్రముల కధిపతులు.

మణిపూరకమునకు చంద్రుడు, స్వాధిష్ఠానమునకు కుజుడు, మూలాధారమునకు శని అధిపతులై జీవప్రజ్ఞను, మనోమయ కామమయ పదార్థమయ విషయములలో బంధింతురు. దేహ బంధనము వలననే మరణింతురు. అధోలోకములకు ఉన్ముఖమగు మనసును ఊర్ధ్వలోకముల కున్ముఖము చేయుటయే సాధన. ఇట్టి సాధన ప్రారంభించినపుడు సాధనకు విముఖముగ అధోలోక ప్రజ్ఞలు, సుముఖముగ ఊర్ధ్వలోక ప్రజ్ఞలు తోడ్పడును. ఈ ఆకర్షణ వికర్షణలకు కారణము మిథునరాశి తత్త్వమే. భూమండలమందు శుక్ల పక్ష, కృష్ణ పక్ష తత్వములు కూడ మిథునము ఆధీనముననే యుండును. అవరోహణ, ఆరోహణ క్రమములు ఒకదానికొకటి వ్యతిరిక్తముగ వర్తించుటకు కూడ మిథునమే ఆధారము. నిజమునకు సమస్త సృష్టిని పరిపాలించునది ప్రకృతి-పురుషులే కదా! వారే ప్రప్రథమ మగు మిథునము. అర్ధనారీశ్వర తత్వము. మిథునమునకు అత్యుత్తమ మగు చిహ్నము.

## ద్వంద్వములు :

దేవుడు-జీవుడు, పరమాత్మ-జీవాత్మ, జీవుడు-స్వభావము, ఉత్తరధృవము-దక్షిణ ధృవము, శుక్లపక్షము-కృష్ణపక్షము, పెరుగుదల -తరుగుదల మిథునరాశిచే పరిపాలింపబడును. ద్వంద్వముల నడుమ సమవర్తనము నేర్పరచుకొనుట ఒక కళ. దానినే యోగమందురు.

"సమత్వం యోగముచ్యతే" అని శ్రీకృష్ణుడు యోగమును నిర్వచించి నాడు. సమత్వమునందు ద్వంద్వములు ఏకీభావము చెందును. అట్టి ఏకీభావము చెందిన ద్వంద్వత్వమునే అర్ధనారీ తత్త్వమందురు. అర్ధనారి, అర్ధనరుడు ఈశ్వరుడుగ తెలుపబడుచున్నాడు. నర-నారీ తత్త్వము సరిసమానముగ నుండుట యోగేశ్వర తత్త్వమునకు ప్రతీక. యోగేశ్వరునందు నరుడెంత యుండునో నారి కూడ అంతే యుండును. హెచ్చుతగ్గు లుండవు. శివశక్తులు సరిసమానము. అట్లే లక్ష్మీనారాయణులు. అట్లే సీతారాములు.

పురుషులు స్త్రీకన్న అధికులనుకొనుట అవివేకము. ఆధిక్య భావము అజ్ఞానము. సమభావము, సమవర్తనము జ్ఞానము. సృష్టి యంతయు స్త్రీ పురుష తత్త్వముతోనే నిండియున్నది. దైవమునెంత ఆరాధింతురో, ప్రకృతిని కూడ అంత ఆరాధింపవలెను. ఈ సుళువు తెలియనివారు జీవితమునందు సమతూకము లేక తలమునక లగుదురు.

మిథునతత్త్వము ఆధారముగనే శాస్త్రజ్ఞానము పొందుట సులభము. ద్వాదశ రాసుల యందలి మిథునములను గుర్తించి సమన్వ యించుకొని పఠించుట వలన జ్యోతిషము పూర్ణమగు అవగాహన నిచ్చును. మేషము-తుల, వృషభము-వృశ్చికము, మిథునము-ధనుస్సు, కర్కాటకము-మకరము, సింహము-కుంభము, కన్య-మీనము. ఆరు విధములుగా ద్వాదశ జ్యోతిషచక్రమును దర్శించవలెను. ఈ జంటరాశులన్నియు శివ-శక్తుల వంటివని తెలియవలెను.


**అనుసంధానము :**

మిథునరాశి అధిపతి బుధగ్రహముగ జ్యోతిర్విద్య పేర్కొను చున్నది. బుధుడు మధ్యవర్తి. మిథునమందలి రెండు (Π) స్తంభముల నడుమ నుండువాడు. ఇటునటు కూడ సంబంధము కలిగి యుండు వాడు. బాహ్యాంతరముల నడుమ సంధానకర్త. అన్ని లోకముల యందును అతడే సంధానకర్త యగుటవలన నారద మహర్షిని బుధ తత్త్వమునకు అత్యుత్తమ ప్రతీకగ తెలుపుదురు.

పరమాత్మకు జీవాత్మకు నడుమ, జీవాత్మకు జీవ స్వభావము లకు నడుమ బుధుడే సంధానకర్త. విభిన్నమగు భావముల నడుమ కూడ సంధానకర్తగ నుండును. లౌకికమగు మనస్సునకు అలౌకికమగు మనస్సునకు సంధానకర్తగ నిలచి, విభిన్న భావముల నడుమ సయోధ్యను కూర్చి ఉద్ధారణము కలిగించువాడు బుధుడు. మానవు నందలి సప్తకోశములందు కూడ ఇట్టి ఉద్ధారణకు తోడ్పడువాడు బుధుడు. కనుకనే అసురులు, మానవులు, దేవతల నడుమ అద్భుత మగు సంధానము కూర్చిన కథలు నారదుని గూర్చి అనేక పర్యాయ ములు పురాణములలో తెలుపబడినవి. రత్నాకరుని వాల్మీకి మహర్షిగ మార్చినను; అసుర బాలుడగు ప్రహ్లాదుడు జన్మమునకు పూర్వమే భాగవతునిగ తీర్చిదిద్దినను; మొండితనము, పట్టుదల, క్రోధము అత్యధికముగ గల ధృవుని ఉత్తమోత్తమ స్థానమునకు చేర్చినను– ఇత్యాది ఉద్ధారణము లన్నియు క్రింది మీదుల సంధానము వలన నిర్వర్తింపబడినవి.

పదార్థమయ లోకములలో బంధింపబడిన జీవులను పరమార్థ

మునకు మళ్లించుటలో బుధ తత్త్వము పాత్ర వర్ణింప నలవి కానిది. ఇహము నుండి పరము వరకు నిచ్చెన మెట్లుగ మిథునమందలి బుధుని గ్రహింపవలెను. ఆశయముల నేర్పరచుకొనుచు వానిని సిద్ధింప చేసుకొనుటకు బుధు డత్యద్భుతముగ సహకరించును. బృహస్పతిని కూడు బుధుని సహకారముననే జీవుల నుద్ధరించును. ధనుస్సు నందలి బృహస్పతి మిథున మందలి బుధునితో అనుసంధాన మేర్పరచుకొని జీవుల నుద్ధరించుచు నుండును.




మానవ మనస్సును చేరుటకు బృహస్పతి బుధుని ప్రయోగించును. బుధుడు మానవునికి బృహస్పతికి నడుమ అనుసంధానము కూర్చు ప్రయత్నమును నిపుణతతో నిర్వర్తించును.

**సమన్వయము :**

సూర్యుని రెండవ కిరణమగు "హరికేశము" ప్రేమ జ్ఞానములకు ప్రతీక. ద్వాదశరాసులలో మిథునము ప్రేమ జ్ఞానముల నందించు రాశులలో ప్రధాన రాశి. ప్రేమ జ్ఞానములు సృష్టియందలి ద్వంద్వములను సమన్వయింపగలవు. ఎచ్చట ప్రేమ జ్ఞానములుండునో అచ్చట

దృక్పథముల నుండి దృశ్యమును గ్రహించు జ్ఞానముండును. వివిధత్వము యొక్క ఆవశ్యకత తెలిసినవాడే జ్ఞాని. జ్యోతిశ్చక్రమున ద్వాదశరాసులలో ప్రతి రాశికిని ప్రతిముఖముగ మరియొక రాశి గోచరించును. ప్రతిముఖములు ప్రతిబింబములేని జ్ఞాని మాత్రమే ఎరుగును. మేషమునకు తుల, వృషభమునకు వృశ్చికము, మిథునము నకు ధనుస్సు, కర్కాటకమునకు మకరము, సింహమునకు కుంభము, కన్యకు మీనము ప్రతిముఖముగ గోచరించినను వానిని ప్రతిబింబము లుగ గుర్తింపవచ్చును. స్త్రీ పురుషులు తూర్పు పడమరలవలె ప్రతిముఖులే అయినను తూర్పునకు పడమర ప్రతిబింబమే. ఆలు మగలు వైవిధ్య భావములు కలిగినను ప్రేమ వలన ఒకరియందొకరికి విలువలు గోచరించును. ఒకరి బలహీనత మరియొకని బలముగ దర్శింపవచ్చును. ఇరువురును ప్రేమ ఆధారముగ ఒకరినుండి ఒకరు నేర్చుకొనుచుందురు. ఇట్లు ఇరువురును సమగ్రతను పొందుదురు. మిథునము జ్ఞానమాధారముగ ప్రేమను, ప్రేమ ఆధారముగ జ్ఞానమును అందించు అద్భుతమగు రాశి. కనుక ప్రతిముఖమగు రాశులను సమన్వయించుటకు మిథునము ప్రధాన రాశిగ దైవము వినియో గించును.

అన్యోన్యమైన దంపతికి ఉత్తమ సంస్కారముగల సంతతి లభించినట్లు, మిథునము - ధనుస్సు దంపతికి సమగ్రమగు మీన తత్త్వము లభించును. అట్లే కన్య తత్త్వము కూడ లభించును. ప్రతిముఖమగు రాశులయందు గ్రహము లున్నచో వానికి కోణముగ నుండు రాశులు పరిష్కారము నీయగలవు. ఉదాహరణకు వృషభము- వృశ్చికము దంపతికి సింహము-కుంభము పరిష్కారము నీయగలవు.

ఇట్లే మిగిలిన రాశులకు కూడ పరిష్కారము లభించును. జ్యోతిషమున ఇది నూతన దృక్కోణము.

| రాశుల జంటలు | | | పరిష్కృత రాశులు | | |
|---|---|---|---|---|---|
| 1. మేషము | – | తుల | కర్కాటకము | – | మకరము |
| 2. వృషభము | – | వృశ్చికము | సింహము | – | కుంభము |
| 3. మిథునము | – | ధనుస్సు | కన్య | – | మీనము |
| 4. కర్కాటకము | – | మకరము | మేషము | – | తుల |
| 5. సింహము | – | కుంభము | వృషభము | – | వృశ్చికము |
| 6. కన్య | – | మీనము | మిథునము | – | ధనుస్సు. |

పై పట్టికను తిలకించినచో మొదటి మూడు జంటలే తరువాతి మూడు జంటలుగ గోచరించును. ఈ సమన్వయము తెలిసినపుడు జ్యోతిష మున పరిష్కార మిచ్చుట సులభమగును.

ద్వాదశ రాసులలోని ప్రతిముఖ రాసులు సమన్వయింప బడినపుడు తదనుగుణమైన ద్వంద్వములు పరిష్కరింపబడి నూతన మగు అవగాహనము ఏర్పడును. భిన్నత్వమందలి ఏకత్వము దర్శింప బడినపుడు భిన్నత్వ మంగీకరింపబడును. అపు డొకరి నొకరు నిరాకరించుకొనక, ఆదరించుకొనుచు స్వతంత్రము ననుభవింతురు. ఎవరిని ఎవరు బంధింపని స్థితి ఏర్పడును.

ఉదాహరణకు ఒంటరితనము కోరు మకరము, బృందమును కోరు కర్కాటకముల కలయిక వలన మకరము బృందజీవనమున

కంగీకరించుట ఆరంభించును. అట్లే కర్కాటకమునకు ఒంటరి జీవితపు విలువలు తెలియును. నిజమునకు బృందజీవనమున, ఒంటరి జీవనమున కూడ విలువలున్నవి. జీవనమున ఒక్కొక్కమారు ఒంటరితన మావశ్యక మనిపించును. అట్లే ఒక్కొక్కమారు బృంద మావశ్యక మనిపించును. నిజమునకు రెండును ఆవశ్యకమే. ఏ సమయమున ఏది ఆవశ్యకమో తెలిసినపుడు రెంటిని అనుభవించ వచ్చును. ఇట్లు ప్రతి అభిముఖ రాసి జంటయందు కూడ వైవిధ్యమగు విలువలు ఆదరింపబడుటకు, మన్నింప బడుటకు మిథునరాశి తత్త్వ మావశ్యకము. రాసుల మధ్య సమగ్ర అవగాహనకు మిథున తత్త్వమును వినియోగించుట ఆధ్యాత్మ జ్యోతిషమున పరిపాటి. ఈ పరిజ్ఞానముగల జ్యోతిష్కులు చక్కని పరిష్కారములు చూపగలరు. ఇట్టి స్థితి కెదుగుటకు జ్యోతిష్కులకు శాస్త్రజ్ఞానమే గాక ప్రేమ జ్ఞానముల ఆవశ్యకత ఎంతయో యున్నది.

ప్రేమ-జ్ఞానములు లేని జ్యోతిషులు ఉత్తమ జ్యోతిషులు కానేరరు. జ్ఞానము లేనివారు సలహాల నందించుటలో వైఫల్యము చెందుచు నుందురు. ప్రేమ జ్ఞానము లబ్బవలెనన్నచో యోగజీవన మవసరము. యోగవిద్యలేని జ్యోతిషులు జీవితమునకు పరిష్కారముల నిచ్చుట అపాయకర మగును. కనుక శాస్త్రజ్ఞానము కన్న యోగ సాధనము ప్రధానమై యుండును. యోగమున పరిణతి చెందు చుండగ, సాధకుని యందు అవగాహనము, సమన్వయము పెరుగును. అది ఆధారముగ జ్యోతిషశాస్త్ర జ్ఞానమును వినియోగింప వచ్చును.

యోగ పరిజ్ఞానములేని శాస్త్రజ్ఞానము నిరర్థకమని భగవద్గీత 7వ అధ్యాయము ఉద్ఘాటించు చున్నది.

**ఒకే తత్త్వము :**

మన సూర్యమండలమునకు మిథున రాశియే హృదయ స్పందనముగ నిలిచి యున్నది. అనగా మన సూర్యుని హృదయము మిథునము నందున్నదని తెలియవలెను. గుండెకాయ కర్కాటకము నందున్నను, దాని సంబంధితమగు హృదయ స్పందనము మిథునము నందే యున్నదని పరమగురువు జ్వాల్‌కూల్ మహర్షి తెలిపియున్నారు. ఈ స్పందనమునకు మూలమైన ప్రణవము కుంభరాశి యందున్నదని కూడ తెలిపియున్నారు. అనగా మన సూర్యుని ఆదిత్య తత్త్వము కుంభరాశి యందుండగ, సవితృ తత్త్వము మిథున రాశియందు, గుండెకాయ అగు సూర్య తత్త్వము కర్కాటకము నందున్నదనియు ఒక రహస్యమును వ్యక్తపరచినారు. మిథునరాశియందు ప్రాణ స్పందనమును అనుసంధానము గావించుకొన్నచో సవితృ తత్త్వము మనకు అనుభూత మగుటకు అవకాశమున్నదని తెలియవలెను. జాతక చక్రమందు ఆత్మ తత్త్వమునకు సంబంధించిన ఆదిత్య, సవిత, సూర్య తత్త్వములను అవగాహన చేసుకొనుటకు కుంభరాశి, మిథున రాశి, కర్కాటక రాశులను జ్యోతిష్కులు పరిశీలించవలెనని కూడ సూచన లిచ్చినారు.

కర్కాటకరాశి యందలి సూర్యతత్త్వము పదార్థమందలి చైతన్యమును అవగాహన గావించును. మిథునమందలి సూర్య తత్త్వము వస్తువుల యందలి ప్రాణస్పందన ప్రక్రియను గుర్తింపజేసి, వస్తువుల యందలి ద్వంద్వములను విశదపరచును. (వస్తువు లనగా రూపములుగ వశించియున్న జీవ చైతన్యము. అది సచేతనముగ గాని అచేతనముగ గాని యుండవచ్చును.) స్పందన దర్శనము వలన

ద్వంద్వములు తెలియబడును. ఒకటి రెండుగ ఏర్పడి ఒకదాని కొకటి భిన్నముగ వర్తించుట చేతనే ఒక వస్తువు లేక ఆకారము నిలబడి యున్నది. సృష్టి సమస్తము ద్వంద్వ ప్రక్రియతోనే నిలచియున్నది. ఒకే ఒక తత్త్వము ప్రకృతి – పురుషులుగ ప్రత్యర్థిత్వము వహించుట వలన సృష్టి నిలబడియున్నదను ధర్మము మిథునరాశియే అనుభూతము గావింపగలదు. భిన్నత్వమును దర్శించి, దాని మూలమగు ఏకత్వ మును గ్రహించుట మిథునరాశి సందేశము.

**బుధతత్త్వము :**

ద్వంద్వత్వము ప్రధాన సూత్రముగ సృష్టి నిర్మాణము జరిగి, ద్వంద్వత్వమే ఆధారముగ సృష్టి, స్థితియందున్నదని తెలుపబడినది. రెండు పరస్పర విరుద్ధ భావములు (ప్రకృతి–పురుషులు) ఒకే తత్త్వము నుండి వెలువడి, ఒకదానితో నొకటి పోటీగ నిలబెట్టబడియుండుట సృష్టియందు గమనించ వచ్చును. ఆక్షరణ వికర్షణము లాధారముగ సృష్టిని నిలబెట్టు ధర్మమునే మిథునరాశి ధర్మమందురు. ఆకర్షణ, వికర్షణములను సమన్వయపరచు తత్త్వము కూడ మిథునమునందే యున్నది. సూర్య మండలమున ఈ తత్త్వమును పరిపాలించు గ్రహము బుధగ్రహము. సృష్టియందీ తత్త్వమును 'నారదు'డని పిలుతురు. ప్రకృతి పురుషుల మధ్యను, ప్రజ్ఞ పదార్థముల నడుమను, సురాసురల నడుమను, మర్త్య అమర్త్యలోకముల నడుమను సంధానము చేయు సూత్రమే నారదుని ప్రజ్ఞ లేక బుధ ప్రజ్ఞ లేక కుమార ప్రజ్ఞ. తల్లిదండ్రులనుండి ఏర్పడిన కుమారుడు తల్లిదండ్రుల నడుమ సంధానకర్తగ యుండును. అతనియందు తండ్రికిని, తల్లికిని అంగీకార ముండును. కుమారుని యందు తల్లిదండ్రుల అంశ యుండుటయే

దీనికి కారణము. అట్లు కుమారులలో ఒకడైన నారదుడు సంధానకర్తగ సృష్టిని సమన్వయించు చుండునని పురాణములు పేర్కొనుచున్నవి. సృష్టికి నారదుడెట్లో, సూర్యమండలమున బుధుడట్లున్నాడు. అతడు సంధానకర్త యగుటచే మిథునరాశి అధిపతిగ ప్రసిద్ధిగాంచి యున్నాడు. తూర్పు పడమరలను, ఉత్తర దక్షిణములను విజ్ఞతతో, వేగముతో సంధానమొనర్చుట బుధ తత్త్వము.

మనయందలి విరుద్ధ భావములను కూడ బుధుని అనుగ్రహ ముతో సమన్వయించుకొన వచ్చును. జీవునకు స్వభావమునకు నడుమ కూడ సమన్వయ కర్తగ బుధు డుపకరించును. బుధుడు బృహస్పతి కెంత చెందినవాడో, చంద్రునకు కూడ అంతే చెందినవాడు. కనుక జ్ఞానమునకు, మోహమునకు నడుమ కూడ అతడు సంధానము చేయగలడు.

**విచక్షణ :**

మిథునమందలి బుధుడు ప్రపంచమందున మెలగుటకు విచక్షణ నిచ్చును. ప్రాపంచిక మానవులు భౌతికలోకమున విచక్షణ ఆధారముగ చిక్కులు పడకుండ జీవితము సాగించు చుందురు. ఇట్టివారు లోక వ్యవహారమున నిపుణులు. లౌక్యము బాగుగ తెలిసినవారు. సాధారణముగ జ్యోతిష చక్రమున బుధుడు నీచ పడనిచో తెలివిగలవానిగ గుర్తింపబడును. మంచి చెడులను బేరీజు వేసు కొనుచు, ఇట్టి వారు జీవితమును నేర్పుతో, జాగరూకతతో నిర్వర్తించు కొందురు. ఎంత నేర్పు గలవారైనను ప్రారబ్ధ కర్మవశమున చిక్కులలో పడుట విదితమగు విషయము.

ఆత్మసాధకుల విషయమున మిథునమున కధిపతియైన బుధుడు అంతః బహిర్లోకముల యందు వర్తించు విధానమును తెలుపును. కాలమును దేశమునుబట్టి అంతరంగమున ఎపుడుండ వలెనో, బహిరంగమున నెపుడుండవలెనో అను విచక్షణ నిచ్చును. ప్రతి దినము, ప్రతి వారము, ప్రతి పక్షము, మాసము, ఉత్తర దక్షిణాయనముల యందు కొన్ని సమయములు అంతరంగానుభూతికి అనుకూలములు. కొన్ని సమయములు బహిరంగానుభూతికి అనుకూలములు. సాధకుడు బుధుని సహాయమున ఈ విచక్షణను పొంది పర్వ సమయములందు అంతరంగమందుండుట, ఇతర సమయములందు బహిరంగమందుండుట నేర్చును. ఉదాహరణకు ప్రాతఃకాలము, ప్రదోషకాలము అంతఃకరణము నందుండుట సముచితము. అట్లే పూర్ణిమ, అష్టమి, అమావాస్యలు, ఇతర పర్వ దినములు పంచాంగమున గుర్తించి, ఆయా దినములలో బహిరంగ కార్యక్రమములు నేర్పుగ తగ్గించుకొని, అంతరంగము నందుండుట నేర్వవలెను. ఆత్మ సాధనయందాసక్తిగల సాధకుడు విచక్షణను వినియోగించి, పుణ్యదినములయందు ఇతర కార్యములు తగ్గించుకొని ధ్యానమునకు, స్వాధ్యాయమునకు వినియోగించు కొనవలెను. కొన్ని మాసములలో ఆదివారములు, మరికొన్ని మాసములలో సోమ వారములు, ఇంకొన్ని మాసములలో గురు, శుక్రవారములు పర్వములై యున్నవి. అట్లే కొన్ని తిథులు పర్వములై యున్నవి. పౌర్ణమి, అమావాస్యలు, విషువత్పుణ్య దినములు కూడ పర్వములే అగుటచే అంతరంగ సాధనకు వినియోగించి, అంతఃకరణ శరీర నిర్మాణమునకు

కృషి సలిపినచో అట్టి శరీరము జీవుని ప్రయోజనము నెరిగి భౌతిక శరీరమును వర్తింపజేయును. జీవునికి దేహమునకు నడుమ మధ్యవర్తిత్వము నెరపుటకు సూక్ష్మ శరీర మావశ్యకము. జీవుని ఆజ్ఞనే మనసేంద్రియ శరీరములు పాటించవలె ననుట సిద్ధి. అట్టి సిద్ధికై విచక్షణతో కాలమును సద్వినియోగము చేయవలెను. లోపల వెలుపల అనునది కూడ మిథునమే. వెలుపలకు మనసు పనిచేయుచుండగ, లోపల బుద్ధి పనిచేయును. మనసు అంతర్ముఖమైనపుడు, క్రమముగ లోపలి మనసును నిర్మాణము చేయును. అపుడు ఆత్మనుండి బుద్ధికి, బుద్ధి నుండి లోపలి మనస్సుకు, లోపలి మనస్సు నుండి బాహ్య మనస్సునకు ఆదేశములందును. అపుడు యజమాని యగు జీవుని కార్యములు నెరవేరును. కనుకనే జీవునికి అంతరంగికులుగ బుద్ధి, లోమనస్సు యుండవలెను. ఇట్లు అంతరంగ ప్రభుత్వము నేర్పాటు చేసుకొనుట మిథునమునకు సంబంధించిన కార్యక్రమము.

**మిథునతత్త్వము :**

లోకాలోకములను అనుసంధానము చేయునది మిథునరాశి. ఏడులోకము లందు ఒక లోకమునుండి మరియొక లోకమునకు నడుమగల చోటును మిథునముగ దర్శింపవలెను. ఇట్లు ఊర్ధ్వము నుండి అధస్సునకు, అధస్సు నుండి ఊర్ధ్వమునకు నడుమగల చోటు యందు ఊర్ధ్వ అధస్సుల ప్రభావము అవగత మగును. విభిన్న స్వభావముగల ఇరువురి నడుమ, ఇరువురికిని సమ్మతమగు రీతిలో వర్తించగల నేర్పరితనము మిథునమునకే యున్నది. ద్వంద్వములను

సంధించగల రాశిగ మిథునము వైశిష్ట్యము కలిగియున్నది. కనుకనే అధస్సు నుండి ఊర్ధ్వమునకు జీవులను ఉద్ధరించు కార్యక్రమమునకు మిథునము తోడ్పాటు గావించును. దైవదూత లందరియందును మెండుగ మిథునరాశి నేర్పరితన ముండును. వారు దైవమునకు జీవులకు నడుమ అనుసంధాన మొనర్చుటలో నేర్పరులై యుందురు. సత్యమును, ధర్మమును, తదనుగుణమగు సూత్రములను జీవుల కందించుచు జీవులను సంస్కరించుకొనుచు, అనునయముతో వారిని సంస్కారవంతులను చేయుచు, పరిమితము మర్త్యము అగు లోకముల నుండి అపరిమితము అమర్త్యమగు లోకముల లోనికి గొనిపోవుట దైవదూతల కార్యముగ కన్పట్టును. ఇట్టి గురుతర బాధ్యత దైవ సంకల్పమున దేవదూతలు నిర్వర్తింతురు. ఇట్టి వారికి సురాసుర కలహములను చక్కదిద్దుట నుండి మోక్షవిద్య వరకును సమస్త ఉపాయములు తెలిసిన పరమగురువు నారదమహర్షి ఈ రాశికి పూర్ణమగు ప్రతినిధి. విశ్వమంతటికిని అతడు మిత్రుడు.

సర్దుకొనిపోవుట, సర్దుబాట్లు చేసుకొనుట, సర్దుబాట్లు చేయుట, సమన్వయించుట వంటి పాదరస గుణములు మిథునరాశికి చెంది నవి. అన్నివర్గముల వారితోను సర్దుకొనిపోవు స్వభావము ఉండుటచే వారందరికిని సమ్మతముగనే యుందురు. మొక్కలతోగాని, జంతువు లతోగాని, మానవులతోగాని, దైవీ స్వభావము గలవారితోగాని, ఆసురీ స్వభావము కలవారితోగాని కలసిమెలసి యుండుట, వారి విభేదము లను సమన్వయించుట, విభిన్న కోణములను సమన్వయించి దృశ్యము నిచ్చుట వంటి కౌశలము కల తత్త్వము మిథునతత్త్వము.

**దేవదూతలు :**

మిథునరాశి అధిపతియైన బుధుడు జీవుల స్వభావమును త్వరితగతిని విచక్షణతో పరిశుద్ధము చేయగలడు. పరిశుద్ధమగు మనసు అంతరంగమున బుద్ధి ద్వారా దివ్యసంకల్పము, దివ్య జ్ఞానమును పొందుటకు పాత్రత సంతరించుకొనును. క్రమముగ ఆత్మ తత్త్వమును కూడ బడయును. అపుడు ఆత్మ, బుద్ధి, మనసు ఒక త్రాటిపై నిలువగా, అంతఃకరణ శరీరమేర్పడి జీవునికి దివ్యలోక సంబంధ మేర్పడును. అపుడు జీవుని పరిశుద్ధ స్వభావము దివ్య స్వభావమై మార్పు చెంది, జీవునికి తారణ మిచ్చును.

విచక్షణయందు మానవుని మనస్సు స్థితి గొనినపుడు, సాధకునికి బుద్ధిలోకమున ప్రవేశించుటకు వీలగును. బుద్ధి అటు ఆత్మకు, ఇటు మనసేంద్రియ శరీరములకు సంధానకర్తగ ఏర్పడి అంతర్లోక, బహిర్లోక అనుభూతులను ప్రసాదించు స్థితిని కలిగించును. అట్టి సమయమున సాధకుడు దివ్యలోక సంకల్పములను అందు కొనుట, మనసేంద్రియ శరీరములచే నిర్వర్తింపజేయుటగా జీవితము సాగును. క్రమముగా జీవనము దివ్యజీవనమై మార్పుచెందును. అటుపైన దివ్య ప్రణాళికకు వాహికయై దేవదూతగ మారును. మిథునరాశి ప్రత్యేకించి దేవదూతలకు సంబంధించిన రాశి. నారద మహర్షి అన్ని లోకములందు దేవదూతగా ప్రకాశించు చున్నాడు. అతడు మిథునరాశి తత్త్వమునకు తలమానికమైనవాడు. పరమ గురువు లందరును కూడ దేవదూతలే యగుటవలన వారునూ ఈ రాశి సంబంధము కలిగియున్నారు.

ఊర్ధ్వలోకములనుండి దివ్యప్రణాళిక నందుకొనుట, దానిని భూలోకమున నిర్వర్తింపజేయుట మైత్రేయాది గురుపరంపర ప్రధాన కర్తవ్యమై యున్నది. మైత్రేయుడు, పరమగురువు జ్వాలాకూలుడు మిథునరాశి తత్త్వమును అధికముగ వినియోగపరచు చుందురు. వారు మానవులను వాహికలుగ గావించుకొని భూమిపై ప్రణాళికను నిర్వర్తింపజేయుదురు. మానవులు పరమగురువుల అనుసంధానమున దివ్యలోకమందలి సంకల్పములను మానవ లోకములందు, జంతు వృక్ష ఖనిజ లోకములందు నిర్వర్తింపజేయుచు తరించుట మిథునరాశి కార్యమే.

**తోడ్పాటు :**

మానవుడు జీవుడుగ దివ్యాత్మ స్వరూపుడు. స్వభావముచేత మానవుడు జంతువులకు, వృక్షములకు, ఖనిజములకు అగ్రజునివంటి వాడు. అతని కర్తవ్య మంతయు మానవ, జంతు, వృక్ష, ఖనిజ లోకము లతో ముడిపడి యున్నది. తమ తమ్ములను చేరదీయుట, సంరక్షించుట, వారి వృద్ధికై తోడ్పడుట అను బాధ్యత అగ్రజునికున్నట్లు, తనయందలి దైవీతత్వముతో ముడిపడి, తాను సంధానకర్తగ తోటి మానవులను, జంతువులను, వృక్షములను, ఖనిజములను సంరక్షించి వాని పరిణామమునకై తోడ్పడుట మానవ కర్తవ్యము. మనకన్న పెద్దవారి నుండి ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులను పొందుచు తన క్రింది వారికి తోడ్పడుట మన కర్తవ్యమై యున్నది.

"These are from those whom I follow to those who follow me" అనునది దివ్య ప్రణాళికాబద్ధమగు వాక్యము. మనకన్న

పెద్దలగు గురువులను, దేవతలను ఆరాధించుచు, వారితో అనుసంధానము చెందుచు, వారి నుండి అందివచ్చిన సంకల్పమును, జ్ఞానమును, క్రియాశక్తిని తోటి మానవుల కొరకు, జంతు వృక్ష ఖనిజముల కొరకు వినియోగించుట అనునది మిథునతత్వము. అందుకు ఊర్ధ్వలోకముల నుండి అందుకొనుచున్నప్పుడు తాను స్త్రీగను, క్రింది లోకముల కందించు చున్నపుడు తాను పురుషుడుగను మానవుడు మిథునత్వమును నిర్వర్తించుచున్నాడు. తాను ఇతరులకెంత తోడ్పడునో అంతగ ప్రార్థన, ధ్యానము, పూజాదికములందు తనకు గురు, దేవతా సంఘముల నుండి తోడ్పాటు లభించుచుండును. తాను పొందినది, తానందుకొన్నది తన పరిసరముల యందు సద్వినియోగము చేయుటవలన మాత్రమే మానవుడు సద్గతిని పొందగలడు. మిథునమందలి ధన, గుణ సంకేతమగు స్తంభములు ఈ సందేశము లిచ్చుచుండును. కేవలము జీవితమున అన్నియు పొందుటయేగాక, పొందిన వానిని వివేకముతో పంచుట వలననే సద్బుద్ధి లభించును. కనుకనే యజ్ఞము, దానము ఆరోహణ క్రమమున ప్రధానమగు లక్షణములుగ చెప్పబడినవి. విద్యావిధానమున మానవునకీ బోధనము చిరుప్రాయమునే అందించకుండుట వలన తరతరములుగ మానవులు స్వార్థపరులై, సృష్టి పరిణామమునకు అంతరాయముగ నిలిచినారు. ఊర్ధ్వ, అధస్సులకు నడుమ గొంతు నందు ఇరుక్కున్న రేగిపండువలె మానవులు నిలిచి యున్నారు. కనుక సతమత మగుచున్నారు.


**ఆనంద స్వరూపులు :**

మిథునరాశి యధిపతియగు బుధుడు దివ్యజ్ఞానమునకు ప్రతీక కాగ, శుక్రుడు దివ్యానుభూతికి ప్రతీక. బుధునివలన హృదయమందు బుద్ధివికాసము కలిగి, విజ్ఞానమయ కోశము ఆవిష్కరింపబడును. జ్ఞానము నవతరింప జేయుటయే విజ్ఞానము. జ్ఞానమును పొందుట ఒక ఎత్తు, అట్టి జ్ఞాన మాధారముగ పరిసర జీవుల నుద్ధరించుట మరియొక ఎత్తు. ఈ రెండును సవ్యముగ ఎవనియందు సాగునో అట్టివాడు దివ్యానుభూతికి నిజమగు అర్హత సంపాదించుకొనును. అట్టి అనుభూతికి అధిపతి శుక్రుడు. దివ్యజ్ఞానము నవతరింప జేయుటవలన విజ్ఞానమయ కోశము వికాసము చెందుచుండును. జ్ఞానము విజ్ఞానముగ అవతరించుచుండగ, అనుభూతి ఆనందము ఆనందమయకోశము నావిష్కరించును. కనుక బుధుని కార్యము ప్రాతిపదికగా, శుక్రుడు ఆనందమను ఫలము నిచ్చును. కనుకనే పరమగురువు జ్వాలాకూలుడు సత్సాధకులకు మిథునమందలి శుక్రుడు అనుభూతి నిచ్చునని వెల్లడించెను.

యజ్ఞార్థము, సాధనార్థము జీవితము నిర్వర్తింపని వానికి కలుగు అనుభూతులు భ్రమలు, భ్రాంతులే. ఎవ్వరైనను తమ అనుభూతులను తరచుగ తెలియపరచు చున్నపుడు, వారి జీవన విధానమును పరిశీలించి చూచినచో, అనుభూతులు సత్యమో లేక భ్రమయో తెలియును. పరహితముతో ముడిపడని జీవనమునకు అనుభూతి యన్నది స్థిరమై యుండదు. అనుభూతులకై వెంపరలాడక యజ్ఞార్థ జీవితమును నిర్వర్తించుకొనుట వలన స్థిరము, సుఖము

అగు ఆనంద మెప్పుడును యుండును. సిద్ధులు సదా ఆనందస్వరూపులై యుండుటకు కారణ మిదియే.

జ్ఞానమును క్రియాశక్తి ద్వారా అవతరింపజేయుచు భూమి జీవులకు మేలు కలుగుచున్న సందర్భమున నిజమగు శుక్రస్పర్శ లభించును. కనుక జ్వాల్‌కూల్ మహర్షి ఈ క్రింది త్రిభుజమును తమయందు ధరింపుడని తన అనుయాయులను నిర్దేశించినాడు.




శుక్రునినుండి దిగివచ్చిన భూమికి, శుక్రుడే బుధుని ద్వారా ఉద్ధారణ కలిగించునని, అట్టి కార్యమున పాల్గొన్న మానవులు శుక్రునిలోనికి ఉద్ధరింప బడుదురని ఆధ్యాత్మిక జ్యోతిషము తెలుపు చున్నది.

**పరిణామము :**

రాశి చక్రమున మూడవరాశి మిథునము. ఏడు తరగతుల జీవరాశులలో మూడవది పశుజాతి. ఖనిజము, వృక్షము ఒకటి, రెండు జాతులు కాగా పశువులు మూడవ జాతి. నాలుగవ జాతియైన మానవుడు, మూడవ జాతియగు పశువులను సంరక్షించుటలో తాను

వృద్ధి చెందునని తెలియవలెను. దానిని తెలియజేయుటకే పురాణ పురుషుడు కొంతకాలము గోపాలకుడుగ వర్తించినాడు. ఏసుక్రీస్తును కూడ గొఱ్ఱెలకాపరిగ పేర్కొందురు. పశువులను సంరక్షించుటలోనే మానవుల వృద్ధి యున్నదిగాని హింసించుటలో లేదు. పశుహింసను నివారించుటకే గౌతమబుద్ధుడు అహింసా విధానమును ఆచరించి శాసించినాడు. మతములందలి పశుహింసను తానుగ నివారించి నాడు.

ఏనాడు మానవజాతి పశువుల నాదరించునో ఆనాడు మాత్రమే మానవుడు దైవముచే ఆదరింపబడును. అనుదినము భూలోకమున జరుగు పశువధయే మానవ లోకములకు వ్యాపించి కలహములు, కల్లోలములు, యుద్ధములు, మారణ హోమములుగ నిర్వర్తింప బడుచున్నవి.

మానవుడు దివ్యలోకములకు, పశులోకములకు నడుమజాతి వాడు. తనకన్న ఊర్ధ్వముగ దేవతా లోకములున్నవి. తమకన్న వెనుకబడిన జాతిగ పశుజాతి యున్నది. పశువుల నుద్ధరించిన వాడు ఉద్ధరింపబడును. పశుపోషణము, రక్షణము మానవుని కర్తవ్యమై యున్నదని తెలిసిన మానవులు మిక్కిలి అల్పసంఖ్యలో నున్నారు.

మరియొక ముఖ్య విషయము. మానవ స్వభావము, మానవ రూపము పశువు నుండియే పరిణతి చెందినది. ఈ విషయమున డార్విన్ సిద్ధాంతము సత్యము. కాని ఈ స్వభావము నధిష్ఠించి ఈశ్వరుడే జీవుడుగ మానవ శరీరమందున్నాడు. అనగా జీవుడుగా

మానవుడు దివ్య స్వరూపుడు. స్వభావపరముగ మానవుడు పశువు. పశువు వలననే మనసేంద్రియ శరీరములను మానవుడు వాడుచు దేహపోషణము, సంరక్షణము చేయును. మానవుడు తనయందలి పశు స్వభావమును క్రమముగ, మానవ స్వభావముగాను, దైవీ స్వభావముగాను తీర్చిదిద్దుకొనుచు పరిణామము చెందును. పశు రూపమున నున్న తన స్వభావమును తానే ఉద్ధరించుకొనవలెను. అట్టి సమయమున పశుహింస వీడవలెను. ఇది నిశ్చయమగు సూత్రము.

**శని తోడ్పాటు :**

మిథునరాశి చంద్రుని చేతను, గురుని చేతను, కుజుని చేతను, యముని చేతను కూడ పరిపాలింపబడు చున్నది. చంద్రుని ద్వారా అనిశ్చితి; బృహస్పతి ద్వారా సమన్వయ శక్తి; కుజుని ద్వారా పట్టుదల, శ్రద్ధ, భక్తి; యముని ద్వారా సంకల్పబలము ఈ రాశి నుండి భూమిని చేరును. శని ప్రభావ మంతంత యగుటచే నిరంతరత్వము, బద్ధత, క్రమశిక్షణ కరువై యుండును. కనుక ఈ రాశివారు ప్రత్యేకించి శని స్పర్శను అందుకొనవలెను. శనైశ్చరుడు క్రమబద్ధత నిచ్చును. నూనెధారవలె నిరంతరత్వము నిచ్చును. ఒకే పనిని ఒకే విధముగ, ఒకే సమయమున దశాబ్దముల తరబడి నిర్వర్తించగల శక్తి శనిదేవుడే ఈయగలడు. ఎచ్చట శని బలముగ నుండునో అచ్చట కార్యము లన్నియు సిద్ధించును. శనిబలము లేనిచోట కార్యములకు శాశ్వతత్వము, స్థిరత్వము యుండదు. భూమిపై ఒక సంప్రదాయము గాని, ఒక


సత్కార్యముగాని అవతరించి దీర్ఘకాలము ప్రభావంతముగ నుండుటకు శని తరంగము లవసరము. శని ఏ విషయమునైనను భూస్థాపితము చేయగలడు, స్థిరపరచగలడు. మిథునరాశి అధిపతియగు బుధుడు పాదరసమువలె తెలివితేటలు ప్రదర్శించుటకు ఎంత ఉత్సహించునో, కట్టుబాటుకు, నియమ నిబద్ధతకు అంత విముఖత చూపును. చిక్కక, దొరకక తిరుగుట పాదరస ప్రభావము. పాదరసమును ఘనీభవింప జేయుట విశిష్టమగు విద్య. అట్లే మిథునరాశి వారిని స్థిరముగ కట్టుబాటు యందుంచుటకు శని శిక్షణము తప్పనిసరి. శని శిక్షణము, శని స్పర్శలేని మిథునము పొగరుబోతు, తిరుగుబోతుగ, మాటల నేర్పరిగ, చిక్కక దొరకక వ్యర్థుడగు అపాయము పొంచియున్నది. లంగరులేని పడవ ప్రయాణము వంటిదిగ, గాలివాటున సాగిపోవు జీవితమై యుండును.

సూర్యుని ఆరు కిరణములును, ఆరు గ్రహములకు సంబంధించియుండగ, ఏడవ కిరణము శనికి సంబంధించి యున్నది. ఏడవదియగు శనితత్త్వము వలననే సమస్తము భూమిపై అవతరించి యున్నది. శుభ గ్రహములగు బుధ, గురు, శుక్రులును, అశుభ గ్రహములగు చంద్ర, కుజ, భూ గ్రహములును శని వలననే సౌర కుటుంబమున స్థిరముగ నున్నవని పరమగురువు జ్వాలాకూలుని సందేశము. శనిలేని సౌరమండలము సూత్రములేని గాలిపటము వంటిది. కనుక మిథునమునకు శని తోడ్పాటు అత్యవసరమై యున్నది. శని లేనిచో అవతరణమే లేదు. స్థిరత్వమే లేదు. సర్వమూ భావమయమై యుండిపోవును.

**క్రతుబద్ధము :**

భూగోళమందలి క్రతువిద్యాలయము లన్నియు కూడ మిథునము, ధనుస్సు రాశులచే పరిపాలింపబడు చున్నవి. మిథునము అంతర్లోకములలోనికి ద్వారములుగా ఏర్పడగ, ధనుస్సు ఆ ద్వారము నుండి ప్రవేశించుటకై వలసిన దీక్ష, శిక్షణల నిచ్చును. దీక్ష లేనివారు ఏమియూ సాధించలేరు. దీక్షకు ఓర్పు, సహనము, సంకల్ప బలము, బాధ్యత పడుట, అతిచిన్న విషయములందు కూడ శ్రద్ధ ప్రధాన లక్షణములై యున్నవి. ఇవి యన్నియు సప్తమ కిరణముచే పరిపాలింప బడుచున్నవి. సప్తమ కిరణము సప్తమ గ్రహమగు శనైశ్చరుని లక్షణములు కలిగియున్నది. వారిరువురి వర్ణము కూడ ఒకటియే. మిథునమందలి బుధుడు, ధనుస్సు నందలి గురుడు, తుల యందలి శనితో సత్సంబంధ మేర్పరచుకొన్నప్పుడు క్రతుబద్ధముగ కార్యములు నిర్వర్తింపబడి సిద్ధించును. మిథునరాశి మాహాత్మ్యము అపరిమితము. కాని ఆ రాశి వైభవము అవతరించుటకు వలసిన లక్షణమా రాశి యందు నిక్షేపింపబడలేదు. కనుక దివ్య సంకల్పములను భూమిపై అవతరింప జేయుటకు తులయందలి శనైశ్చరుడు అత్యావశ్యకమై యున్నాడు. అనాదిగ దివ్య సంకల్పములను అవతరింపజేయు వారందరు ప్రధానముగ గురు, బుధ, శని గ్రహ బలము కలిగినవారై యుందురు. బృహస్పతి నుండి బుధుడు దివ్యసంకల్పములను బడసి మనసేంద్రియ శరీరములకు దీక్షగ శనిబలముచే కార్యములు సిద్ధింపజేయుట కద్దు. కనుక అవతరణమునకు ఈ మూడు గ్రహములు, మూడు రాశులు ఒక త్రిభుజమై వర్తింపవలెను. అపుడే దివ్యత్వము

భూమిపై అవతరించుట జరుగును. కనుక మిథునరాశి ధనూరాశి తోను, తులారాశితోను చక్కని సంబంధ మేర్పరచుకొనుట ఒక ఉపాయముగ తెలియవలెను. ముగ్గురు సాధకులు ఈ మూడు రాశు లకు సంబంధించినవారై యున్నచో, వారిద్వారా కార్యసిద్ధి సుగమ మగును.




క్రతు విద్యాలయమునందు ఈ యంత్రమే ప్రధానముగ ఉపాసింప బడును.

**ఏకత్వము :**

మిథునరాశి జంట ప్రజ్ఞలకు సంకేతము. ఒకటి రెండుగ గోచరించుట మిథునము వలననే. ఒకే తత్త్వము ప్రకృతి-పురుషులుగ, అర్థనారీశ్వర తత్త్వముగ ఏర్పడుట మిథునము. రెండుగ కనిపించినను అది నిజమున కొకటియే. రెండు కన్ను లున్నను చూపొక్కటియే. రెండు నాసాపుటము లున్నను శ్వాస ఒక్కటియే. రెండుగ గోచరించు ప్రాణాపానములు కూడ ఒకే శ్వాసకు సంబంధించిన రాక పోకలు.

రెండు దవడ లున్నను నోరు ఒక్కటియే. రెండు చెవులున్నను వినికి డొక్కటియే. రెండు చేతులున్నను పని ఒక్కటియే. అట్లే రెండు కాళ్ళున్నను నడక ఒక్కటియే. ఇట్లు శరీరమందు రెండు రెండుగ గోచరించునవి నిజమున కొకటిగనే యున్నదని తెలియవలెను.

మానవుని యందు ప్రాణమున్నది. ప్రాణ ప్రవాహ మున్నది. ప్రజ్ఞ యున్నది. ప్రజ్ఞ ప్రభావ మున్నది. ప్రాణము, ప్రజ్ఞ చక్కగ సమన్వయింపబడినచో యోగ జీవన మారంభమగును. ప్రాణము, ప్రజ్ఞ నిజమగు కవలలు. ఆత్మయే ప్రజ్ఞా ప్రాణములుగ శరీరమున వర్తించుచుండును. ప్రజ్ఞకు ప్రాణము, ప్రాణమునకు ప్రజ్ఞ తోడ్పడుట ప్రధానము.

ప్రజ్ఞకు ప్రధాన కేంద్రము ఆజ్ఞ. ప్రాణమునకు ప్రధాన కేంద్రము హృదయము. ఈ రెండు కేంద్రములు అనుసంధానము చెందినపుడు జీవుని కతని స్వభావముతో సామ్య మేర్పడును. ప్రజ్ఞ ప్రాణకేంద్రమగు హృదయమున స్థిరపడినను లేక ప్రాణము ప్రజ్ఞా కేంద్రమగు ఆజ్ఞయందు స్థిరపడినను యోగస్థితి కలుగును. ఇందు మొదటి స్థితి యోగమని, రెండవ స్థితి రాజయోగమని తెలుపుదురు.

పై తెలిపిన యోగస్థితిని పొందుటకు మనస్సు యందలి ప్రజ్ఞను శ్వాసపై నిలుపుట ప్రధానము. అట్లు నిలుపుట వలన ప్రజ్ఞ శ్వాస ఆధారముగ హృదయమును చేరి, స్పందనముగ స్థిరపడును. అటుపైన క్రమముగ ప్రాణముతో కూడి తన స్వస్థానమగు ఆజ్ఞను చేరును.

కనుకనే ఆధ్యాత్మ జ్యోతిషమున మిథునరాశి శ్వాస నధిష్ఠించి యున్నదని తెలుపుదురు. శ్వాస ఆలంబనముగ ప్రజ్ఞ తన నిజస్థితిని

చేరుట, అటుపై ప్రజ్ఞా ప్రాణములు ఏకత్వము చెంది ఆత్మదర్శన మగుట మిథునముయొక్క పరమ ప్రయోజనము.

**నియుక్తము :**

ఏకోన్ముఖుడగు సాధకుడు క్రమముగ బహుముఖ ప్రజ్ఞాశాలి యగుట విదితమే. బహుముఖ ప్రజ్ఞ మిథున తత్త్వమునకు సంబంధించినది. మిథున రాశి వారు బహు విషయములందు, బహు శాస్త్రములందు పరిచయము కలిగి యుందురు. కాని దేని యందును ప్రావీణ్య ముండదు. మిథునమునకు ప్రతిముఖముగ నుండు ధనుస్సునందు ఏకోన్ముఖ లక్షణ మున్నది. ఈ లక్షణమును మిథున మాశ్రయించినచో క్రమవికాసము, బహుముఖ ప్రజ్ఞత్వము కలుగును.

వృక్షము పెరుగునపుడు ఏకోన్ముఖముగనే పెరిగి బహు శాఖలుగ విస్తరించును. శాఖలు ఉపశాఖలుగ విస్తరించును. వానికి రెమ్మ లేర్పడును. రెమ్మలకు ఆకులు, పుష్పములు, ఫలములు ఏర్పడును. అవియన్నియు చూపరులకు చాలా అందముగను, ఆకర్షణముగను యుండును. కాని బహుశాఖలకు ఆధారము మూలము, కాండము, వేర్లే కదా! బలమైన కాండము లేకున్నచో బహుశాఖలుగ విస్తరించుట వీలుపడదు. శాఖలకే ఫలములు, పుష్పములు ఏర్పడును. కాండమునకు కాదు. కాని కాండము లేక శాఖలు లేవు.

మిథునరాశి వారు బహువిషయము లందాసక్తి యున్నను వారి ఆశయము సిద్ధించుటకు ఒకానొక ఆశయమును ఎన్నుకొని దీక్షగ నిర్వర్తించుట ప్రధానము. అట్లు నిర్వర్తింపకుండిన జీవిత

మంతయు ఊహాగానములతోను, గాలిమేడలతోను నిండియుండును. ఏ ఆశయము నిర్వర్తింపక, బహువిషయములందు వాచాలత్వము నెరపుచు గాలికి తిరుగువారుగ ఏర్పడుట మానవులయందు విస్తారముగ గోచరించు చుండును. ఇట్టివారు గుంజకు గొడ్డును కట్టినట్లుగ ఒక ఆశయమున నియుక్తులను చేయుట సద్గురువు చేయు మహోపకారము.

ధనస్సునందలి గురువు, మిథునమందలి బుధుని ఆ విధముగ నియుక్తము చేయుటయే గణపతి ఎలుకపై ఎక్కుట.

**జీవుడు - స్వభావము :**


మిథున మందలి కవలలు ఒకరినొకరు మన్నించుకొన్నచో మానవుడు ఉత్తమ గతిని చెందునని జ్వాల్‌కూల్ మహర్షి సూచించినారు. అందొకరు దివ్యత్వమునకు ఉన్ముఖమై యుండగ, రెండవవారు సహకరించుట నేర్చినచో, అట్టి ఉత్తమ స్థితి కలుగునని, అట్టి సమయమున ఋషులందరు సంతసింతురని తెలిపినారు.

అట్లనుటలో మహర్షి ఉద్దేశమేమనగ, జీవుడు - అతని స్వభావము కవల లని అందు జీవుడు దేవయానమున కుత్సహింపగ, స్వభావము సహకరించుట జరుగవలెనని అర్థము. స్వభావము జీవుని అనుసరించినచో జీవుడు జీవన ప్రయోజనమును నెరవేర్చగలడు. స్వభావము యొక్క సహకారము వలన జీవునికి సామరస్య ముండును. అది అనుకూల దాంపత్యమువలె నుండును. స్వభావ సహకారము అంతంత మాత్రముగ నున్నచో జీవునియందు స్పర్ధ యుండును.

మానవునియందు స్పర్థ, అశాంతి, కలవరము, ఆందోళన ఏర్పడి యుండుటకు కారణము స్వభావ సహకారము లేకుండుటవలననే. స్వభావము సహకరించినచో జీవుడు, జన్మ కారణమును పరిపూర్తి గావించుకొన గలడు. లేనిచో జీవనయానము ఒక పోరాటముగ సాగును.

నిజమునకు స్వభావమును జీవుని ప్రయోజనమునకు అనుకూలముగ తీర్చిదిద్దుకొనుటయే సమస్తసాధన. వాహనమును ప్రయాణమునకు తీర్చిదిద్దుకొనునట్లు సాధకుడు తన స్వభావమును తీర్చిదిద్దుకొనవలెను. ఈ విధముగ జీవ స్వభావము, జీవుడు జీవుని ప్రయోజమునకు తోడ్పడుట వలన జీవుడుద్ధరింపబడును. అట్లు కాక జీవుడు స్వభావము ననుసరించినచో అవరోహణ క్రమమున బద్ధుడై జన్మపరంపరలలో చిక్కుకొనును.

జీవుడు పరిపూర్ణముగ స్వభావము ననుసరించునపుడు కూడ అతనియందు స్పర్థ యుండదు. కాని మానవుడు పాశవికమగు స్థితి చేరును. అట్లుగాక స్వభావము జీవుని పరిపూర్ణముగ అనుసరించినచో ఊర్ధ్వగతి చెందును. జీవస్వభావ సమైక్యతయందు జీవుని, స్వభావము నధిష్ఠించి యుండవలెనుగాని, స్వభావమును జీవుడు అనుసరించు టగ నుండరాదు.



# కర్కాటకము

**పరిచయము :**

బృందములు బృందములుగ జీవించుట యనునది జంతు పరిణామము నుండి జీవుల కలవడెను. రక్షణభావము ప్రధానముగ పశువులు గుంపులు గుంపులుగ జీవించును. అదే స్వభావము మానవులుగ ఏర్పడినపుడు కూడ అంటిపెట్టుకొని యుండును. గుంపులు గుంపులుగ యుండుట వేరు, ఒకే చైతన్యము అందరి యందు పనిచేయుట వేరు.

ఒకే చైతన్యము అందరియందు పనిచేయుటను బృంద చైతన్య మందురు. కేవలము భౌతికముగ గుంపులుగ కూడియుండుట మంద స్వభావ మందురు. కులాభిమానము, భాషాభిమానము, ప్రాంతీయ అభిమానము, దేశాభిమానము, జాతి అభిమానము ఆధారముగ మానవులు గుమిగూడు చుందురు. ఇక కుటుంబము, బంధువుల విషయమున చెప్పనక్కరలేదు. ఇట్టి 'మంద' స్వభావము ఎంత చదువుకున్న వారికైనను తప్పనిసరియై పరిమితి చేయుచుండును. ఇట్టి భావము కల వారందరు కర్కాటకరాశిచే పరిపాలింపబడు చుందురు. ఏ కార్యము తలపెట్టినను తమవారికోసమే అన్నట్లుగ మమకారపడు చుందురు. ద్వాదశ రాశులలో అమితమగు మమకారము కర్కాటకరాశి యందే గోచరించును. వీరికి తరతమ భేదములు హెచ్చు. పాక్షికమగు బుద్ధి అధికము. తప్పొప్పులతో

సంబంధము లేక తమవారిని సమర్థించుట, రక్షించుకొనుట, మమకారము కారణముగ తమదైన వస్తువులను, తమవారను భావించు వారితో విడదీయరాని బంధము వీరి కేర్పడియుండును. జీవుల యందు అధికమగు మమకారమునకీ రాశి ప్రభావమే కారణము.

కుంభయుగమున దేహపరమగు సంబంధములుగాక ఆత్మపరమగు సంబంధములకు ప్రాముఖ్యత మెండు. ఆత్మపరమగు సంబంధము ఆత్మవంతులకే తెలియునుగాని సంసారబద్ధులకు తెలియదు. దేహబద్ధత నుండి ఆత్మబద్ధత వరకు గల పరిణామ మంతయు ఈ రాశి యందిమిడి యున్నది. మమకారమునకు మూలమైన మనసు చంద్రునికి ప్రతీక. ఆత్మానుభూతిని పొందు ఆత్మచైతన్యమునకు సూర్యుడు ప్రతీక. చంద్రుని మమకారము నుండి, సూర్యుని ఆత్మతత్త్వము వరకు నిర్దిష్టమగు జ్యోతిష మార్గమున్నది. పరిణతిని కోరు సాధకులకు ఈ మాసమున కుజు డధిపతిగ సదాచార దీక్ష నిచ్చును. చాతుర్మాస్యదీక్షలు వీనికి ప్రతీక. శని శిక్షణ నిచ్చును. వరుణుడు పరిమిత చైతన్యమునకు వ్యాప్తి నిచ్చును. పై విధమగు నిర్దిష్ట మార్గమును బృహస్పతి ఇచ్చును. అతడే ఈ రాశియందు ఉచ్ఛ స్థానమునుండి సర్వమును నిర్వర్తించును. కనుకనే ఈ మాసమున గురుపూర్ణిమారాధన సంప్రదాయమై నిలచినది. గురువిచ్చిన దీక్షను పట్టుదలతో నెరవేర్చుటకు కుజుడు, ఓర్పుతో నిర్వర్తించుటకు శని, వ్యాప్తి నిచ్చుటకు వరుణుడు దోహదపడుదురు. కనుక సత్సాధకులకు కర్కాటకము బద్ధజీవనము నుండి ముక్త జీవనమునకు ద్వారములు తెరచును.

**నాటకరంగము :**

జీవులు దేహములు ధరించుటకు, ప్రపంచములోనికి వ్యాప్తి చెందుటకు కర్కాటకరాశి ముఖద్వారమై యున్నది. దేహమును ధరించుట, దేహ సంబంధములు, పరిసరముల యందు మమకార పడుట, మమకారపడిన వ్యక్తులయందు, విషయముల యందు బద్ధులగుట, తమనుతాము మరచుట దేహధారణము కారణముగ జరుగును. నాటకమున పాత్రపోషణమునకు వేషము ధరించువాడు తన పాత్రయే తానను అపోహ చెందుట ఎట్లో, దేహమున ప్రవేశించిన జీవుడు కూడ తాను పురుషుడనని, స్త్రీనని లింగభేదమును భావించును. అట్లే బ్రాహ్మణుడని, క్షత్రియుడని, వైశ్యుడని, శూద్రుడని భ్రాంతి చెందును. దేహధారణకు పూర్వము అందరును జీవులే. ధరించిన దేహమును బట్టి వైవిధ్యము తోచును. ఒక నాటకమున అందరును నటులే. అందొకడు రాజుగను, మరొకడు మంత్రిగను, మరొకడు బంటుగను పాత్రలను ధరించునపుడు, నాటకరంగమునందే అవి సత్యముగాని, ఇతర సమయములందు బంటు బంటును కాదు, రాజు రాజును కాదు. పాత్రధారణము వంటిదే దేహధారణము. నాటక రంగము వంటిదే సృష్టిరంగము. ఈ సృష్టిరంగమునే శ్రీరంగ మందురు. ప్రతినిత్యము నటుడు నాటకరంగమున ప్రవేశించునట్లే జీవుడు సృష్టిరంగమున ప్రవేశించును. నటనకు తానెవరో తనకు గుర్తు ఉండును. తన వేషధారణము తాత్కాలికమని తెలిసియుండును. నాటకమందలి భార్య, భర్త, సంతానము, బంధువులు, మిత్రులు, శత్రువులు నాటకము వరకే పరిమితము. నాటకమున భార్యవలే

నటించు స్త్రీ రంగము వదిలిన వెనుక తన భార్య కాదు కదా! అట్లే అందలి శత్రువులు తన శత్రువులు కాదు కదా!

ఇట్లు పై తెలిపిన విధముగ భార్యయని, భర్తయని, సంతాన మని, బంధువులని, మిత్రులని, శత్రువులని భావించు వారెవరును నిజమునకు రంగము దిగిన వెనుక, అట్టి బంధములు, అనుబంధ ములు ఉండనేరవు. నటునికీ విషయము సుస్పష్టము. అట్లే నిజ జీవితమునగల సంబంధము లన్నియు కూడ తాత్కాలికములని తెలిసి, తాను వసించు, నిర్వర్తించు రంగము కూడ నాటకరంగమేనని భావించి జీవించువాడు జ్ఞాని లేక యోగి. అట్టివారరుదుగ నుందురు. అధిక సంఖ్యాకులు భ్రమ చెంది మోహమున పడుదురు. అట్టి భ్రమ భ్రాంతికి మూలకారణము కర్కాటకరాశియే. తనది కానిది తనదనుకొని భ్రమపడి దుఃఖించుట, తరతమ భేద భావముతో జీవిత మంతయు ఘర్షణము చెందుట కర్కాటకరాశి ప్రాథమిక లక్షణములు. అవరోహణ క్రమమున జీవుడు దేహము ధరించి మోహము పొందుట సహజము. జన్మల తరబడి అట్లు మోహపడి జీవుడు చక్రభ్రమణమున తిరుగుట 'దక్షిణాయన' ప్రవేశమని, అట్టి మోహము నుండి మేల్కాంచి తనను తానెరిగి, తన స్వస్థానము చేరుట 'ఉత్తరాయణ' ప్రవేశమని తెలియ వలెను.

**జీవుల రూపధారణ :**

ప్రజ్ఞ, ప్రాణము, రూపము అను మూడు అంశములు వరుసగా స్థిరరాశి, చరరాశి, ద్విస్వభావరాశులకు సంబంధించి యున్నవి. మరల చరరాశులలో మేషము ప్రజ్ఞకు సంబంధించియుండగ, రూపము

కర్కాటకరాశికి సంబంధించి యున్నది. రూపధారణము వలననే ప్రజ్ఞకు వ్యక్తావ్యక్త స్థితులు కలుగుచున్నవి. ప్రజ్ఞ శాశ్వతముగ నున్నను రూపమున్నప్పుడే తెలియబడును. రూపము స్థూలముగను, సూక్ష్మము గను కూడ నుండవచ్చును. శరీరములు ప్రధానముగ మూడు రకములుగ తెలుపబడుచున్నవి. స్థూలమగు భౌతికదేహము, అటుపైన సూక్ష్మదేహము, ఆపైన సూక్ష్మతరమైన కారణదేహము. సూక్ష్మ కారణ దేహములు వెలుగు శరీరములుగ గుర్తింపబడినవి. ఈ దేహము లన్నింటికిని కాలపరిమితులున్నవి. పుట్టుట, పెరుగుట, నశించుట అను లక్షణములు కలిగినదే దేహము. ఇట్లు ప్రజ్ఞ ఆధారముగ అనేకానేక దేహము లేర్పడుచుండును. ప్రాణము ప్రజ్ఞను దేహముతో అనుసంధానము చేయును. ప్రాణమువలననే పుట్టుట, పెరుగుట యుండును. ప్రాణ ముపసంహరింప బడినపుడు ప్రజ్ఞ రూపమును విడివడి ప్రజ్ఞ నిలచును. రూపము నశించును. రూపము నశించు నపుడు పంచభూతముల లోనికి లీనమగును. మరల ప్రజ్ఞ రూపమును ధరింప సంకల్పించినపుడు పంచభూతములను సంగ్రహించును.

రూపమునకు పుట్టుట, పెరుగుట, తరుగుట, నశించుట యున్నవి. జీవప్రజ్ఞల కట్టి రూపములను అనుగ్రహించు విధానము కర్కాటక రాశియందున్నది. రూపముల కమృతత్వము లేదు. కాని రూపమున కాధారమైన పంచభూతములు సృష్టి యున్నంతకాల ముండును. మహదహంకారము నుండి పుట్టిన తామస అహంకారము ద్వారా పంచభూతము లేర్పడును. రూపము లేర్పరచుటకు పంచ భూతములే ఆధారము.

జీవులకు రూపములనిచ్చు కథ యంతయు కర్కాటక రాశి యందిమిడి యున్నది. రూపముల ననుగ్రహించుట వలననే జీవులు సృష్టియందు ప్రవేశించి, వైవిధ్యమగు అనుభూతి పొందుచున్నారు. జీవుల రూపధారణ కథ యంతయు కర్కాటక రాశియందు నిక్షిప్తమై యున్నది. దానిని సమగ్రముగ తెలియుటకు సామాన్యులకు వీలు పడదు. సంకల్పమాత్రమున పంచభూతములతో దేహము కట్టు కొనుట, మరల సంకల్పమాత్రమున దేహమును పంచభూతముల లోనికి లయమొనర్చుట తెలిసిన సిద్ధులు కలరు. వారిని నిర్మాణకాయు లందురు. అట్టి నిర్మాణకాయులకే కర్కాటక రాశి రహస్యములు సమగ్రముగ తెలియగలవు.

## భూతవర్తనములు :

కర్కాటకము కార్యకారణ సంబంధిత లోకములలో విశేషమగు ప్రభావము చూపును. ప్రస్తుతము కనబడుతున్న కారణములకు బీజములు కార్యరూపమున ఇదివరకే నిర్వర్తించబడినవి. హఠాత్తుగ సృష్టిలో ఏమియును జరుగదు. పెంచకయే ఒక వేపమొక్క, ఒక రావిమొక్క గృహ ఆవరణమున మొలకెత్తును. అట్లు మొలకెత్తునపుడు ఆశ్చర్యము కలుగును. ఆ మొలకకు కారణము పూర్వమే బీజముగ గృహ ఆవరణమున ఏర్పడి యుండునుగదా! విత్తనము లేని మొలక మొలవదు. విత్తనము భూమియందు జొరబడుట గమనింప బడనపుడు, మొలకెత్తినపుడు ఆశ్చర్యము కలుగును. అనూహ్యమగు విషయముగ గోచరించును. అట్లే జీవుల స్వభావములో విత్తనము లేర్పడుచున్నపుడు గుర్తింపబడక, అవి కార్యరూపము దాల్చునపుడు గమనించుట జరుగును. ఈ వ్యక్తి ఇట్లుండుటకు కారణమేమి అనునది

తెలియవలెనన్నచో, అతనియందు బీజప్రాయమగు సంకల్పము లుండును. పూర్వము ఒనర్చిన కార్యముల వలన వాని ఫలములు బీజప్రాయమై సంస్కారమున చేరి, మరల కాలము దేశము అనుకూల మైనపుడు మొలకెత్తుట ఆరంభమగును.

దృశ్యమగు విషయమునకు తెరవెనుక అదృశ్యమగు కారణ మున్నది. ఇట్లు దృశ్యాదృశ్యములుగ, కార్య కారణములు వర్తించుచు నుండును. మూడు లోకములు కార్యకారణ సంబంధముననే ఏర్పడు చుండును. ఇట్లనంతముగ సాగుట సృష్టియందు గమనింపవచ్చును.

జీవులు దేహములు ధరించు కార్యములకు కర్కాటకము అధ్యక్షత వహించి యుండును. ఎవరికెట్టి దేహములు లభింపవలెనో, జీవులు పూర్వమొనర్చిన కర్మమును బట్టి యుండును. జీవుని భూతవర్తనమే ప్రస్తుత పరిస్థితికి, భవిష్యత్‌కు పునాదు లేర్పరచును. కనుకనే భూతవర్తనము లెరుగుటకు జరిగిపోయిన కాలములోనికి పరిశోధనలు చేయు విధానము లన్నియును కర్కాటకరాశి సంబంధిత ములే. ఈజిప్ట్‌దేశమున పూర్వమిట్టి ప్రయత్నములు జరుగుచుండెడివి. తద్వారా జీవుని గత చరిత్ర నెరిగి ప్రస్తుతమున కర్తవ్యము లేర్పడుట యుండును. కర్కాటకరాశియందు జాతకునికిగల గ్రహములు అతనిని ఏ విధముగ బంధించుచున్నవో తెలియచేయును.

**జనన మరణ చక్రము :**

పునర్జన్మ రహస్యము లన్నియు కర్కాటక రాశి ద్వారా తెలియ నగును. అట్టి జ్ఞానమును పొందుటకు మానవుడు యోగమున చెప్పబడిన ధారణ ధ్యాన స్థితులయందు సిద్ధి పొందియుండవలెను.

ఋషితుల్యు లగువారు తపోబలముచే జీవుల పూర్వ జన్మలను దర్శించి, తదనుగుణముగ జీవులకు పరిష్కారమార్గములు తెలుపు చుండెడివారు. అట్టి ఋషులు తరచుగ జాతకుని జన్మకుండలి యందలి వృశ్చికరాశి, మీనరాశి యందలి గ్రహసంపత్తిని గూడ పరిశీలించెడివారు. కర్కాటకము, వృశ్చికము, మీనము జలరాశు లగుట వలన వానియందు పూర్వ స్పృహ నిక్షిప్తము చేయబడి యుండును. ఈ మూడు రాశులును మకరరాశితో కూర్చి స్పష్టమగు అవగాహనను పొందుచుండెడివారు.

కర్కాటకమందలి విత్తనములు వృశ్చికమున బయల్పడి జాతకుని పరీక్షకు గురిచేయును. మకరమున పరీక్షలన్నియును పరిష్కరించుకొని జీవుడు నిర్మలుడై మీనమున తరించును. ఇదియొక అవగాహన.

కర్కాటకమునందు దేహము ధరించిన జీవుడు మీనమున తరించుటకు తొమ్మిది(9) రాశుల పరీక్షయు యుండును. జీవుని మొత్తము యాత్రయంతయు ఈ తొమ్మిది రాశుల కథగ పూర్వ సంప్రదాయము లందుండెడిది. దేహధారణము, ప్రపంచమున దిగబడుట, అందుండి క్రమముగ జిజ్ఞాస పథమున ప్రవేశించుట, అటుపైన బంధవిమోచనము, చివరికి తారణ జీవనము అను ఘట్టములుగ ప్రతి జీవి యాత్ర సాగును. ఈ యాత్రలో అనేక మరణ ములు, పునర్జన్మములు సహజమై యుండును. తనను తాను పరి పూర్ణుడు చేసుకొనుటకే జీవుడు మరల మరల జన్మల నెత్తునని తెలియుటవలన ఒక మహత్తర ఉపాయము ఎరుకలో నిలుచును.

జన్మనెత్తుట కేవలము కర్మానుభవమునకే కాదని, పరిపూర్ణత కొరకై చేయు కృషియని తెలిసినచో ప్రతి జన్మమును ఒక అవకాశముగ భావించు పరిణతి కలుగును. పరీక్ష తప్పినవానికి ఆరు నెలలలో మరియొక పరీక్ష పెట్టుట అవకాశమే గదా! మరల పరీక్ష వ్రాయుట కర్మ అనుకొనుట అజ్ఞానము. అవకాశమనుకొనుట సుజ్ఞానము. ప్రతి వైఫల్యము విజయమునకు పునాదియే.

జనన మరణములను ఉచ్ఛ్వాస నిశ్వాసలుగ భావించువాడు చక్రమున బంధింపబడడు. జనన మరణ చక్రమును దైవమందించిన అవకాశముగ భావించువాడు విజ్ఞుడు.

**లోక ప్రయోజనము :**

పునర్జన్మమును గూర్చిన అవగాహన విజ్ఞులయందొక రకము గను, అజ్ఞానులయందొక రకముగను గోచరించును. విజ్ఞులు ఒక దివ్య ప్రయోజనమును నిర్వర్తించుటకై పునర్జన్మమును ఒక అవకాశ ముగ స్వీకరింతురు. వారు జన్మించిన వెనుక క్రమముగ ఆ ప్రయోజన మును బడసి, దానిని నిర్వర్తించి కృతకృత్యులై, శరీరము విడతురు.

అజ్ఞానులు కూడ స్వప్రయోజనమునకే జన్మింతురు. పూర్వము అసంపూర్ణమైన కోరికలను, ఆశలను, ఆశయములను పరిపూర్తి గావించుకొనుటకే జన్మింతురు. వానిని పొందు ప్రయత్నమున మరి కొన్ని కోరికలు, ఆశలు, ఆశయములు ఏర్పడుట జరిగి అసంపూర్ణము గనే మరణింతురు. వీరి కోరికలు, ఆశలు, ఆశయములు ఎప్పటికిని పరిపూర్ణము కావు. వీరు చిల్లుపడిన కుండను నీటితో నింపుటకు

ప్రయత్నించువానివలె ఎప్పుడును వైఫల్యము చెందుదురు. మూడు చిల్లులున్న కుండను ఎంతనింపినను నిండకుండుటయే యుండును. వీరు చేసిన కార్యములే చేయుచు, వృథా శ్రమను చెందుచు నుందురు. ఇట్టి వారికి కాలక్రమమున దైవానుగ్రహముగ కర్తవ్యముపై మనసు మళ్లును. అపుడు వారు కామ్య కర్మలనుండి కర్తవ్య కర్మలవైపునకు మళ్ళుదురు. అటుపైన ఒక నిర్దిష్ట లోకప్రయోజనమునకై జీవించు విధాన మబ్బును.

పై తెలిపిన ఇరు తెగలలో మొదటివారు విజ్ఞులు. రెండవవారు అజ్ఞులు.

ఇందు మొదటి ప్రయోజనమున జన్మించువారు కొన్ని జన్మలలో ప్రయోజనము ననుసరించి, గుంపులు గుంపులుగ జన్మింతురు. వారు దాదాపుగ సమకాలికులుగ జన్మింతురు. కాలక్రమమున కలిసి ఒక దివ్యప్రయోజనమును నిర్వర్తింతురు. కలసి వర్తింతురు. ప్రయోజనము సిద్ధించిన వెనుక దాదాపుగ కలిసి నిష్క్రమింతురు. ఆధునిక యుగమున ఇట్లు బృందములుగ జనన మరణములందు సాగుట ఒక విధానముగ ఏర్పడి యున్నది. కలిసి జన్మించుట, కలిసి ఒక ప్రయత్నమునకై వర్తించుట, ప్రయోజనము సిద్ధించిన వెనుక కలిసి నిష్క్రమించుట. ఇది నూతన విధానము. భారతమునందలి పంచ పాండవులు దీనికొక ఉదాహరణము. ఒంటరిగ వచ్చుట, ఒంటరిగ పోవుట అనునవి పటిష్ఠమగు బృందజీవనమున జీవించు సభ్యులకు వర్తింపదు.

**తరింపు మార్గము :**

కర్కాటకరాశి ప్రధానముగ జీవుల అవతరణమునకు సంబంధించిన రాశి. మకరరాశి జీవుల నిష్క్రమణమునకు సంబంధించిన రాశి. అవరోహణమునకు కర్కాటకరాశి, అధిరోహణమునకు మకరరాశి ప్రధానమగు స్థానములను అలంకరించి యున్నవి. ఒక రాశి దక్షిణాయనమునకు ప్రారంభము. మరొక రాశి ఉత్తరాయణమునకు ప్రారంభము. భూమిపై అవతరించుట, అనేకానేకములైన అనుభవములు సంపాదించుకొనుట అను ఘట్టమునకు కర్కాటకరాశి ప్రాధాన్యత వహించును. భూమిపై పరిపూర్ణతను చెంది, ఉన్నత మండలములలోనికి ప్రవేశించుటకు మరియు భూమిపై ఉన్నతమగు జన్మలు పొందుటకు మకరరాశి ముఖద్వారమై యున్నది.

కర్మానుసారము దేహములు ధరించువారు, దివ్య కర్మానుసారము దేహములు ధరించువారు కూడ కర్కాటక రాశి ముఖద్వారముననే ప్రవేశింతురు.

అనాదిగ భూమినుండి తరింపు కోరువారు, తరింపునకై అనేకానేక ప్రయత్నములు చేయుదురు. ప్రార్థనలు కూడ చేయుదురు. తరింపు కోరువారికి తరింపునకు మార్గము చూపుటకై దేహధారణమునకు సంసిద్ధులుగ నుండువారు కూడ ఈ రాశి ముఖద్వారముగనే భూవలయమున ప్రవేశింతురు. తరింపు కోరువారు, తరింపునకు దోహదము చేయువారు ఇరువురును భూమిపై దేహములు ధరించి సంచరింతురు. ఈ ఇరువురి కలయక అత్యంత సుందరఘట్టము. అదియే రామాయణము నందలి సుందరకాండ కూడ. ఆర్తితో

తరింపునకై ప్రయత్నించు వానికి తరింపు మార్గమునిచ్చు ఒక దివ్యజీవి సమీపించుట, తరింపుకోరు జీవునకు ఒక శాశ్వత పరిష్కారము. కనుక కర్కాటక రాశియందు అత్యంత శుభప్రదమగు గురు–శిష్య సమాగమము ఋషులచే నిర్దేశింపబడినది. అదియే 'గురుపూర్ణిమ'.

గురుపూర్ణిమా సంప్రదాయమును ప్రపంచమున నెలకొల్పు టకు హిమాలయ గురుపరంపర ఒక చక్కని కృషి సలిపినది. ఈ సంప్రదాయము పటిష్ఠమైనకొలది మానవజాతి పురోగతికి సౌలభ్యము మెండగుచుండును. సద్గురువు చంద్రునివలే చల్లని స్పర్శతో ప్రవేశించి వెన్నెలవలె జ్ఞానము ప్రసాదించి జీవులను కడతేర్చును. కనుకనే ఈ రాశి కధిపతిగ చంద్రుడు, ఉచ్చ స్థానము నలంకరించిన వానిగ గురుని జ్యోతిషము తెలుపుచున్నది.

**జిజ్ఞాసత్వము :**

జిజ్ఞాసువు యొక్క చిత్తమునందు వెలుగంతంత మాత్రముగనే యుండును. పదార్థమునందలి ఆసక్తివలన చిత్తమందలి వెలుగు వికీర్ణమై, విచలితమై మిణుగుమిణుగు మనుచుండును. కొడిగట్టుచున్న దీపమువలె యుండును. దాని సమీపమునకు గురువను వెలుగు చేరునపుడు బలమందుకొని తేజరిల్లును.

మందలో నొకనిగ నుండు జిజ్ఞాసువు జిజ్ఞాసత్వము కారణముగ తన పరిష్కారముకొరకై ఎదురుతెన్నులు చూచును. గురుసాన్నిధ్యమున కొంతబలము చేరి ప్రకాశించుట ఆరంభించును. ఇచ్చట జిజ్ఞాసువు చంద్రునివంటి వాడు. గురువు బృహస్పతి వంటి వారు. బృహస్పతి సాన్నిధ్యమున చంద్రుని కాంతి స్థిరపడి వెలుగుచు

నుండును. అపుడు గురువగు బృహస్పతి చంద్రుడగు జిజ్ఞాసువునకు దీక్ష నొసగును. దీక్షాయుతుడైనటువంటి జిజ్ఞాసువు దీపము కొడిగట్టకుండగ అప్రమత్తతతో చూచుకొనును. అదియే దీక్ష! నియత కర్మలాచరించుచు కామ్య కర్మలనుండి తన్ను తాను పరిరక్షించుకొను చుండగ రాగద్వేషములు, కామక్రోధములు, ఆశాభయములు, ఈర్ష్య అసూయలు క్రమముగ హరింపబడును. అదియే దీపము కొడిగట్ట కుండుట. నిరంతరము నియత కర్మయందే యుండు దీక్ష కుజ బలమున కలుగును. అట్టి బలము గురువు నుండి శిష్యునికి లభించును. శిష్యుని జిజ్ఞాసత్వమే సూత్రముగ గురుడు బల మందించును.

దీక్షయందు స్థిరముగ నున్న శిష్యునకు గురువు శనివలె శిక్షణ నిచ్చును. దీక్షాయుతునకే శిక్షణ వీలగును. దీక్ష లేనివానికి శిక్షణ కుదరదు. ఇట్లు సద్గురువు బృహస్పతివలె దీక్షా శిక్షణల నిచ్చుచుండగ, జిజ్ఞాసువు నందు వెలుగు వృద్ధి చెంది బుద్ధిగ స్థిరపడును. అదియే బుధ జననము. బుద్ధియందు పుట్టిన జిజ్ఞాసువునకు ద్విజత్వము లభించును. అట్టి ద్విజత్వమున జ్ఞాన వైరాగ్య యోగములు సిద్ధించుట సుగమ మగును.

పై తెలిపిన కార్యక్రమమంతయు ఒకటి నుండి పన్నెండు జన్మలలో జిజ్ఞాసువుయొక్క పాత్రత వలన సిద్ధించును. ఈ నడుమ జిజ్ఞాసువెక్కడ జన్మించినను సద్గురువతనిని అనుసరించుచునే యుండును. కనిపెట్టుచునే యుండును.

ఇట్టి సౌభాగ్యమగు అమరిక కర్కాటక మాధారముగ ఋషు లేర్పరచినారు.

**అనుకరణ :**

కర్కాటకరాశి జలరాశి యగుటవలన, రాశి అధిపతి చంద్రుడగుట వలన సముద్రమందు ప్రతిబింబించిన చంద్రునివలె చిత్తము అనిశ్చితిలో యుండును. కలవరపాటు యుండును. భయముండును. తనను తాను కాపాడుకొనవలెనని నిత్యప్రయత్న ముండును. నిర్దిష్టమగు గమ్యముండదు. జ్ఞానము అందివచ్చినను చిత్తమున స్థిరపడదు. పరిసరప్రభావములే అధికముగ నుండును. సముద్రతీరమందలి పీతవలె అటునిటు కంగారుగ తిరుగుచు, భయము కలిగినపుడెల్ల రంధ్రములలోనికి చనుచు జీవితము గడుపును. చిన్న విషయములు కూడ అమితమగు ఆందోళనము కలిగించును. అరుపులు, పెడబొబ్బలు తరచు వ్యక్తమగుచుండును. ఇట్టి పీతవంటి జీవునకు క్రమముగ స్థిరము కలిగించుట సులభమగు విషయము కాదు.

కర్కాటకరాశి వారికి సింహరాశి సాన్నిధ్యము అత్యంత ఉపయోగకరమని పరమగురువు జ్వాలాకూలుడు తెలిపినాడు. సింహము స్థిరమగు చిత్తము, సూటియగు ప్రవర్తనము, రక్షణ భావము గల తత్వము. అట్టివారి సాన్నిధ్యమున కర్కాటకమునకు ఊరట కలుగును. చిత్తమునకు స్థిమితము దక్కును. అనుకరణ విద్యయందు కర్కాటకము దిట్టయగుటచే, సింహమువలె స్థిరముగ నుండుట, తన యందు తానుండుట, ఆత్మ విశ్వాసమును బడయుట ఇత్యాదివి నేర్చును. కర్కాటకరాశి వారికి సింహరాశి వారి మైత్రి అత్యంత సురక్షితముగ తోచును. సింహరాశి వారికి కర్కాటకరాశి వారు అనుసరణీయులుగ గోచరింతురు. వినయవిధేయతలతో కూడిన కనిష్ఠ

సోదరునివలె లేక అభిమాన పుత్రికవలె సహాయకారులుగ నుందురు. వారి సాంగత్యమున సింహరాశి వారికి ప్రేమ, ఆదరణ లభించుచు నుండును.

సాధకులైన వారు తమయందు కర్కాటకరాశి స్వభావము మెండుగ నున్నచో కోరి సింహరాశి వారి సాంగత్యము బడయ వలయును. ఇది ఒక చక్కటి ఉపాయము.

**ప్రతిబింబ లక్షణము :**

మానవ శరీరమందు కర్కాటకరాశి ఉరస్సు నాక్రమించి యుండును. ఉరస్సునందే శ్వాస ప్రక్రియ, రక్త ప్రసారము, మంచి రక్తము చెడు రక్తముగ మారుట, మరియు చెడు రక్తము మంచి రక్తముగ మారుట, హృదయ స్పందనము జరుగుచుండును. అనాహత చక్రము కర్కాటకరాశికి సంబంధించినదే.

మనసు శ్వాస ప్రక్రియపై యుంచినపుడు మనోమయకోశము, ప్రాణమయకోశము, అన్నమయ కోశము శుద్ధి కాగలవు. అష్టాంగ యోగమందలి నాలుగవ అంగమైన ప్రాణాయామము ఈ రాశి సంబంధితమగు ప్రక్రియ. ప్రాణాయామము ద్వారా ప్రాణ స్పందనముతో జీవప్రజ్ఞ అనుసంధానము చెందునపుడు చిత్తమందలి అపరిశుద్ధత అంతయు తొలగి, మానవుడు రాజయోగమార్గమున స్థిరచిత్తమును, ప్రశాంతతను పొందగలడు. మనసునకు గల చంచలత్వము (మూడ్స్) హరింపబడి జీవనము ప్రశాంతమై సాగగలదు. చిత్తభ్రమలు కూడ తొలగి స్థిరచిత్తము, స్ఫూర్తి లభించగలదు.

చిత్తభ్రమలు, పూనకములు, భూతగ్రహములు ఇత్యాది వన్నియు కూడ కర్కాటకరాశిచే పరిపాలింపబడు చుండును. ఈ రాశివారి మనస్సు అత్యంత సున్నితమగుటచే, సులభముగ వీరి మనస్సును వశము చేసుకొనవచ్చును. సద్విషయములు గాని, ఇతర విషయములు గాని సులభముగ వీరిపై ప్రభావము చూపును.

పాలు, పాలతో చేయబడు పదార్థములు అన్నిటిపైనను కర్కాటకరాశి ప్రభావముండును. పాలు, పెరుగు, నేయి దేహ కోశము లను శుభ్రపరచుటకు యోగులు సైతము విరివిగ వినియోగింతురు. సాధకులు అంతఃకరణ శరీర నిర్మాణమునకు పూర్వకాలమున పాలు, వెన్న, నేయి విరివిగ వాడెడివారు. ఈ పదార్థము నందలి వేడిమి యోగసాధకుని వీర్యవంతునిగ, బలమున నిలుపును. వార్ధక్యము వాయిదా వేయబడును.

చంద్రునకు, మనసునకు, వెండిలోహమునకు కర్కాటకరాశికి అనుబంధమున్నది. మనసును ప్రశాంత పరచుటకు పాలు, వెన్న, పెరుగు, నేయితో పాటు వెండిలోహమును కూడ వైద్యమందు వాడుట కద్దు.

కర్కాటకరాశి యందలి చంద్రునకు సంగీత స్వరజ్ఞానము సహజముగ నుండును. సంగీతముద్వారా ఈ రాశివారిని ఉత్తేజ పరచవచ్చును. అట్లే గురుసాన్నిధ్యమున వీరు త్వరితగతిని ధారణ స్థితి చేరగలరు. ఋణసంజ్ఞ ప్రధానముగ గల రాశి కర్కాటకరాశి. పరిసరములందలి మంచి చెడులను వీరు సులభముగ ఆకర్షింతురు. వాని ప్రభావమునకు కూడ సులభముగ లోబడుదురు. సంఖ్యా

పరముగ కర్కాటకరాశి రెండు (2) అంకె ప్రధానముగ కలిగియున్నది. వీరు తమకు తాముగ ప్రకాశింపలేరు. కాని ఇతరుల ప్రకాశము వీరినుండి ఆకర్షణీయముగ వ్యక్తమగును. రాముని ప్రభావము భరత లక్ష్మణుల యందిట్లే ప్రకాశించెడిది. భరతుడు, లక్ష్మణుడు పుష్యమి, ఆశ్లేష నక్షత్ర ప్రభావములు కలవారు. వారి నుండి రాముడే నిజముగ ప్రకాశించెను. సూర్యుని కాంతి చంద్రుని నుండి ఆకర్షణీయమగు వెన్నెలగ ప్రకాశించును గదా! ప్రతిబింబ లక్షణము గల కర్కాటకరాశి చక్కని అనుచరులను ఈయగలదని తెలియవలెను.

**జీవుల పుట్టుక :**

పరిసరముల ప్రభావము కర్కాటకరాశి వారిపై అమితముగ నుండును. నలుగురు పోవుదారిలో పోవుట కిచ్చగించరు. నలుగురితో కూడియుండుట కిచ్చగించరు. ఒంటరితనము భరింపలేరు. ఒంటరి తనమన్నచో భయముండును.

కర్కాటకరాశి వారి మనోభావములు కూడ స్థిరముగ నుండవు. అటునిటు ఊగుచు నుండును. వారుగ స్వతంత్రించి ఏ నిర్ణయములు చేయరు. అనుసరించుటకు, అనుకరించుటకు సంసిద్ధులై యుందురు. వీరికెప్పుడును ఆసరా అవసరమై యుండును. వీరు చక్కని అనుచరులు. వీరికి భగవంతుని చేరు నవవిధ భక్తి మార్గములలో భజనము, కీర్తనము ఇష్టమై యుండును. అట్టి మార్గమున వీరు వృద్ధి చెందు అవకాశము మెండు. భక్తిమార్గము నాశ్రయించిన కర్కాటకరాశి వారికి ఇంద్రుడు, కుజుడు వలసిన వృద్ధినిత్తురు.

కోటానుకోట్ల జీవులు కర్కాటకరాశి ప్రభావముననే జన్మముల నెత్తుచుందురు. మరణ రహస్యము తెలియువరకు జీవుల పుట్టుక అజ్ఞానమందే జనించును. వారి మరణము కూడ అజ్ఞానముననే సంభవించును. మరణమును గూర్చి తెలియువరకు కర్కాటక ప్రభావముననే పుట్టుక సంభవించు చుండును. తదనుగుణ జ్ఞానము పొందినవారికి పుట్టుక వెలుగులో జరుగును గనుక, మకరరాశి ప్రభావము వారిపై ఎక్కువగ నుండును. జీవుల పుట్టుకకు కర్కాటకము ముఖద్వారము కాగ, వారు మరల వెలుగులో పుట్టుటకు మకరము ముఖద్వారమని పరమగురువు జ్వాలాకూలుడు ఉద్ఘాటించినాడు.

ప్రతి పుట్టుకయు, జీవనము జీవునికి అనుభవమును, అనుభూతి నిచ్చి మరియొక పుట్టుకకు తోడ్పడును. ఇంచుమించుగ అన్ని రాశుల యందు జీవులు జనించుచు, తదనుగుణమగు అనుభవములు గ్రహించుచు, మనోవికాసమును పెంచుకొనుచు ముందుకు సాగుచుందురు. మానవుడు పరిపూర్ణుడగుటకే ప్రకృతి జన్మ పరంపరల నేర్పరచినది. అందు జనన కార్యక్రమమంతయు కూడ కర్కాటకరాశి అధ్యక్షతన జరుగును.

**శరీరపుంజము :**

కర్కాటక రాశియందు జీవులకు రూపము, మనస్సు సంక్రమించును. మేషమందు జీవుడు ఆత్మ తత్త్వమును, వృషభమందు ఆత్మ సౌందర్యమును, మిథునమందు బుద్ధిని సంక్రమించుకొని కర్కాటకమున మనసేంద్రియ శరీరమును పొందును. మనస్సు

కారణముగ కార్యకారణ లోకములలోనికి ప్రవేశించును. మనస్సున జీవునకు కారణముతో పనిచేయుట యుండును. అది కారణముగ కర్మ పుట్టుచుండును. కర్మ కారణమై జన్మ పరంపరలు ఏర్పడును. ఈ కార్యకారణ వలయమునందే మానవులు, జంతువులు యుగముల తరబడి, కల్పముల తరబడి చక్రగతిన తిరుగుచుందురు. ఇట్టి వారిపై తిథి వార నక్షత్రములు, గ్రహములు తమ ప్రభావమును చూపుచు నుండును.

కారణము లేకయే కర్మములు నిర్వర్తించుట అన నేమో సామాన్య మానవులకు తెలియదు. వారికి కర్మము యజ్ఞార్థమని తెలుయును. ఇది తెలియవలెనన్నచో పంచభూతములు, గ్రహములు, దిగ్దేవతలు, దేవతలు ఎట్లు పనిచేయుచున్నారో మనము గమనింప వలెను. అవతార పురుషుల జీవిత చరిత్రలు శ్రద్ధగ పఠింపవలెను. ఈ పైన తెలుపబడిన వారందరు నిష్కారణముగనే లోకహితమును చేయుచు నుందురు. అట్టి మార్గము నవలంబించి క్రమముగ కర్కాటక ప్రభావమునుండి బయల్పడి మకరము చేరుసరికి కార్యకారణ లోకములనుండి విముక్తులగుట సిద్ధించును. ఇట్టి సిద్ధి పొందిన వారికి మనస్సు, ఇంద్రియములు, శరీరము తాను ధరించిన తొడుగులుగను, సౌకర్యముగను గోచరించునేగాని, వానిని తానుగ భావింపరు. అట్టి వారు జీవితాంతమున దేహము త్యజించుటయే యుండును. వారికి మరణావస్థ యుండదు.

కర్కాటకమున జీవులు శరీరపుంజమును ధరించుటచే రూపకుడగును. శరీర పుంజమనగా మనస్సు, ఇంద్రియములు, శరీరము. ఆ రూపమునకు ఒక నామము కూడ ఏర్పడును. నామ,

రూప, రూపాత్మకమగు జగత్తున తిరుగాడుచు అంతకుమించిన సత్యము లేదను అజ్ఞానమున పడును. తాను జీవుడనని, తన రూపమున తానే ప్రతిబింబించు చున్నాడని తెలియును. నీటిలో ప్రతి బింబితమైన సూర్యునివలె చంచలత్వమును పొందును.

**ద్విజత్వము :**

కర్కాటక రాశియందు జీవుడు దేహధారణము పొందుటచే తనను తాను మరచు అపాయము ప్రధానముగ నున్నది. నామ రూపములకు అతీతమగు స్పందనాత్మక ప్రజ్ఞ, నామరూపములే తాను అను భ్రమను చెందును. కలయందలి జీవునివలె సత్యమును మరచును. ప్రతిబింబిత సూర్యుడు సూర్యునివలె నిశ్చలముగ నుండక నీటి కదలికలకు స్వస్వరూపము కోల్పోయినట్లు జీవుడు తన స్వస్వరూపమును కోల్పోవును. ఈ కోల్పోయిన స్థితిని మరల పొందుటకు ఎన్ని జన్మలైనను పట్టవచ్చును. పూర్ణ వైరాగ్యమున మాత్రమే నిజస్థితి గోచరించును. మోహ శోకములు పూర్ణముగ విసర్జింపబడిననాడే జీవుడు విరాగియగును. అట్టి వైరాగ్యమబ్బుటకు అనువైన సన్నివేశములు ప్రకృతియే కల్పించును. అట్టి స్థితి చేరిన వారికి మాత్రమే కర్కాటకరాశి గంభీరత్వము పూర్ణముగ తెలియును.

ద్విజత్వము చెందుట జీవుని పరిణామ దశలో ఒక ముఖ్య ఘట్టము. నామరూపధారియైన జీవునకు తత్సంబంధితమైన భ్రమ, భ్రాంతి, మోహము కాల్చివేయబడినపుడు వెలుగునందు మరల పుట్టుట ద్విజత్వము. అట్టి వారికి ఈ సృష్టియందు కావలసినదేమియు

లేదు. తాను, తనవారు, తనది అను విషయములు దగ్ధము కాబడి, కేవలము దివ్య ప్రయోజనమునకే జీవించుట యుండును. వీరికి తమయందలి కామశరీరము పూర్ణముగ దగ్ధమై యుండును. ఇటీవలి కాలమున అట్టి స్థితియందు వర్తించినవారే మాస్టర్ ఇ.కె., శ్రీ సత్యసాయి మరియు పూజ్యులు యు.జి.కృష్ణమూర్తిగారు.

అట్టి ద్విజన్ముల నుండి దైవము తానుగనె ప్రకాశించుచు, క్రీడగ కార్యములను చేయుట యుండును. క్రీడామయుడగు కృష్ణుడు ఇట్టివారికి కథానాయకుడు. కోట్లాదిజీవులు కర్కాటకము నుండి పంచభూతాత్మకమైన సృష్టిలోనికి ప్రవేశింతురు. తండోపతండములుగ జీవులు దేహధారులగు చుందురు. కాని నామరూపములనుండి మరల ముక్తి పొందుట ఒక్కొక్కరిగనే సాగును. కర్కాటకము జీవులకు లోయవంటిది. దానికి ప్రతిముఖముగ నున్న మకరము పర్వత శిఖరము వంటిది. ఆరోహణమే సాధన.

**పరిణామ కథ :**

కర్కాటకమందు జీవునకు తన శరీరము, తన స్వభావము తానుగ గోచరించును. తాను రూపమున వసించుచున్న పురుషుడ ననిపించును. దాదాపు మానవజాతి యంతయు ఇట్లే యుండును. అందు వసించు జీవుడు నిద్రాణస్థితిలో నుండును. ఇది మానవజాతి యందలి పసితనము. కేవలము శరీర పోషణము, ఇంద్రియ పరితృప్తికే బాలురు జీవింతురు. పదిమంది ఏమి చేయుచున్నారో గమనించి వారు కూడ అదే నిర్వర్తింతురు. వీరు పెరిగి పెద్దవారైనను ప్రాపంచిక జీవనమందు నిమగ్నులై అందరేమి చేయుచున్నారో వారును అదే

చేయుదురు. వీరికి అంతర్ఘర్షణము లేవియు ఉండవు. బాహ్యా ఘర్షణలే యుండును.

పరిణామ క్రమమున జీవుడు కర్కాటకరాశి నుండి వృశ్చికరాశి చేరునపుడు కొంత పరిణతి చెంది ఆత్మ పరిశీలనము, ఆత్మావ లోకనము చేసుకొనుచు, తాను తన స్వభావమును గుర్తించి తన కనుగుణముగ తన స్వభావముండవలెనని, ప్రయత్న మారంభించును. ప్రాథమికముగ తనకన్న తన స్వభావమే బలమైనదని తెలుసుకొనును. దీక్షతో, పట్టుదలతో, ఓర్పుతో, నేర్పుతో తన స్వభావమును మచ్చిక చేసుకొని తనకు సహకార మందించునట్లుగ తీర్చిదిద్దుకొనును. ఈ అంతః పోరాటము చాలాకాలము పట్టును.

కర్కాటకమున చంద్రుడధిపతిగ, మనస్సుకు తోచిన విషయ ములను ఆచరించుకొనుపోవు స్థితి నుండి వృశ్చికము చేరుసరికి కుజుని ప్రభావమున పట్టుదల, దీక్ష, శని ప్రభావమున తననుతాను యమించుట, ఓర్పు, సహనము, భరించుశక్తి ఇత్యాదివి నేర్చుట జరుగును. వృశ్చికమందలి జీవుడు మధ్యవయస్కునివలె పరిణతి చెందును. జీవుడు తన స్వభావమును గుర్తించి దానిని తన కను గుణముగ మలచుకొనును.

తుదకు మీనము చేరుసరికి జీవుడు జ్ఞానవృద్ధుడై, తన స్వభావమునుండి తాను విడిపడి, తనను తాను జీవునిగ గుర్తించి, తన మూలమైన పరతత్త్వమును చేరు ప్రయత్నమున నుండును. ఇట్టి వారికి బుధ, గురు, శుక్రులు తోడ్పడి జీవుని బ్రహ్మత్వ స్థితికి చేర్చును.

ఇట్లు మూడు జలరాశుల పరిణామ కథను పరమగురువు జ్వాలాకూలుడు క్లుప్తముగ, సరళముగ తెలిపినాడు. ఇది పరిణామ క్రమమున కుజ, శనుల శిక్షణ, బుధ, గురు, శుక్రుల మార్గదర్శకత్వము ఉదహరించినాడు. బ్రహ్మాసిద్ధిని తన్మయత్వ స్థితిగను, దాని నందించు గ్రహమును నెప్ట్యూన్ (ఇంద్రగ్రహము)గను అభివర్ణించినాడు. మనమెరిగిన జగద్గురువు మైత్రేయుడు భూమిపై నెప్ట్యూన్ ప్రతినిధియే అని కూడ తెలిపినాడు. ఇట్లు జలరాశి, గ్రహరాశి తత్త్వములను ఒక పరిణామ కథగ మహర్షి విశ్లేషించినారు. ఇదియొక అపురూపమగు ప్రస్తావనము.

**నివృత్తి మార్గము :**

కర్కాటక రాశి యందు దేహబంధమున పడు జీవుడు తదుపరి తొమ్మిది (9) రాశుల భావములను పరిపూర్ణముగ అనుభూతి చెందినపుడు సంవత్సరాంతమున ముక్తుడగును. ఈ నడుమ కథ యుగముల తరబడి సాగుచునుండును. పుట్టు గ్రుడ్డు నుండి పూర్ణ జ్ఞాని వరకు జరుగవలసిన వికాసము జన్మ జన్మల వికాసముగ జరుగును.

నిజమునకు కర్కాటకరాశికి పూర్వము గల మూడు రాశులు గుర్తించి జీవుడు వెనుకకు మరలినచో మిథునమున బహిరంతరములు తెలియుట, వృషభమున స్వయం ప్రకాశకుడు, అక్షరుడు అగు పురుషుని తెలియుట, మేషమున అట్టి అక్షర పురుషునకు మూలమైన పురుషోత్తముని తెలుయుటగా జరుగగలదు. ఇట్లు తనలోనికి తాను

తిరోగమించుట వలన త్వరితగతిని సత్య దర్శనమగును. కాని కర్కాటకమున జీవునకు బహిర్ముఖ దృష్టి అధికమై, అంతర్ముఖ దృష్టి మరుగైపోవును. ఇది గమనించిన ఋషులు నివృత్తి మార్గమునకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చిరి. అందుకనే వారి జీవితముల యందు ధ్యానము, తపస్సు ప్రధానముగ నుండెడిది.

అంతర్ముఖముగ ధ్యానించుట, బహిర్ముఖముగ ధర్మము నిర్వర్తించుట తెలిపిరి.

ఋషులు, గురువులు బోధించిన విషయములను బాగుగ గ్రహించి కర్కాటకమున అంతర్ముఖ, బహిర్ముఖ దీక్షనందుకొనుట బుద్ధిమంతుల పని. ఇట్టి సమీక్షకు గురుపూర్ణిమను ఉద్దేశించిరి. కర్కాటక రాశియందు చంద్రు డెంత బలవంతుడో, అంతుకుమించి గురుడు (బృహస్పతి) కూడ బలవంతుడు. కనుక సాధకుడు చంద్ర స్వభావ మున పడక గురుని కృప వలన కర్తవ్యమున మేల్కొనును. కర్కాటకము నందలి గురుడు సాధకులకు సులభము, శీఘ్రము, సుఖకరమగు మార్గముల పూర్ణుడగుటకు వలసిన ఉపాయము లందించును.

**జీవుని వికాసము :**

కర్కాటక మందలి చంద్రుడు జీవులకు బాహ్యమగు మమత, అనురాగము, ఆకాంక్ష, ఆపేక్ష, అనురక్తి నిచ్చును. వీని వలన జీవులు బాహ్యమును అనుభవించుటయేగాక, అజ్ఞాతముగ బాహ్యమునకు బంధింపబడుదురు. కనుకనే మరల మరల దేహధారణము జరుగు చుండును.

పై తెలిపిన మమత, అనురాగము, ఆకాంక్ష దైవముతో కలిగినపుడు పై తెలిపిన బంధము లన్నియు అదృశ్యమై దైవసంబంధమే మిగులును. ఇట్టి స్థితి కలిగించు గ్రహము జ్యోతిషమున ఇంద్ర గ్రహ (నెప్ట్యూన్)మని తెలుపుదురు. భూమిపై ఇంద్రగ్రహమునకు మైత్రేయ మహర్షి ప్రతినిధిగ నున్నాడు. మొత్తము సూర్యమండలమును దత్తాత్రేయుడు అధిష్ఠించి యున్నాడు. సమస్త గురుపరంపరకు గురువు దత్తాత్రేయుడు కాగ, భూమిపై గల గురుపరంపరకు మైత్రేయులు అధ్యక్షుడుగ నున్నాడు. అజ్ఞానమును నశింపజేసి జ్ఞానమిచ్చువాడు గురువు. అట్టి గురువు సమాశ్రయమున జ్ఞాన మావిష్కరింపబడి, అజ్ఞానము దహించును. కనుక కర్కాటకము గురు సమాశ్రయము నకు సంబంధించిన మాసముగ ఋషులు పేర్కొనిరి.

కర్కాటకరాశిపై చంద్రుడు, ఇంద్రుడు చూపు ప్రభావము తెలుపబడినది. పరోక్షముగ కర్కాటకరాశిపై మరి 5 గ్రహములు ప్రభావము చూపును. సున్నితమగు స్వభావముగల కర్కాటకరాశి వారిని ఘర్షణకు గురిచేయుట సులభము. వారు త్వరితగతిని కలత చెందుదురు. దానికి కారణము కుజ ప్రభావమే. ఇట్లు తరచు కలత చెందుట అను స్థితినుండి బయల్పడుటకు వారు కుజుడందించు దీక్షాయుత జీవితమును ఆశ్రయింపవలెను. అట్లే కర్కాటకరాశిపై శని ప్రభావము వలన ఆ రాశి వారికి అసహనము, తొందరపాటు, ఏదియును భరింపలేని స్థితి యుండును. వీరు శరీర శ్రమకు కూడ ఓర్వలేరు. ఇట్టివారు గురుడిచ్చు క్రమశిక్షణను అంగీకరించి వర్తించినచో శనైశ్చరుని బలము కలుగును. ఇట్లు కుజ, శనుల బలములను సంతరించుకొనిన కర్కాటక స్వభావము స్ఫూర్తిమంత

మగును. అట్టి సమయమున స్ఫూర్తిదాయకమగు భావములు బుధుడందించగ అంతఃసౌఖ్యము శుక్రు డిచ్చును. ఇట్లు నాలుగు గ్రహముల తోడ్పాటు లభించిననాడు జీవుని వికాసము త్వరితమై సాగును. అప్పటినుండి వరుణుని ప్రభావము ఆసాంతము తోడై జీవునకు సిద్ధి నిచ్చును.

**జన్మప్రయోజనము :**

పునర్జన్మము కర్కాటకరాశి గుణములలో ఒక ప్రధానమైన గుణము. జీవులు మరల మరల పుట్టుచుండుట అను కార్యక్రమము మూడు విధములుగ జరుగుచుండును. మొదట అసంపూర్ణముగ నున్న కోరికల కారణముగ మరల మరల వచ్చుట జరుగుచుండును. తీరని కోరికలే సామాన్యముగ జీవులను మరల పుట్టుటకు ప్రేరేపించును. రెండవ కారణ మేమనగా, మానవుడు ఉత్తమ మానవు డగువరకు జన్మపరంపరలు సాగుచునుండును. మానవుడు ఉత్తమ మానవుడగుట చాల నిదానముగను, దీర్ఘ కాలముగను జరుగు చుండును. ఇట్టివారు కోటానుకోట్ల జీవులలో, శతాబ్దమునకు వంద (100) మందికన్న మించరు. మానవుడు పరిపూర్ణ మానవుడగుటకు అనేక జన్మల కార్యక్రమ మున్నది. అటుపైన జన్మ లెత్తుటకు మూడవ కారణము భూమిపై దైవప్రణాళికను నిర్వర్తించుకొనుటకు జరుగును. పరిపూర్ణ మానవులను దైవము వినియోగించుకొనుట జరుగును కాన, మానవులుగ పుట్టుట జరుగుచుండును.

ఇట్లు మానవ శరీరములు ధరించు జీవులు మూడు రకము లుగ నున్నారు. మొదటి రకము వారు కామ పూరణమునకు

జన్మింతురు. రెండవ రకమువారు పరిపూర్ణత కొరకై జన్మించి, జిజ్ఞాసువు లగుదురు. మూడవ రకము వారు దివ్యకారణము వలన జన్మింతురు. ఈ మూడవ తెగవారిని కారణ జన్ములని సంబోధింతురు. రెండవ రకమువారు జిజ్ఞాసువులు. మొదటి రకమువారు ఆర్తులు, అర్థార్థులు. వీరందరి పైనను కర్కాటక రాశి ప్రభావముండును.

మరల మరల పుట్టుటలో పై మూడు శ్రేణులను గుర్తించుట ప్రధానము. మొదటి 25 సం॥లలో జన్మ కారణము పెద్దలు సులభ ముగా తెలియుదురు. తమ జన్మ కారణమే కాక తమ పరిసరమందలి జన్మ కారణము కూడ తెలియును. దానిని బట్టి యువకులకు దారి చూపుట జ్యోతిషమున ఒక ప్రధానమగు మెలకువ. జ్యోతిషులు జన్మించిన జీవుని ప్రయోజనమేమియో గుర్తించుట ప్రధానముగ నేర్వవలెను. జన్మ ప్రయోజనము తెలియవలెనన్నచో చంద్రుడు, ఆరూఢ లగ్నము, సూర్యుడు ఏ నక్షత్ర విభాగమున నున్నారో గమనించి విశ్లేషించవలెను. అట్లు చేయగలిగినపుడు మహోపకారము కలుగును.

**ఇచ్చుట - పంచుట :**

కర్కాటకమున జీవుని శరీర ధారణ ప్రణాళిక అత్యంత గంభీరముగ నిర్వర్తింపబడు చుండును. ప్రతి జీవునికిని ధన, ఋణ అనుబంధము జన్మపరంపరలలో కలుగుచుండును. కావున జన్మనెత్తిన నాటి నుండి దేహత్యాగము వరకు అనేకానేకమగు లావాదేవీలు, పొందుట యిచ్చుటలు జీవుల నడుమ జరుగుచుండును.

లావాదేవీలు కారణముగనే కొందరికి మనము చేయుట, కొందరు మనకు చేయుటగ ఒక బృందము జీవుని చుట్టును

ఏర్పడుచుండును. ఋణ సంబంధముగాని, ధన సంబంధముగాని లేనివారు మనతో కూడరు. ప్రతి మానవునికిని సహాయమొనర్చువారు కొందరుండగ, ఆధారపడువారు కొందరుందురు. కాలక్రమమున కొందరు చేరుచుండగ, కొందరు విడిపోవుచుందురు. నూతనముగ చేరినవారు మనకు చేయుటకో, లేక మనతో చేయించుకొనుటకో చేరుదురు. ప్రతి చేరిక యందును ఇచ్చిపుచ్చుకొనుటగ సాగు చుండును. భార్య, సంతానము, బంధువులు, మిత్రులు - ఈ సమూహమున మనకు చేయువారు కొందరుండగ, మనతో చేయించు కొనువారు కొందరుందురు. వీరి జమా ఖర్చులు, వీరినొక గుంపుగ ప్రకృతి ఏర్పాటు చేయును. ఈ సత్యము కుటుంబమున దర్శింప వచ్చును. అట్లే బంధు బృందమునందు దర్శింపవచ్చును మరియు మిత్ర బృందమున దర్శింపవచ్చును. కార్యకారణ రూపముల యందు యిచ్చి పుచ్చుకొనుటలోనే ఈ బంధము లేర్పడును. ఇచ్చి పుచ్చుకొను లెక్కల పద్దు ముగియగనే, ఇక ఒకరినొకరు కలియుట యుండదు. అన్నదమ్ములైనను కలియ లేరు. తండ్రి తనయులైనను కలియలేరు. ఇది ఒక చిత్రమగు విషయము. అంతయు ధన ఋణ సంజ్ఞలను బట్టి కూడుచు విడిపోవుచు నుండును.

జన్మలు మారినను మరుజన్మమందు కూడ ధన ఋణ సంబంధములే జీవుల కూడికలు, తీసివేతలు జరుగుచు నుండును. ఇట్లు జన్మించువారు అసంఖ్యాకులు. ఇట్టి కార్యకారణ లోకమునందే సహకరించుట, ఇచ్చుట, పంచుట అను లక్షణములు కలిగి నిష్కారణముగ జీవులకు తోడునీడగ యుండువారు కూడ జన్మింతురు. వారు ఋణ పడక సహాయ సహకారము లందింతురు. వారు

అపరిగ్రహ వ్రతము నాచరించుచు నుందురు. అట్టి వారి నుండి ప్రకృతి ఇతరులకు తరింపు మార్గమును దర్శింపజేయుచు నుండును.

**మార్గదర్శకులు :**

ప్రాథమిక దశలో అసంఖ్యాకమగు జీవకోటికి మార్గము చూపుటకై దైవము తానే ప్రజాపతులుగ, మనువులుగ అవతరించి జీవులకు విజ్ఞాన మిచ్చి, జీవన విధానము నేర్పరచినాడు. అట్టి ప్రజాపతులే ఋషులై యజ్ఞార్థము కార్యకారణ లోకములలో అప్రకటిత ముగ సంచరించుచు నుందురు. అట్లే మను సంతతి కూడ పరిపాలకులై త్యాగనిరతితో పాలించుచు, జీవులు ధర్మము తప్పక జీవించుటకు వలసిన శాసనము లేర్పరచినారు. ప్రజాపతులు- వారి సంతతికాని, మనువులు- వారి సంతతిగాని సామాన్యులనుండి ఏమియు ఆశింపక అన్ని విధములుగ సామాన్యుల వృద్ధికి కృషి సలిపినారు. ఇట్టివారు కార్యకారణ లోకములలో నున్నను, కార్య కారణముల కతీతముగ, నిష్కారణమగు హితము నొనర్చు చున్నారు. ఇట్లు కార్యకారణ లోకములలోనికి కారణాతీతులు దిగివచ్చుట కూడ కర్కాటక రాశి కార్యక్రమము. వారే దీపపు స్తంభములవలె చీకటిలో తిరుగాడు జీవులకు మార్గదర్శకులై యున్నారు. ఇట్టివారు కర్కాటక రాశి యందలి బృహస్పతులని తెలియవలెను. కర్కాటకమందు బృహస్పతి ఉచ్చస్థానమున నుండునని జ్యోతిషము తెలుపుటలోని అంతరార్థ మిదియే.

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అని వేమన యోగి దర్శించి పలికినాడు. పుణ్యపురుషులు లోకుల నుండేమియు కోరరు.

లోకులకు సహాయపడుచు నుందురు. ఇట్టి కోవకు చెందినవారు భూమిపై నుండుట భూమిజీవుల పరిష్కారము కొరకే. హిమాలయ గుహలందు అత్యంత ప్రాచీన గ్రంథమున పై విషయము ఈ క్రింది విధముగ లిఖించబడి యున్నది.

*"ఉద్ధారణకొరకై లోకులు ఆక్రందనము చేయుచున్నారు. వారి ఆక్రందన మిన్ను ముట్టినది. ఆ ధ్వని కారణాతీత లోకముల లోనికి చొచ్చుకొని పోవుచున్నది.*

*చొచ్చుకొని వచ్చుచున్న ఆక్రందనలు గ్రహించిన సాధుజనులు ఆక్రందనకు ప్రతిస్పందనగ నామరూపాత్మక లోకముల లోనికి దిగివచ్చు చున్నారు.*

*నిశ్వాసగ ఆక్రందనములు ఊర్ధ్వలోకముల లోనికి చేరు చుండగ, ఉచ్ఛ్వాసగ పరహితులు అవతరించుచు నున్నారు"* ఈ నిశ్వాస, ఉచ్ఛ్వాసలే కర్కాటకరాశి శ్వాస.

**భక్తి మార్గము :**

దేహధారణము వలన జీవుడు తన సహజమగు సంకల్పశక్తిని, జ్ఞానమును కోల్పోవుట సహజము. ప్రజ్ఞ పదార్థమున ప్రవేశించినపుడు ప్రజ్ఞ మసకబారును. తత్కారణముగ గజిబిజి ఏర్పడును. కర్కాటకరాశి యందు ఈ గజిబిజిని సులభముగ గుర్తింప వచ్చును. పీత నడకను గమనించినచో అందు కంగారు, గజిబిజి, సన్నివేశములకు దూరముగ పారిపోవుట, ఏదో ఒక కన్నములో దాగుకొనుట ఇత్యాది లక్షణములు కనిపించును. ప్రజ్ఞపై పదార్థముయొక్క ప్రభావము ఎంత ఎక్కువ ఉండునో అంత గజిబిజి ఉండును. మసకబారిన వెలుతురువలె

తికమక యుండును. పదార్థము సాంద్రతను బట్టి ప్రజ్ఞయొక్క గజిబిజి హెచ్చుతగ్గులలో నుండును.

తనకుతానుగ నిర్ణయించుకొనగల శక్తి కోల్పోయి ఇతరుల నిర్ణయముపై ఆధారపడుట జరుగును. నిర్వర్తనమున కూడ గజిబిజి యుండును. జీవితమును తన పరిసరములకే పరిమితము చేసుకొని ఈ రాశివారు జీవించుచు నుందురు. ఇల్లు కదలివెళ్లుట, ఊరుదాటి వెళ్లుట, దూరదేశముల కేగుట వీరికి భీతి కలిగించుచు నుండును. అట్లే నూతన పరిచయముల విషయమున కుచించుకొని యుందురు. వీరు బాగా పరిచయమున్న సన్నివేశములలో గాని, ఇతర సన్నివేశము లలోగాని సుఖముగ నుండలేరు. "ఇంటిలో పులి, బయట పిల్లి" అను సామెతే వీరికి పూర్ణముగ వర్తించును.

భక్తిమార్గమే వీరికి పరిష్కారము. ఒక ఉన్నతమగు ఆశయము నేర్పరచుకొని, భక్తితో, త్యాగనిరతితో, ఆ ఆశయమును నిర్వర్తించుటలో వీరి స్వభావము పరిణతి చెందును. మకర రాశి వారితో సాంగత్య మేర్పడినచో వీరి పరిమితులు కొంతవరకు పరిష్కరింపబడ గలవు. భక్తి మార్గమున వీరు సులభముగ ఏకాగ్రతను పొందగలరు. భక్తి యందు అయస్కాంతీకరణము జరుగును గాన తామున్న గజిబిజి నుండి ఉద్ధరింపబడుటకు వీలుపడును. వీరి ఉద్ధారణ ఘట్టము మకర రాశి యందు నిక్షిప్తమై యున్నది. మకర రాశి ప్రభావమున వీరు తమ ఊరు, తమ వారు అను సంకుచిత భావముల నుండి బయల్పడి విశాల ప్రపంచమున ప్రవేశింపగలరు. గోతిలో పడిన గొఱ్ఱె మెట్టను చేరినట్లు, ప్రజ్ఞ పదార్థము నుండి ఊర్ధ్వమునకు లాగబడును. అప్పటినుండి తికమక లేక తానేమి చేయుచున్నాడో తెలిసి చేయుట

యుండును. ఇంటి ప్రభావము నుండి బయల్పడును. యుద్ధ వాతావరణము నుండి కూడ బయల్పడి జీవితమును సాగించును.

**అన్వేషకుడు :**

కర్కాటకమందు జీవుడు శరీరధారణము చేయగనే సహజముగ అక్షరుడగు జీవుడు పదార్థ మహిమకు లోబడి తన అక్షరత్వమును మరచును. క్షరుడై దేహ పోషణార్థము వర్తించుచు, తాను తనది తనవి అను మాయా మోహమున పడి, తనను తాను కీర్తించుకొనుచు దంభముతో జీవించును. మానవకోటియందు యిట్లు తమను తాము పొగడుకొనువారు కోటానుకోట్లుగ నున్నారు. తమను అందరు గుర్తింపవలెనని తాపత్రయపడుచు ధన వ్యామోహము, కీర్తి వ్యామోహము, పరివార వ్యామోహముతో ప్రయాసపడి మరణింతురు. మరల పుట్టినను క్షరులై అజ్ఞానమున బడి అవే పనులు చేయుచు మరణింతురు. కర్కాటక ప్రభావమున జీవున కేర్పడిన క్షరత్వము వృశ్చికమున అంతమగును. ఈ లోపున లెక్కలేనన్ని జన్మలు జరుగ వచ్చును. మరల మరల అదే విధమగు అనుభవములతో విసుగు చెందిన జీవుడు, వృశ్చికమున అన్వేషకుడుగ పరివర్తనము చెందును.

అప్పటినుండి తానెవరు? తానెందులకీ జన్మ నెత్తినాడు? జీవులెందులకు పుట్టుచు, చచ్చుచు నున్నారు? తన జీవన ప్రయోజన మేమి? తాను ఎచ్చటి నుండి వచ్చినాడు? తాను మరణానంతరము ఎటు పోవుచున్నాడు? మరణానంతర మేమి జరుగును? ఇత్యాది ప్రశ్నలు పుట్టి వేధించగ, జ్ఞానమును గూర్చిన పిపాస ఏర్పడి క్రమముగ క్షర, అక్షరముల తానెట్లున్నాడో తెలియుటకై శ్రమించును.

మరణ సమయమునపడు ఆవేదనమున జీవున కెన్నియో ఉపదేశములు జరుగుచు నుండును. మరల దేహము ధరించినపుడు పాత కథ జరుగుచున్నను నూతనముగ నేర్పడిన జిజ్ఞాసత్వము కూడ క్రమముగ పెంపొందును. అట్టి జిజ్ఞాసత్వము మకరమున పరిపక్వత చెందును. మకరరాశి అధిపతియగు శనైశ్చరుడు సహకరించగ, తనయందలి క్షరాక్షరులు స్పష్టమై గోచరింతురు. క్షరత్వమునకు సంబంధించిన కార్యక్రమములను క్రమముగ తొలగించుకొనుచు, అక్షరమగు కార్యక్రమములోనికి ప్రవేశించి తనకు మూలమగు పురుషోత్తమునిపై దృష్టిని సారించును. అట్టివానికి మీనమున అనుగ్రహము వర్షించి బ్రహ్మప్రాప్తి కలుగును. ఇట్టి జీవుని పరిణామ కథ కర్కాటకమున ప్రారంభింపబడి, మీనమున పరిపూర్తి యగును.

**కేంద్రస్థానము :**

*"నేనొక అందమైన జీవితము నిర్మించుకొని అందు సుఖింతును."* ఇది కర్కాటకరాశి భావము.

*"నేనొక రహస్యమగు గుహ నేర్పాటు గావించుకొని, అందు నన్ను నేను శోధించుకొనుచు, నా మూలమును తెలియుదును. ప్రపంచము పోవు దారిన నేనిక చనలేను."* ఇది వృశ్చికరాశి భావము.

*"నేను పర్వతారోహణ ద్వారా ఆకాశమును చేరి అందుండి దేవదూతగ సకల జీవుల క్షేమము కోరి లోకహిత మొనర్తును."* ఇది మీనరాశి భావము.

పై మూడు జలరాశిభావములు జీవపరిణామ కథను క్లుప్తముగ సూచించును. ఇందు కర్కాటకరాశి కథ అవరోహణ క్రమమును

సూచించును. కార్యకారణ ప్రపంచమున ప్రవేశించిన జీవుడు మనస్సు, ఇంద్రియములందు, పంచభూతములందు ప్రవేశించి, అనేకానేకమగు సర్దుబాటులు నేర్చును. జలరాశి యగుట వలన సర్దుబాట్లు సులభమైన రీతిలో సాగును.

కర్కాటరాశి మరియొక విశేష మేమనగ, ఈ రాశి ప్రాణ ప్రవాహము నధిష్ఠించి యుండును. జీవుల యందలి రక్త ప్రసారము నకు కర్కాటకము అధిష్ఠాన భావము. మేషము రక్తమునకు సంబం ధించి యుండగా, కర్కాటకము రక్త ప్రసారమునకు సంబంధించి యున్నది. కనుక ఈ రాశి యందు జాతకునకు కుజుడు, శని, రాహువు ఇత్యాది గ్రహప్రజ్ఞ లున్నచో రక్తప్రసారమునకు సంబంధించిన వ్యాధులను, రక్తపోటు, గుండెనొప్పి, రక్తమందలి రుగ్మతలు జాతకుని నాలుగవ భావమున గాని లేక కర్కాటక రాశి యందుగాని గుర్తించ వచ్చును.

మరియొక విశేషము ఏమనగా, కర్కాటకమందే ప్రాణ స్పందనము, ఉచ్ఛ్వాస నిశ్వాసలు వంటి ప్రక్రియలు జరుగును. ప్రాణాయామము, ప్రత్యాహారము ఇత్యాది స్థితులు. సిద్ధులకు కేంద్రము కర్కాటకము. కర్కాటక మందలి ఇంద్రుడు తన్మయత్వమును కూడ కలిగింపగలడు. మనసేంద్రియ శరీరములను పవిత్రీకరించుకొను సమస్త రాజయోగ ప్రక్రియలకు కూడ కర్కాటకమే కేంద్రస్థానము. అనాహత పద్మమున్నది కర్కాటకరాశి భావమందే కనుక ఈ రాశి స్వస్థానము చేరుటకు ముఖద్వారమైనది. ప్రాణము, వాయువు యొక్క కార్యకలాపము లన్నియు కర్కాటకరాశి సంబంధితములే.

**భ్రమ - భ్రాంతులు :**

కర్మాటకరాశి కేంద్రము మానవుని యందు అనాహతమే అయి ఉన్నను, రాశి అధిపతి చంద్రుడగుటచే కర్మాటక రాశి ప్రజ్ఞ మణిపూరక పద్మము యొక్క స్పర్శను కూడ కలిగి యుండును. అనాహతము మణిపూరక ప్రజ్ఞతో ముడిపడి యున్నపుడు మానవుడు సూక్ష్మలోక ప్రజ్ఞలకు వాహికయై క్రమముగ వానికి దాసుడై జీవించును. పూనకములు పొందిన వారందరు ఇట్టివారే. దేవత లావేశించెనని, మహాత్ము లావేశించెనని, ఎవరో అదృశ్యశక్తి తనను నిర్దేశించుచు, శాసించుచు, పనిచేయించు చున్నాడని భావన చెందువారందరు ఇట్లు మణిపూరకమున బంధింపబడినవారే. ఇట్టివారు తమను తాము బుద్ధితో నియమించుకొననిచో భ్రమ భ్రాంతులలో కొట్టుకొని పోవుచు, తమనేదో దివ్యశక్తి నడిపించు చున్నదని భ్రమ చెంది, ఇతరులను కూడ భ్రమకు లోనుచేసి తాము నష్టపడుచు, కష్టపడుచు, ఇతరులను కూడ కష్టనష్టములకు లోను చేయుదురు.

కర్మాటకమునందు మణిపూరక ప్రభావము అధికముగ నున్న వారు చనిపోయినవారిని చూచుట, వారితో భాషించుట వంటి భ్రమలు చెందుచు నుందురు. వీరికి భూతములు, దయ్యములు గోచరించుట వంటివి కూడ జరుగును. ఇట్టి వారికి సిందూర వర్ణము, రామ నామము, ఆంజనేయ స్తుతి దివ్య ఔషధములు.

పదార్థము కూడగొట్టుకొనుట అనునది కర్మాటక రాశి ప్రభావముకాగా, పదార్థము నుండి విడిపడుట అనునది మకరరాశి లక్షణమై యున్నది. కర్మాటకము సాయంసంధ్యకాగా, మకరము ప్రాతః

సంధ్యయై యున్నది. కర్కాటక మండలి సర్పములే ధనుస్సుయందు గరుడ పక్షులు కాగలవు. కర్కాటకమునకు తులారాశి పాతాళము కాగా, మేషరాశి స్వర్గమై యున్నది. మకరము ప్రతిముఖమై యున్నది. పురాణములందు మేషరాశిని కశ్యపుడుగను, కర్కాటక రాశిని దితిగను, మకరమును అదితిగను వర్ణించిరి. దితి సంతతి పదార్థ బంధమునకు లోనగుచుండగ, అదితి సంతతి ప్రజ్ఞాలోకములందు విహరించును. ద్వాదశ దళ అనాహత పద్మము కర్కాటకరాశి పద్మము కాగా, అష్టదళ పద్మము ఉత్తమమగు మకర రాశి పద్మముగ ఆధ్యాత్మిక జ్యోతిషము తెలుపుచున్నది.

**వాయు కాలుష్యము :**

ప్రస్తుతమున కర్కాటకరాశి వ్యాధిగ్రస్తమై యున్నది. యుగ ధర్మము ననుసరించి, కలిపీడనము కర్కాటకరాశి యందు మిక్కుటమై యున్నది. ముందుపాఠములలో కర్కాటకరాశి చక్రమగు అనాహతము ప్రాణస్పందనమునకు, వాయు వ్యాపారమునకు ప్రధానమగు కేంద్రముగ తెలుపబడినది. ఆధునిక ప్రపంచమున వాయు కాలుష్యము అమితముగ నున్నది. తత్కారణముగ ప్రాణికోట్ల శ్వాసకోశము వ్యాధిగ్రస్తమై పోవుచున్నది. వాయు కాలుష్యము వలననే ఊపిరితిత్తులు బలహీనపడి, దగ్గు జలుబు తరచు ఏర్పడుచు జీవులను హింసించు చున్నది. వాయువు ప్రాణమునకు వాహకమై యుండుట వలన, ప్రాణశక్తి కూడ త్వరితగతిని రుగ్మత చెందుచు నున్నది. అందరికిని శ్వాసకోశపు రుగ్మతలే. అత్యధికముగ అందరి రక్తము నందును కాలుష్యము అణునిత్యము చేరుచునే యున్నది. జల కాలుష్యము, వాయు కాలుష్యము వలన ప్రాణములు మిన్నగించు చున్నవి. పరి

శుభ్రమగు నీరు, వాయువు సహజముగ లభ్యము కాని పరిస్థితులలో సర్వమును అతలాకుతలమై యున్నది. కర్కాటకరాశి యందు రుగ్మత స్థిరపడినది. మందులకు లొంగని అనేక వ్యాధులు ఉదరమున, ఉరస్సున చేరుచున్నవి.

పాడి, పాలు, పెరుగు ఇత్యాది పోషక పదార్థములు కర్కాటక రాశి సంబంధితములే. పూర్వమున గోక్షీరము అమితమగు ప్రభావము గల పోషకముగ తెలుపబడినది. నేడా పరిస్థితి తారుమారయినది. గోవులు త్రాగు నీరు, స్వీకరించు ఆహారము స్వచ్ఛత కోల్పోయినపుడు గోవులు అందించు క్షీరము పోషకము ఎట్లగును? పాలు, పెరుగు, నీరు ఇత్యాది వన్నియు వాటి సహజ స్వచ్ఛత కోల్పోవుటచే పాలు, పెరుగు, వెన్న, నేయి ఇత్యాది ఆహార పదార్థముల యందు పోషకశక్తి పోయినది. మానవుని దురాశ, అజ్ఞానముల కారణముగ కర్కాటకము వ్యాధి కారణమై నిలచినది. కనుకనే ఆషాఢమున తొలి వర్షము కురియగనే రోగములు విజృంభించు చుండును. వర్షాకాలము రాగానే వైద్యులకు తీరిక లేనంత పని ఏర్పడుచున్నది. ఇది ఇట్లుండగ, వేద సంప్రదాయమున పాలు, పెరుగు, వెన్న, నేయి ప్రత్యేకస్థానములు కలిగి యున్నవి. వాని స్వీకరణమున పంచకోశములకు శుద్ధి ఏర్పడి, ఆత్మ సాధనకు వలసిన శక్తి లభించునని తెలుపబడినది.

కర్కాటకమునకు చంద్రుడధిపతి యగుట చంద్రాత్మక ప్రజ్ఞగల వెండి అత్యంత ప్రాధాన్యత కలిగియున్నది. నిత్యము వెండి పాత్రతో పానీయము త్రాగుట, వెండి పళ్ళెములలో భోజనము చేయుట వలన మనస్సునకు ప్రశాంతత లభించును. మనస్సు చురుకుగ పనిచేయును. ఆయుర్వేద వైద్యమునందు, హోమియో వైద్యమునందు వెండిని

ఔషధముగ వాడు విధానము కూడ యున్నది. బలహీనపడుతున్న మనస్సునకు వెండి స్పర్శ పరమౌషధమై యున్నది. కనుక వెండి పాత్రను వినియోగించుటయే జ్ఞానము. బ్యాంకు లాకరులలో దాచుకొనుట కరడుగట్టిన అజ్ఞానము. బంగారము విషయమున గూడ ఇట్టి సత్యము సింహరాశి యందు వివరింపబడును.

**త్రయీవిద్య :**

జ్యోతిష చక్రమును దర్శించినపుడు ఒక సత్యము గోచరించును. కర్కాటకరాశిలో రాశిచక్రము, మూడింట ఒక భాగము. మేషమునుండి కర్కాటకమునకు నాలుగు రాశులు. మరల సింహము నుండి వృశ్చికమునకు నాలుగు రాశులు. అట్లే ధనుస్సు నుండి మీనము నకు నాలుగు రాశులు. ఇట్లు ద్వాదశరాశి చక్రమును మూడు సమాన భాగములుగ గుర్తింపవచ్చును. ఒక్కొక్క భాగమున నూట ఇరవై (120) దినములు, రెండు వందల నలభై (240) సంధ్యలు, నాలుగు పౌర్ణమి తిథులు, నాలుగు అమావాస్య తిథులు.

ప్రతి భాగము అగ్నితత్త్వపు రాశితో మొదలిడి జలరాశితో పూర్తియగును. మేషము అగ్నితత్త్వపు రాశి. కర్కాటకము జలతత్త్వపు రాశి. అట్లే రెండవ భాగము అగ్ని తత్త్వపు రాశి యగు సింహరాశితో ప్రారంభింపబడి, జలరాశి యగు వృశ్చికముతో పూర్తియగును. మూడవ భాగము అగ్నితత్త్వపు రాశియగు ధనుస్సుతో ప్రారంభింపబడి, జలతత్త్వపు రాశియగు మీనరాశితో అంతమగును.

మూడు అగ్నితత్త్వపు రాశులు మూడు రకములగు ప్రారంభములుగ జ్యోతిషము గుర్తించును. మూడు జలరాశులు మూడు రకములగు

ప్రళయములుగ గుర్తింపబడును. కర్కాటకము ఒక రకమగు ప్రళయము. వృశ్చికము మరియొక రకమగు ప్రళయము. మీనము మహాప్రళయము. సృష్టి ఆరంభము మేషమున కాగా సృష్టి ప్రళయము మీనమున జరుగును. ఈ లోపల కర్కాటకము నందు, వృశ్చికము నందు కూడ ప్రళయములు వచ్చిపోవుచుండును కాని అవి పూర్ణ ప్రళయములు కావు. ప్రతి చిన్న, పెద్ద ప్రళయముల తరువాత, మరల ఆరంభమున అట్టి చిన్న తరహా ఆరంభములు సింహరాశి యందు, ధనూరాశి యందు జరుగును.

కర్కాటకరాశి యందు జీవాత్మలు దేహములు ధరించినపుడు తమ నిజస్థితిని కోల్పోయి క్షరపురుషు లగుదురు. అనగా తమ అక్షరత్వమును మరచిపోవుదురు. అది కర్కాటక ప్రళయము. మరల వృశ్చికమున క్షరులగు జీవాత్మ, అక్షరు లగుటకు ఆరోహణ మార్గము పట్టుదురు. అపుడు క్షరత్వమునకు మరణము, అక్షరత్వమునకు పునః స్మృతి లభించును. ఇచ్చట అక్షరత్వమునకు ప్రళయము. అటుపైన మీనమునందు అక్షరుడు పురుషోత్తమునిలో లీనమగుట యుండును. అపుడు జీవులు ఈశ్వరునందు లీనమగుదురు. ఇదియొక ప్రళయము.

ఇట్లు కాలచక్రగతిని జీవులు అవరోహణము చెందుట, స్థితి ననుభవించుట, ఆరోహణము చెందుట అను మూడు భాగముల కథను ఋషులు మూడు భాగములుగ ద్వాదశ చక్రము విభజించి అవగాహన గావించుకొని, అనుయాయులకు బోధించిరి. ఇట్లు మూడు భాగములుగ ఒకే తత్త్వమును, దాని చరితమును త్రయీ విద్యగ సంకేతించిరి. త్రిభుజమందలి ప్రతిముఖము అగ్నిరాశితో

ప్రారంభమై జలరాశితో అంతమగు చుండును. ఈ త్రయీ విద్యద్వారా జీవుల జనన మరణములు, వారి పరిణామ కథ అనేక విధములుగ, అనేక పురాణములలో అందించిరి. పునర్జన్మముల రహస్యములను కూడ గ్రహించిరి. అక్షరుడు, శాశ్వతుడు, స్వయం ప్రకాశకుడు అగు జీవాత్మ దేహధారణము ద్వారా తన సహజ లక్షణమును కోల్పోయి, క్షరుడై ప్రకాశమును కోల్పోవుట కర్కాటకరాశి యందలి ఆశ్లేష నక్షత్రమున జరుగునని విశ్లేషించిరి. ఆశ్లేష కాలసర్పము వంటిది. దాని తల కర్కాటకమందలి చివరి పదమూడు దినములలో యుండును. అందువలననే ఆషాఢ పౌర్ణమి తరువాత రోజులు శూన్య తిథులుగ తెలుపబడినవి. ఆశ్లేష ప్రవేశమున సాధకులు అప్రమత్తతతో యుండుట సూచించును.

**ప్రతిముఖ రాశి :**

కర్కాటకరాశికి ప్రతిముఖముగ మకరరాశి యుండుటచే, మకర రాశి ప్రభావము కర్కాటకరాశిపై యుండును. నిజమునకు ప్రతి రాశికిని ప్రతిముఖరాశి దాంపత్య సంబంధము కలిగి యుండును. ఏ రాశిని పఠించుచున్నను దానితోపాటుగా ఆ రాశి ప్రతిముఖ రాశిని గూడ పఠింపవలెను.

ఉదాహరణకు మకర రాశి ప్రభావము కర్కాటకరాశిపై యుండుటచే, మకరరాశి వారికి ముదురు ఆకుపచ్చరంగు ఇష్టమై యుండును. అట్లే కర్కాటక రాశి సహజముగ ఆకుపచ్చరంగు కలిగి యుండును. ఆకుపచ్చ రంగుకన్న పసుపుపచ్చ రంగు, బంగారు

పసిమి ఉత్తమమైన రంగులు. పసిమి బంగారు రంగుకన్న పార దర్శకముగ గోచరించు తేనెరంగు ఉత్తమము. తేనెయందలి పార దర్శకత్వము బుద్ధిలోకములకు సంబంధించినది. అట్టి రంగున కధిపతి గురుడై యున్నాడు. అట్టి బుద్ధిలోక సాధకునకు గురుస్పర్శ లభించి నపుడు నీలకాంతి దర్శనమగును. అట్టి నీలకాంతి కర్కాటకరాశి ప్రజ్ఞను భ్రూమధ్యమునకు ఉద్ధరించును. రాజయోగి యగు గురు సాంగత్యమున మమతా బంధములకు లోనైయున్న జీవప్రజ్ఞ బంధ మోచనము చెంది శిరస్సున ప్రకాశించుట ప్రారంభించును. కర్కాటక రాశి వారికి రంగుల దర్శనము సులభమై యుండును. చంద్రుడు రాశి అధిపతి యగుటచే కాంతిదర్శనమునకు అవకాశము మెండుగ నుండును.

కర్కాటక రాశి యందు సామాన్య మానవులకు చంద్రుడధిపతి. సత్కథకులకు కుజుడు, శని అధిపతులు. సంగీత సాధకులకు శుక్రు డధిపతి. ధ్యాన సాధకులకు గురు డధిపతి. గురుడిచ్చు వాక్యము యొక్క శబ్దము, ధ్వని వారి నుద్ధరించును. అట్లే కర్కాటకరాశి సంబం ధితులైన శంబళ వాసులకు ఇంద్ర గ్రహ మధిపతి. ఇంద్ర గ్రహస్పర్శ లభించినపుడు మనోహరణమై తాదాప్య స్థితి లభించును. ఇట్టి వారికి జగద్గురువు మైత్రేయుడు, సనత్కుమారుడు గురువులై పరిరక్షింతురు.

సామాన్యులకు ఇంద్ర గ్రహ స్పర్శ లభించినచో వారు పిచ్చివారై పోవుదురు. రకరకముల భ్రాంతులు, భ్రమలకు లోనై, మూర్ఖులై పతనము చెందుదురు.

## గురు స్పర్శ :

సంగీత విద్యద్వారా తన్మయత్వము చెందుట అను సౌలభ్యము కర్కాటకరాశి యందు ఇంద్రుని స్పర్శతో లభించును. ఈ స్పర్శ సద్గురువు ద్వారా లభించుట శ్రేయస్కరము. అట్లు లభించినపుడు శబ్దము యొక్క సంగీత ధ్వని సాధకుని బుద్ధి మనో కోశములలో కొన్ని అవరోధములను ఛేదించి ఆత్మానుభూతి, తన్మయత్వము ఇచ్చును. శంబళయందు వసించువారు, గోలోకమునందు వసించు వారు ఇట్టి పరమానందమును అనునిత్యము అనుభవించుచు నుందురు. ఎంతటి గుణవంతుని కైనను గురువనుగ్రహము, గురు స్పర్శ లేనిదే ఆత్మానుభూతిని పొందుట దుర్లభము. సంగీత విషయ మున ప్రత్యేకించి ఇది సత్యము.

కర్కాటకరాశి గూర్చి వివరించు కొనునపుడు నారదమహర్షి గూర్చి తెలుసుకొనుట అత్యంత ప్రాధాన్యమైన విషయము. నారద మహర్షియే లేనిచో సంగీత విద్యకు పరమావధి యుండెడిది కాదు. అన్ని విద్యలకు అతడే గురుపరంపరలలో శిఖరము వంటివాడు. ప్రత్యేకించి సంగీత విద్య నారదస్పర్శ లేక పరిపూర్తి చెందదు. వాల్మీకి మహర్షికిగాని, వ్యాసమహర్షికి గాని, ధృవునకుగాని , ప్రహ్లాదునకు గాని, త్యాగరాజ స్వామి వారికి గాని తుది స్పర్శ నిచ్చి పరమ పదమునకు దారి చూపినవాడు దేవర్షియైన నారదుడే. అతడు బ్రహ్మామానస పుత్రుడు. అతడే గురువు లందరికిని గురువు. శంబళ వాసులకు కూడ పరలోకానుభూతికి నారదమహర్షియే గురువై

యున్నాడు. సనత్కుమారు డొక్కడే నారదునితో సరిసమానుడు. పరిపూర్ణమగు దివ్యప్రజ్ఞ.

'మా' అను శబ్దము కర్కాటకరాశి సంబంధితము. మరియు నాసాపుటములచే ఉచ్చరింపబడు గానము, ప్రవచనము కూడ కర్కాటక సంబంధితమే. మానవుని పరిణతిని బట్టి అతని వాక్కు నాసిక, ముఖముల మధ్య నాట్య మాడుచుండును. శబ్దమునకు నాసికల వినియోగమును బట్టి జీవుని పరిణామము ఋషులు గుర్తింతురు.

కర్కాటకరాశి రెండు (2) అంకె శక్తితో కూడి యుండును. రెండు (2) శుద్ధ చైతన్యము యొక్క సంకేతము. మూల ప్రకృతికి సంకేతము. చంద్రునికి సంకేతము. కదలికకు సంకేతము. మానవుని యొక్క ప్రవర్తనకు కూడ సంకేతము.

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 19. | Book of Prayers | E |
| 20. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 21. | Bricks for the Temple | E |
| 22. | Cow | K/T/E/Hi |
| 23. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 24. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 25. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 26. | Dhanakamuni Katha | T |
| 27. | Doctrine of Eternal Presence | E |
| 28. | From the Teachers Pen | E |
| 29. | Gayatri Mantra Avagahana | T |
| 30. | Geetopanishad - Sankya Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Gnana Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 35. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 36. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 37. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 38 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 39. | Good Friday | E/S |
| 40. | Gurusisya Samvadamu | T |
| 41. | Healers Handbook | E |
| 42. | Health & Harmony | E/G |
| 43. | Health & Harmony-2 | E |

| | | |
|---|---|---|
| 44. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 45. | Himalaya Guruparampara | T/Hi/K |
| 46. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 47. | Just Adjust | E |
| 48. | Jyotirlinga Yatra | T |
| 49 | Jyothisha Vignanamu | T |
| 50. | Kapila and Kardama | E/G/S |
| 51. | Katha Deepika | T |
| 52. | Kumara Sambavam | T |
| 53. | Lectures on Secret Doctrine - I | S/E |
| 54. | Lectures on Secret Doctrine - II | E |
| 55. | Lectures on Secret Doctrine - III | E |
| 56. | Listening to the Invisible Master | E/S/K |
| 57. | Lord Maitreya - The World Teacher | E/S |
| 58. | Life and Teachings of Master Jupiter | E |
| 59. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 60. | Mana Master garu | T |
| 61. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 62. | Mars - The Kumara | E/G/S |
| 63. | Mercury - The Alchemist | E/G/S |
| 64. | Maria Magdalena | E/S |
| 65. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 66. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 67. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 68. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 69. | MASTER C.V.V. - Yogamu | T |

| | | |
|---|---|---|
| 70. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 71. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 72. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 73. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 74. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 75. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 76. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 77. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 78. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 79. | Master CSG | E |
| 80. | Messages of Master E.K. | E |
| 81. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 82. | Moon - The Key | E |
| 83. | New Age Hospital Management | E |
| 84. | Nutrients For Discipleship | E |
| 85. | OM | T/K/E |
| 86. | Occult Meditations | E/G/S |
| 87. | Om Namo Narayanaya | E/G/S |
| 88. | On Change | E/S |
| 89. | On Healing | E |
| 90. | On Love | E/G/S |
| 91. | On Service | E/G/S |
| 92. | On Silence | E/G/S |
| 93. | PARIKSHIT-The World Disciple | E |
| 94. | Pranayamam | T |

| | | |
|---|---|---|
| 95. | Prayers | E/G/S |
| 96. | RUDRA | E |
| 97. | Rukmini Kalyanam | T |
| 98. | Sai Sukthulu | T/K |
| 99. | Sai Ki Amruthavani | Hi |
| 100. | Sanghaneethi | T |
| 101. | SAM | E |
| 102. | Saraswathi-The Word | E/G/S |
| 103. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 104. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 105. | Shodosopachara Pooja - Avagahana | T |
| 106. | SOUND-The Key and its Application | E/G/S |
| 107. | Spiritualism-Business and Management | E/G |
| 108. | Spiritual Healing | S/G |
| 109. | Sri Dattatreya | E/G/S/T |
| 110 | Sripada Srivallabha Charitamrutam | E |
| 111. | Srimadramayana Dharmakusumalu | T |
| 112. | Sri Guru Paadukastavamu | T |
| 113. | SRI LALITHA (Set 10 Books) (Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 114. | SRI SASTRY GARU | T/K/E/S |
| 115. | Sri Krishna Namamrutham | T |
| 116. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 117. | Sri Suktam | E |
| 118. | Steps of Silence | E |
| 119. | Sun that Iam | E/G/S |
| 120. | Temple and the Work | E |

| | | |
|---|---|---|
| 121. | Teachings of Lord Maitreya-1 | E |
| 122. | Teachings of Lord Maitreya-2 | E |
| 123. | The Aquarian Cross | E/G/S |
| 124. | The Aquarian Master | E/G/S |
| 125. | The Doctrine of Ethics | E/S |
| 126. | The Etheric Body | E/G/K |
| 127. | The Golden Stairs | E/S |
| 128. | The Path of Synthesis | E |
| 129. | The Splendor of Seven Hills | E |
| 130. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 131. | THE TEACHER-Meaning and Significance | E |
| 132. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 133. | The Teachings of Lord Kapila | E/G |
| 134. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 135. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 136. | The Theosophical Movement | E/G/S |
| 137. | The White Lotus | T/E/S/K |
| 138. | The World Teacher | E |
| 139. | The Mysteries of Sagittarius | E |
| 140. | Time - The Key | E/G |
| 141. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 142. | Varuna Graha Prabhavamu | T/K |
| 143. | VENUS-The Path to Immortality | E/S |
| 144. | Violet Flame Invocations | E |
| 145. | Vrutrasura Rahasyam | T |
| 146. | Wisdom Buds | E/S |
| 147. | Wisdom Teachings of Vidura | E/G/S |
| 148. | Yama Geetha | T |

## OTHER BOOKS BY DHANISHTA

| | | |
|---|---|---|
| 1. | Gajendra Mokshanamu | T |
| 2. | Purana Purushuni Pooja Vidhanamu | T |
| 3. | Sarannavaratra Pooja Vidhanamu | T |
| 4. | Sri Anjaneya Pooja Vidhanamu | T |
| 5. | Sri Dattatreya Pooja Vidhanamu | T |
| 6. | Sri Hanuman Chalisa | T |
| 7. | Sri Mahalakshmi Pooja Vidhanamu | T |
| 8. | Sri Rama Pooja Vidhanamu | T |
| 9. | Sri Shiva Hrudayamu | T |
| 10. | Sri Shiva Pooja | T |
| 11. | Sri Soukumarya Satakamu | T |
| 12. | Sri Subrahmanya Pooja Vidhanamu | T |
| 13. | Sri Surya Pooja Vidhanamu | T |
| 14. | Sri Venkateswara Pooja Vidhanamu | T |
| 15. | Sri Saraswathi Pooja Vidhanamu | T |
| 16. | Sri Vinayaka Vratha Kalpamu | T |
| 17. | Sri Vishnu Sahasra Namamu | T |
| 18. | Sri Sathguru Pooja Vidhanam | T |
| 19. | Sri Lalitha Sahasrana Stotramu | T |
| 20. | Siva Sankalpamulu | T |

**Please visit our website**
**(www.dhanishta.org / info@dhanishta.org) for prices**

కాలచక్రగతిని జీవులు అవరోహణము చెందుట, స్థితి ననుభవించుట, ఆరోహణము చెందుట అను మూడు భాగముల కథను ఋషులు మూడు భాగములుగ ద్వాదశ చక్రము విభజించి అవగాహన గావించుకొని, అనుయాయులకు బోధించిరి. ఇట్లు మూడు భాగములుగ ఒకే తత్త్వమును, దాని చరితమును త్రయీవిద్యగ సంకేతించిరి. త్రిభుజమందలి ప్రతిముఖము అగ్నిరాశితో ప్రారంభమై జలరాశితో అంతమగు చుండును. ఈ త్రయీవిద్య ద్వారా జీవుల జనన మరణములు, వారి పరిణామ కథ అనేక విధములుగ, అనేక పురాణములలో అందించిరి. పునర్జన్మముల రహస్యములను కూడ గ్రహించిరి.

ఈ పుస్తకమందలి మేష, వృషభ, మిథున, కర్కాటక రాశుల వివరణము శ్రద్ధతో పఠించువారికి రాశి స్వరూప స్వభావములు ఆకళింపై, తదనుగుణమగు ఉద్ధారణము నీయగలవు.

ISBN 978-81-89467-30-2

9 788189 467302 >

ధనిష్ఠ